



# బోల్షివిక్

సంచిక: 10    సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక    జనవరి–జూన్ 2018

## లోపలి పేజీల్లో...


ఎ.పి ప్రత్యేక హెూదా .......... 3

సిద్ధాంత వ్యాసం .......... 8

సామాజిక సంబంధాలు .......... 19

పత్రికా ప్రకటన .......... 31

కరపత్రం .......... 34

నేను గెరిల్లానేందుకయ్యానంటే? .......... 36

అమరుల జీవిత చరిత్రలు .......... 42

పోరాట ప్రవంతి .......... 48


“తత్వవేత్తలు -ఈ ప్రపంచాన్ని పలు విధాలుగా వ్యాఖ్యానించడం మాత్రమే చేసారు. అయితే దానిని మార్చడం ఎలా అనేదే అసలు విషయం.”

- (మార్క్స్ ఫ్యూయర్‌బాపై సిద్ధాంతం నుండి).

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది!

# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2018 జనవరి నుండి జూన్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో కామ్రేడ్ ఉంగి (ఆరతి–ఎ.సి.ఎమ్), కామ్రేడ్ కుమారి (కోసి–ఎ.సి.ఎమ్), కామ్రేడ్ రణిత (పాయికే–ఎ.సి.ఎమ్), కామ్రేడ్ సందీప్ (పీసాల్–పి.ఎమ్), కామ్రేడ్ లక్కె (పి.ఎమ్) ఈ కామ్రేడ్స్‌తో పాటు, దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

# ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అసెంబ్లీ, పార్లమెంటుల వీధినాటకాల ద్వారా రాదు! ప్రజల ఐక్య, సమరశీల పోరాటాల ద్వారానే వస్తుంది!! ప్రత్యేక హోదా (ఆర్థిక, సాంఘిక) ప్రజల హోదాను పెంచేదిగా వుండాలి!!!

*ప్రియమైన ప్రజలారా!*

నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల పార్టీలు రకరకాల గారడీ విద్యలతో ప్రజల ముందుకు వస్తున్నాయి. ప్రత్యేకంగా ఊసరవెల్లి కంటే కూడా వేగంగా రంగులు మార్చే చంద్రబాబు గారడీలు విశేష ఆకర్షణగా మారాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొలది ఈ టక్కుటమారాగాల్లంతా కొత్త కొత్త వేషాలతో ముందుకు వస్తున్నారు. నిన్నటి వరకు ప్రాణమిత్రులుగా నటించిన తెలుగుదేశం, బి.జె.పి.లు శత్రువులుగా మారి, కత్తులు దూస్తున్నారు. 'ప్రత్యేక హోదా కాదు, ప్రత్యేక ప్యాకేజీ' అని గొంతులు కలిపి చంద్రబాబునాయుడు, వెంకయ్యనాయుడులు ప్రజల ముందు ప్రచారం చేశారు. ఇప్పుడు చంద్రబాబు 'మారు మనసు' పొంది, కొత్తవేషంతో ప్రత్యేకహోదా కోసం చివరి వరకు పోరాడతానని చిందులు వేస్తున్నాడు. ఈ పరిణామాల వెనక వున్న రాజకీయ, ఆర్థిక కారణాలను అర్థం చేసుకొని ప్రజల ప్రయోజనం కోసం, ప్రత్యేక హోదా సాధనకై సమరశీలంగా పోరాడవలసిన అవసరం ముందుకు వచ్చింది.

2014లో, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం రూపొందించే సందర్భంగా, ఆనాటి ప్రధానమంత్రి మన్‌మోహన్‌సింగ్ 5 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇవ్వాలని లోక్‌సభలో ప్రకటించాడు. ఆనాడు ప్రతిపక్షంగా వున్న బి.జె.పికి చెందిన వెంకయ్యనాయుడు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బి.జె.పి అధికారంలోకి వస్తే, 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని, ఎన్నికల సమయంలో రాష్ట్రమంతా ప్రచారం చేశాడు. చంద్రబాబునాయుడు ఇంకా ముందుకు పోయి, 15 సంవత్సరాలు ప్రత్యేకహోదా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. వాస్తవంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను ఇవ్వడం చాలా సంక్లిష్టమైన అంశం. ఈ హామిని అమలు చేయాలంటే ప్రజల ప్రయోజనాల ఎడల ఎంతో చిత్తశుద్ధి వుండాలి. కానీ ఆనాడు ఏ మాత్రం చిత్తశుద్ధిలేని అవకాశవాద పార్టీలన్నీ, రానున్న పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలలో, ఆంధ్రప్రదేశ్‌లో ఆధిక్యత సంపాదించేందుకు ప్రత్యేక హోదాను బల్లగుద్ది మాట్లాడటమే కాకుండా, దాని కాలపరిమితిని పోటీపడి పెంచుతూ, డిమాండ్ చేశాయి.

2014 ఎన్నికలలో కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోను ప్రభుత్వాలు మారాయి. కేంద్రంలో బి.జె.పి, రాష్ట్రంలో టి.డి.పిలు అధికారంలోకి వచ్చాయి. తీరా అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే, మోడీ ప్రభుత్వం ప్రత్యేక హోదా స్థానంలో మెరుగైన స్పెషల్ ప్యాకేజీని ఇస్తామని మాట మార్చింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను అమలు జరిపితే, ఇతర వెనకబడిన రాష్ట్రాలు కూడా ఆ డిమాండ్‌ను ముందుకు తెస్తాయనే విషయాన్ని 14వ ఆర్థికసంఘం చెప్పిందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఈ సందర్భంగా ఒక పచ్చి అబద్ధాన్ని ప్రకటించాడు. దానికి చంద్రబాబు వంత పాడటమే కాకుండా, ప్రత్యేక హోదా గురించి మాట్లాడినవారిపైనా, ప్రత్యేక హోదా సాధనకు ఆందోళన చేపట్టినవారిపైన తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేశాడు. అయితే 14వ ఆర్థిక సంఘం సభ్యుడు అభిజిత్‌సేన్, తమ నివేదికలో, ఎ.పి ప్రత్యేక హోదాపై అరుణ్‌జైట్లీ చెబుతున్న అభ్యంతరాలేమి లేవనీ ప్రకటించి ఈ అబద్ధాల కోరుల, ప్రజా వ్యతిరేకుల బండారాన్ని బయటపెట్టాడు.

వాస్తవంగా ప్రత్యేక హోదా అమలులో కొన్ని సంక్లిష్టతలు వున్నప్పటికీ, వాటిని అధిగమించాలనే చిత్తశుద్ధి మోడీకి లేదు. చంద్రబాబుకు అంతకన్నా లేదు. మోడీ నేతృత్వం వహిస్తున్న బి.జె.పికీ, ఆ పార్టీ వెనక వున్న బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలకు, ఎ.పికి ప్రత్యేక హోదా ఇవ్వడం వలన పొందే ప్రయోజనం కన్నా, ఇబ్బందులే ఎక్కువ. వారికి రాజకీయంగా, ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చే పథకాలు వేరుగా వున్నాయి. ఇక చంద్రబాబు అండ్ కో కంపెనీ బి.జె.పితో అవకాశవాద పొత్తును ఏర్పర్చుకొని, రాష్ట్రంలో తీవ్రమైన అవినీతికి పాల్పడుతూ, రాష్ట్రాన్ని విచ్చలవిడిగా దోపిడీ చేశారు. ఈ దుష్ట ప్రయోజనాలే చంద్రబాబును మోడీ తోక పట్టుకొని పోయేలా చేశాయి. చివరికి ఇద్దరు కలిసి తమ సంకుచిత, స్వార్థ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రాకుండా అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రాకుండా అడ్డుపడిన కారణాలను మరింత నిర్దిష్టంగా తెలుసుకునే ముందు ప్రత్యేక హోదాతో పాటు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీల విషయం తెలుసుకుందాం.

**ప్రత్యేక హోదా-విభజన చట్టంలోని హామీలు**

ప్రత్యేక హోదా ఏర్పాటు 1969 నుండి ప్రారంభమైంది. గాడ్గిల్ ఫార్ములాను జాతీయ అభివృద్ధి మండలి (ఎన్.డి.సి) ఆమోదించడంతో 17 రాష్ట్రాలకు గానూ, జమ్ముకాశ్మీర్, అస్సాం, నాగాలాండ్‌లకు మాత్రమే హోదా ఇచ్చారు. ఆ తర్వాత మిగిలిన ఈశాన్య రాష్ట్రాలకు, కొండప్రాంతాలైన హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు ఇచ్చారు. ప్రత్యేక హోదా వలన 90% గ్రాంట్లు, 10% ఋణం రూపంలో ఆర్థికసహాయం ఉంటుంది. ప్రత్యేక హోదా వలన పన్నుల నుండి రాయితీలు ఇస్తారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక రాయితీలు వుంటాయి. 2017 ఆగస్టులో, కేంద్ర మంత్రి మండలి ప్రత్యేక హోదా కలిగిన 11 రాష్ట్రాలకు, 2027 వరకు జి.ఎస్.టి నుండి మినహాయింపును ఇచ్చింది.

ఇక నిర్దిష్టంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రాజధాని నిర్మాణం కోసం నిధులు, ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ నిమ్స్ వంటి జాతీయస్థాయి వైద్య సంస్థలను ఏర్పాటు చేయాలి. కేంద్రీయ విశ్వవిద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యానవన విశ్వవిద్యాలయం, పెట్రోలియం విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మానేజ్మెంట్ (ఐ.ఐ.ఎమ్), ఐ.ఐ.టి, ఐ.ఐ.ఐ.టి వంటి జాతీయ స్థాయి సంస్థలను స్థాపించాలి. విడిపోయిన కారణంగా రెవిన్యూలోటు ఉంది కాబట్టి, రాష్ట్ర రెవిన్యూలోటును కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా పూడ్చుకోవాలి. ఈ హామీల అమలు కోసం 5 సంవత్సరాలు ప్రత్యేక హోదాను ఆనాడు కేంద్రప్రభుత్వం హామి ఇచ్చింది.

## ప్రత్యేక హోదా రద్దుకు బి.జె.పి, టి.డి.పిల స్వార్థ, సంకుచిత రాజకీయాలే కారణం

ఎ.పికి ప్రత్యేక హోదా ఇస్తే బీహార్, ఒడిశా వంటి వెనుకబడిన రాష్ట్రాలు ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తాయి. డిమాండ్ చేయటమే కాకుండా, ఆందోళనబాట కూడా పడతాయి. అలా చేయటం వారి న్యాయమైన హక్కు కూడా. నేడు దేశంలో నెలకొని వున్న ఈ అసమానాభివృద్ధి, ఈ దేశ పాలకవర్గాలు (దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు) కట్టుకున్న పుణ్యమే. ఈ దోపిడీ పాలక వర్గాలకు రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ నేతృత్వంలోని బి.జె.పి కూడా 'తిలాపాపం-తలా పిడికెడు' అన్నట్లు ఈ పాపంలో దాని వంతు పాత్ర దానికుంది. ఎందువలనంటే ఈ దేశ దోపిడీ పాలక వర్గాలకు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో ప్రయోజనాలేమి లేవు. వాళ్ళకు, వాళ్ళ యజమానులైన సామ్రాజ్యవాదులకు ఎక్కడ లాభాల పంట పండుతుందో అక్కడ వారిదైన 'అభివృద్ధి' చేపడతారు. ఈ ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక దళారీ స్వభావం కలిగిన మోడీ ప్రభుత్వం అసమానాభివృద్ధి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా లేదు, సిద్ధపడదు కూడా. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదాను ఇస్తే, వెనకబడిన రాష్ట్రాలలో ఆందోళనలు చెలరేగి, రాబోయే ఎన్నికలలో ప్రతికూల ఫలితాలు వస్తాయని ఆందోళన పడిన మోడీ ప్రభుత్వం, ప్రత్యేక హోదాకు మంగళం పాడింది. మరోవైపు కేంద్ర నిధులను ప్రత్యేక హోదా కొరకు ఎ.పికి తరలించడం వలన తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బడా బూర్జువా వర్గం (అంబానీ, ఆదానీ....వగైరా) ప్రయోజనాలు నెరవేరవు. వాళ్ళకు దేశ సంపదను కట్టబెట్టేందుకు మోడీ ఇప్పటికే రకరకాల సదుపాయాలు, సౌకర్యాలు, రాయితీలు ఇచ్చాడు. వారి ప్రయోజనాల కోసమే మౌలిక సదుపాయాల రంగంలో లక్షలాది కోట్ల రూపాయల కేంద్ర నిధులను దుర్వినియోగపరుస్తున్నాడు. పైకి మాత్రం ప్రత్యేక హోదాకు నిధుల కేటాయింపు విషయంలో సమస్యేమి లేవని మాట్లాడుతున్నాడు. ప్రత్యేక హోదాకు ఎంత నిధులు కేటాయిస్తామో, ప్రత్యేక ప్యాకేజీకి అంతకంటే ఎక్కువ నిధులను కేటాయిస్తామని మభ్య పెట్టాడు. కానీ 2018 కేంద్రబడ్జెట్లో నిధుల కేటాయింపు విషయంలో ఎ.పికి తొంటి చేయి చూపించి, తన అసలు స్వభావాన్ని బహిర్గత పర్చుకున్నాడు. ఈ విధంగా కేంద్రప్రభుత్వం నిరంకుశంగా, నిర్లక్ష్యపూరితంగా ఎ.పి విభజన చట్టంలో రూపొందించుకున్న ప్రత్యేక హోదా హామీని తుంగలో తొక్కింది. ఈ చర్య వాళ్ళు రాజ్యాంగంలో రాసుకున్న సమాఖ్య (ఫెడరల్) స్వభావాన్ని దెబ్బతీసి కేంద్రం మరింతగా అధికారాలను గుంజుకోవడాన్ని (యూనిటరీ స్వభావం) వ్యక్తపరుస్తున్నది. ఈ ధోరణి 1947 నుండి క్రమంగా పెరుగుతున్నప్పటికీ, మోడీ హయంలో వేగం పుంజుకుంటున్నది.

ఇక చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాలంటే తన కుటుంబ ప్రయోజనాలతో పాటు, తాను రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎ.పికి చెందిన బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనం మాత్రమే. అందుకే చంద్రబాబు అండ్ కో కంపెనీ, మోడీ నేతృత్వంలోని బి.జె.పితో 'అపవిత్ర కలయిక'ను ఏర్పాటు చేసుకొని రాష్ట్రంలో యదేచ్ఛగా అధికారాన్ని కొనసాగిస్తూ, నిస్సిగ్గుగా అవినీతికి పాల్పడుతూ, కోట్లాది రూపాయిల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. వీరు రాష్ట్రాన్ని నిలువునా దోచారు. ఈ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కారణంగానే చంద్రబాబు ప్రత్యేక హోదాను తుంగలో తొక్కేందుకు బి.జె.పితో చేతులు కలిపాడు. తీరా 2018 కేంద్రబడ్జెట్లో బి.జె.పి ప్రభుత్వం, ఎ.పికి తొంటి చేయి చూపించడంతో, వీరి అసలు స్వభావం బహిర్గతమైంది. ప్రజలు వీధుల్లోకి వచ్చి బి.జె.పి, టి.డి.పిలకు వ్యతిరేకంగా నిరసనలు వివిధ రూపాలలో తెలియజేశారు. మళ్ళా ఒక్కసారి ప్రత్యేక హోదా, ప్రజల ఆకాంక్షగా ముందుకు వచ్చింది. దీంతో చంద్రబాబు రానున్న ప్రమాదాన్ని పసిగట్టి, పూర్తి వ్యతిరేక దిశలో నాటకీయంగా వ్యవహరించడం మొదలు పెట్టాడు. బి.జె.పితో పూర్తిగా తెగతెంపులు చేసుకొని, ప్రత్యేక హోదా సాధన కోసం పోరాటం చేస్తున్నట్లు, ఛాంపియన్లా ఫోజులు పెడుతున్నాడు.

## ప్రత్యేక హోదా కోసం పార్లమెంటరీ పార్టీల పోరాటం

రాష్ట్రంలో వై.ఎస్.ఆర్.సి.పి, కాంగ్రెస్, వామపక్షాలు, జనసేన వంటి పార్లమెంటరీ పార్టీలన్నీ ప్రత్యేకహోదాకు పెరుగుతున్న ప్రజల మద్ధతును పెట్టుబడిగా ఉపయోగించుకొని, రానున్న ఎన్నికలలో అధికారాన్ని చేజిక్కించుకొనేందుకు పోటీ పడుతున్నాయి. ఈ ప్రయత్నంలో భాగంగానే ఒక వైపున ప్రజలను పోరాటంలోకి సమీకరిస్తూ, మరోవైపు వాటిని సమరశీల పోరాటాలుగా మారకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ తతంగాన్ని ఎన్నికల దాకా పొడిగిస్తూ, తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. కేవలం సభలు, ఊరేగింపులు, సమిష్టి వంటలు...వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల ఆగ్రహాన్ని చల్లబరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు అయితే ప్రజలెవరూ పోరాడనవసరం లేదనీ, తానొక్కడినే పోరాటం చేస్తానంటున్నాడు. వాస్తవంగా ఈ పార్టీల నేతలందరికీ ప్రత్యేక హోదాను సాధించాలనే పట్టుదల కన్నా, అధికారాన్ని పొందాలనే వ్యామోహమే ఎక్కువ. అందుకే వీళ్ళు ఎన్నికలలో గెలుపు కోసం అవకాశవాద, అపవిత్ర కలయికలకై వెంపర్లాడుతున్నారు. బి.జె.పి మరోసారి ప్రజల్ని మోసం చేసి గెలవగలదనుకుంటే, బి.జె.పితో ఐక్యతకు కూడా వీరు సిద్ధమే. వీరు ఎన్నికలలో లబ్ధి పొందగానే 'ఏరుదాటి తెప్పతగలేసిన చందం'గా తిరిగి 5 సంవత్సరాల దాకా ప్రత్యేక హోదాను గాలికి వదిలేస్తారు. మరోవైపు వీరు ప్రత్యేక హోదాను రాష్ట్రాభివృద్ధికి ఏకైక పరిష్కారం అన్నట్లు 'సర్వరోగనివారిణి'గా ప్రచారం చేస్తున్నారు.

## రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక హోదా సర్వరోగనివారిణి కాదు

ప్రత్యేక హోదా వలన రాష్ట్రంలో సమస్యలన్ని పరిష్కారం అవుతాయనీ, నిరుద్యోగం మటుమాయం అవుతుందని ఎన్నికల

పార్టీలు ప్రజల్లో అపోహలు కల్పిస్తున్నాయి. వారు చెప్పినట్లుగా ఈ ప్రత్యేక హోదా సర్వరోగనివారిణి కాదు. ప్రత్యేక హోదాను పొందిన రాష్ట్రాలైన నాగాలాండ్, హిమాచల్‌ప్రదేశ్, అస్సాం, మణిపూర్, ఇతర రాష్ట్రాలలో ఏ మేరకు అభివృద్ధి జరిగిందో ఒకసారి పరిశీలిస్తే అర్థమవుతుంది. ఈ రాష్ట్రాలలో ప్రజల జీవన ప్రమాణాలు అంతకు పెరిగింది లేదు. విద్య, వైద్యం, ఉపాధి విషయాలలో ఈ రాష్ట్రాలు మిగతా రాష్ట్రాల కంటే, ఇప్పటికీ వెనకబడే వున్నాయి. అయితే ప్రత్యేక హోదా అమలు కాలంలో పీడిత ప్రజల ప్రయోజనాలు కేంద్రంగా నిధులను వెచ్చించగలిగితే కొన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చు. కానీ వాళ్ళు చేస్తున్న అభివృద్ధి అంతా దోపిడీ వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగానే వుంటున్నది. 2014లో రూపొందించిన ఎ.పి ప్రత్యేక హోదా చట్టంలో కూడా వెనుకబడిన ప్రాంతాలు, దళితులు, ఆదివాసీలు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, మైనార్టీలు మొదలగు సామాజిక గ్రూపుల అభివృద్ధి గురించి నిర్దిష్టంగా ఏమి లేదు. ఒకవేళ హోదా అమలు జరిగితే దాని నుండి వచ్చే ఆర్థికసాయాన్ని కూడా సామ్రాజ్యవాద అభివృద్ధి మోడల్‌ల్లో భాగంగా ఖర్చు పెడతారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయరు. పేద, సామాజిక వర్గాలకు కూడా న్యాయం జరగదు. ఇంకాస్త ఆర్థిక అసమానతలు పెరుగుతాయి. అందువలన ప్రత్యేక హోదాను సాధించుకోవడంతో పాటు, దాని అమలును దోపిడీ వర్గాల అభివృద్ధి కోసం కాక, ప్రజల అభివృద్ధి కోసం ఉపయోగించాలి. ఇలా చేయడం ఎన్నికల పార్టీల ద్వారా గానీ, వారు చేస్తున్న ఆందోళనల ద్వారాగాని సాధ్యం కాదు. ఎన్నికల పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ, ప్రజలను పోరాటాలలోకి తీసుకువచ్చేందుకు విప్లవ పార్టీలు, ప్రజాస్వామిక సంస్థలతో కూడిన విశాల ఐక్య వేదికను నిర్మించాలి. ఈ ప్రత్యేక హోదాలో కొన్ని స్వల్పకాలిక డిమాండ్‌లు, కొన్ని దీర్ఘకాలిక డిమాండ్‌లను పెట్టుకొని ఉద్యమాన్ని నడిపించాలి. ఎన్నికల పార్టీల మాయలో పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ, సమరశీల పోరాటాలలోకి కదిలించాలి.

## *ప్రియమైన ప్రజలారా!*

దోపిడీ పాలకవర్గాలు ప్రచారం చేస్తున్నట్లు ప్రత్యేక హోదా ప్రజల అన్ని సమస్యలకు పరిష్కారం కాకపోయినప్పటికీ, మోడీ నిరంకుశత్వానికీ, చంద్రబాబు అవకాశవాదానికి వ్యతిరేకంగా పోరాడి దాన్ని సాధించుకోవాల్సిందే. అలాగే ప్రత్యేక హోదా కాలంలో వచ్చే బెనిఫిట్స్‌ను ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించుకోవాలి. లేదంటే దోపిడీ పాలకవర్గాలు ఆ బెనిఫిట్స్‌ను తన్నుకుపోతారు. అవి వాళ్ళ సొంతం కాకుండా ఉండాలంటే, ప్రత్యేక హోదాను సాధించుకోవడంతో పాటు, దాని అమలుపై ప్రజల పర్యవేక్షణ కలిగి వుండేలా సమరశీల పోరాటాలకు దిగాలి. అలాగే ఈ సందర్భంగా ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం గురించి కూడా ఆలోచించాలి. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావాలన్నా, వారు సంపూర్ణంగా విముక్తి పొందాలన్నా దేశంలో భూస్వామ్యాన్ని సంపూర్ణంగా నిర్మూలించాలి. దున్నేవారికే భూమి ప్రాతిపదికన నూతన వ్యవస్థను పునర్నిర్మించాలి. ఆధునిక విజ్ఞానాన్ని వినియోగించి, వ్యవసాయ ఉత్పత్తిని గరిష్ట స్థాయికి పెంచాలి. మన దేశంపై అమలవుతున్న సామ్రాజ్యవాదుల నయావలస దోపిడీని నిర్మూలించాలి. గుత్త పెట్టుబడిని జాతిపరం చేయాలి. దేశీయ పరిస్థితులపై ఆధారపడి, స్వావలంబనతో కూడిన, ప్రజల అవసరాలను తీర్చే పారిశ్రామిక విధానాన్ని చేపట్టాలి. ఈ కర్తవ్యాలన్నింటిని అమలు చేయాలంటే ఈ దేశ పాలకవర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలను వారి యజమానులైన సామ్రాజ్యవాదులను ప్రజాయుద్ధంలో ఓడించడం తప్ప మరో మార్గం లేదు. కనుక ప్రత్యేక హోదా సాధనకు ఉద్యమించడంతో పాటు, దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం జరుగుతున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో భాగస్వాములు కమ్మని పార్టీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

2019 మే నెలలో తిరిగి పార్లమెంటు ఎన్నికలతో పాటు, కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ రాజకీయ నేపథ్యంలో, పాలక పార్టీల నుండి కొన్ని వాదనలు ముందుకు వస్తున్నాయి. కేంద్రం రాజ్యాంగ చట్టానికి వ్యతిరేకంగా ఫెడరల్ స్వభావాన్ని దెబ్బతీసి, అధికారాలన్నింటిని కేంద్రీకృతం చేస్తూ, యూనిటరీ స్వభావాన్ని పెంచుతున్నదనీ, ఈ ప్రక్రియలో భాగంగానే ప్రత్యేక హోదా వంటి చట్టాన్ని నిరంకుశంగా, నిర్లక్ష్యంగా తోసిపుచ్చిందనే వాదన ముందుకు వచ్చింది. ఈ వాదన సరైనదే అయినప్పటికీ, ఈ సమస్యకు కొన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీలు చెబుతున్న పరిష్కారం మాత్రం సరైనది కాదు. వాళ్ళు రాజ్యాంగంలోని ఫెడరల్ స్వభావాన్ని కాపాడుకోవాలనీ, అందుకనుగుణంగా కేంద్రం అధికారాలు తగ్గించి, రాష్ట్రాల అధికారాలు పెంచాలనే డిమాండ్ ముందుకు తెస్తున్నారు. ఈ వాదనలోని అపసవ్యతను పరిశీలించుదాం.

నేడు కేంద్ర ప్రభుత్వాన్ని కంట్రోల్ చేస్తున్న ఉత్తరాది బడా బూర్జువా వర్గం అనబడే గుజరాత్, మహారాష్ట్రలోని పార్సీ, మార్వాడీ పెట్టుబడిదారులకు రాష్ట్రాలలోని ఆయా జాతులకు చెందిన, అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ వర్గానికి మధ్య పోటీ పెరుగుతున్నది. వాస్తవంగా ఈ ఉత్తరాది బడా పెట్టుబడిదారీ వర్గానికి కావలసినది యూనిటరీ స్టేట్. దాని పెట్టుబడి ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితమై లేదు. అది దేశమంతటికీ వ్యాపించి వుంది. ఇండియన్ మార్కెట్‌పై దాని ఆధిపత్యం కొనసాగాలన్నా, దేశవ్యాపితంగా వున్న ముడి సరుకులపై తమ గుత్తాధిపత్యం కొనసాగాలన్నా ఏ ఒక్క జాతికి చెందిన ప్రభుత్వమో తమ చేతిలో వుంటే సరిపోదు. యావత్తు భారతదేశం తమ అదుపాజ్ఞలలో వుండాలి. అలాంటి కేంద్రీకృత (యూనిటరీ) ప్రభుత్వాన్ని నిర్మించుకోవడం భారత బడా పెట్టుబడిదారుల అభీష్టం. ఆ లక్ష్యాన్ని సాధించుకోవడానికే 'జాతీయ సమైక్యత', 'జాతీయ సమగ్రత' నినాదాలను ముందుకు తెస్తున్నారు. సామ్రాజ్యవాదుల మద్దతుతో కేంద్రంలో యూనిటరీ ప్రభుత్వాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా బి.జె.పి ఈ దారిలో వడివడిగా అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ, బడా బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతీయ పార్టీలు ప్రజలలో వున్న విప్లవ చైతన్యాన్ని పక్కదారి పట్టించి, బి.జె.పి, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ అధికారాలు తగ్గించి, రాష్ట్రాల అధికారాలు పెంచాలంటున్నాయి. ఇది సరైన పరిష్కారం కాదు. ఈ పరిష్కారం ప్రజలకు మేలు చేసేది కాదు. ఇది కేవలం ప్రాంతీయ బడా బూర్జువా వర్గానికి మేలు చేసేదే. కనుక ఈ దేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశంగా వున్నంత కాలం ఏదో ఒక సామ్రాజ్యవాద దేశం

ఆధిపత్యంలో మన దేశం జాతుల బంధీఖానాగా కొనసాగుతుంది. కనుక ఈ సమస్యకు పరిష్కారంగా దేశంలో వ్యవసాయ విప్లవం ఇరుసుగా కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, జాతులకు విడిపోయే హక్కుతో పాటు, స్వయం నిర్ణయాధికార హక్కును కలిగి వుండేలా, ఐచ్ఛికమైన భారత ప్రజల ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్‌ను స్థాపించాలి.

***ప్రియమైన ప్రజలారా!***

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక హోదాకు గండి కొట్టడమే కాకుండా, విభజన చట్టంలో రాష్ట్రాభివృద్ధికి సరైన హామీలను పొందుపరచలేదు. అవి ఒక దిశానిర్దేశం లేకుండా ఉన్నాయి. కనుక ప్రత్యేక హోదాను సాధించడంతో పాటు, సంబంధిత కాలంలో రాష్ట్రాభివృద్ధికి సరైన దిశానిర్దేశంలో, అంటే ప్రజల కనీస సమస్యలు పరిష్కరించబడేలా నూతన హామీల కోసం కూడా పోరాడాలి. అవి ముఖ్యంగా వ్యవసాయ సమస్య, పారిశ్రామిక సమస్య, అసమానాభివృద్ధి సమస్య, ఆదివాసీ, దళిత, మైనార్టీ, మహిళా, విద్యార్థి సమస్యల కేంద్రంగా హామీలను పొందాలి.

**1. వ్యవసాయ సమస్య**

నిర్దిష్టంగా చెప్పాలంటే రాష్ట్రంలోని జనాభా అధిక శాతం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. వ్యవసాయరంగ అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి. దీని మీదనే మెజారిటీ ప్రజల అభివృద్ధి ఆధారపడి వుంది. ఇప్పటికీ భూమి లేని జనాభా గణనీయంగానే ఉన్నారు. వీరు ప్రధానంగా దళితులుగా వున్నారు. భూమిలేని రైతుకూలీలు, పేదరైతాంగానికి భూ సంస్కరణలు అమలు జరిపి, భూములను పంచాలి. వ్యవసాయాభివృద్ధి కోసం సాగునీటి పథకాలు అమలు జరపాలి. భూమి ఎక్కువ మంది ప్రజల చేతికిందికి వచ్చినప్పుడు, వలసలు పోయే పరిస్థితి చాలా వరకు తగ్గుతుంది. రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సరసమైన ధరలకు ప్రభుత్వమే సరఫరా చేయాలి. రైతులను అప్పుల బారీ నుండి రక్షించేందుకు వడ్డీ వ్యాపారుల దోపిడీని అరికట్టాలి. ప్రైవేటు వడ్డీ వ్యాపారాన్ని రద్దు చేయాలి. రైతాంగానికి 10 సంవత్సరాల వరకు వడ్డీలేని పంట ఋణాలను ఇవ్వాలి. కౌలు రైతులకు కౌలుదారీ చట్టాలను అమలు జరపాలి. కౌలు రైతులకు కూడా పంట నష్టపరిహారాన్ని, వడ్డీలేని ఋణాలను ఇవ్వాలి. దీని కోసం గతంలో కొనసాగిన సహకార బ్యాంకులను పునరుద్ధరించాలి. వీటికి తోడుగా గ్రామీణ బ్యాంకులకు నిధులను కేటాయించి విస్తరింపజేయాలి. పండిన పంటకు గిట్టబాటు ధర కల్పించాలి. ఈ విధంగా భూసంస్కరణల అమలు, నీటి సౌకర్యం కల్పించడం, పంట ఋణాలను ఇవ్వడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరఫరా చేయడం, పండిన పంటకు గిట్టబాటు ధర కల్పించడం ద్వారా రైతాంగాన్ని సంక్షోభం నుండి బయటపడవేయవచ్చు. రైతాంగ ఆత్మహత్యలను నివారించవచ్చు. వరి పరిశోధనా కేంద్రాలనూ, నూనె గింజల పరిశోధనా కేంద్రాలనూ, పప్పుధాన్యాల పరిశోధనా కేంద్రాలనూ, నార పరిశోధనా కేంద్రాలను... రాష్ట్రంలో ఆయా ప్రాంతాల అవసరాన్ని బట్టి ఏర్పాటు చేయాలి.

**2. అసమానాభివృద్ధి సమస్య**

**ఎ. రాయలసీమ ప్రాంతం :–** ఇది రాష్ట్ర వైశాల్యంలో 40%, జనాభాలో 30%న్ని కలిగి వున్నది. బరయిటీస్, చైనాక్లే, డైమండ్, డోలమైట్, సున్నపురాయి, గ్రీన్‌క్వార్జ్, ఇనుము, సిలీకాన్, ఆస్‌బెస్టాస్ వంటి ఖనిజ సంపదతో పాటు, ఎర్రచందనం, వెదురు, గందపుచెట్లు లాంటి అపారమైన అడవి సంపద కూడా ఉంది. ఈ సంపద నుండి వస్తున్న ఆదాయాన్ని ఈ ప్రాంతం అభివృద్ధికి ఉపయోగించడం లేదు. కరువు, కాటకాలు నిరంతరం కొనసాగుతున్నాయి. విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు, పారిశుద్ధ్యంలో వెనకబడి వుంది. వలసలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. హంద్రి–నీవా, తెలుగుగంగ, వెలుగొండ, గాలేరునగరి, వెలుగోడు లాంటి ప్రాజెక్టులు పూర్తి చేసి, సాగునీటి సౌకర్యాలను కల్పించాలి. విద్యా, వైద్యానికి సంబంధించిన కొన్ని సంస్థలను రాయలసీమలో ఏర్పాటు చేయాలి. చేనేతరంగ అభివృద్ధి కోసం పథకాలను అమలు జరపాలి. తిరుపతిలో పెట్టాలనుకున్న క్యాన్సర్ సంస్థను అక్కడ గానీ, మరొక రాయలసీమ పట్టణంలో గాని ఏర్పాటు చేయాలే తప్ప, వేరే ప్రాంతానికి మార్చరాదు. రాయలసీమలో పెట్టాలనుకున్న విద్యుత్ ఉత్పత్తి పరికరాల సంస్థని నెల్లూరుకు మార్చకుండా, రాయలసీమలోనే ఏర్పాటు చేయాలి. ఇంకా ఇతరత్రా చిన్న తరహా, మధ్య తరహా శ్రమ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి, మెజారిటీ ప్రజలకు ఉపాధిని కల్పించాలి. రాయలసీమలోని మేధావులు, ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్న హైకోర్టు బెంచ్‌ని కర్నూల్‌లో ఏర్పాటు చేయాలి. విభజన చట్టంలోని వున్న గుంతకల్ రైల్వేజోన్ హామిని పూర్తి చేయాలి.

**బి. ఉత్తరాంధ్ర ప్రాంతం :–** ఇది కూడా చాలా వెనకబడి వున్నది. ఈ ప్రాంతంలో విస్తారంగా నదులు వున్నాయి. సాగునీటి పథకాల ద్వారా వ్యవసాయానికి సాగునీటి సౌకర్యాన్ని కల్పించాలి. భూమి లేని వారికి భూములు పంచాలి. జీడిపిక్కల పరిశ్రమ, చేనేత పరిశ్రమ, కొబ్బరితోటలు, చెరకు అభివృద్ధి, బెల్లం తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలోని జూట్ మిల్లులను పునరుద్ధరించాలి. గిరిజన విశ్వవిద్యాలయాన్ని విజయనగరంలో ఏర్పాటు చేయాలి. శ్రీకాకుళంలో జాతీయ స్థాయి కలిగిన వైద్య సంస్థనూ, కిడ్నీ వ్యాధుల పరిశోధనా కేంద్రాన్నీ, పాల్‌టెక్నిక్ కాలేజీనీ, ఆయుర్వేద హోమియో వైద్యశాలనూ, నార పరిశోధనా కేంద్రాన్ని నిర్మాణం చేయాలి. టెక్కలిలో జీడిమామిడికి సంబంధించిన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. మిగిలిన విద్యా, వైద్య సంస్థలను కూడా విశాఖపట్నంలో కాకుండా ఇతర ఉత్తరాంధ్ర పట్టణాలలో ఏర్పాటు చేయాలి. పాడేరులో మెడికల్ కాలేజీనీ, పశు వైద్య కళాశాలనీ, బి.ఇడి. కాలేజీనీ, పి.జి సెంటర్‌ను, నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి. అరకులోయలో ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలి. రాయలసీమలో ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్నీ, ఉత్తరాంధ్రలో మరొక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. అరకులోయను టూరిజం పేరుతో అశ్లీల వ్యభిచార సంస్కృతిని అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రభుత్వం చూస్తున్నది. ఇటువంటి ప్రజా వ్యతిరేక పథకాలను అడ్డుకోవాలి. కాఫీ, జీడిపిక్కలు, ఇంకా ఇతర రకాల చిన్న తరహా, మధ్య తరహా శ్రమ ఆధారిత పరిశ్రమలను ఏర్పర్చాలి. ఈ విధంగా ఎక్కువ మంది ప్రజలకు ఉపాధి దొరికే విధంగా పరిశ్రమలు నెలకొల్పాలి.

**సి. దక్షణకోస్తా ప్రాంతం :–** ఈ ప్రాంతంలో కూడా అనేక వెనకబడిన ప్రాంతాలు వున్నాయి. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ ఎత్తిపోతల

ప్రాజెక్టు, గుంటూరు జిల్లా, పల్నాడు ప్రాంతంలో దమ్మర్లగొంది ఎత్తిపోతల ప్రాజెక్టు వంటి వాటితో పాటు, ఇతర ప్రాంతాలలో కూడా తగిన అభివృద్ధి పథకాలు చేపట్టాలి.

**3. పారిశ్రామిక సమస్య**

పరిశ్రమలు ముఖ్యంగా శ్రమ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలి. చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలను ప్రధానంగా నెలకొల్పాలి. అప్పుడే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుంది. సామ్రాజ్యవాదుల మిలఖత్‌తో దళారీ పెట్టుబడిదారులు ఏర్పాటు చేసే పరిశ్రమలు పెద్ద ఎత్తున దేశ సంపదను కొల్లగొడతాయి. ఆ కంపెనీలకు అనుకూలంగా వున్న కొద్దిమంది మాత్రమే కుబేరులవుతారు. దీని ఫలితంగా సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్ర స్థాయిలో పెరుగుతాయి. ఇటువంటి పరిశ్రమలు పెట్టిన ప్రాంతాల్లో విస్తాపిత సమస్య, కాలుష్యం సమస్యలు పెరుగుతాయి. ముఖ్యంగా పరిశ్రమలను జాతీయ బూర్జువా వర్గానికి ప్రభుత్వం సహకరించి, ఏర్పాటు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా, శాశ్వత పద్ధతిన ఉద్యోగాలు కల్పించాలి. మన రాష్ట్రంలో సముద్రతీరం పొడవునా నివసిస్తున్న మత్స్యకారుల అభివృద్ధి కోసం పథకాలను ఏర్పాటు చేయాలి.

అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కొన్ని పథకాలను అమలు జరపాలి. సమాన పనికి సమాన వేతనం, ఉపాధి గ్యారంటీ, కనీస వేతన చట్టాలను అమలు జరపాలి. పని స్థలాలలో ప్రమాద నివారణ చర్యలు అమలు జరిగేలా చూడాలి. ప్రమాదాలు జరిగినప్పుడు న్యాయమైన నష్ట పరిహారం చెల్లించే విధంగా చూడాలి. వృద్ధాప్యంలో పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలి. అసంఘటిత రంగ కార్మికులకు సంబంధించిన హక్కుల చట్టాలను అమలు జరపాలి. భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు జరపాలి.

ఇప్పటిదాకా అన్ని పార్టీలు సామ్రాజ్యవాద మోడల్ అభివృద్ధిని అమలు పరుస్తున్నారు. దాని వలన ప్రాంతీయ అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో హైద్రాబాదును భారీ స్థాయిలో పెంచాయి. ఇటువంటి అభివృద్ధి వలన కాలుష్యం పెరిగిపోయి, ఆ నగరంలో ప్రజలు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం ఢిల్లీ నగరాన్ని చూసి నేర్చుకోవాలి. ఢిల్లీలో భయంకరమైన వాయుకాలుష్యం వలన ప్రజలు పారిపోయే పరిస్థితి వచ్చింది. నేడు విశాఖపట్నం, విజయవాడలను కేంద్రంగా చేసి, అభివృద్ధి చేయాలని చంద్రబాబు, బి.జె.పి.లు పథకాలు వేశారు. విశాఖపట్నం ఇప్పటికే మురికికూపంగా తయారైంది. విశాఖపట్నం-చెన్నై కోస్టల్ కారిడార్ వలన తీర ప్రాంతం అంతా కాలుష్య కేంద్రంగా మారబోతుంది. కాకినాడ, విశాఖపట్నం మధ్యన ఇప్పటికే ఎన్నో కాలుష్య కారక పరిశ్రమలను ఏర్పాటు చేశారు. దీనివలన ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువలన పరిశ్రమలు గానీ, విద్యాలయాలుగానీ, వైద్యశాలలుగానీ, ఇంకా ఇతర రకాల యూనిట్లుగానీ, ప్రభుత్వ కార్యాలయాలుగాని ఒకేప్రాంతంలో కేంద్రీకరించి ఏర్పాటు చేయరాదు.

**4. ఆదివాసీ సమస్య**

ఇప్పటిదాకా ఆదివాసీలు పోరాడి సాధించుకున్న చట్టాలను (1/70 వంటి) హక్కులను పరిరక్షిస్తూ, ఆ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి. ముఖ్యంగా విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించాలి. వారి స్వయం ప్రతిపత్తి డిమాండ్ ఆమోదించాలి. ముఖ్యంగా జల్, జంగల్, జమీన్‌పై వారి హక్కును గుర్తించాలి.

**5.** దళితులు, మైనార్టీలు, మహిళలు, విద్యార్థులు, ఇతర సెక్షన్‌ల అభివృద్ధికి నిర్దిష్టమైన కార్యక్రమం చేపట్టాలి. ముఖ్యంగా దళితులలోని వ్యవసాయ కూలీ, పేద రైతాంగానికి తప్పనిసరిగా సాగు భూమిని ఇవ్వాలి.

నేడు ఆంధ్రప్రదేశ్‌లో పీడిత ప్రజల కనీస అభివృద్ధికి పై హామీలను సాధించుకోవాలి. వీటితో పాటు హామీల విషయంలో మరింత లోతుగా చర్చించి సమగ్రతను సాధించాలి. ఈ హామీలను ప్రత్యేక హోదా కాలంలో అమలు జరిగేలా ఒక నిర్దిష్టమైన పథకాన్ని కూడా రూపొందించేలా డిమాండ్ చేయాలి. ఇందుకు పైన చెప్పుకున్నట్లుగా ప్రత్యేక హోదాను సాధించేందుకూ, సంబంధిత కాలంలో సాధించుకున్న హామీలను అమలు చేసేందుకు సమరశీల పోరాటానికి సిద్ధం కావాలి.

- **ప్రత్యేక హోదా ఎన్నికల గారడీల ద్వారా రాదు.**
- **దీర్ఘకాలిక సమరశీల ప్రజా పోరాటాల ద్వారా మాత్రమే ప్రత్యేక హోదా సాధ్యం.**
- **ప్రత్యేక హోదా వలన ప్రజల ఆర్థిక, సాంఘిక హోదా పెరిగాలి.**

విప్లవాభివందనాలతో,

తేది : ఏప్రిల్ 10, 2018,

ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి.

▲

"కమ్యూనిస్టులు కార్మికవర్గపు తక్షణ లక్ష్యాల సాధనకోసమూ, అప్పటి (మూమెంటరీ) ప్రయోజనాలకోసమూ, పోరాడతారు. అయితే వాళ్ళు వర్తమాన ఉద్యమంలో, ఆ ఉద్యమ భవిష్యత్తుకు ప్రాతినిధ్యం వహిస్తూ, భవిష్యత్తు పట్ల శ్రద్ధ వహిస్తారు."

# మార్క్స్, ఎంగెల్స్‌ల జీవిత రేఖలు

**మూలం : ఎర్నెస్టో చే గువేరా** **అనువాదం : కాత్యాయిని**



"కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ లిరువురూ దాదాపుగా ఒకే కాలంలో, ఒకే ప్రాంతంలో పుట్టినవాళ్ళు. 1818 మే, 5వ తేదీన ట్రెయిర్ నగరంలో మార్క్స్ జన్మిస్తే, 1820 నవంబర్ 28న బ్రెమెన్‌లో ఎంగెల్స్ పుట్టాడు. ఈ రెండు నగరాలూ జర్మనీలోని రైన్‌లాండ్ ప్రాంతంలోనివే. ఐతే వాళ్ళిద్దరూ పరస్పర భిన్నమైన పరిస్థితులలో పెరగడమే గాక యవ్వనంలో అడుగు పెట్టేదాకా ఒకరినొకరు ఎరగరు.

కార్ల్‌మార్క్స్ తండ్రి క్రైస్తవ మతాన్ని స్వీకరించిన ఒక యూదు లాయరు. కానీ, వాళ్ళ కుటుంబమంతా హిబ్రూ మత సంప్రదాయాలను అనుసరించేది. అప్పట్లో మార్క్స్‌కు ఆర్థిక ఇబ్బందులేమీ లేనప్పటికీ, యూదుల మీద అమలయ్యే జాతివివక్ష అతని హృదయాన్ని గాయపరుస్తూ ఉండేది. మొదట బాన్ నగరంలోనూ, తర్వాత బెర్లిన్‌లోనూ న్యాయశాస్త్రం చదివాడాయన. ఆ రోజుల్లోనే ఆయనకు తత్వశాస్త్రంపై ఆసక్తి మొదలైంది. డెమొక్రిటిస్, ఎపిక్యూరస్‌ల తాత్విక సిద్ధాంతాలపై పరిశోధన చేసి, 1841లో జెనాలో డాక్టరేటు పుచ్చుకున్నాడు.

ఫ్రెడరిక్ ఎంగెల్స్ కళాశాల విద్యను పూర్తి చెయ్యకుండానే తండ్రి నిర్వహిస్తున్న వ్యాపారంలోకి అడుగు పెట్టాడు. కొంతకాలం పాటు సైన్యంలో పని చేశాక బెర్లిన్‌లో తత్వశాస్త్ర అధ్యయనాన్ని ప్రారంభించాడు. తానొకవైపున ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూనే మిత్రుడు మార్క్స్‌కు అన్ని విధాలా అండగా నిలబడ్డాడు ఎంగెల్స్. కార్ల్‌మార్క్స్, తాను దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతూ కూడా శ్రామికవర్గ విముక్తికై ఒక సిద్ధాంతాన్ని, ఉద్యమాన్ని నిర్మించేందుకు అకుంఠిత దీక్షతో తన జీవితాన్ని అంకితం చేశాడు.

ఉదారవాద దృక్పథంగల మార్క్స్ తండ్రి, తన కొడుకు ఆసక్తులను అర్థం చేసుకోగలిగాడు. కానీ ఎంగెల్స్ కుటుంబం-ముఖ్యంగా అతని తండ్రి - ఫ్రెడరిక్ చేసే సాహసాలు చూసి, బాధపడుతుండేవాడు. అన్ని రకాల మూఢ విశ్వాసాల మీదా తిరుగుబాటు చేసే ప్రవృత్తి ఫ్రెడరిక్‌కు చిన్నతనం నుండీ అలవడింది.

మార్క్స్, ఎంగెల్స్‌లు సంధించిన మొట్టమొదటి అస్త్రాలు వాళ్ళ కవితలు. ఈ కవిత్వాన్ని విమర్శకులెవ్వరూ పెద్దగా పట్టించుకున్నట్టు కనబడదు. ఈ కుర్రతనపు సరదాలు ఎంతో కాలంపాటు కొనసాగనూ లేదు. తర్వాత ఈ యువకులిద్దరూ హెగెల్ తత్వశాస్త్రం వైపుకు ఆకర్షితులై, యువ హెగెలియన్లు నిర్వహించే చర్చల్లో పాల్గొనేవారు.

కొంతకాలం తర్వాత మార్క్స్, ఎంగెల్స్‌లిద్దరూ ఫ్యుయెర్‌బాక్ సిద్ధాంతానికి ప్రభావితులయ్యారు. ఆ సిద్ధాంతాన్ని మరింతగా అభివృద్ధి పరిచి, గతితార్కిక భౌతికవాదంగా రూపొందించడానికి ఈ ఇద్దరూ ఎవరి పంథాలో వాళ్ళు ప్రయత్నాలు సాగించారు. తద్వారా వీళ్ళిద్దరూ ప్రాణమిత్రులుగా మారి, ఒక చరిత్ర నిర్మాణంలో భాగస్వాములైన అద్భుత వ్యక్తులుగా నిలిచిపోయారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు మిత్రులుగా మారకముందు గడిపిన జీవితంలో చెప్పుకోదగిన విశేషాలేమి లేవు. ఐతే ఒక వ్యక్తిని గురించి మాత్రం చెప్పుకొని తీరాల్సిందే. ఎందుకంటే మార్క్స్ జీవితంపై ఆమె ప్రభావం అసాధారణమైనది. ఆమె - జెన్నీవాన్ వెస్ట్ ఫాలెన్. ఆమె జర్మనీలోని ఒక సంపన్న కుటుంబానికి చెందిన యువతి. మార్క్స్ జీవితానికి జెన్నీ ఒక మూలస్థంభంగా నిలిచిందని చెప్పాలి. భర్తను మనసారా ఆరాధించే స్త్రీగా, ఆయన రచనలకు మేలుప్రతులను తయారు చేసిన వ్యక్తిగా తప్ప, ఆమెకు ఏ గుర్తింపు లభించలేదు. ఐతే ఆమె మాత్రం సాధారణ గృహిణి ఎంత మాత్రమూ కాదు. భర్త మేధనూ, దానికి మరింత పదునుపెట్టే ఆయన రచనా వ్యాసంగాన్నీ ఆమె అర్థం చేసుకున్నది. ఆయన అభివృద్ధి కోసం కనీసావసరాలను కూడా త్యాగం చేసిన వ్యక్తిగా ఆమె తన వర్గపు స్త్రీలందరిలోనూ ఉన్నతురాలిగా నిలిచింది.

ఆమె కూడా ఒకప్పుడు తన సామాజిక వర్గానికి చెందిన వాళ్ళందరి లాగానే విందులూ, వినోదాలూ, పుష్కలమైన సంపదతో ప్రశాంత జీవనాన్ని సాగించిన వ్యక్తే. అయితే తన జీవితం మార్క్స్‌తో ముడిపడినప్పటి నుంచీ అన్ని సౌకర్యాలనూ వదులుకుని ఆయన విప్లవభావాలకు అండగా నిలబడింది. సంవత్సరాల తరబడి వాళ్ళు అనుభవించిన దారిద్ర్యం వాళ్ళ సంతానంలో కొందరిని బలితీసుకున్నది. వృద్ధాప్యంలో అనారోగ్యంతో వున్న మార్క్స్, కాన్సర్‌తో మరణశయ్యపై నున్న భార్యకు చివరి వీడ్కోలు పలికిన సన్నివేశాన్ని వాళ్ళ చిన్నకూతురు (ఎలియనార్) వర్ణించింది. ఆమె మాటలు మార్క్స్, జెన్నీల అన్యోన్య దాంపత్యానికి సాక్ష్యంగా నిలుస్తాయి –

"ముందు హాల్లో అమ్మా, ఆ పక్కనున్న చిన్న గదిలో మూర్ (మార్క్స్) పడుకుని వున్నారు. జీవితాంతమూ ప్రాణానికి ప్రాణంగా కలిసి బతికిన వాళ్ళిద్దరూ చివరిదశలో ఒక గదిలో ఉండటానికైనా వీల్లేని పరిస్థితి వచ్చింది. మూర్ అనారోగ్యం మళ్ళీ తిరగబెట్టింది. ఆయన తన శక్తినంతటినీ కూడదీసుకుని లేచి, అమ్మ గదిలోకి వెళ్ళిన ఆనాటి ఉదయాన్ని నేనెన్నటికీ మరిచిపోలేను. ఆపూట వాళ్ళిద్దరూ నవయవ్వనంలోని యువతీయువకుల్లా ఉన్నారు. తానొక అనారోగ్య పీడితుణ్ణయిన వృద్ధుడినని ఆయనకు గానీ, జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధురాలినని ఆమెకు గానీ గుర్తేలేనంత యవ్వనోత్సాహంతో అప్పుడే జీవితాన్నారంభించిన యువ ప్రేమికుల్లా మారిపోయారు."

మార్క్స్ జెన్నీల సంతానంలో ముగ్గురు కూతుళ్ళు–జెన్నీ, లారా, ఎలియనార్‌లు మాత్రమే పెరిగి పెద్దవాళ్ళయ్యారు. మిగిలిన పిల్లలందరూ మరణించారు. ఎనిమిదేళ్ళ వయసుదాకా పెరిగిన ఎడ్గార్ అనే పిల్లవాడి మరణం తల్లిదండ్రులను బాగా కుంగదీసింది. వాళ్ళిద్దరూ రాసుకున్న ఉత్తరాల్లో ఆ పిల్లవాడి ప్రసక్తి చాలా కాలంపాటు కనబడుతూనే ఉండేది.

మార్క్స్ జీవితం మీద జెన్నీ కన్నా గాఢమైన ప్రభావం వేసిన వ్యక్తి ఎంగెల్సే నన్నది వాస్తవం. ఐనప్పటికీ ఆమెను గురించి ప్రత్యేకంగా చెప్పుకుని తీరాలి. ఆమె ఒక అసాధారణ వ్యక్తి. మార్క్స్ జీవితకాల సహచరి. ఆయన జీవితంలో ఆమెకు దూరంగా గడిపిన కాలం అతి స్వల్పమే.

సెన్సార్‌షిప్ గురించి చేసిన రచనతో మార్క్స్ తన రాజకీయ రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. ఐతే, ఆయన వివరించిన ఆ సెన్సార్‌షిప్ కారణంగానే ఆ వ్యాసం ప్రచురితం కాలేదు. తన చిన్ననాటి మిత్రుడు ఆర్నాల్డ్ ర్యూగ్ సంపాదకత్వంలోని 'జర్మన్ యాన్నెల్స్' అనే పత్రిక కోసం మార్క్స్ ఆ వ్యాసాన్ని రాశాడు. తర్వాతి కాలంలో మార్క్స్, ఎంగెల్స్‌లిద్దరి జీవిత మార్గాలు వేరయ్యాయి. 'రీనిష్ జీటుంగ్' అనే పత్రికలో మార్క్స్ రాసిన ముఖ్యమైన రచనల ప్రచురణ ప్రారంభమైంది. తర్వాత కొంత కాలానికి ఆయన ఆ పత్రికకే సంపాదకుడయ్యాడు. ఎంగెల్స్ కూడా ఫ్రెడరిక్ ఆస్వాల్డ్ అనే కలం పేరుతో ఆ రెండు పత్రికల్లోనూ గతితార్కిక దృక్పథంలో రచనలు ప్రారంభించాడు.

ఆనాటి ప్రజా వ్యతిరేక శిబిరంలో 'రీనిష్ జీటుంగ్' పత్రిక కలవరం రేపింది. దాన్ని అణచివేయటానికి ప్రష్యన్ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందుగా పత్రికపై సెన్సార్‌షిప్‌ను ప్రయోగించింది. దాంతో యాజమాన్యం తమ పత్రికను నిలబెట్టుకునేందుగానూ మార్క్స్ రచనలపై నియంత్రణను ప్రారంభించింది. ఈ పరిస్థితుల్లో మార్క్స్ స్వచ్ఛందంగా సంపాదక బాధ్యతల నుండి తప్పుకున్నాడు.

మార్క్స్, ఎంగెల్స్‌ల తొలి పరిచయం 1842, అక్టోబర్‌లో జరిగింది. అప్పటికే మార్క్స్‌కు యువ హెగెలియన్లతో సంబంధాలు తెగిపోయాయి. కానీ ఎంగెల్స్ ఇంకా వారితో కొనసాగుతూనే వున్నాడు. అందువల్ల వాళ్ళిద్దరి మొదటి పరిచయం అతి సాధారణంగా – అంటే తర్వాతి రోజుల్లో ఆ ఇద్దరూ అంత సన్నిహితంగా కలిసి పని చేస్తారని ఊహించటానికైనా వీల్లేనంత మామూలుగా జరిగిపోయింది.

'జర్మన్ యాన్నెల్స్' పత్రికను జర్మనీ నుండి నడిపేందుకు ఇక సాధ్యంకాని పరిస్థితులేర్పడ్డాయి. దాంతో మార్క్స్, ర్యూగ్‌లు కలిసి 'డచ్ – ఫ్రాంజోషిష్క్ జర్‌బూచర్' అనే పత్రికను ఫ్రాన్స్ నుండి ప్రచురించాలని నిర్ణయించుకున్నారు. ఐతే ఆ పత్రిక కూడా ఒక్క సంచిక మాత్రమే వెలువడి, ఆగిపోయింది. అందులో మార్క్స్ 'ఇంట్రడక్షన్ టు ఎ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ హెగెల్స్ ఫిలాసఫీ ఆఫ్ రైట్' అనే వ్యాసాన్ని రాశాడు. దాని ద్వారా తనదైన దృక్పథంతో సామాజిక చరిత్రను వ్యాఖ్యానించే ప్రయత్నం చేశాడు. అదే సంచికలో ఎంగెల్స్ కూడా 'అవుట్‌లైన్స్ ఆఫ్ ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' అనే వ్యాసాన్ని రాశాడు. ఎంగెల్స్‌ను మార్క్సిస్టు సిద్ధాంత వ్యవస్థాపకులలో ఒకరుగా నిలబెట్టగల ఆర్థిక శాస్త్ర విశ్లేషణ ఆ వ్యాసంలో కనబడుతుంది.

ఆ తర్వాత మార్క్స్, పారిస్‌లోనే నివసిస్తూ చరిత్రను లోతుగా అధ్యయనం చేయసాగాడు. థెయరీ, గెజాట్‌ల వంటి బూర్జువావర్గ రచయితలను విశ్లేషించటం ద్వారా 'వర్గ సంఘర్షణ' అనే కీలకమైన ఒక సైద్ధాంతిక భావనను కనుగొనగలిగాడు. ఆ తర్వాత చాలా కాలానికి, 1854లో ఎంగెల్స్‌కు రాసిన ఒక ఉత్తరంలో మార్క్స్ ఇలా అన్నాడు.

"1858లో థెయరీ రాసిన 'ద హిస్టరీ ఆఫ్ ద థర్డ్ ఎస్టేట్' అనే పుస్తకం నన్నెంతగానో ఆకట్టుకుంది. 'వర్గ సంఘర్షణ సిద్ధాంత పితామహుడు'గా ఫ్రెంచి చరిత్రకారులు ఆకాశానికెత్తిన ఈ పెద్దమనిషి 'ఆధునికులకు' వ్యతిరేకంగా రాసిన తన ముందుమాటలో బూర్జువా, శ్రామిక వర్గాల మధ్యవున్న శతృత్వానికి చరిత్రలో జాడలు వెతుకుతూ వెళ్ళి, 1789 కన్నా ముందే 'మూడవ ఎస్టేట్' అనదగిన ఒక భూస్వామ్య వర్గం ఉండేదని ప్రతిపాదించాడు."

ఇలా తనకన్నా ముందుతరాల వారి మేధనూ, వారి చారిత్రక ప్రాధాన్యతనూ మార్క్స్ గుర్తించినప్పటికీ, ఆ బూర్జువా మేధావుల సిద్ధాంతాల్లోని లోపాలను విమర్శనాత్మకంగా ఎత్తిచూపుతూనే ఉన్నాడు.

మార్క్స్ ఏడాదికాలానికి పైగా ఫ్రాన్స్‌లో ఉన్నాడు. ఆ తర్వాత పెద్దకూతురు పుట్టాక, కొన్ని తప్పనిసరి పరిస్థితులలో కుటుంబాన్ని బ్రస్సెల్స్‌కు మార్చాల్సి వచ్చింది.

అర్థశాస్త్రంపై ఎంగెల్స్ రాసిన మొదటి వ్యాసం వెలువడే నాటికే మార్క్స్ ఆ విషయంలో లోతుగా అధ్యయనం చేసి, హెగెల్-ఫ్యుయర్‌బక్‌ల సైద్ధాంతిక దృక్పథాల ప్రాతిపదికగా అర్థశాస్త్రాన్ని విశ్లేషించే పనిలో నిమగ్నమై ఉన్నాడు. ఈ అంశంపై ఆయన చేసిన రచనల్లో అద్భుతమైన అంతర్‌దృష్టి కనబడుతుంది. ఐతే మార్క్స్, ఎంగెల్స్‌ల మరణానంతరం దాకా ఈ రచనల ప్రచురణ జరగనే లేదు. 1844లో 'ఎకనమిక్ అండ్ ఫిలసాఫికల్ మాన్యుస్క్రిప్ట్స్' పేరిట ఈ వ్యాసాలు అచ్చయ్యాయి.

మార్క్స్, ఎంగెల్స్‌ల సంయుక్త రచనగా వెలువడిన 'ద హెూలీ ఫ్యామిలీ'లో ఎక్కువ భాగం మార్క్స్ రాసినదే. సాహిత్య, తాత్విక (యువ హెగెలియన్లకు వ్యతిరేకంగా) విమర్శల సమ్మేళనమైన ఈ గ్రంథంలో చారిత్రక భౌతికవాద ఛాయలు కొన్ని చోట్ల తళుకులీనుతూ ఉంటాయి. యువ హెగెలియన్లలో ఒకరైన యూజీన్ స్యూ రాసిన 'ద మిస్టరీస్ ఆఫ్ ప్యారిస్' అనే ఒక సాదాసీదా నవలపై విమర్శ ఈ గ్రంథంలో ప్రముఖంగా కనబడుతుంది. 1867లో ఎంగెల్స్‌కు రాసిన ఓ ఉత్తరంలో మార్క్స్ ఇలా అంటాడు.

"ఇవాల్టి పరిస్థితుల్లో హాస్యాస్పదంగా మారిపోయిన ఫ్యుయర్‌బక్ దృక్పథంతో వెలువడిన ఆ రచన అప్పట్లో నాకు ఆశ్చర్యానందాలను కలిగించిందని చెప్పుకోటానికి, కించపడాల్సిన అవసరమేమీ లేదు."

ఎంగెల్స్‌కు మంచి గుర్తింపు తెచ్చిన రచనల్లో 'ద కండిషన్ ఆఫ్ ద వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్' అనేది ఒకటి. అప్పటికీ పాతికేళ్ళయినా నిండని ఎంగెల్స్ ఈ గ్రంథ రచన ద్వారా తన సృజనాత్మక లక్ష్యాన్ని చేరేందుకు ఒక మార్గాన్ని రూపొందించుకున్నాడు. 1863లో ఎంగెల్స్‌కు ఆ పుస్తకాన్ని గురించి రాస్తూ మార్క్స్ -

"నీ పుస్తకాన్ని మళ్ళీ చదువుతూ వుంటే వయోపరిణతి తెచ్చిన మార్పు వల్ల కొంత నిరాశ కలుగుతోంది. ఇందులోని నీ అధ్యయనంలో శాస్త్రీయత కొంత కొరవడినప్పటికీ గొప్ప ఉత్సాహోద్వేగాలతో ధైర్యంగా ఒక దృక్పథాన్ని ఎంచుకోవటమనేది స్పష్టంగా కనబడుతుంది. ఆ ఊహ వాస్తవంగా మారి భవిష్యత్‌ను వెలిగిస్తుంది. ఎంతటి ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకుని ఈ వాస్తవం ఒక అద్భుతంగా, శక్తిమంతంగా చరిత్రలో నిలిచిపోతుంది."

కీలకమైన అంశాలను గ్రహించటంలోనూ, వాటిని చక్కటి శైలిలో సూటిగా వ్యక్తీకరించటంలోనూ మార్క్స్ కన్నా ఎంగెల్స్ ప్రతిభావంతుడని (ఫ్రాంజ్) మెహ్రింగ్ అభిప్రాయం. ఐతే ఆయన ఈ విషయాలన్నీ విపులంగా చర్చించడనీ ఆయన రచనలు 'పత్రిక కథనాల్లా' క్లుప్తంగా ఉంటాయనీ, మార్క్స్‌లాగా లోతైన విశ్లేషణలు చెయ్యడనీ ఎంగెల్స్‌పై ఒక ముద్ర ఏర్పడిపోయింది. 'యాంటీ ద్యూరింగ్', 'ఆరిజిన్ ఆఫ్ ఫ్యామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ అండ్ ద స్టేట్'ల వంటి ఎంగెల్స్ ప్రధాన రచనలన్నీ వాద వివాదాలతో, విడివిడి అంశాలతో, చర్చలతో కూడినవిగా కనబడతాయి. ఐతే మార్క్సిస్టు సైద్ధాంతిక చరిత్రలో వీటికున్న ప్రాధాన్యత చాలా గొప్పది.

తన రచనల్లోని లోపాలను ఎంగెల్స్ స్వయంగా గుర్తించ గలిగాడు. అందుకే 1851లో మార్క్స్‌కు ఒక ఉత్తరం రాస్తూ ఎంతో నిజాయితీగా, ఆత్మవిమర్శనాత్మకంగా ఇలా రాశాడు -

"భూమి కౌలు గురించి నువ్వు రాసిన విషయం పూర్తిగా యదార్థం. రికార్డో ప్రాంతంలోని నిరంతర జనాభా పెరుగుదలతో సమాంతరంగా పంటల దిగుబడి పెరగక పోవటం వల్ల జరిగే పరిణామాలు నా ఊహకు అందలేదు. మొక్కజొన్న ధరలు మాటిమాటికీ పెరిగిపోతుండటానికి కారణాలను కూడా సరిగ్గా విశ్లేషించలేక పోయాను. ఎంతసేపూ నా సిద్ధాంతాలకు మెరుగుపెట్టే పనిలోనే తలమునకలై, నాలోని విమర్శనా జ్ఞానాన్ని మొద్దుబార్చుకోవటం వల్ల మౌలికాంశాలను గుర్తించలేని స్థితికి చేరుకున్నాను."

మార్క్స్ కూడా ఇటువంటి ఇబ్బందులు కొన్నిటిని ఎదుర్కొన్నాడు. కానీ తనలోని గొప్ప మానవతా దృక్పథం ఇచ్చిన శక్తితో ఎగుడు దిగుళ్ళలో పడుతూ, లేస్తూ మొక్కవోని దీక్షతో తన మార్గంలో కొనసాగి సాధించిన లక్ష్యమే "క్యాపిటల్" గ్రంథం. ఈ అత్యద్భుతమైన ఫలాన్ని సాధించటానికి తన జీవితమంతటినీ వెచ్చించి కృషి చేశాడు మార్క్స్.

ఈ సహచరులిద్దరూ బ్రస్సెల్స్‌లో కలిసి పని చేసి 'ద జర్మన్ ఐడియాలజీ' అనే కొత్త గ్రంథాన్ని వెలువరించారు. ఇది కూడా వెంటనే వెలుగులోకి రాకుండా మార్క్స్, ఎంగెల్స్‌ల పుట్టనిబిడ్డగానే మిగిలిపోయింది. వారి మరణానంతరమే ఈ గ్రంథం అచ్చయ్యింది. "ద హెూలీ ఫ్యామిలీ"లోని పదబంధాల వంటివే ఈ రచనలోనూ కనబడతాయి. పాండితీ ప్రకర్షతో కూడిన వ్యంగ్యం వల్ల ఈ రచన సామాన్య పాఠకులకు మింగుడు పడటం కష్టంగా మారింది. గ్రంథ రచయితలు ఏయే వ్యక్తుల మీదనయితే పుస్తకంలో విమర్శలు చేశారో వాళ్ళంతా ఏనాడో చరిత్రలో మరుగునపడి పోవడం వల్ల కూడా పాఠకులకు విషయం అర్థమవటం కష్టమయింది. సమాజం నిరంతర పరిణామశీలమనీ, అది హింసాత్మకమైన తిరుగుబాట్లూ, నిర్దిష్ట లక్షణాలు గల దశలూ కలబోసిన ఒక మహా సమ్మేళనమనీ ఈ గ్రంథం నిరూపిస్తుంది. సామాజిక సమస్యల పట్ల ఈ రచనలో ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవడం వల్ల, మార్క్స్, ఎంగెల్స్‌లు ఆనాటి కమ్యూనిస్టులకు సన్నిహితులవటమే గాక (పెర్రీ - జోసెఫ్) ప్రౌధాన్‌పై తీవ్రమైన విమర్శలు కూడా చేశారు. కేవలం సైద్ధాంతిక వాదులైన 'ఆధునిక సోషలిస్టు'లపై వారి విమర్శలు ఎంతో సూటిగా, నిష్కర్షగా ఉంటాయి.

'ద జర్మన్ ఐడియాలజీ' గ్రంథానికి మార్క్స్ చాలా ప్రాధాన్యత నిచ్చారు. గత కాలపు రాజకీయ దృక్పథాలతో తెగదెంపులు చేసుకోవటంగా ఆయన దీన్ని భావించాడు. దీన్ని ప్రచురించడంలో అవరోధాలు ఏర్పడటాన్ని గురించి చెప్తూ "రాతప్రతిని చిట్టెలుకల

విమర్శకే వదిలిపెట్టి మా లక్ష్యశుద్ధిని పరీక్షించుకున్నాం" (ఎ కంట్రిబ్యూషన్ టు ద క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ పీఠికలో) అని చమత్కరించాడు మార్క్స్.

మార్క్స్ గతంలో చేసిన రచనల నుండి ఇదొక మౌలికమైన మలుపుగా ఈ గ్రంథాన్ని గురించి (లూయీ) ఆల్తూజర్ అభివర్ణించాడు. ఆనాటి వరకూ మార్క్స్ కమ్యూనిస్టు రాజకీయవాది గానూ, కాల్పనికోద్వేగంతో నిండిన సిద్ధాంతకర్తగానూ మాత్రమే ఉండేవాడు. కానీ అప్పటినుండీ ఆయన తన రాజకీయ దృక్పథానికి శాస్త్రీయ గతితార్కాన్ని జోడించదగల పరిణత మనస్కుడుగా దర్శనమిస్తాడు.

మార్క్స్, ప్రౌథాన్‌ల వ్యక్తిత్వాల్లోని మౌలికమైన భేదాలవల్ల వారిద్దరి సామాజిక దృక్పథాల్లోని భేదాలు చివరిదాకా అలాగే కొనసాగాయి. దారిద్ర్యం గురించిన తాత్వికత (ద ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ) గురించి ప్రౌథాన్ రాస్తే తాత్విక దారిద్ర్యం (ద పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ)తో మార్క్స్ అతనికి బదులిచ్చాడు. ఈ రచన చారిత్రక భౌతికవాదాన్ని నిర్వచించే మొట్టమొదటి ప్రతిపాదన కావటంతో మార్క్స్, ప్రౌథాన్‌ల మధ్య ఏర్పడిన వైరుధ్యం వాళ్ళను శాశ్వత ప్రత్యర్థులుగా మార్చింది. 1846లో మార్క్స్ చేసిన ఈ రచనకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది.

1846 డిసెంబర్ 28న పి.వి అన్నెన్‌కోవ్‌కు రాసిన ఒక లేఖలో ప్రౌథాన్ మీది తన విమర్శను ఇలా వివరించాడు మార్క్స్ –

''నిజం చెప్పాలంటే దాన్ని నేను పేదరికం గురించి స్థూలస్థాయిలో చర్చించిన రచనగా భావించానే తప్ప, నిరుపేదల గురించి ప్రత్యేకంగా దృష్టి పెట్టిన రచనగా నేను అనుకోలేదు. మీరు రాసిన లేఖలో చమత్కరించినట్లుగానే ప్రౌథాన్ తన గ్రంథంలోని అస్పష్టతా, అహంభావాల నడుమన 'కాస్తంత జర్మన్ తత్వశాస్త్రాన్ని" కూడా ప్రదర్శనకు పెట్టాడు. ఐతే అందులోని ఆర్థికాంశాలు మాత్రం ఆయన తాత్విక విషప్రయోగానికి గురి కాకుండా నిలిచాయని మీరు అభిప్రాయపడ్డారు. అందుకే ప్రౌథాన్ తాత్వికతలోని ఆర్థిక దృక్పథం ఎంత దోషపూరితమైనదో మీకు వివరించబోవటం లేదు. ప్రౌథాన్ రాజకీయార్థిక దృక్పథంలోని లోపాలను నేనిప్పుడు వివరించడం అనవసరంగూడా. సమకాలీన సామాజిక పరిస్థితులనూ, వాటి అంతస్సంబంధాలనూ గురించి ఏ మాత్రమూ అవగాహన లేకుండానే ఫొరియర్ వంటి వారి నుండి అరువుతెచ్చుకున్న పదజాలాన్ని ప్రయోగించడం వల్ల ప్రౌథాన్ సిద్ధాంతం పూర్తి అసంబద్ధంగా తయారయింది.

నిర్దిష్టమైన రూపాన్ని మినహాయించి చూస్తే, ఇక సమాజమనే దానికి అర్థమేముంటుంది? ఏ సమాజమైనా మానవసంబంధాల ఫలితంగానే రూపొందుతుంది. ఏ మానవుడయినా తన ఇష్టాయిష్టాల కనుగుణంగా కావాలనుకున్న సమాజాన్ని సృష్టించుకోగలడా? ఎంత మాత్రమూ సాధ్యం కాదు. మానవుడి ఉత్పత్తి సామర్థ్యాల అభివృద్ధి క్రమంలో ఏర్పడిన ఏ సామాజిక దశను చూసినా ఆ దశకు సంబంధించి ప్రత్యేకమైన వినిమయ, వినియోగ విధానాలు కూడా ఏర్పడి వుండటాన్ని గమనించగలం. ఉత్పత్తి, వినిమయం, వినియోగం అభివృద్ధి క్రమంలోని వివిధ పరిణామ దశలను పరిశీలించినట్లయితే ప్రతి దశలోనూ నిర్దిష్టమయిన సామాజిక వ్యవస్థా, సాంఘిక నిర్మాణాలూ – అంటే కుటుంబం, సంపద లేక వర్గాలు – ఒక్క మాటలో చెప్పాలంటే ఒక పౌరసమాజ మనేది నిర్దిష్టంగా ఏర్పడి వుంటుంది. ప్రతి పౌరసమాజ వ్యవస్థలోనూ ప్రత్యేకమైన రాజకీయ వ్యవస్థ ఏర్పడి, ఆ పౌర సమాజపు స్వభావాన్ని అధికారికంగా వ్యక్తీకరిస్తూ ఉంటుంది. ఈ విషయాలను ప్రౌథాన్ ఏ మాత్రమూ అర్థం చేసుకోలేదు. రాజ్యాన్నీ, పౌరసమాజాన్నీ, అంటే అధికారిక సమాజాన్నీ, ఆ సమాజపు అధికారిక సారాంశాన్నీ వేర్వేరు విషయాలుగా చూస్తూ, దాన్నే పెద్ద ఘనకార్యంగా భావించాడు.

తన ఉత్పత్తి శక్తులను స్వయంగా ఎన్నుకునే స్వేచ్ఛ మానవులకు లేదన్న విషయాన్ని ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటాను. ఐతే మానవ చరిత్ర మొత్తం ఉత్పత్తి శక్తులనే పునాదిపైనే నిర్మితమవుతుంది. ప్రతి ఉత్పత్తి శక్తీ కూడా కిందటి తరాలలోని క్రియాశీల ఆచరణ ఫలితంగా రూపొందినదే అయి వుంటుంది.

ఇంగ్లాండులో గత కాలపు ఆర్థిక వ్యవస్థలూ, వాటికి అనుగుణంగా ఏర్పడిన సామాజిక సంబంధాలూ, పాత పౌరసమాజానికి అధికారిక వ్యక్తీకరణగా ఉండిన రాజకీయ వ్యవస్థా – ఇవన్నీ ఇప్పుడు కుప్పకూలిపోయాయి. అంటే మానవుడి ఉత్పత్తికీ, వినిమయానికీ, మారకానికీ నెలవుగా వున్న వ్యవస్థలన్నీ చారిత్రక పరిణామంలో మార్పు చెందేవేనన్నమాట. మానవుడు కొత్త ఉత్పాదక సామర్థ్యాలను రూపొందించుకున్నప్పుడల్లా తన ఉత్పత్తి విధానాన్నీ, దానికి అనువుగా తన ఆర్థిక సంబంధాలనూ మార్చుకుంటూ పోతాడు. అంటే ప్రతి ఉత్పత్తి విధానంలోనూ దానికి అనుకూలమన రూపంలో ఆర్థిక సంబంధాలు ఏర్పడుతూ ఉంటాయి.

మానవులు ఉన్ని, లినెన్, సిల్కు వస్త్రాలను తయారు చేస్తున్నారన్న విషయం వరకూ ప్రౌథాన్ బాగానే అర్థం చేసుకున్నాడు. కానీ ఆయా ఉత్పత్తులకున్న మూలాలను గురించి ఆయన అవగాహన మరీ ఇంత అధ్వాన్నంగా ఉండటమే ఆయన ఘనత! ఊలు, లినెన్ వంటి వృత్తుల్లోని వ్యక్తులు తమ ఉత్పత్తుల ఆధారంగా నిర్దిష్టమైన సామాజిక సంబంధాలను కూడా రూపొందించుకుంటున్నారన్న విషయం ప్రౌథాన్ కేమాత్రమూ అంతుబట్టనే లేదు. ఈ విధంగా తాము ఉత్పత్తి చేసే పదార్థాలను బట్టి తమ సామాజిక సంబంధాలను ఏర్పరచుకోవటమేగాక భావాలనూ, ఆచార వ్యవహారాలనూ గూడా – అంటే తమ సామాజిక సంబంధాలకు తగిన ఆదర్శ భావనలను కూడా రూపొందించుకుంటున్నారని ప్రౌథాన్ గ్రహించలేదు. ఐతే అలా ఏర్పడిన అన్ని విధానాలూ వాటి ద్వారా వ్యక్తీకరించబడే సంబంధాలతో బాటుగా మారిపోయేవే తప్ప శాశ్వతమైనవి కావు. అవి కేవలం ఆయా చారిత్రక దశలకు సంబంధించినవి మాత్రమే. ప్రౌథాన్ మాత్రం ఈ ఆచార వ్యవహారాలనూ, అధిభౌతిక

విశ్వాసాలనూ చాలా ప్రధానమైనవిగా భావిస్తున్నాడు. చరిత్ర నిర్మాతలు మానవులేనన్న వాస్తవాన్ని ఆయన గుర్తించదల్చుకోనేలేదు. ఈ విధి విధానాలూ, ఊహా కల్పనలూ మానవుడి భౌతిక ఆచరణకు భిన్నమైనవనీ అవన్నీ శాశ్వతమూ, సత్యమూ అప్రతిహతమూననీ ఆయన అభిప్రాయం. ఇదంతా భౌతిక వాస్తవికతకు ఆమడ దూరానున్న శుద్ధ తర్కమే తప్ప మరొకటి కాదు. ఎంత అసంబద్ధమైన వాదమిది.!"

ప్రాణమిత్రులుగా మారిన మార్క్స్, ఎంగెల్స్‌లు మరి కొందరు యువ కమ్యూనిస్టులను కలుపుకుని (వారిలో (విల్‌హెల్మ్) ఉల్ఫ్ ముఖ్యుడు.) బ్రస్సెల్స్‌లో కమ్యూనిస్టు సంఘాల ఐక్య సంఘటన నొకదాన్ని నెలకొల్పి, యూరప్ అంతటా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఓ ఏడాది తర్వాత (1848లో) వారి కృషి ఫలించి అతి కీలకమైన చారిత్రక పత్రమొకటి రూపొందింది. అదే 'ద కమ్యూనిస్ట్ మేనిఫెస్టో'.

ఐతే ఆ పత్రం ఆ నాటికింకా తగినంత తాత్విక గాఢతను సంతరించుకోక పోవడంతో తన లక్ష్యాలను స్పష్టంగా ప్రకటించే స్థితిలో లేదు. అది ఆనాటి సోషలిస్టు సాహిత్యానికి ఒక విమర్శనాత్మక అనుబంధ రచనగా ఉందేతప్ప లక్ష్య ప్రకటనలో తగినంత స్పష్టతతో లేదని భావించారు. ఐనప్పటికీ, ఈ నాటికి కూడా ఎన్నో రాజకీయ పార్టీలు, వామపక్ష గ్రూపులూ తమ అసలైన లక్ష్యాలను (అవి ఏ విధమైనవి అయినప్పటికీ) ఆ ఉత్తేజపూరిత వర్గ సిద్ధాంతం పేరిట చెలామణి చేసుకుంటున్నారంటే, ఆ సిద్ధాంతం అందించిన అవగాహన ఎంత శాస్త్రీయమైనదో అర్థం చేసుకోవచ్చు. అలాగే కమ్యూనిస్టు ప్రణాళిక మీద విశ్వాసం ప్రకటించిన ఏ విప్లవకారుడి చిత్తశుద్ధినీ శంకించలేము. ఈ కమ్యూనిస్టు ప్రణాళిక రచనకు మార్క్స్‌ను ప్రోత్సహించిన 'కమ్యూనిస్ట్ లీగ్' ఏర్పాటులో మార్క్స్, ఎంగెల్స్‌లు ఆనాడు శ్రద్ధ వహించకపోయి ఉన్నట్లయితే 1884లో వెలువడిన ఈ పత్రం అతి దుర్మార్గంగా అణిచి వేయబడి ఉండేది.

అది మార్క్స్, ఎంగెల్స్‌లు రాజకీయ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయటంలో నిమగ్నులై వున్న కాలం –

1848లో యూరప్‌ను ఉగ్రూత లూపిన విప్లవోత్తేజ తరంగాల స్ఫూర్తిలో ఈ మిత్రులిద్దరూ కూడా జర్మనీలోని రాజకీయాల్లో పూర్తిగా నిమగ్నులయ్యారు. కొలోన్ నగరంలో 'న్యూ రీనిష్ జెటుంగ్' అనే పత్రికను స్థాపించారు. దాదాపు ఏడాది కాలంపాటు శ్రమించి ఆ పత్రికనూ, జర్మన్ కమ్యూనిస్టు పార్టీ ప్రచురణలనూ వెలువరించారు. వాటికి కమ్యూనిస్టు మేనిఫెస్టోలోని అవగాహనను జోడించి జర్మన్ ప్రజల విప్లవకాంక్షల ప్రతిబింబాలుగా తీర్చిదిద్దారు.

ఆనాటికి శ్రామికవర్గం తగినంతగా బలపడకపోవడం వల్ల తిరోగమనవాదుల దాడులకు సరైన ప్రతిఘటన లేదు. దాంతో అది, తనకు బద్ధశత్రువుగా నిలిచిన 'రీనిష్ జెటుంగ్' పత్రికపై అణిచివేతకు పూనుకున్నది. మార్క్స్‌నూ, పత్రిక బృందంలోని మరికొందరినీ జర్మనీ నుండి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మే 19న వెలువడిన చివరి సంచికలో ఎర్రటి అక్షరాలతో ప్రచురించిన (ఫెర్డినాండ్) ఫ్రిలిగ్రాత్ కవితలకు ఎంతో ప్రాచుర్యం ఏర్పడింది. మార్క్స్‌కు సన్నిహితుడైన ఈ విప్లవకవి చాలాకాలం తర్వాత స్వదేశంపై మమకారంతో తిరిగివెళ్ళి (ఆయన చాలాకాలం లండన్‌లో ప్రవాస జీవితం గడిపాడు), బంధువులు కొందరి కారణంగా 'వోగట్' కేసులో ఇరుక్కున్నాడు.

ఆ సమయంలోనే మార్క్స్, ఎంగెల్స్‌లకు ఫెర్డినాండ్ లాసెల్లేతో స్నేహం ఏర్పడింది. తర్వాతి కాలంలో ఫెర్డినాండ్ దృక్పథంతో కొన్ని విభేధాల కారణంగా ఆ స్నేహం కుంటుపడింది. ఫెర్డినాండ్ మరణానంతరం అతని అనుయాయులు అనుసరించిన ఎత్తుగడలు శ్రామిక పోరాటాలను తిరోగమనవాదం వైపుకు నెట్టసాగాయి. వాళ్ళతో మార్క్స్, ఎంగెల్స్‌లు ఘర్షణపడటం అనివార్యమైంది. లాసెల్లేకున్న అర్థశాస్త్ర పరిజ్ఞానం మీద మార్క్స్‌కు ఏనాడు సదభిప్రాయం కలగలేదు. ఆయన తాత్విక అవగాహనతో కూడా కొన్ని విభేదాలున్నాయి. లాసెల్లే రాసిన 'హెరాక్లిస్ ద అబ్‌స్క్యూర్' అనే రచన గురించి 1858లో ఎంగెల్స్‌కు రాసిన ఓ ఉత్తరంలో మార్క్స్ ఇలా వ్యాఖ్యానించాడు –

"నాకేమనిపిస్తున్నదంటే తన ఈ రెండో ఉద్గ్రంథం ద్వారా ఆయన హెగెల్ మార్గంలో రాజకీయ అర్థశాస్త్రాన్ని రూపొందించ దల్చుకున్నాడు. చివరికి ఆయన రుజువు చేసినదేమంటే ఒక విమర్శకుడు గతితార్కిక విధానం ద్వారా మాత్రమే శాస్త్రీయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించగలుగుతాడనీ – అమూర్తమైన యథాతథ వాదం ద్వారా సిద్ధాంత రూపకల్పనకు పూనుకుంటే ఆ సిద్ధాంతం కూడా అంతే అమూర్తంగా వుంటుందనీ"

ఏదేమైనప్పటికీ జర్మన్ శ్రామిక వర్గాన్ని సంఘటితం చేసేందుకు లాసెల్లే చేసిన కృషిని మార్క్స్, ఎంగెల్స్‌లు గౌరవించారు. ఒక స్త్రీ కారణంగా ఏర్పడ్డ వివాదంలో 1864 సెప్టెంబర్‌లో లాసెల్లే హత్యకు గురయ్యాడు. ఆ సందర్భంలో ఎంగెల్స్, మార్క్స్‌కు లేఖరాస్తూ.....

"ఈ వార్త విని నేనెంత దిగ్భ్రాంతి చెందానో ఊహించ గలవనుకుంటా. ఇతర విషయాల్లో లాసెల్లే ఎటువంటి వాడయినా కావచ్చు గానీ వ్యక్తిగా, రచయితగా, మేధావిగా, రాజకీయవేత్తగా జర్మనీలో ఒక ప్రాముఖ్యత పొందాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రస్తుతానికి ఆయన మనకొక అనిశ్చితమైన మిత్రుడేగానీ, భవిష్యత్‌లో శత్రుస్థానానికి చేరడం తథ్యం.

ఇటువంటి అతివాదుల బారినుండి జర్మనీ ఎలా నెగ్గుకొస్తుందో వేచి చూడాల్సిందే. అక్కడి పారిశ్రామిక వేత్తలూ, అభ్యుదయవాదుల మనకునేవారు కూడా లాసెల్లేను చూసి భయపడేవారు. ఇప్పుడు వారందరికీ ఆనందంగా ఉందేమో".

మరణించిన ఆ మిత్రుడి గురించి మార్క్స్ అప్పట్లో ఏ వ్యాఖ్యలూ చేయలేదు. కానీ తర్వాత చాలా కాలానికి లాసెల్లేలో బిస్మార్క్ లక్షణాలు కనబడుతున్నాయంటూ తీవ్రమైన విమర్శలు చేశాడు.

1848లో వెల్లువెత్తిన విప్లవస్ఫూర్తితో జర్మన్ ప్రజానీకం బేడెన్,

పాలటినేట్‌ల వంటి ప్రాంతాల్లో సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు. కొంత ఆలస్యంగానైనా ఆ పోరాటానికి ప్రతిస్పందించిన ఎంగెల్స్ అక్కడికి చేరి సాయుధ కార్యకర్తగా మారాడు. ఈ పోరాటాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న బూర్జువావర్గం ఎంగెల్స్‌ను ప్రధాన నాయకత్వ స్థానంలోకి రానివ్వకుండా అడ్డుకున్నది. ఎంగెల్స్ పేరు ఆనాటికే ప్రజల్లో మంచి ప్రాచుర్యం పొంది వుండటమే దానికి కారణం. ఆ తర్వాత వాళ్ళు ప్రష్యన్ సైనికాధికారి ఆగస్టు విలిచ్ అనుచరుడొక్కడిని ప్రవాస జీవితం నుండి వెలికితీసుకొచ్చారు. అతనికి గతంలో నాలుగు యుద్ధాల్లో పాల్గొన్న అనుభవం ఉంది. యుద్ధంలో ఓడిపోయిన బేడెన్ సేనలను స్విట్జర్లాండ్ నుండి రక్షించిందీ ఇతడే. ఆయనను జర్మనీలోని పోరాటానికి నాయకత్వం వహించేందుకు తీసుకొచ్చారు. ఐతే అతను అక్కడ పని చేసింది మాత్రం జూన్ 13, 1849 నుండి జూలై12 వరకూ నెలరోజులు మాత్రమే. తన సైన్యం సరిహద్దులు దాటిన వెంటనే యుద్ధం నుండి విరమించుకున్నాడు. కానీ మిలటరీ రంగంపై ఆయనకు చాలా ఆసక్తి ఉండటంతో యుద్ధ విషయాలపై రచనలు చేసే బాధ్యతను స్వీకరించాడు. వాటిని గురించి మార్క్స్ తన రచనల్లో కొన్నిచోట్ల ప్రస్తావించాడు.

తర్వాత కొద్ది కాలానికే ఫ్రాన్స్‌లో నివసిస్తున్న మార్క్స్‌ను బ్రిటానీలోని అనారోగ్యకమరైన ఓ మారుమూల ప్రాంతానికి పంపుతున్నట్టుగా ఉత్తర్వులు వెలువడ్డాయి. దాంతో ఆయన వెంటనే లండన్ వెళ్ళిపోయి, జీవితాంతమూ అక్కడే గడిపాడు.

మార్క్స్, ఎంగెల్స్‌లు లండన్ నుండి 'న్యూరీనిష్ జెటుంగ్' పత్రిక ప్రచురణను ప్రారంభించారు. మార్క్స్ సంపాదకత్వంలో ఆరు సంచికలు వెలువడ్డాయి. ఆనాటి రాజకీయ సమస్యలనూ, కమ్యూనిస్టు లీగ్ కార్యకలాపాలనూ గురించి మార్క్స్ ఆ పత్రికలో లోతైన విశ్లేషణలు చేసేవాడు. 1848లోని విప్లవ పోరాట స్ఫూర్తిని కొనసాగించడంలో విఫలమైనందున కమ్యూనిస్టులీగ్ క్షీణించిపోయింది. గతంలో ఎంగెల్స్‌పై సైనికాధికారిగా పని చేసిన విల్లిచ్, భావి కార్మికోద్యమ నాయకులు మార్క్స్, ఎంగెల్స్‌లపై రాజకీయ విమర్శలకు దిగారు. అతని ఆరోపణలను ఖండిస్తూ వాళ్ళిద్దరూ ఈ పత్రికలో రచనలు చేసేవారు.

ఆ పత్రిక మూతబడిపోయిన తర్వాత ఎంగెల్స్, ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్‌కు చేరి తన తండ్రికి భాగస్వామ్యం వున్న ఒక జౌళి మిల్లులో ఉద్యోగం చెయ్యసాగాడు. మార్క్స్ లండన్‌లో బ్రిటిష్ మ్యూజియం సమీపంలో వుంటూ తన అధ్యయనాన్ని సాగించాడు.

మార్క్స్, ఎంగెల్స్‌ల మిత్రుడు (జోసెఫ్) వేడెమొయిర్ స్వదేశంలోని వేధింపుల కారణంగా అమెరికాకు వలసవెళ్ళి, ఒక పత్రికను స్థాపించాడు. కొద్దికాలం మాత్రమే నడిచిన ఆ పత్రికలో మార్క్స్ రాసిన 'ద ఎయిటీన్త్ బ్రూమెయిర్ ఆఫ్ లూయీ బోనపార్టే' అనే కీలకమైన పత్రం ప్రచురితమయింది. కానీ ఆనాటి పరిస్థితుల్లో మార్క్స్ చేసిన విశ్లేషణలు మరీ తీవ్రమైనవిగా తోచడంవల్ల ఆ రచన తగినంత గుర్తింపు పొందలేదు. అదే సమయంలో వెలువడిన 'లిటిల్ నెపోలియన్' (విక్టర్‌హ్యూగో పెట్టిన పేరు) విమర్శాగ్రంథం ఎంతో పాఠకాదరణ పొందింది. గతంలో ఇదే అంశంపై హ్యూగో, ప్రౌధాన్‌ల రచనలు వచ్చినప్పటికీ ఈ పుస్తకం మంచి ప్రాచుర్యాన్నే పొందింది.

ఆ రోజుల్లో రాజకీయ, తాత్విక ప్రాధాన్యత కలిగిన ఎన్నో అధ్యయనాలు, గ్రంథాలు వెలువడ్డాయి. వాటిలో మార్క్స్ రాసిన 'ద క్లాస్ స్ట్రగుల్స్ ఇన్ ఫ్రాన్స్', 'ద ఎయిటీన్త్ బ్రూమైర్ ఆఫ్ లూయీ బోనపార్టే' గ్రంథాలూ, ఎంగెల్స్ రచన 'రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్' ముఖ్యమైనవి.

విప్లవ పరిస్థితులు మరింత పరిపక్వమయ్యే దాకా వేచి చూడటం అవసరమనేది మార్క్స్, ఎంగెల్స్‌ల భావన. విల్లిచ్ మాత్రం వెంటనే కార్యాచరణకు దిగాలని మొండిపట్టు పట్టడంతో ఇరు వర్గాల మధ్యనా భేదాభిప్రాయాలేర్పడ్డాయి. ఈ వలసవాద ముఠాలతో వాగ్వివాదాలు తమ అధ్యయనానికీ, లక్ష్యానికీ ఆటంకమని గ్రహించిన మార్క్స్, ఎంగెల్స్‌ల వాటికి దూరంగా జరిగారు. 1852లో మార్క్స్ సలహా మేరకు కమ్యూనిస్టు లీగ్‌ను రద్దు చేశారు.

ఆ రోజుల్లో మార్క్స్ లండన్‌లో గడిపిన జీవితం అతి దుర్భరమయినది. మిత్రుడికి సహాయపడేందుకు ఎంగెల్స్ చేసిన ప్రయత్నాలు కూడా తగినంతగా ఫలించలేదు. అప్పట్లో ఆయన పరిస్థితులు కూడా అనుకూలించక మేరీబర్న్ అనే ఐరిష్ యువతి సహాయం మీద ఆధారపడి ఉంటున్నాడు.

'న్యూయార్క్ ట్రిబ్యూన్' కోసం మార్క్స్ రాసే వ్యాసాల్లో కొన్ని మాత్రమే ప్రచురితమయ్యేవి (అవి ప్రచురితమైతేనే ఆయనకు పారితోషికం లభించేది). ఆ రచనలు తప్ప ఆయనకు మరొక ఆదాయ వనరు అందుబాటులో లేదు. ఆ కొద్దిపాటి ఆదాయంతో కుటుంబం గడవటం సులభం కాదు. ఐనా మార్క్స్, జెన్నీలు వీలయినంత పొదుపుగా ఒక్కొక్క పెన్నీనీ జాగ్రత్తగా వాడుతూ గౌరవంగా జీవితాన్ని నెట్టుకొచ్చారు.

పరిస్థితులు అలా ఉండగానే 1855లో వాళ్ల కొడుకు ఎడ్గార్ మరణించాడు. ఆ పిల్లవాడి విషాదస్మృతులు వాళ్లను జీవితమంతా వెంటాడుతూనే ఉన్నాయి. ఎటువంటి పరిస్థితుల్లోనయినా మార్క్స్ తన మహోన్నత వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూనే ఉన్నాడు. ఆయనకు భార్యాబిడ్డల మీద ఎనలేని ప్రేమ. కానీ అంతకన్నా ఎక్కువగా తన జీవిత లక్ష్యాన్ని ప్రేమించిన వాడాయన. భర్తగా, తండ్రిగా కుటుంబంపై తనకున్న ప్రేమనూ – శ్రామికవర్గ విముక్తి అంకిత భావాన్నీ – ఈ రెండింటినీ సమానంగా నిర్వహించటానికి ఆయన ఎంతో వత్తిడిని భరించాడు. రెండు బాధ్యతలకూ న్యాయం చెయ్యటానికి శాయశక్తులా ప్రయత్నించాడు. ఐతే దుర్భరమైన పేదరికం వల్ల ఎదురయిన పరిస్థితుల్లో కొన్ని అపార్థాలను కూడా ఎదుర్కోక తప్పలేదు. ఈ విషయం మార్క్స్ ఉత్తరాల ద్వారా మనకు తెలుస్తుంది. 1862లో (లుడ్విగ్) కుగెల్‌మన్‌కు రాసిన ఓ ఉత్తరంలో

మార్క్స్ మాటలివి –

'1861లో అమెరికాలో అంతర్యుద్ధం కారణంగా 'న్యూయార్క్ ట్రిబ్యూన్' మూతపడటం వల్ల నాకున్న ప్రధాన ఆదాయ వనరు మూలపడింది. ఆ పత్రికకు నేను పంపిన కొన్ని వ్యాసాలింకా ప్రచురితం కానేలేదు. దాంతో నాకు రావాల్సిన డబ్బు ఆగిపోయి, కుటుంబం వీధినపడే పరిస్థితికి చేరాం. నేనికనైనా 'వాస్తవిక స్పృహ' గల మనిషిగా మారాలన్పించి రైల్వే ఆఫీసులో ఉద్యోగానికి చేరుదా మనుకున్నాను. నా అదృష్టమో, దురదృష్టమో గానీ అధ్వాన్నమైన నా చేతిరాత మూలంగా ఆ ఉద్యోగమూ వెనక్కి పోయింది. అందువల్లనే కొంతసేపయినా సిద్ధాంత గ్రంథాల రచన చెయ్యగలుగుతున్నానన్న మాట'.

1867లో మేయర్‌కు రాసిన ఓ ఉత్తరంలో తీవ్రమైన భావోద్వేగంతో, ఆగ్రహావేశాలతో కూడిన మార్క్స్ కంఠం విన్పిస్తుంది – 'నేను నీకెందుకు జవాబు రాయలేదంటావా?'

ఎందుకంటే, మృత్యుచ్ఛాయల సరిహద్దుల్లో నిరంతర సంచారం వల్ల. ఐనా సరే, వీలైన ప్రతి నిమిషాన్నీ వెచ్చించి నా పుస్తకాన్ని పూర్తి చేయ్యాలని ప్రయత్నిస్తున్నాను. అందుకోసం నా ఆరోగ్యాన్నీ, సుఖాన్నీ, కుటుంబాన్నీ పణం పెట్టేందుకు సిద్ధపడ్డాను. ఇంతకన్నా సంజాయిషీలు చెప్పాల్సిన అవసరం లేదు నాకు. 'వాస్తవిక'వాదులనబడే వారినీ, వారి జ్ఞానాన్నీ చూస్తుంటే నవ్వొస్తోంది. గానుగెద్దులా బతకటానికి సిద్ధపడిన ఏ మనిషయినా మానవాళి భారాన్నంతటినీ తన మూపున మోయటంతో బాటుగా తనను తాను కాపాడుకోవాల్సి ఉంటుంది. కానీ, నేను నా రచనను కనీసం రాతప్రతి రూపంలోనైనా పూర్తి చెయ్యలేకపోయినట్టయితే నేనొక 'అవాస్తవిక' జీవిగా అప్రదిష్టల పాలవక తప్పదు'.

1859లో మార్క్స్ తన అర్థశాస్త్ర రచనలో కొంతభాగాన్ని పూర్తి చేసి 'ఎ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' పేరిట ప్రచురించారు. ఈ రచన 'కేపిటల్' గ్రంథానికి ఉపోద్ఘాతం లాంటిది. మార్క్స్ అద్భుత సృష్టి 'కేపిటల్' మొదటి భాగంలో కనబడే సరుకులు, డబ్బు అనే అంశాల అధ్యయనాన్ని ఈ రచనలో చూడవచ్చు. ఇందులోని వచనశైలి క్లిష్టంగా ఉండటంతో విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇందులోని సారాంశాన్ని గ్రహించటంలో లాసెల్లే వంటి వాళ్లు కూడా విఫలమయ్యారు. తర్వాతి రోజుల్లో ఈ గ్రంథం ఎంత సమగ్రమైన రూపంలో తయారైందో చూసే అవకాశం ఉండి ఉంటే లాసెల్లే తన అభిప్రాయాన్ని మార్చుకునేవాడేమో. ఈ రచనను కరపత్రాల రూపంలో ఆరు భాగాలుగా ప్రచురించాలని మొదట్లో భావించిన మార్క్స్, అధ్యయన క్రమంలో అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. 1858లో ఎంగెల్స్‌కు ఉత్తరం రాస్తూ తన అభిప్రాయాల్లో మార్పుకు కారణాలను ఇలా వివరించాడు –

ఈ గ్రంథం రచనకు సంక్షిప్త ప్రణాళిక ఇది. మొత్తం సారాంశాన్ని ఆరు పుస్తకాలుగా విభజించవచ్చు.

1. పెట్టుబడి గురించి (కొన్ని అధ్యాయాల పరిచయం)
2. భూసంపద
3. వేతన కూలి
4. రాజ్యం
5. అంతర్జాతీయ వాణిజ్యం
6. ప్రపంచ స్థాయి మార్కెట్

పెట్టుబడి గురించిన భాగంలో మళ్లీ నాలుగు విభాగాలు ఉంటాయి.

ఎ. సాధారణ పెట్టుబడి (మొదటి విభాగపు సారాంశం ఇది)

బి. పోటీ లేదా బహుళ పెట్టుబడుల పరస్పర చర్య

సి. రుణం (ఇది వ్యక్తిగత సంపద కంటే భిన్నమైన విశ్వజనీన అంశంగా ఉండే పెట్టుబడి)

డి. భాగస్వామ్య పెట్టుబడి (అనేక వైరుధ్యాలతో కూడిన సంక్లిష్టరూపం)

అర్థశాస్త్రం గురించిన ఈ రచనను వీలైనంత త్వరగా ముగించాలన్న ఆత్రుత మొదలైంది మార్క్స్‌లో. దీనికి కారణమేమిటో కూడా ఆయనే స్వయంగా చెప్పుకున్నాడు. స్మిత్, రికార్డోల తర్వాత ఈ శాస్త్రంలో జరిగిన కృషి నామమాత్రమే కావడంతో ఈ నిరంతర అధ్యయనం తనను తీవ్రమైన అలసటకు గురి చేస్తోందన్నాడు మార్క్స్. ఆయన పరిశోధనల్లోని ఒక భాగం ఎట్టకేలకు ప్రచురితమయింది (కరపత్రాల రూపంలో తీసుకురావాలనుకున్న ప్రచురణ ఆగిపోవటం వల్ల ఈ విషయం వెల్లడి కాలేదు). 'విలువ' తత్వమూ, 'శ్రమశక్తి' అనే భావనకు రూపకల్పనా వంటి సూక్ష్మస్థాయి పరిశీలనల ద్వారా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల్లోని సంక్లిష్టతనూ, వాటి ఫలితంగా ఏర్పడే 'అదనపు విలువ'నూ సవివరంగా నిరూపించగలిగాడు మార్క్స్.

ఆ విషయాలన్నిటినీ సవివరంగా చర్చించటం ఇక్కడ సాధ్యపడకపోయినప్పటికీ మార్క్స్ పరిశీలనలోని ఒక పేరాను ఇక్కడ చూడండి –

'ఒక సరుకుకున్న మారకపు విలువ దాన్ని ఉత్పత్తి చెయ్యటానికి అవసరమైన శ్రమకాలానికి సమానమైతే, ఒక రోజు శ్రమ తాలూకు మారకపు విలువ ఆ శ్రమ ద్వారా ఉత్పత్తి అయిన సరుకుకున్న మారకపు విలువతో సమానం కావాలి. అంటే ఒక కార్మికుడికి లభించే వేతనం ఆ వ్యక్తి ఉత్పత్తి చేసిన సరుకు మారకపు విలువతో సమానంగా ఉండాల్సి ఉంటుంది. ఐతే వాస్తవంలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. కాబట్టి ఒక కార్మికుడు తయారు చేసిన సరుకు మారకపు విలువ, ఆ శ్రమకు లభించే వేతనం కన్నా అధికంగా ఉండటానికి కారణమేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. అంటే శ్రమకు లభించే మారకపు విలువ, ఆ శ్రమ ద్వారా జరిగే ఉత్పత్తికి ఉండే మారకపు విలువ కన్నా స్వల్పంగా ఉంటుందన్న మాట. ఈ విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే పెట్టుబడి స్వభావాన్ని లోతుగా అధ్యయనం చెయ్యాలి'.

ఎనిమిదేళ్ల తర్వాత 'కేపిటల్'కు చివరి పాఠాంతరం ప్రచురితమయ్యే వరకూ ఆ రచనలో ఉండే ఈ విషయాలేవీ వెలుగు చూడనే లేదు. ఈ గ్రంథంలోని కొంత భాగం ప్రచురితమయిన కొన్నాళ్ల తర్వాత జరిగిన వాదవివాదాలకు సమాధానంగా 'హెర్ వోగెట్' అనే కరపత్రాన్ని రాశాడు మార్క్స్. తనను అప్రదిష్టపాలు చెయ్యటానికి ప్రయత్నించిన వోగెట్, నెపోలియన్ అనుయాయుడని ఈ కరపత్రంలో మార్క్స్ వెల్లడించాడు. కేవలం మార్క్స్, ఎంగెల్స్‌ల చేత విమర్శలకు గురయిన కారణంగా మాత్రమే చరిత్రలో స్థానం పొందిన కొందరు వ్యక్తుల్లో వోగెట్ కూడా ఒకడు. అందుగ్గానూ వాళ్లందరూ మార్క్స్, ఎంగెల్స్‌లకు కృతజ్ఞులై ఉండాలి. అర్థశాస్త్రంలో మార్క్స్ చేసిన కృషి ముందు వోగెట్ సాధించినది ఏమీ లేదు కూడా.

ఆ తర్వాత కొంతకాలం పాటు మార్క్స్, 'కేపిటల్' రచన, మొదటి ఇంటర్నేషనల్ (ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్)ల మీదనే తన కృషిని కేంద్రీకరించి పని చేశాడు. 1864లో లండన్‌లో ఏర్పడిన ఈ అంతర్జాతీయ సంస్థకు ప్రారంభోపన్యాసాన్నీ, నిబంధనావళినీ రూపొందించాడు మార్క్స్.

మొదట ఇంటర్నేషనల్ మనుగడలో ఉన్నది కొద్దికాలం మాత్రమే. కానీ, శ్రామికవర్గ ఉద్యమాల చరిత్రలో దానికున్న స్థానం విశిష్టమైనది. లాసెల్లే అనుయాయులైన జర్మన్లు చేసిన పొరపాటుల వల్లా, ప్రౌధాన్, బకూనిన్‌ల మద్దతుదారుల మధ్యన అభిప్రాయ భేదాల వల్లా కుట్రలకూ, కుతంత్రాలకూ లోనైన ఈ సంస్థ ఓ అగ్నిగుండంలా మారింది. యూరప్‌లోని సంఘటిత రంగాల కార్మికుల మద్దతును కూడగట్టలేకపోవడమే మొదటి ఇంటర్నేషనల్ వినాశనానికి మూలం. ముఖ్యంగా ఇంగ్లండ్‌లోని కార్మికవర్గం సామ్రాజ్యవాదుల ప్రలోభాలకూ, ఎత్తుగడలకూ లొంగిపోయి లక్ష్యానికి దూరమైంది.

మొదటి ఇంటర్నేషనల్ కుప్పగూలిపోయినప్పటికీ తిరోగమనవాదులు శక్తి పుంజుకోకముందే అప్రమత్తమై విప్లవోద్యమాన్ని పునర్జీవింపజేసే చర్యలు తీసుకోవటం 1871లో ప్యారిస్ కమ్యూన్ ఏర్పాటుకు దారి తీసింది.

ఫ్రాంకో-జర్మనీ ప్రభుత్వాల మధ్యన సంఘర్షణా, ఆ తర్వాత పారిస్ కమ్యూన్ పరిణామాలూ బూర్జువా వర్గ స్వభావాన్ని బట్టబయలు చేశాయి. మార్క్స్ చెప్పినట్టుగా 'స్వర్గాధిపత్యాల కూల్చివేతకు' శ్రామిక వర్గం చేసిన మొట్టమొదటి మహా ప్రయత్నాన్ని దుర్మార్గంగా అణచివేసేందుకు విజేతలైన జర్మన్లూ - పరాజితులైన ఫ్రెంచి దోపిడీదారులూ నిర్లజ్జగా చేతులు కలిపారు.

ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధం 1870 జూలై 19న ప్రారంభమయింది. జూలై 23న జనరల్ కౌన్సిల్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ ద్వారా మార్క్స్ రూపొందించిన ఒక ప్రత్యేక ప్రకటన వెలువడింది. ఈ యుద్ధ స్వభావాన్ని గురించి శ్రామిక వర్గాన్ని హెచ్చరించింది ఈ ప్రకటన.

సెడాన్ తిరుగుబాటు అనుభవాల తర్వాత శ్రామికవర్గం నిజంగానే రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోగలుగుతుందన్న విశ్వాసం మార్క్స్‌కు అంతగా కలగలేదు. కానీ ఆ పరిణామం వాస్తవ రూపాన్ని దాల్చిన వెంటనే తన పూర్తి మద్దతును అందించాడాయన. ఈ పరిణామానికి మూలం ప్రజల తక్షణ ప్రతిస్పందనే అయినా, లేక బ్లాంకిస్టుల ప్రభావమనుకున్నా - మౌలికమైన ప్రేరణనిచ్చింది మాత్రం మార్క్స్, ఎంగెల్స్‌లే. ఇందులో మొదటి ఇంటర్నేషనల్ ప్రభావం ఏమీ కనబడదు. ఈ పరిణామంలో బూర్జువా వర్గపు అణచివేత స్వభావమూ, దానిపై శ్రామికవర్గపు అవిశ్వాసమూ స్పష్టమైన రూపాన్ని తీసుకున్నాయి. ఇంగ్లండ్‌లోని కార్మికవర్గంతో తెగతెంపులు చేసుకోవటంతో ఇంటర్నేషనల్ త్వరలోనే అంతరించిపోయింది. ఐతే భవిష్యత్‌లో సోషలిస్టు సమాజం ఏర్పడడం సాధ్యమేనన్న స్థిరవిశ్వాసాన్ని మాత్రం అందించిపోయింది.

ఇక మార్క్స్, ఎంగెల్స్‌లిద్దరూ తమ వైఫల్యాల నుంచి గుణపాఠాలను గ్రహిస్తూ వచ్చారు. ఫ్రాన్స్ అంతర్యుద్ధాన్ని గురించి మార్క్స్ చేసిన విశ్లేషణాత్మక రచన మొదటి ఇంటర్నేషనల్ ద్వారా ప్రచురితమయింది. ప్యారిస్ కమ్యూన్ ద్వారా నేర్చుకోదగిన అతి ముఖ్యమైన గుణపాఠమేమిటంటే - ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలంటే ముందుగా ఉనికిలో ఉన్న రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసి తీరాలని.

ఈ చర్చ ఈనాటికీ ఎంతో ప్రాముఖ్యత కలదిగానే నిలిచి ఉంది. మార్క్స్, తన మిత్రుడు (లుడ్విగ్) కుగెల్‌మన్‌కు రాసిన లేఖలో ఇంగ్లండులోని పాత ప్రభుత్వ యంత్రాంగాన్నంతటినీ కూల్చివెయ్యాల్సిన అవసరమేమీ లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఐతే శాంతియుతంగా రాజ్యాధికారాన్ని సాధించటమనేది 'చారిత్రకంగా అసాధారణ'మని అక్టోబర్ (రష్యన్) విప్లవానికి కొన్నాళ్ల ముందు లెనిన్ అన్నాడు. ఈ రెండు అభిప్రాయాలనూ సందర్భశుద్ధి లేకుండా అవకాశవాద ధోరణిలో వాడుకోవడం ద్వారా తమ 'మితిమీరిన శాంతి మార్గాన్ని' సమర్థించుకోవడం చాలా మంది కమ్యూనిస్టు నాయకుల్లోనూ, సోషలిస్టు ప్రభుత్వాల్లోనూ ఒక లక్షణంగా మారింది.

కమ్యూన్‌లోని లోపాలనూ, బలాలనూ గురించి మార్క్స్‌కు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. ఇందుకు సాక్ష్యం 12 ఏప్రిల్ 1871న కుగెల్‌మన్‌కు మార్క్స్ రాసిన మరో ఉత్తరమే -

'నేను రాసిన 18వ బ్రూమైర్‌లోని చివరి అధ్యాయాన్ని చూస్తే నా అభిప్రాయం మీకు అర్థమవుతుంది. ఫ్రెంచి విప్లవం మళ్లీ త్వరలోనే కార్యరూపం దాలుస్తుంది. ఈసారి గతంలోలాగా బ్యూరోక్రటిక్ మిలిటరీ యంత్రాంగం కేవలం చేతులు మారటం జరగదు - అది పూర్తిగా ధ్వంసమవుతుంది. ప్రపంచంలో నిజమైన ప్రజా విప్లవం ఎక్కడ జరిగినా ఇదొక ప్రాథమిక షరతుగా ఉండాల్సిందే. ఇలాంటి ఒక ప్రయత్నాన్నే ప్యారిస్‌లో మన కామ్రేడ్స్ చేస్తున్నారు. ఎంతటి విశాల దృక్పథంతో, చారిత్రక బాధ్యతతో, త్యాగశీలతతో వాళ్లా బాధ్యతను నిర్వహిస్తున్నారు!

బయటి శత్రువుల కన్నా ఎక్కువగా లోపలి విద్రోహులు చేసిన దారుణాల వల్ల ఆరు నెలల పాటు వాళ్లు దుర్భరమైన ఆకలినీ, విధ్వంసాన్నీ అనుభవించారు. ఐనప్పటికీ ప్రష్యన్ల తుపాకీ మొనల నడుమనుండే వాళ్లు ముందుకు నడిచారు. ప్యారిస్ నగర ద్వారాల వద్ద మోహరించిన శత్రువులను గానీ, ఫ్రాన్స్ – జర్మనీల మధ్య యుద్ధాన్నిగానీ లెక్క చెయ్యకుండా విజృంభించారు. అటువంటి సంఘటన చరిత్రలో నిజంగా అపూర్వమే! ఒకవేళ వాళ్లు అపజయం పాలవటమంటూ జరిగితే, అది వాళ్ల 'మంచితనం' వల్ల పొందిన ఓటమిగానే భావించాలి. వాళ్లు నేరుగా నివోయ్, వర్సెయిల్స్‌ల మీద దండయాత్రలు చేసినట్టయితే ప్యారిస్ జాతీయ భద్రతా దళాల్లోని తిరోగమనవాదుల ముఠా తోక ముడవాల్సిందే.

ఐతే వాళ్లు కేవలం నైతికమైన సంకోచం వల్ల ఆ అవకాశాన్ని జారవిడుచుకున్నారు. అంతర్యుద్ధాన్ని ప్రారంభించటం వాళ్ల అభిమతం కాదు. ఈ విధమైన తొందరపాటు చర్యకు పూనుకుని ప్యారిస్‌ను నిరాయుధం చెయ్యటం సరైంది కాదని భావించారు. వాళ్లు చేసిన మరొక పొరపాటేమిటంటే – కమ్యూన్ ఏర్పాటుకు మార్గాలన్నీ సుగమం చెయ్యాలన్న ఉద్దేశ్యంతో ఇంత త్వరగా సెంట్రల్ కమిటీ తన అధికారాలను వదులుకోవటం. ఇది కూడా మితిమీరిన 'నిజాయితీ'తో కూడిన నైతిక చర్యే. ప్యారిస్‌లో ఇప్పుడు తలెత్తిన తిరుగుబాటును పాత సమాజ ప్రతినిధులైన తోడేళ్లూ, పందులూ, హీనులూ అణచివేయవచ్చేమో, ఐనా సరే మన పార్టీ ఆధ్వర్యంలో ప్యారిస్‌లో జరిగిన ఈ ఉద్యమాన్ని మహోన్నతమైనదిగానే గుర్తించాలి.

1867లో తను రాసిన కేపిటల్ మొదటి సంపుటి చక్కటి గ్రంథంగా ప్రచురితమవటాన్ని చూసుకోగలిగాడు మార్క్స్. తర్వాతి సంపుటాల ప్రచురణ ఆయన మరణానంతరమే జరిగింది. అర్థశాస్త్ర రచన పూర్తి కాకపోవడమూ, ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యం, సామ్రాజ్యవాదాల గురించిన అధ్యాయాల రాతప్రతులు కూడా ఎక్కడో పోవటం వలన వీటి ప్రచురణ జరగలేదు.

1866లో (అక్టోబర్ 13న) కుగెల్‌మన్‌కు రాసిన ఒక లేఖలో మార్క్స్ తన రచనా ప్రణాళికను వివరించాడు. అది ఇలా ఉంది –

మొదటి సంపుటి – పెట్టుబడి ఉత్పత్తయ్యే విధానం

రెండవ సంపుటి – పెట్టుబడి వ్యాప్తి చెందే విధానం

మూడవ సంపుటి – ఈ విధానమంతటి మొత్తం నిర్మాణం

నాలుగవ సంపుటి – ఆర్థిక సిద్ధాంత చరిత్రకు సంబంధించిన అంశాలు

ఈ పుస్తకంలోని మిగతా భాగమంతా కేపిటల్ సంక్షిప్త పాఠమూ, దాని విశ్లేషణాలతో నిండి ఉంటుంది. కాబట్టి ఇప్పుడు దాని వివరాల జోలికి వెళ్లనవసరం లేదు. కానీ 1867లో ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన ఓ లేఖలో చాలా ముఖ్యమైన విషయాలున్నాయి గనుక దాన్ని గురించి చెప్పుకోవాలి –

'నా గ్రంథంలోని ముఖ్యాంశాలు ఇలా ఉంటాయి –

1. శ్రమశక్తి ఉపయోగపు విలువ రూపంలో వ్యక్తమవుతున్నదా లేక మారకపు విలువ రూపంలోనా అనేదాన్ని బట్టి శ్రమశక్తికి ద్వివిధ స్వభావం ఏర్పడుతుంది (వాస్తవాలకు సంబంధించిన అవగాహన అంతటిలో ఇది కీలకమైన అంశం).

2. అదనపు విలువ దాని నిర్దిష్టమైన రూపాన్ని బట్టి వివిధ రకాలుగా ఉంటుంది. ఉదా – లాభం, వడ్డీ, అద్దె మొదలయినవి. రెండవ సంపుటిలో ఈ అంశంలో సవివరమైన చర్చ ఉంటుంది. సాంప్రదాయిక ఆర్థిక విధానం వల్ల ఏర్పడే ఈ వైవిధ్యం నిరంతరం చెలామణీ అవుతూనే ఉంటుంది.

ఈ దశలో మార్క్స్ అత్యుత్తమైన సృజనాత్మకతను ప్రదర్శించాడు. మిగతా రెండు సంపుటాల్లోని ప్రధాన భాగాన్నీ, అదనపు విలువ సిద్ధాంతంలోని ముఖ్యాంశాలనూ ఆయన ఈ సమయంలోనే రచించాడు.

మార్క్స్ తన జీవిత చరమాంకంలో చేసిన మరొక ముఖ్యమైన రచన 'క్రిటిక్ ఆఫ్ ద గోథా ప్రోగ్రామ్'. కమ్యూనిజం భవిష్యత్తును గురించిన సృజనాత్మక విశ్లేషణలన్నిటిలోనూ ఈ రచన ఒక వెలుగురేఖ. మార్క్స్ గొప్ప వాస్తవికవాది కావటం వల్ల ఆయన విశ్లేషణల్లో ఎక్కడా ఊహాకల్పనలూ, వితండవాదాలూ కనబడవు. జర్మనీలోని సోషల్ డెమొక్రాట్ల (లాసెల్లే ప్రభావంలో కూరుకుపోయిన వాళ్లు) విధానాల పై తనకు కలిగిన అసంతృప్తిని వ్యక్తీకరించటానికి మార్క్స్ ఆ విషయాలపై ఒక సమగ్ర రచనకు పూనుకున్నాడు.

సహచరుడు ఎంగెల్స్ ద్వారా కొంత సాయం అందినప్పటికీ మొత్తం మీద మార్క్స్ జీవితమంతా ఆర్థిక ఇబ్బందుల్లోనే గడిచిపోయింది. ఈ సమస్యలతో బాటుగా ఆయన జీవిత చరమాంకంలో భార్యా, కూతురూ (ఇద్దరు జెన్నీలు) మరణించటం ఆయనను తీవ్రంగా కల్లోలపరిచింది. 1881 డిసెంబర్‌లో ఒకరూ, 1883 ప్రారంభంలో మరొకరునూ ఆ ఇద్దరూ మృతి చెందారు. వాళ్లు దూరమవటంతో ఆయనను ఇంత కాలమూ ముందుకు నడిపిన అంతర్శక్తి నశించిపోయినట్టయింది. ఇక తాను చెయ్యగలిగిన పనులేమీ లేవన్నట్టుగా 1883, మార్చి 14న మార్క్స్ ఈ లోకం నుండి నిష్క్రమించాడు.

తనలోని ప్రేమను ప్రపంచంలోని పీడిత మానవాళికంతటికీ పంచినవాడూ, అంతులేని ఆశావాదంతో, నిబద్ధతతో ఒక మహత్తరమైన పోరాట సందేశాన్ని అందించినవాడూ అయిన ఆ మనీషిని కేవలం ఒక విగ్రహమాత్రుడిగా చూడబోవటం చరిత్రకు వక్రీకరణే అవుతుంది.

ఆయనను మరింత సజీవంగా నిలుపుకోవాలంటే ఆయనలోని మానవతా కోణాన్ని మరింతగా వెలుగులోకి తేవాలి. మార్క్స్ జీవితానికి సమగ్రమైన రచనా రూపం ఇంకా రావలిసే ఉంది. మెహ్రింగ్ చేసిన బృహత్ ప్రయత్నానికి మరింత స్పష్టమైన దృక్పథాన్ని జోడించి సమగ్రమైన గ్రంథాన్ని రూపొందించాల్సిన అవసరం మిగిలే ఉంది. నేను రాసిన ఈ పుస్తకం ఆయన కృషికి కేవలం

రేఖామాత్రమైన పరిచయం మాత్రమే. మార్క్సిస్టు అర్థశాస్త్రంతోనూ, దాని రూపకర్తల కృషితోనూ పరిచయం లేనివారికి వాటిని తెలియజెయ్యటమే నా ఉద్దేశ్యం.

మార్క్స్ సమాధి దగ్గర ఎంగెల్స్ ప్రసంగిస్తూ ఇలా చెప్పాడు –

'మార్చి 14వ తేదీ మధ్యాహ్నం పావు తక్కువ మూడు గంటలకు ఆ మహోన్నత వ్యక్తి మేధ తన ఆలోచనను నిలిపివేసింది. ఆయన దగ్గర నుండి రెండు నిమిషాల సేపు బయటికి వెళ్లిన మేము తిరిగి వచ్చేసరికి ఆయన కుర్చీలో ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు – అది శాశ్వత నిద్ర.

పోరాట మార్గంలో సాగుతున్న యూరోపియన్, అమెరికన్ శ్రామిక వర్గానికీ, చారిత్రిక విజ్ఞానానికీ ఈ వ్యక్తి మరణం వల్ల జరిగిన నష్టం మరెవరూ పూడ్చలేనిది. ఆయన మరణంతో ఏర్పడ్డ శూన్యాన్ని పూరించేందుకు మనం వెంటనే ప్రయత్నాలను ప్రారంభించాలి.

భౌతిక ప్రకృతికి సంబంధించిన జీవ పరిణామ సిద్ధాంతాన్ని డార్విన్ ప్రతిపాదించినట్టే మానవ చరిత్ర పరిణామాన్ని మార్క్స్ సిద్ధాంతీకరించాడు. ఆయన సిద్ధాంతం ఒక ప్రాథమిక సత్యాన్ని వెల్లడించింది. రాజకీయాలూ, శాస్త్రాలూ, కళలూ, మతమూ లాంటివేవీ ఏర్పడని ఆదిమ దశలో మానవులందరికీ ఉన్న లక్ష్యం – తిండి, బట్ట, ఆవాసం వంటి ప్రాథమికావసరాలను సమకూర్చుకోవటం మాత్రమే. ఆ తర్వాత క్రమంగా ఆర్థిక వనరులు అభివృద్ధి చెందటంతో బాటుగా రాజ్యాంగ యంత్రాంగమూ, నైతిక సూత్రాలూ, కళలూ, మతమూ వంటివన్నీ రూపొందుతూ వచ్చాయి. ఐతే ఆ తర్వాతి కాలంలో ఇవన్నీ మానవుల సమస్యలకు పరిష్కారాలను అందించేవిగా కాక, వాళ్లకు వ్యతిరేకమైనవిగా తయారవసాగాయి.

చారిత్రక పరిణామాన్ని విశదీకరిస్తూ మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతం ద్వారానే ఈనాటి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, దాని ఫలితంగా ఏర్పాటయిన బూర్జువా సామాజిక వ్యవస్థనూ కూడా అర్థం చేసుకోగలుగుతాం. ఆయన ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతపు వెలుగు గతంలోని బూర్జువా, సోషలిస్టు ఆర్థికవేత్తల సిద్ధాంతాల్లోని మార్మికతను పటాపంచలు చేసింది.

ఒక వ్యక్తి జీవితాన్ని సార్థకం చెయ్యటానికి ఇటువంటి రెండు పరిశోధనలు సరిపోతాయి. నిజానికి వాటిలో ఏ ఒక్క అంశం మీద పరిశోధన చెయ్యగలిగినా అది అపురూపమైన విషయమే. ఐతే మార్క్స్ అలా ఏ ఒకటి రెండు విషయాలకో తన కృషిని పరిమితం చెయ్యలేదు. చేపట్టిన ప్రతి రంగంలోనూ ప్రతి అంశాన్నీ లోతుగానే అధ్యయనం చేశాడు. చివరికి గణితశాస్త్రంలో కూడా స్వతంత్రమైన పరిశోధనలకు పూనుకున్నాడు.

గొప్ప శాస్త్రజ్ఞానం కలిగిన వ్యక్తులు ఎందరో ఉండవచ్చు గానీ, వారినందరినీ సంపూర్ణ వ్యక్తిత్వాలు గల మానవులుగానైతే చెప్పలేం. మార్క్స్ దృష్టిలో శాస్త్ర పరిజ్ఞానమనేది చారిత్రకమూ, సృజనాత్మకమూ, విప్లవాత్మకమూనైన శక్తి. అది ఏ రంగమైనా సరే, అందులో ఒక కొత్త ఆవిష్కరణను సాధించటంలో ఆయన గొప్ప ఉత్తేజాన్ని పొందేవాడు. పారిశ్రామికాభివృద్ధినీ, చారిత్రక పరిణామక్రమాన్నీ విప్లవాత్మకమైన రీతిలో విశ్లేషించటంలో ఆయనకు గొప్ప ఆసక్తి. ఉదాహరణకు విద్యుత్ శాస్త్ర రంగంలో జరిగే ప్రతి పరిశోధననూ, చివరికి మార్సెల్ డిప్రెజ్ చేసిన ఆవిష్కరణలనూ కూడా మార్క్స్ శ్రద్ధతో అధ్యయనం చేశాడు.

వీటన్నిటినీ మించి మార్క్స్ ఒక గొప్ప విప్లవకారుడు. పెట్టుబడిదారీ వ్యవస్థనూ, దాని తాలూకు రాజ్యాంగ యంత్రాన్నీ కూలదోసి ఆధునిక యుగంలోని కార్మికుల విముక్తికి దోహదం చెయ్యటమే ఆయన జీవిత లక్ష్యం. శ్రామిక వర్గ ప్రజలకు వర్గ స్పృహనూ, వర్గ చైతన్యాన్నీ, విముక్తి సిద్ధాంతాన్నీ గురించిన జ్ఞానాన్ని అందించేందుకు ముందు నిలిచినవాడు మార్క్స్. ఈ లక్ష్యం కోసం అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించాడు. 1842లో మొదటి రీనిష్ జీటుంగ్, 1844లో ప్యారిస్‌లో వోవార్ట్స్, 1848–1849లలో కొత్త రీనిష్ జెటుంగ్, 1852–1861లలో ద న్యూయార్క్ ట్రిబ్యూన్ పత్రికలలో చేసిన రచనలూ – ఆ తర్వాత సైద్ధాంతిక గ్రంథాల రచనా, ప్యారిస్, బ్రసెల్స్, లండన్‌లలో ఉద్యమ సంస్థల నిర్మాణమూ, ఆ పైన ఈ కృషికంతటికీ మకుటాయమానమైన అంతర్జాతీయ కార్మిక సమాఖ్య నిర్మాణమూ – ఇవన్నీ మార్క్స్ సాధించిన విజయాలే. నిజం చెప్పాలంటే ఏ రచయితకైనా ఇంతకన్నా సాధించదగినదీ, గర్వపడదగినదీ జీవితంలో మరేదీ ఉండబోదు.

తను చేసిన నిరంతర పోరాటం కారణంగా మార్క్స్, తన జీవితంలో ఎంతో ద్వేషాన్నీ, అపనిందలనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. రాచరిక ప్రభుత్వమూ, రిపబ్లికన్ ప్రభుత్వాలూ కూడా ఆయనకు దేశ బహిష్కార శిక్షలను విధించాయి. అలాగే బూర్జువాల్లోని సంప్రదాయవాదులూ, తీవ్ర ప్రజాస్వామికవాదులూ కూడా మార్క్స్‌పై దుష్ప్రచారాలు చెయ్యడంలో పోటీలు పడ్డారు. వాటన్నిటినీ బూజును దులిపినట్టు దులిపేసుకోగలిగాడు మార్క్స్. సహేతుకమైన విమర్శలకు మాత్రం జవాబులిచ్చి, అర్థరహితమైన ఆరోపణలను తోసిపుచ్చాడు. సైబీరియన్ గని కార్మికుల నుండి – యూరప్, అమెరికాల్లోనూ, కాలిఫోర్నియా తీరప్రాంతాల వరకూ గల కోట్లాదిమంది ప్రజలు ఆయనపై ప్రగాఢమైన ప్రేమాదరాలతో ఆయన మరణానికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. మార్క్స్‌కు సిద్ధాంతపరమైన వ్యతిరేకులు ఎందరో ఉండవచ్చు గానీ వ్యక్తిగా ఆయనను ద్వేషించగల మనిషి ఒక్కరైనా ఉండడం అసాధ్యమని నేను నిశ్చయంగా చెప్పగలను.

ఆయన పేరూ, ఆయన చేసిన కృషీ శతాబ్దాల తరబడి సజీవంగానే ఉంటాయి'.

మార్క్స్ మరణానంతరం కూడా మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అన్ని కోణాలలోనూ మరింత బలోపేతం చెయ్యటానికి ఎంగెల్స్ జీవితాంతమూ కృషి చేశాడు.

జర్మనీలోని సోషల్ డెమొక్రటిక్ ప్రెస్ ద్వారా ప్రజల గృహావసరాల సమస్యను గురించి ప్రౌధానిస్టు దృక్పథంతో రాసిన వ్యాసాలు గతంలో వెలువడ్డాయి. అదే సమస్యను మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషిస్తూ 'గృహవసతి సమస్య' అనే వ్యాసాన్ని 1872-73లలో ప్రచురించాడు ఎంగెల్స్. సోషలిస్టు పార్టీలో ప్రముఖ తత్వవేత్త (యూజీన్) డ్యూరింగ్ సిద్ధాంతంపై విమర్శను కూడా 1877లో రాశాడు. ఆ వ్యాసాలన్నీ కలిపి తర్వాత కాలంలో 'యాంటీడ్యూరింగ్' అనే పుస్తకంగా వెలువడింది. అందులో మార్క్స్ రాసిన రాజకీయ అర్థశాస్త్రాన్ని ఒక అధ్యాయంగా చేర్చారు. సామాజిక పరిణామాల గురించీ, ప్రకృతి గతితర్కాన్ని గురించీ ఎంతో విస్తృతంగా మార్క్సిస్టు దృక్పథంతో చర్చించిన 'యాంటీడ్యూరింగ్'ను 'కేపిటల్'కు అనుబంధంగా పరిగణించాల్సి ఉంటుంది. కానీ ఎంగెల్స్ ఆ రచనను పూర్తి చెయ్యలేకపోవడమే విచారకరం.

ఎంగెల్స్ తన చిట్టచివరి రచన అయిన 'యాంటీ డ్యూరింగ్'ను 1870లలో ప్రారంభించాడు. కానీ రచన పూర్తి చేసే అవకాశం ఆయనకు కలగలేదు. ఆ గ్రంథం జర్మన్ సోషల్ డెమొక్రసీకి ఒక గొప్ప చేర్పుగా నిలుస్తుంది. కానీ తమకు అది ఎంతగా ప్రయోజనకారి అవుతుందో సోషల్ డెమొక్రాట్లు గుర్తించనే లేదు. లేక దాన్ని చూసి వాళ్లు భయపడి కూడా ఉండవచ్చు. చివరికి 1925లో సోవియట్ యూనియన్ ఆ గ్రంథాన్ని ప్రచురించింది.

'కేపిటల్' ప్రచురణను పూర్తి చేసేందుకు తదేక దీక్షతో శ్రమించాడు ఎంగెల్స్. 1885లో మార్క్స్ మరణానంతరం ప్రచురించిన రెండవ సంపుటానికి ఎంగెల్స్ ముందు మాట రాస్తూ, మూడవ సంపుటాన్ని కూడా త్వరలోనే ప్రచురించబోతున్నామని ప్రకటించాడు. కానీ మార్క్స్ వదిలివెళ్లిన రాతప్రతులన్నిటినీ సేకరించి, సరిచూసి గ్రంథరూపంలోకి తెచ్చేందుకు ఎంగెల్స్‌కు పదేళ్లకాలం పట్టింది. తన మరణానికి కొద్ది నెలల ముందు దాన్ని ప్రచురించగలిగాడాయన.

మార్క్స్‌కు అభిమాని అయిన సోషల్ డెమొక్రటిక్ మేధావి కార్ల్ కాట్స్కీ మార్క్స్ రాసిన 'క్రిటికల్ హిస్టరీ ఆఫ్ ద థియరీ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూ' ప్రచురణ బాధ్యతను స్వీకరించాడు. తనకు పూర్వీకులూ, సమకాలీనులూ అయిన తత్వవేత్తల సిద్ధాంతాలపై మార్క్స్ చేసిన విమర్శల సంపుటి ఈ గ్రంథం. వాటిలో కొత్త సిద్ధాంతాలేమీ లేవు గానీ అప్పటికి అస్పష్టంగా మిగిలిపోయిన కొన్ని సిద్ధాంతాలను ఈ వ్యాసాలు చర్చించాయి. 'సంక్షోభం' అనే అంశాన్ని కూడా ఇందులో ప్రస్తావించాడు. ఐతే మార్క్స్ గానీ ఆయన అనుయాయులు గానీ ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసినట్టు కనబడదు.

1884లో ఎంగెల్స్ 'ఆరిజిన్ ఆఫ్ ద ఫ్యామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ అండ్ ద స్టేట్' గ్రంథాన్ని ప్రచురించాడు. అమెరికాలో పరిశోధకుడు మోర్గాన్ రాసిన 'ఆదిమ సమాజం' (ప్రిమిటివ్ సొసైటీ)పై మార్క్స్ చేసిన విశ్లేషణలను ప్రాతిపదికగా తీసుకుని ఎంగెల్స్ ఈ రచన చేశాడు. సామాజికపరిణామ క్రమాన్నీ, సామాజిక వర్గాల పుట్టుకనూ, ఆయా వర్గాలు ఏ పరిస్థితుల్లో పుట్టి, ఎక్కడ అంతమవుతాయన్న అంచనాలనూ వివరించి చెప్పే అద్భుతమైన గ్రంథం ఇది. మోర్గాన్, డార్విన్‌లు చేసిన పరిశోధనలను ఆధారంగా చూపుతూ గతితార్కిక భౌతికవాద తాత్వికతతో ఆయన దీన్ని రచించాడు.

1886లో ఎంగెల్స్ రాసిన గ్రంథం 'లుడ్విగ్ ఫ్యుయెర్‌బక్ అండ్ ద ఎండ్ ఆఫ్ జర్మన్ క్లాసికల్ ఫిలాసఫీ'. ఫ్యుయెర్‌బక్ గురించి స్టార్కీ రాసిన ఒక పుస్తకంపై విమర్శనాత్మక వ్యాసాల సంపుటే ఈ గ్రంథం.

ఎంగెల్స్ బహుభాషా ప్రవీణుడు. డజనుకు పైగా భాషల్లో ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఎన్ని విషయాలను చర్చించాడో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన కృషి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సుసంపన్నం చేసింది. ఆయనకు విప్లవం పట్ల గల నిబద్ధతకు ఆయన ఉత్తరాలు సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఆనాటి కార్మికవర్గ పార్టీలు (ఎడ్వర్డ్) బెర్న్‌స్టీన్ వంటి జర్మన్ సోషల్ డెమొక్రాట్ల ఉదారవాద భావాలలో కొట్టుకుపోతున్న సమయాన వాటికి మార్గనిర్దేశం చేసి నిలబెట్టటానికి ఎంగెల్స్ ఎంతో శ్రమించాడు. ఆనాటి సోషల్ డెమొక్రాట్లు తమ రాజకీయ పంథాయే రాజ్యాధికార సాధనకు తిరుగులేని మార్గమని విశ్వసించేవాళ్లు.

రెండవ ఇంటర్నేషనల్ నిర్మాణ వ్యవహారాలపై ఎంగెల్స్ పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆనాటికింకా పరిస్థితులు పరిపక్వం కాలేదని ఆయన అభిప్రాయం. ఐనప్పటికీ కార్మికవర్గపు ముసుగులో ఒక అవకాశవాద సంస్థ ముందుకొచ్చే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు రెండవ ఇంటర్నేషనల్‌లో భాగంగా ప్యారిస్ కాంగ్రెస్ ఏర్పాటుకు జరిగిన ప్రాథమిక సన్నాహాల్లో ఎంగెల్స్ భాగం పంచుకున్నాడు. ఆ సంస్థ చేసిన చారిత్రాత్మక తీర్మానాల్లో ముఖ్యమైనది చికాగో అమరవీరుల స్మృతి (1886) చిహ్నంగా మే 1వ తేదీని అంతర్జాతీయ శ్రామిక దినోత్సవంగా ప్రకటించడం.

తను నమ్మిన సిద్ధాంతపు ఔన్నత్యాన్ని కాపాడటానికీ, విప్లవం పట్ల నిబద్ధతను ప్రకటించటానికీ ఎంగెల్స్ తన ఆలోచనకూ, కలానికీ పదునుపెట్టి సంసిద్ధుడై నిలిచాడు. ఆయన తన జీవిత చరమాంకంలో కూడా ఫ్రెంచి సోషలిస్టులను తీవ్రంగా విమర్శిస్తూ 'ద పెజెంట్ క్వెశ్చన్ ఇన్ ఫ్రాన్స్ అండ్ జర్మనీ' అనే వ్యాసాన్ని రాశాడు.

చివరి రోజుల్లో కొన్ని నెలల పాటు క్యాన్సర్ వ్యాధితో బాధపడిన ఎంగెల్స్ 1896 ఆగస్టు 5న కన్నుమూశాడు.

శాస్త్రీయ సామ్యవాదానికి రూపకర్తా, భౌతికవాదాన్ని నరనరానా జీర్ణించుకున్న మేధావీ అయిన ఎంగెల్స్ తన వీలునామాలో కాల్పనిక భావోద్వేగంతో రాసిన ఒక విషయం గమ్మత్తుగా తోస్తుంది. తనకు అత్యంత ప్రియమైన ఉత్తర కోస్తా ప్రాంతపు సముద్ర జలాల్లో తన చితాభస్మాన్ని నిమజ్జనం చెయ్యమని ఆయన కోరిక.

ఎంగెల్స్ మరణంతో ఒక తరం అంతరించింది. మళ్లీ లెనిన్ ప్రవేశంతో మరొక దశ ప్రారంభమవటమే గాక, శ్రామిక వర్గ విముక్తి కోసం మరింత మెరుగైన, ఆచరణాత్మక కార్యక్రమం మొదలైంది. ▲

## శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్

# సామాజిక పరిశోధన

***నోట్:- ఎస్.కె.ఎల్-కె.పి డివిజన్ కామ్రేడ్స్, మొత్తంగా 8 గ్రామాలకు చెందిన సాధారణ, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను పరిశోధించడంతోపాటు, వాటిలోని మూడు గ్రామాలకు (ఎగువ సిందేరి, చింతరమంజరి, గందెరగండ) సంబంధించిన నిర్దిష్ట సమాచారం ఆధారంగా, వర్గ పరిశీలన రిపోర్టును తయారు చేసారు. అయితే, కేవలం మూడు గ్రామాలకు చెందిన వర్గ పరిశీలనా రిపోర్టును మాత్రం గత సంచికలో వేశాము. ప్రస్తుతం 8 గ్రామాలకు చెందిన సాధారణ, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల ప్రాతిపదికగా రూపొందించిన, రిపోర్టులోని మిగిలిన భాగాన్ని, ఇక్కడ పొందుపరుస్తున్నాము.***

## సామాజిక పరిశోధన చేసిన గ్రామాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1. ఎగువసీందెరి (కువ్వి) | కంఠి పంచాయితి, | సిమిలిగూడ బ్లాక్ | తేది: | 8-9/4/2016 |
| 2. చింతల మంజరి ( ”) | ” | ” | | 14-15/4/2016 |
| 3. పూల్‌పొదర్ ( ”) | ” | ” | | 16/4/2016 |
| 4. హత్తిమహ ( ”) | కొటియ పంచాయితి, | పొట్టంగి బ్లాక్ | | 12/4, 13/4 |
| 5. చుడిమఁద్రి ( ”) | ” | ” | | 18/4 |
| 6. డొకిరిగాటి(మటియ) | గుమ్మండి పంచాయితి, | నారాయణపట్నాబ్లాక్ | | 24-25/4/2016 |
| 7. గందెరిగండ(మటియ) | ” | ” | | 26-27/4/2016 |
| 8. నేలబద్ర ( కువ్వి) | బొరిగి పంచాయితి, | నారాయణపట్నా బ్లాక్ | | 2-3/5/2016 |

మొత్తం 14 రోజులు ఈ సర్వే కార్యక్రమాలు నిర్వహించాము.

### *సామాజిక పరిశోధన కోసం రూపొందించుకున్న ప్రశ్నావళి*

### I. సామాజిక అంశాలు

1. గ్రామం ఎప్పుడు, ఎలా ఏర్పడింది? మొదటి నుండి ఇక్కడే ఉందా?

2. గ్రామంలో ఏయే తెగలు/కులాలు వున్నాయి? వారి మధ్య సంబంధాలు ఎలా వున్నాయి?

3. మతం (క్రిష్టియానిటి), తెగ ఆచారాలు సాంప్రదాయలు ఎలా వున్నాయి? క్రిష్టియానిటి వచ్చిన తర్వాత గ్రామంలో వచ్చిన మార్పు, అభివృద్ధి ఏమిటి? క్రిష్టియానిటి రావటానికి కారణం?

4. తెగ ఆచార, సాంప్రదాయలు, సంస్కృతిలో వచ్చిన మార్పు ఏమిటి? ప్రస్తుతం ఎలా ఉంది?

5. గ్రామంలో ఏయే పండుగలు చేస్తారు? ఖర్చు ఎంత? ఏయే రూపాల్లో సేకరిస్తారు?

6. పుట్టుక/పెళ్ళి/చావులు ఎలా నిర్వహిస్తారు? ఖర్చు ఎంత?

7. గ్రామంలో ఇప్పటికీ అమలవుతున్న తెగ కట్టుబాట్లు ఏమిటి? తప్పులకు శిక్షలు ఏయే రూపాల్లో?

8. గ్రామంలో వైద్య సదుపాయలు? జబ్బు పడితే ఏం చేస్తారు? అనారోగ్య మరణాలు?

9. విద్యా సౌకర్యం ఏమిటి? స్కూలు వుందా? టీచర్స్ వస్తున్నారా? పిల్లలను బయటి స్కూల్స్‌లో చదివిస్తున్నారా? కారణాలు ఏమిటి?

10. తాగునీరు, సాగునీరు సౌకర్యం వుందా?

11. కరెంటు వుందా? మిల్లు (ధాన్యం, పిండి) వుందా? మహిళల శ్రమ ఎలా వుంటుంది?

12. గ్రామంలో పండుగలు, జాతరలు జరుగుతాయా? జరిగితే ఎవరి నియంత్రణలో జరుగుతాయి? అందరూ పాల్గొంటున్నారా?

13. పర్యావరణ పరిరక్షణ-అడవిపై ఆధారపడి జీవనం (గతంలో ఎలా, ఇప్పుడు ఎలా వుంది)?

### II. ఆర్థిక అంశాలు

1. బయటి కూలి పనులకు వెళతారా? ఏయే పనులకు పోతారు? కారణాలు ఏమిటి?

2. గ్రామ సమిష్టి అవసరాల కోసం ఆదాయం ఎలా సమకూరుస్తారు? పంటలు/డబ్బులు వసూలు చేస్తారా? ఎవరి ఆధ్వర్యంలో వుంటాయి?

3. టౌన్‌లో సంబంధాలు? ఏయే అవసరాల కోసం వెళతారు? మార్కెట్‌లో దేనికి ఖర్చు పెడతారు?

4. భూమి అమ్మటం-కొనటం వుందా? ఎవరైనా ఆశ్రయం కోసం గ్రామానికి వస్తే వాళ్ళను ఎలా కలుపుకుంటారు? ఇల్లు, భూమి కల్పిస్తారా?

### III. ఆర్థిక అంశాలు

1. గ్రామంలో రాజకీయ పార్టీలు? ఏ పార్టీకి బలం వుంది? ఓట్లు ఎలా వేస్తారు? డబ్బులు/ఇతరత్రా ఏమైనా తీసుకుంటారా? ఎన్నిసార్లు బహిష్కరించారు?

2. బూర్జువా, రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొంటున్నారా? ఎలాంటి కార్యక్రమాలు?

3. గ్రామంలో ప్రభుత్వ, పాలనా యంత్రాంగానికి సంబంధించిన నిర్మాణ వ్యవస్థ ఎలా వుంది? ఎలా నడుస్తుంది? (వార్డ్ మెంబర్, అంగన్‌వాడి, ఆశా, స్కూల్ ప్రెసిడెంట్, కుక్ వగైరా)

4. గ్రామంలో తెగ నిర్మాణం ఎలా వుంది (హవంత, దీసరి, జాని, వగైరా) వారి కార్యక్రమాలు ఏమిటి?

5. మన పార్టీ పరిచయం ఎప్పటి నుండి (ప్రత్యక్షంగా, పరోక్షంగా)పార్టీపై ప్రజల అభిప్రాయాలు?(మొదట ఎలాఉంది? ఇప్పుడు ఎలాఉంది)?

6. సంగం ఎప్పుడు ఏర్పడింది? సంగం తీసుకున్న కార్యక్రమాలు? ఫలితాలు ఏమిటి?

7. సంగంలో ఇప్పటి వరకూ జరిగిన మార్పులు (నిర్మాణాలలో)?

8. గ్రామ ప్రజలకు-సంగానికి, పార్టీకి-ప్రజలకు, సంగానికి-పార్టీకి మధ్య సంబంధాలు ఎలా వున్నాయి? పార్టీ మీద ఏమైనా విమర్శలు ఉన్నాయా?

9. పాకెట్ కమిటి తీసుకున్న నిర్ణయాలు, కార్యకలాపాలపై ప్రజల అభిప్రాయాలు? పాకెట్ కమిటీపై ఏమైనా విమర్శలు ఉన్నాయా?

10. పార్టీ, సంగం, గ్రామ ప్రజలపై ఏమైనా చర్యలు తీసుకుందా? (దేహశుద్ధి, హెచ్చరించటం, ఖతం వగైరా) వాటిపై ప్రజల అభిప్రాయం ఏమిటి? వారి కుటుంబాలు ఎలా వున్నాయి?

11. గ్రామంపై పోలీసుల దాడి (అరెస్టు, కేసులు వగైరా) ఎలా వుంది?

12. గ్రామంలో ఇన్ఫార్మర్లు, పెత్తందార్లు వున్నారా? గ్రామం నుండి ఎవరైనా పార్టీ భయంతో పారిపోయారా?

### *గ్రామంలో కుటుంబాల వారిగా సేకరించిన అంశాల పట్టిక (వర్గ విశ్లేషణ కోసం)*

1. పేరు/వయోజనులు (ఆడ/మగ)/పిల్లలు (ఆడ/మగ)/మొత్తం కుటుంబం సంఖ్య.
2. చదువు (ఆడ/మగ)
3. ఇల్లు/కరెంటు/ రేషన్ కార్డు
4. భూమి (పొలం/మెట్ట/పోడు)/ నీటి వసతి (వర్షాధారమా/కెనాల్స్/ బోర్స్ వగైరా)
5. ఎరువుల వాడకం ఎలా వుంది(సేంద్రీయ/ రసాయనిక)?
6. భూమి ఎలా వచ్చింది (వారసత్వమా/స్వంతంగా చేసారా)? పట్టా వుందా?
7. ఆహార పంటలపై ఆదాయం (ధాన్యం/సోళ్ళు/సామలు/జొన్న/ కందులు వగైరా?
8. వాణిజ్య పంటలపై ఆదాయం (అల్లం/పసుపు/చీపుర్లు వగైరా)?
9. అటవీ ఉత్పత్తులపై ఆదాయం?
10. పశువులు (ఎడ్లు, గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్ళు, పందులు వగైరా)?
11. క్రయ-విక్రయాలు (ప్రభుత్వ సంస్థలా/మార్కెట్/షావుకార్లు?)
12. అప్పులు (గ్రామంలో/షావుకార్లు/బ్యాంకులు వగైరా?
13.బంగారం వున్నదా?
14. మత్తు పానీయాల ఖర్చు సం॥కి (గుడాకు, ఖైనీ, సారా, కల్లు వగైరా) ఎంత?
15. ఆహార ఖర్చు సం॥?
16. దుస్తులు/చెప్పులు/సబ్బులు (టాయ్‌లెట్స్) ఖర్చు (సం॥)?
17. అనారోగ్యాల కయ్యే ఖర్చు (సం॥)?
18. పండుగలు/జాతరల ఖర్చు (సం॥)?
19. చావు/పుట్టుక/పెళ్ళిళ్ళ ఖర్చు (సం॥)?
20. జీవనోపాధి (వ్యవసాయం, ఉద్యోగాలు ఇతరత్రా)?
21. వలస పోతున్నారా? ఎంతమంది? సం॥లలో ఎన్ని రోజులు?
22. ప్రభుత్వ సంస్కరణల ద్వారా పొందిన లబ్ది (పెన్సన్స్ వగైరా)?
23 మరణాలు (సం॥) మనుషులు/పశువులు?
24. ప్రకృతి వైపరీత్యాల వలన జరిగిన నష్టం?
25. కూరగాయలు/పండ్లు (పండిస్తున్నారా?)
26. గ్రామంలో హోదా (హవంత, జాని, దీసరి, సాలన, ఫాస్టర్, రైతు, ఉద్యోగ వగైరా)
27. వ్యవసాయ పనిముట్లు (నాగలి, గొడ్డలి, గునపం, పారలు, కత్తులు, కొడవలి వగైరా)
28. ఎలక్ట్రానిక్స్/ వాహనాలు (సెల్‌ఫోన్, వాచి, టీవి, రేడియో, సైకిల్, బైక్ వగైరా

మనం సామాజిక పరిశోధన చేసిన గ్రామాలలో కంఠి పంచాయితీ, కొటియ పంచాయితీ పక్కపక్కన ఆనుకుని ఉండటంతో చాలా విషయాల్లో ఒకే విధమైన పోలికలు, సాధారణ విషయాలు వున్నాయి. కనుక రెండు పంచాయితీలకు చెందిన 5 గ్రామాలలో వున్న సాధారణ విషయాలను విడిగా చూసి తరువాత ఏ గ్రామానికి ఆ గ్రామం ప్రత్యేకతలను, నిర్దిష్టతలను విడిగా చూద్దాం.

### *సాధారణ విషయాలు*

### గ్రామాలు ఏర్పడిన విధానం

ఆదివాసీ ప్రాంతాలలో పూర్వీకుల చరిత్ర, గ్రామాల చరిత్ర రాతపూర్వకంగా నమోదయ్యి వుండవు. కానీ ఆదివాసీ సాంప్రదాయాల్లో భాగంగా తమ పుట్టు పూర్వోత్తరాలను, పూర్వీకుల చరిత్రను కొన్ని ముఖ్యమైన సందర్భాలలో (పెళ్ళి, చావు దగ్గర) ముఖ్యంగా ఎవరైనా చనిపోతే ఆ సందర్భంగా తన కుటుంబీకులు, చుట్టాలు, బంధువులు అందరూ కలుసుకున్నప్పుడు పెద్దలు (ముసలివాళ్ళు) రాత్రంతా ఆ చరిత్రను అందరికీ చెప్పటం, తరతరాల వారసత్వంగా ఆనవాయితీగా వస్తున్నది. తమ కష్ట సుఖాలను పంచుకోవటానికి ఇది ఒక వేదికగా వుపయోగించుకుంటూ కొనసాగిస్తున్నారు. దీన్నే 'కొహిణి' చెప్పటం అంటారు. ఇది మాటల రూపంలోనూ, పాటల రూపంలో కూడా వుంటుంది. ఇలా ఒక తరం మరో తరానికి తమ చరిత్రను ముఖ్యంగా ప్రసారం చేయటం వలన కాలక్రమంలో కొన్ని వాస్తవాలు మరుగున పడిపోనువచ్చు. మరికొన్ని కల్పితాలు జోడించనూ వచ్చు. దాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని మార్క్సిస్టులంగా మనం గతితార్కిక దృక్పథంతో వాస్తవాల మీద ఆధారపడి ఆ చరిత్రను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఆ విధంగానే మనం కూడా 'కొహిణి' ద్వారా వారు చెప్పిన విషయం మీద కూడా ఆధాపడి ఈ గ్రామాల చరిత్రను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ గ్రామాలు ఏర్పడి సుమారు 250-300 సంవత్సరాల పైనే వుంటుందని వీళ్ళు చెప్పిన దాన్ని బట్టి అర్థమవుతుంది. సాధారణంగా బ్రతకటం కోసం ఎక్కడెక్కడి నుండో సంచారం చేస్తూ తమకు అనుకూలమైన స్థలంలో నివాసం ఏర్పర్చుకోవటం, ఆహారం సంపాదించుకోవటం కోసం మొదట అన్నదమ్ములు లేదా తండ్రి కొడుకులు అంటే ఇద్దరు, ముగ్గురు మాత్రమే వచ్చి వున్నారనీ క్రమంగా వారి సంతానం ద్వారా జనాభ పెరిగి గ్రామాలుగా ఏర్పడ్డాయని చెబుతున్నారు. కనుక మొదట ఎవరైతే ఆ ప్రాంతంలో కాలు పెట్టారో ఆ ఇంటి పేరు గలవారే తరువాత ఆ గ్రామానికి పెద్దలుగ కూడా ఉంటారు. ఆ ఇంటి పేరు గలవారే మెజార్టీగా

కూడా ఉంటారు. ఇప్పటికే ఫలానా ఊరు వాళ్ళు ఎవరు అంటే ఆ ఊరు తాడంగి వాళ్ళనో, మండంగి వాళ్ళనో చెబుతుంటారు. మరికొన్ని గ్రామాలు...ఒక గ్రామం ఏర్పడిన తరువాత జనాభ పెరిగి, భూమి సరిపోకపోవటంతో కొంతమంది మరో ప్రాంతానికి వెళ్ళి వేరు వేరు గ్రామాలుగా ఏర్పడటం కూడా మనకు కనిపిస్తున్నది.

గ్రామం అంటే... జనాభ పెరిగి కుటుంబాలుగా ఏర్పడటం, సరిహద్దులు ఏర్పర్చుకోవటం, జాకరి (పూజాస్థలం), బేరం మండ లేదా బేరం వల్లు (ఊరి మధ్యలో ఉంటుంది. రచ్చబండ వంటిది), కద్ద (నీటితావు/కాలువ), మహణిమండ (స్మశానం), గంగపేను (దేవత), గుమ్మంపేను (గ్రామానికి కాపలా కాసే దేవత). ఇవన్నీ ఏర్పర్చుకుంటేనే గ్రామంగా గుర్తింపు వస్తుంది.

## సరిహద్దులు ఏర్పర్చుకోవటం

ఒక గ్రామానికి సరిహద్దులు ఏర్పర్చుకోవాలంటే ఆ గ్రామానికి చుట్టూ ఉన్న గ్రామాల పెద్ద మనుషులను (హవంత, జానీ, దీసరి) ముందు సంప్రదించాలి (వీళ్ళంతా భూమి ఇచ్చేవాళ్ళే). హంది విహనయ్ (సరిహద్దులలో తొక్కటం) అనే కార్యక్రమం ఏర్పాటు చేయాలి. రెండు గ్రామాలకు మధ్య సరిహద్దును నిర్ణయించుకుని ఆ ప్రాంతంలో భూమిని ఇచ్చే వ్యక్తి ఒక రాయి పాతుతాడు. దానికి పసుపు రాసి బొట్టు పెడతారు. భూమి ఇచ్చిన వ్యక్తి పసుపు నీళ్ళతో స్నానం చేస్తాడు. పెద్ద మనుషులంతా సరిహద్దు ప్రాంతమంతా నడుస్తారు. 'నేను చనిపోయి, నా పిల్లలు, మనవలు వచ్చినా ఈ భూమి మీదే అని చెప్పి, దానికి సాక్ష్యంగా ఒక దారాన్ని తెంపుతాడు. ఒక గడ్డిపరకను తెంపుతాడు, సరిహద్దు రాయి మీద మట్టి ముద్దతో కొడతాడు. ఒకవేళ నేను పోయినా నా వారసులెవరైనా ఈ భూమి మీదకు అక్రమంగా వస్తే ఈ దారంలా, గడ్డిపరకలా, మట్టిముద్దలా, అయిపోతారు. కళ్ళు పేలి చస్తారు. అని ప్రమాణం చేస్తారు. ఈ తతంగం అయిన తరువాత సరిహద్దు తొక్కిన పెద్ద మనుషులందరికీ కొత్తగా సరిహద్దుల్ని ఏర్పర్చుకున్న గ్రామంలో పెద్దలు గునపం, పార, బిందెలు వంటివి ఇస్తారు. గొడ్డు, గొర్రెను కోసి భోజనం పెడతారు. సరిహద్దుల పేర్లు కూడా పొద్దు పొడిచిన వైపు, పొద్దుపోయిన వైపు కొండలు, కాలువలు, రాళ్ళు, చెట్లు, గుహలను సరిహద్దులుగా పెట్టుకుంటారు. తమ గ్రామం చుట్టూ 10, 15 వరకూ ఈ గుర్తులు వుంటాయి. ఉదా : చుడియామరి అనే గ్రామానికి సరిహద్దులు దీప్పామాలి (పర్వతం), సారపారజాల్ల (కాలువ) దూడిపావు (గుహ), తేడమహా (మామిడి చెట్టు), డొమినిజోల్ల (కాలువ), మహణిమండ (స్మశానం), బొడొబుద (కాలువ), ఇర్లాని మహణి (ఇర్పుని స్మశానం), డ్రుంబుకుజొల్ల (కాలువ) లొదనముండి (చెలిమ), పియ్యుకియంబొ (మామిడి చెట్టు), కత్రికద్ద (కాలువ), దువ్వెరిమహ (మామిడిచెట్టు) రాణిసిబంద (కాలువరేవు).....ఇలా వుంటాయి. ఈ సరిహద్దులనే తరువాత ప్రభుత్వ రిపోర్టుల్లో నమోదు చేయించుకుని సరిహద్దు పట్టా పొందామని చెప్పారు.

## గ్రామ పాలనా వ్యవస్థ

గ్రామానికి హవంత, జానీ, దీసరిలు ముఖ్యులు. మొదట గ్రామాలు ఏర్పడినపుడు జనాభా, కుటుంబంలో తక్కువగానే వుండటంతో అన్నదమ్ముల్లో ఒకరు హవంత వుంటే మరొకరు జానీలుగా కూడా వుండేవారు. ఇప్పటికీ కూడా ఈ పదవులు వారసత్వంగానే నడుస్తున్నాయి. గ్రామంలో ఏ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నా ఈ ముగ్గురు కలిసే నిర్ణయిస్తారు.

**హవంత :–** గ్రామపెద్ద. పూజలు చేసినపుడు దేవతకు బలి ఇచ్చిన మాంసం ఏదైనా (గొడ్డు, మేక, గొర్రె, పంది) ఒక వాటా అదనంగా ఇవ్వాలి. గొడ్డు చెవులు హవంతాకే ఇవ్వాలి. గ్రామంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో నిర్ణయాధికారం వుంటుంది.

**జానీ :–** పూజా కార్యక్రమాలన్నీ ఇతని ఆధ్వర్యంలోనే, ఇతని నిర్ణయం మేరకే జరుగుతాయి. ఇతని ఇంట్లోనే పూజకు ఉపయోగించే పొడవాటి కత్తులు, ఈటెలు, దేవతలు (రాళ్ళు), పూజ దగ్గర దేవతల కోసం వండే మట్టి పాత్రలు వగైరా వుంటాయి. వీటి మీద ఇతనికే అధికారం. పూజ దగ్గర వండిన పదార్థాలను దేవతలకు పెట్టటం, తరువాత అందరికీ పంచి ఇచ్చే బాధ్యత ఇతనిదే వుంటుంది. ఇతనికే ఒక వాటా మాంసం అధికంగా ఇస్తారు.

**దీసరి :–** గ్రామంలో పుట్టుక, పెళ్ళి, చావులకు, వ్యవసాయ పనులను ప్రారంభించేందుకు నక్షత్రాలను చూసి (సాగు చూడటం అంటారు) ముహుర్తాలు చెబుతాడు. ఇతనికి కూడా మాంసం సారా అదనంగా ఇవ్వాలి.

గ్రామంలో ఇతర కర్తవ్యాలు నిర్వర్తించేవారు.

**పెజ్జు/పెజ్జని :–** పూజలు చేస్తారు. కరువు కాటకాలకు, ప్రకృతి వైపరీత్యాలకు, ఊరంతా వచ్చే జబ్బులకు పూజలు చేస్తారు (దేవతలతో మాట్లాడుతారు, దేవతల కోరికలను తెలుసుకుని, వాటిని బలి ఇచ్చి వారిని శాంతింప చేస్తారు అని ప్రజల నమ్మకం) వీరు తెల్ల చీర కట్టుకుని (పురుషులైనా సరే) రాత్రంతా మంత్రాలు చదువుతూ, పాటల పాడుతూ ఆడుతారు. వీళ్ళకు ఖచ్చితంగా సారా ఇవ్వాల్సిందే.

**ఒస్సాగురు (గురవడు) :–** గ్రామంలో జబ్బులు, జ్వరాలకు చెట్ల మందులు మంత్రాలు వేసి ఇచ్చేవాడు. ఆ చెట్ల మందులను మాత్రం ఎవరికీ చూపించరు, చెప్పరు. చెబితే దాని శక్తి పోతుందని, మందులు పనిచేయవని అంటారు. మందులతో పాటు మంత్రాలు కూడా చదువుతాడు. కనుక ఇతనికి సారా కొంచెం ఇవ్వాలి. ఇతనికి మంత్రశక్తులు వుంటాయని అందుకే ఎలాంటి జబ్బులైనా తగ్గుతాయని నమ్ముతారు.

**లోహరేసి (కువ్వి, కమ్మర) :–** కత్తులు, గొడ్డళ్ళు, కొడవళ్ళు వగైరా పనిముట్లను తయారు చేయటం, వాటికి సాన పెట్టడం. ప్రతీ గ్రామానికి వుండరు. ఒక గ్రామంలో కమ్మర వుంటే అతడు 3–4 గ్రామాలలో కూడా ఈ పని చేసి పెడతాడు. అందుకోసం ఆయా గ్రామస్తులు ఇతడికి సంవత్సరానికి కొంత ధాన్యం, డబ్బు ఇస్తారు. ఇతను ఈ పనితో పాటు వ్యవసాయం (పోడు) కూడా చేసుకుంటాడు.

**బారిక :–** నారాయణపట్నా ప్రాంతం అంతటా కూడా ప్రతీ గ్రామానికీ 'డొంబ' కులానికి చెందిన వ్యక్తిని బారికగా పెట్టుకున్నారు. ఈ పద్ధతి సుమారు 50 సంవత్సరాల క్రితం వచ్చిందని చెబుతున్నారు. ఈ పద్ధతి రాకముందు కువ్వివారే ఊరికి సాలన (బారిక)గా వుండేవాడు. అలా కువ్వి వాళ్ళే సాలనగా వున్నప్పుడు గ్రామంలో అంతా ఒకటే కుటుంబం, అన్నదమ్ములే వుంటారు కనుక వాళ్ళ మధ్య తగవులు వస్తే వాళ్ళను రచ్చబండ వద్దకు పంచాయితీకి పిలవటం సిగ్గు అనీ, ఇబ్బంది అనీ, ఒకే జాతి వాడు సాలనగా వుంటే పక్షపాతం వుంటుందనే ఉద్దేశ్యంతోనూ, అలాగే గ్రామంలో ఏమైనా తగవులు జరిగి, కేసులయితే పోలీసు స్టేషన్లో మాట్లాడాలన్నా, ఫారెస్టు, ప్రభుత్వ అధికారులతో మాట్లాడాలన్నా గతంలో కువ్వి వాళ్ళకు భాష (ఒడియ) రాదు, భయం కూడా వుండేది కనుక ఆ పనుల్లో కూడా తెగ పెద్దలు డొంబు వాడి మీద ఆధారపడటం కోసం బారికగా పెట్టారు అని కూడా చెబుతున్నారు. ఇతడు గ్రామానికి సంబంధించిన కబుర్లు (చావు, పెళ్ళి, పుట్టుక వగైరా) ఇతర గ్రామాలకు చేరవేయటం, బయట నుండి వచ్చే కబుర్లను (ప్రభుత్వ, పంచాయితీ......వగైరా) గ్రామంలో దండోరా వేసి చెప్పటం చేస్తుంటారు. మన పార్టీ వెళ్ళిన తరువాత కూడా ఇతడే ఊళ్ళో అందరికీ (ఇంటింటికీ వెళ్ళి) మీటింగ్‌కు పిలుస్తాడు. ఎవరైనా డొంబు కులానికి చెందిన వ్యక్తి ఏదైనా గ్రామంలో 'బారిక' పని చేయాలంటే ముందు అతను ఆ గ్రామానికి ఒక గొడ్డు, డబ్బా (10 లీటర్లు) సారా ఇవ్వాలి (పెద్ద గ్రామం అయితే 2 గొడ్లు కూడా ఇవ్వాల్సి ఉంటుంది). గ్రామస్తులు ఇతడికి ప్రతిరోజు నిర్ణయించిన ప్రకారం (ఒక గ్లాసు లేదా మగ్గు) బియ్యం/సోడిపిండి/సామలు ఏదైనా ఒకటి ఇస్తారు. అలాగే సంవత్సరానికి ఒకసారి పంటలు నూర్చిన కల్లం దగ్గర ముందుగా నిర్ణయించిన ప్రకారం ఇతడికి ధాన్యం (వరి, సామ, చోళ్ళు, కందులు ఏదైనా ఒకటి) కొలిచి ఇస్తారు. దీన్ని 'పొల్లు' అంటారు. ఈ బారికకు గ్రామంలో వుండటానికి ఇల్లు, పని చేసుకోదలిస్తే కొంత భూమిని కూడా గ్రామస్తులు ఇస్తారు.

**వార్డు మెంబర్ :–** ఇది ఎప్పటి నుండి వచ్చిందని సరిగ్గా చెప్పలేకపోతున్నారు. ఓటు వచ్చినప్పటి నుండి వచ్చిందని మాత్రం చెబుతున్నారు. మహిళలు వార్డు మెంబర్లుగా వున్నా భర్తలే ఆ పనులపై తిరుగుతుంటారు. ప్రభుత్వ యంత్రాంగానికి గ్రామానికి మధ్య సంధానకర్తగా వుంటాడు. ప్రభుత్వ సంస్కరణల లబ్ది కోసం ప్రజలు ఇతడి మీదనే ఆధారపడుతుంటారు.

**మామకువ్విలు :–** పురుషులు ఎవరైనా తాను పెళ్ళి చేసుకున్న మహిళ ఇంటికి అంటే అత్తామామల ఇంటికి లేదా ఆ గ్రామానికి (భార్య ఉన్న గ్రామానికి) వెళ్ళి అక్కడే స్థిరపడినట్లయితే వాళ్ళను ఆ గ్రామంలో 'మామ కువ్వేసి' అంటారు. ఆ గ్రామంలో వీళ్ళ ఇంటి పేరు వేరేగా వుంటుంది. ఇతనికి ఈ గ్రామ పరిపాలన వ్యవస్థలో అధికారం వుండదు. మైనార్టీగా వుంటారు. అత్తమామలు ఇచ్చిన భూమిలోనే వ్యవసాయం చేసుకుంటారు. చాలా గ్రామాలలో వీళ్ళకు 'సాలన' పోస్టు మాత్రం ఇస్తున్నారు.

**ఆదివాసి కువ్వి తెగ సంస్కృతి-సాంప్రదాయాలు**

**పండుగలు :–** 'బారొ లేంజుకి తేరొ పరుబు' అని కువ్వి నానుడి ఒకటి వుంది (12 నెలలకు 13 పండుగలు అని అర్థం) ప్రతి పండుగకు పూజ చేయాల్సిందే. పూజ చేయటమంటే దేవత ఏది కోరితే దాన్ని బలి ఇవ్వాల్సిందే. అందుకోసం ప్రతీ పండుగకు, పూజకు ఊర్లో ప్రతీ కుటుంబమూ ఇంటికి ఎంత నిర్ణయిస్తే అంత వున్నా లేకున్నా చందా ఇవ్వాల్సిందే. అయితే మాంసం, సారా పెద్దమనుషులకు 2 వాటాలు ఇచ్చి మిగతాది ఊరందరూ పంచుకుని తినటం, తాగటం చేస్తారు.

**పుట్టుక :–** ఏ కుటుంబంలోనైనా పిల్లలు పుడితే ముందు దీసరి నక్షత్రం (సాగు) చూసి మంచి ముహూర్తంలో పుట్టారా లేదా ఏదైనా దోషం వుందా ? అని చెబుతారు. దోషం వుంటే దానికొక పూజ చేయాలి. అలాగే 'పెజ్జిని'లు ఒక చిన్న బుట్టలో కొన్ని పసుపు కలిపిన బియ్యం వేసి ఒక కోడి పిల్లను మరో చేత్తో పట్టుకుని పుట్టిన పిల్ల తాలుకా వంశంలోని పూర్వీకుల పేర్లను వరుసగా చెబుతుంది (చనిపోయిన వారి దగ్గర నుండి బ్రతికున్న వారి వరకు) అలా చెప్పినప్పుడు ఆ కోడిపిల్ల ఏ పేరు వచ్చినపుడు బియ్యం తింటుందో ఆ పేరు గలవారు మళ్ళీ పుట్టినట్లు చెబుతారు. చనిపోయిన వాళ్ళ పేరు వస్తే పరవాలేదు. కానీ బ్రతికున్న వాళ్ళ పేరు చెప్పినప్పుడ కోడిపిల్ల బియ్యం తింటే మాత్రం 'జీవు కల్పినయ్' అనే మరో కార్యక్రమం చేయాలి. అంటే బ్రతికున్న ఆ పేరు గల వ్యక్తి చేత పుట్టిన పిల్లల జీవు కలపాలి. అంటే అందుకోసం మళ్ళీ పూజ చేయాలి. ఈ పూజ చేయకుండా అతడు/ఆమె ఈ పిల్లలను ముట్టుకుంటే పిల్లలు చనిపోతారు. అని నమ్ముతారు. ఈ పూజల కోసం అయ్యే ఖర్చంతా ఆ పిల్లల గల వారే పెట్టుకోవాలి. మాంసం, సారా రెండు వాటాలు పెద్ద మనుషులకు ఇచ్చి మిగతాది ఊరందరికీ ఇస్తారు.

**పెళ్ళి :–** మేనరికాలు ఎక్కువగా వుండేవి. ఆడపిల్ల పుట్టినప్పుడు మేనమామలకు ఆ పిల్ల తమ కోడలు అనే హక్కు ఉంటుంది. కనుక అమ్మాయికి ఇష్టం వున్నా లేకున్నా 'కల్లు' తాగితే అమ్మాయిని రిజర్వ్ చేసుకున్నట్లే ఖచ్చితంగా అబ్బాయిని పెళ్ళి చేసుకోవాల్సిందే. 3 రోజుల పాటు పెళ్ళి జరుగుతుంది. అబ్బాయి తరపు వాళ్ళకు ఎక్కువ ఖర్చు అవుతుంది. అమ్మాయి కుటుంబానికి అబ్బాయి గలవారే గొడ్డు, సారా ఇవ్వాలి. (దీన్ని మొల్ల (ఓలి) అంటారు) అలాగే పెళ్లికి వచ్చిన వాళ్ళందరికీ గొడ్డు కోసి బోజి పెట్టాలి. సారా పోయాలి. పెళ్ళి అయిన మహిళ భర్తను వదిలి పెట్టి వేరొకరితో వెళ్ళిపోతే ఆమెను తీసుకుపోయిన వ్యక్తి (రెండవ భర్త) మొదట భర్తకు గొడ్డు, సారా, డబ్బులు ఇవ్వాల్సి వుంటుంది. దీన్నే 'కెర్ది' అంటారు. ఒకవేళ పిల్లలు పుట్టిన తరువాత ఆమె వేరొకరికి వెళ్ళిపోతే పిల్లలను తల్లికి ఇవ్వరు. 'మాజీవు' అంటారు. బహుభార్యత్వం వుంది. ఇతర తెగ/ కులాల వాళ్ళను పెళ్ళి చేసుకోవటం నిషేదం. ఒకవేళ చేసుకుంటే

తప్పు కట్టాలి. (ఊరికి గొడ్డు, సారా ఇవ్వాలి) లేకపోతే కుటుంబంలో కలపరు.

**సంస్కృతి :–** గతంలో పండుగలు, పెళ్ళిళ్ళు వంటి శుభకార్యాలకు ఊర్లో రాత్రంతా కిందిరి (డ్యాన్సు) వేసేవారు. లిసెణి, పీరుడి, డప్పు, డోలు వంటి వాయిద్యాలతోనూ, నెమలిమట్ట (నెమలి ఈకలతో తయారు చేసేది)ను పట్టుకుని కువ్వి భాషలో రకరకాల పాటలు, సంవాదాలతో సరదాగా ఆటలు ఆడేవారు. సెల్‌ఫోన్లు, టీవీలు, సినిమాల సంస్కృతి లేదు. మైక్‌సెట్లు లేవు.

చావు : ఎవరైనా చనిపోతే 'అంత్యక్రియలకు' వచ్చిన వాళ్ళందరికీ సారా ఇవ్వాలి. తరువాత కూడా చనిపోయిన వాళ్ళ కుటుంబాన్ని పరామర్శించటానికి (డీన్లకండు అంటారు) నెలరోజుల వరకూ రోజు ఎవరో ఒకరు వస్తూ వుంటారు. 'శుద్ధి' కార్యక్రమం చేయాలి. అంటే చనిపోయిన వ్యక్తి ఆత్మకు శాంతి కలగటం కోసం పూజ చేయాలి. గొడ్డు, మేక, పంది కోసి కుటుంబానికి (ఊరికి) చుట్టాలు, బంధువులకు బోజి ఇవ్వాలి. శవాన్ని కాల్చటం వుంది. వర్షాకాలంలో కట్టెల సమస్య వున్నప్పుడు పూడ్చిపెడతారు. ఖచ్చితంగా 'కొహిణి' చెప్పే కార్యక్రమం వుంటుంది.

**అనారోగ్యాలు :–** జబ్బు చేస్తే ముందు గురవడి వద్దకు వెళతారు. అతనికి సారా ఇస్తే మంత్రం చదివి చెట్ల మందు ఇస్తాడు. అయినా తగ్గకపోతే పెజ్జిని దగ్గరకు వెళతారు. ఆమె దేవతతో మాట్లాడి దేవత ఏం కోరుతుందో (గొడ్డు, మేక, పంది, కోడి).....చెబితే దాన్ని తీరుస్తామని మొక్కుతారు. గడువులోగా అప్పు చేసైనా మొక్కు తీర్చుతారు. లేదంటే ఆ వ్యక్తి చనిపోతాడని భయం. ఎక్కువగా చేతబడి జరిగిందని బాగా నమ్ముతారు. 'అమ్మవారు' (స్మాల్ పాక్స్, చికెన్ పాక్స్) వస్తే ఇప్పటికీ మందులు వాడకూడదని, మందులు వేస్తే అమ్మవారికి కోపం వస్తుందని నమ్ముతారు. డాక్టర్ల దగ్గరకు వెళ్ళటం ఇప్పుడిప్పుడే పెరుగుతుంది. పూజలు చేయటం కోసం గతంలో ప్రతి కుటుంబమూ పందులను పెంచుకునేవారు.

**తెగ కట్టుబాట్లు :–** డొంబ కులం వాళ్ళ పట్ల చిన్నచూపు, అంటరానితనం పాటించేవారు. వాళ్ళను ఇంట్లోకి రానివ్వరు. వాళ్ళకు ఏదైనా పాత్రలో ఇచ్చినా మళ్ళీ దాన్ని పసుపు నీళ్ళలో శుభ్రం చేసి లోపలకు తీసుకెళతారు. బహిష్టు అయిన మహిళలు వంట చేయకూడదు. పూజ గదిలోకి, ధాన్యం గదిలోకి వెళ్ళకూడదు.

**క్రిష్టియానిటి :–** ఈ ప్రాంతంలో (కంటి, కొటియా పంచాయితీల్లో) క్రిష్టియానిటీ 50 సంవత్సరాల క్రితమే వచ్చింది. మొదటి సారిగా 'లూథరన్ క్రిష్టియన్' పేరుతో విదేశాల నుండి కొంతమంది పాస్టర్లు, ప్రచారకులు వచ్చి క్రిష్టియన్‌లో చేరాల్సిందిగా ప్రచారం చేసారనీ, చర్చిలు నిర్మాణం కోసం కూడా ప్రయత్నించినట్లు తెలుస్తుంది. అయితే అప్పుడు తెగ ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, వాటిపై నమ్మకం బలంగా వుండటంతో క్రిష్టియన్‌లో చేరలేదు. చాలా కొద్దిమంది వ్యక్తులు మాత్రమే చేరారు. అలా అప్పుడు 'లూథరన్' బీజాలు పడినా బలంగా ఏర్పడలేదు. తరువాత 15,16 సంవత్సరాల క్రితం నుండి మళ్ళీ 'అమర్‌జ్యోతి' 'బేర్‌షెప్' సంస్థల వాళ్ళు క్రిష్టియానిటీని ఈ ప్రాంతంపై కేంద్రీకరించి ప్రచారం చేసారు. అయితే ఈసారి అప్పటికే ఈ ప్రాంతంలో కొంతమంది యువకులకు బైబిల్ ట్రైనింగ్, పాస్టర్ ట్రైనింగ్‌లు ఇచ్చి వాళ్ళనీ ప్రచారకులుగా గ్రామాలకు పంపించారు. ఈసారి కువ్వితెగకు చెందిన యువకులు ప్రచారకులుగా వుండటం, అప్పటికే గ్రామాలలో తెగ పెద్దల ఆధిపత్యం, తెగ ఆచారాలు, కట్టుబాట్లు, నియమాల పట్ల వ్యతిరేకతకు, ఘర్షణకు గురవుతున్న ఒక సెక్షన్ (ముఖ్యంగా యువతీ, యువకులు) చాలా తొందరగా, సహజంగానే క్రిష్టియానిటీ పట్ల ఆకర్షితులయ్యారు. అయితే ఇది కూడా అంత సులభంగా జరగలేదు. మొదట్లో ఒక గ్రామంలో ఇద్దరు, ముగ్గురు మాత్రమే క్రిష్టియన్‌లో చేరినప్పుడు వీరు మైనార్టీగా వుంటారు. కనుక తెగ పెద్దల నుండి చాలా సమస్యలను ఎదుర్కొన్నారు. వీళ్ళను ఆ తెగలో కలపం అనీ, చనిపోయినా ఈ స్మశానంలో కలపమనీ, పెళ్ళిళ్ళకు, చావులకు, పూజలకు రాకూడదనీ......ఒక రకంగా వెలివేసేవారు. అయినప్పటికీ వీళ్ళు వాటన్నింటినీ భరిస్తూ వచ్చారు. క్రమంగా ఈ ప్రాంతంలో చదువుకుంటున్న వాళ్ళు కూడా పెరగటం, వాళ్ళు క్రిష్టియన్‌లో చేరటం జరిగింది. ముఖ్యంగా ఆర్థికపరంగా క్రిష్టియన్లో చేరితే 13 పండుగలు చేయనవసరం లేదనీ, ఖర్చు వుండదనీ, జ్వరాలు, జబ్బులు వచ్చినా పూజ చేయనవసరం లేదనీ, ఖర్చు వుండదనీ, ప్రార్థన చేస్తే సరిపోతుందనే అంశాలు సాధారణ ప్రజలపై చాలా ఎక్కువ ప్రభావం వేసాయి. దాంతో క్రమంగా మెజార్టీ కుటుంబాలు క్రిష్టియన్లో చేరటంతో చివరకు చేసేదేమీ లేక, తెగ పెద్దలు కూడా అనివార్యంగా క్రిష్టియన్‌లో కలసిపోవటం జరిగింది. అలా 10 సంవత్సరాల నుండి ఈ గ్రామాలన్నీ పూర్తిగా (ఒక్క కుటుంబం కూడా మినహాయింపు లేకుండా) క్రిష్టియన్‌లో చేరిపోయాయి. మతం మత్తు. ఈ ప్రాంత ప్రజల మెదళ్ళ పైన చాలా తీవ్రమైన ప్రభావాన్ని వేసింది. క్రిష్టియన్లో చేరటం వలన వచ్చిన మార్పు, అభివృద్ధి ఏమిటి? అని మనం వేసిన ప్రశ్నకు దాదాపు అన్ని గ్రామాలలోనూ యువతీ యువకులు చెప్పిన సమాధానం ఒకే రకంగా వుంది. "ఆర్థికంగా ఖర్చులు తగ్గాయి, ఖచ్చితంగా చేసి తీరాలనే ఆధిపత్యం లేదు, పందులను లేకుండా చేయటం వలన పరిశుభ్రత నేర్చుకున్నామనీ, మత్తు పదార్థాలు (సారా,గుడాకు, బంగు, కల్లు వగైరా) యువతీ యువకులు మానేసారనీ (ముసలివాళ్ళకు మినహాయింపు వుంది), దీని వలన జబ్బులు కూడా తగ్గాయనీ, వస్త్రధారణలో మార్పు వచ్చిందనీ, తాగి గొడవలు పడటం, కొట్టుకోవటం, తిట్టుకోవటం, చంపుకోవటాలు తగ్గాయనీ, మహిళలు కూడా సిగ్గుపడకుండ అందరినీ ఆప్యాయంగా పలకరించటం నేర్చుకున్నారనీ, దొంగతనాలు తగ్గాయనీ, కోపం లేకుండా అందరితో శాంతంగా, మర్యాదగా వుండటం నేర్చుకున్నామనీ, జాతి బేధం పోయిందనీ, క్రిష్టియన్‌లో చేరటం వలన చాలా మేలు జరిగిందనే అభిప్రాయంతో వున్నారు. పెద్ద మనుషులను మీరెందుకు చేరారు అని అడిగితే "అందరూ అందులో చేరిపోయాక ఇక విడిగా వుండి మేమేం చేస్తాం.

ఎవరికి పూజలు చేస్తాం. అని కొంతమంది మనస్ఫూర్తిగా నమ్మి ఇష్టంతో చేరామనీ, మరి కొద్దిమంది ఇష్టం లేకపోయినా తప్పక చేరామనీ చెప్పారు. అయితే ఈ క్రిష్టియానిటీని వ్యాప్తి చేయడంలో పాస్టరు, ప్రచారకులు చాలా ఓపికగా, పథకం ప్రకారం కృషి చేసారు. ముఖ్యంగా ప్రజల మనసులను మార్చటం కోసం ఆర్గనైజ్ చేస్తునే, పెద్దమనుషులతోనూ వైరుధ్యం రాకుండా, వాళ్ళ అధికారానికి, ఆధిపత్యానికి ప్రమాదం లేకుండా వాళ్ళతో వ్యవహరించారు. ఇప్పటికీ కూడా పాస్టరు స్థానిక గ్రామస్తుడు కాకుండా వేరే గ్రామానికి చెందిన వాడుగా వుంటాడు కనుక అతడికి ఈ గ్రామంపై ఆధిపత్యం వుండదు. కానీ క్రిష్టియన్ పద్దతుల ప్రకారం జరిపే ఏ కార్యక్రమనికైనా (పెళ్ళి, పుట్టుక, చావు, పండుగలు....వగైరా) ముందు తెగపెద్దలతో సంప్రదించి , వారి ఆమోదం పొందిన (ఒప్పించి) తరువాతనే అమలు చేస్తారు. గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలలో నిర్ణయాధికారం ఇప్పటికీ తెగపెద్దలకే వుంది. అయితే వాటిని అమలు చేసే, నిర్వహించే విధానంలో (క్రిష్టియన్ పద్ధతి) మార్పు వచ్చింది. ఇందులో పాస్టర్ల పాత్ర కీలకంగా వుంటున్నది. ఈ విధంగా పాస్టర్లు చాలా తెలివిగా రాజీ పద్దతులలో పెద్ద మనుషులను కూడా తమతో కలుపుకోవటం ద్వారా కూడా క్రిష్టియానిటీని వ్యాప్తి చేయగలిగారు.

**గ్రామంలో క్రిష్టియన్ నిర్మాణం :–** పైన చెప్పిన ఆ గ్రామంలో కూడా అమర్‌జ్యోతి, బేర్‌షెప్ అనే సంస్థల ద్వారా చర్చిల నిర్మాణం జరిగింది. అంటే సంస్థ వాళ్ళు చర్చి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, రాడ్స్ వగైరా ఇస్తారు. ఆ గ్రామ ప్రజలు “మాపురు సేవ” పేరుతో స్వచ్ఛందంగా శ్రమ చేయాలి. అలా ‘చర్చి’ల నిర్మాణం జరిగింది.

**పాస్టరు :–** ఏ గ్రామనికి సంబంధించిన వ్యక్తి ఆ గ్రామంలో (స్వంత గ్రామంలో) పాస్టరుగా వుండడు. అలా వుంటే గ్రామస్తులు చెప్పిన మాట వినరని అంటున్నారు. ఈ పాస్టరుకు ఆయా సంస్థ వాళ్ళు నెల నెలకు జీతం ఇస్తారు. (పాస్టరు ట్రైనింగ్ పొంది, సర్టిఫికేట్ పొంది వున్న వాళ్ళకే జీతం) ఈ జీతంతో పాటు ప్రజలు చందాలు ఇస్తారు. (బియ్యం, డబ్బులు), ఇతను నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల సందర్భంగా (పెళ్ళి, పుట్టుకు, చావు, పండుగలు.....వగైరా) డబ్బులు ఇస్తారు. ఇతను వారానికి ఒకసారి (ఆదివారం) చర్చికి వచ్చి ప్రార్థన చేస్తాడు. ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటాడు. వీళ్ళు మత ప్రచారంలో భాగంగా పాటలు పాడటం, ఒక పద్ధతిలో ఉపన్యాసాలు ఇవ్వటం (దేవుని వాక్యాలు చెప్పటం అంటారు) ద్వారా పిల్లలను, యువతీ యువకులను ఆకర్షిస్తుంటారు. పాస్టరు పనితో పాటు దాదాపు అందరూ తమ గ్రామాల్లో వ్యవసాయం కూడా చేసుకుంటుంటారు.

**పాస్టర్ల ట్రైనింగ్ :–** ఆయా సంస్థల ద్వారా యువతీ యువకులను ట్రైనింగ్‌కు పంపుతున్నారు. ఇందులో కూడా 1. సాధారణ బైబిల్ ట్రైనింగ్ – 3 నెలలు వుంటుంది. (5వ తరగతి విద్యార్హత వుండాలి) వీళ్ళను ప్రచారకులు అంటారు. 2. సిటిహెచ్ – $1^{1/2}$ సంవత్సరాల ట్రైనింగ్ వుంటుంది (10 వ తరగతి విద్యర్హత).

3. డిప్లమో – 2 సంవత్సరాల ట్రైనింగ్ (10 వ తరగతి విద్యర్హత).

4. 3 బిటిహెచ్ – 5 సంవత్సరాల ట్రైనింగ్ (+2 సైన్స్ చదివి వుండాలి).

ఈ విధంగా ట్రైనింగ్ పొందిన వాళ్ళకి సర్టిఫికేట్ ఇస్తారు. దాని ఆధారంగా కూడా జీతాలు ఎక్కువ తక్కువగా వుంటాయి. మన ప్రాంతాల్లో మెజార్టీగా సాధారణ ట్రైనింగ్ పొంది పాస్టర్లుగా పని చేస్తున్న వాళ్ళే వుంటున్నారు. వీళ్ళకు ఆయా సంస్థ తరపున నెలకు వివాహితులకు 1200/–, అవివాహితులకు 900/– జీతం ఇస్తారని చెబుతున్నారు. ట్రైనింగ్ కోసం రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాలకు కూడా వెలుతుంటారు.

**పర్చిన/ప్రచిన :–** ఇతను గ్రామానికి చెందిన వ్యక్తే వుంటాడు. చర్చికి సంబంధించిన మెయింట్‌నెన్స్ (నిర్వాహణ) బాధ్యతను చూస్తాడు. (చందాలు వసూలు చేయటం, ఖర్చు పెట్టటం వగైరా) చర్చి తాళాలు ఇతని వద్దనే వుంటాయి. చర్చిని రోజు శుభ్రం చేయటానికి ఊర్లో మహిళలను కేటాయిస్తారు. వీళ్ళు ‘మాపురు సేవ’ కోసం స్వచ్ఛందంగానే ఈ పని చేస్తారని అంటారు.

### స్వచ్ఛంద సంస్థలు

సిమిలిగూడ బ్లాక్ కంటి పంచాయితీలో ప్రధానంగా విడా సంస్థ, అమర్‌జ్యోతి (క్రిష్టియన్ సంస్థ) సంస్థలు చాలా కాలం నుండి పని చేస్తున్నాయి. కొటియా పంచాయితీ (పొట్టంగి బ్లాక్)లో మనం సర్వే చేసిన గ్రామంలో యునిసెఫ్, ఒరిడా, బేర్‌షెప్ సంస్థలు ప్రధానంగా వున్నట్లు అర్థమవుతుంది. ఇవి ఎప్పటి నుండి వచ్చాయనేది స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. అయితే సుమారు 10, 15 సంవత్సరాల క్రితం అంటున్నారు. (ఇంచుమించు క్రిష్టియానిటి వచ్చిన కాలంలోనే)

### స్వచ్ఛంద సంస్థల సంస్కరణలు

**విడా :–** ఈ సంస్థ విద్య కోసం ప్రతీ గ్రామంలో పారా టీచర్స్‌ను నియమించారు. (వీళ్ళు గ్రామంలో ఒక సంవత్సరం పాటు డ్రాప్ ఔట్స్‌కు ప్రాథమిక విద్యను నిర్మిస్తారు) తరువాత “బ్రిడ్జి క్యాంప్ కోర్స్’ అని చిక్కెలమరీ గ్రామంలో అబ్బాయిలకు, పుటిసిలిలో అమ్మాయిలకు క్యాంపులు పెట్టారు. గ్రామంలో 1 సంవత్సరం ప్రాథమిక విద్య పూర్తి చేసిన వాళ్ళను ఈ క్యాంపుల్లో చేర్చి 1 సంవత్సరం పాటు డైరక్టుగా 8వ తరగతి కోర్స్‌ను చెప్పి 7వ తరగతి పరీక్షలు రాయిస్తారు. ఇక్కడ పాస్ అయిన వాళ్ళు తరువాత స్కూల్స్‌లో 8వ తరగతిలో జాయిన్ అయ్యి చదువుకోవచ్చు. ఈ స్కూల్స్ సంస్థ వచ్చిన తరువాత 5 సంవత్సరాలు నడిచి తరువాత బంద్ అయినట్లు చెబుతారు.

**వైద్యం :–** రోజుకి ఒక గ్రామం చొప్పున, నెలకు ఒకసారి ప్రతీ గ్రామానికీ విడా మెడికల్ వాహనం వచ్చి మందులు ఇచ్చేది, టిబి, క్యాన్సర్ లాంటి జబ్బులకు సంస్థ డబ్బులను ఖర్చు పెట్టి హాస్పిటల్‌లో

జాయిన్ చేసేవారు. ప్రతీ నెలా ఊర్ల చుట్టూ మలేరియా మందులు చల్లేవారు. సంవత్సరానికి ఒకసారి ప్రతి కుటుంబానికి మొసరి (దోమతెర) ఇచ్చేవారు. ఇది కూడా ఇప్పుడు బంద్ అయ్యింది.

**మహిళాసంగాలు :–** ఎస్‌హెచ్‌జి (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) పేరుతో 20 మంది మహిళలతో ఒక గ్రూప్‌ను ఏర్పరిచారు. ఈ మహిళా మండలి పేరుతో బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసారు. మహిళలు ఒక్కొక్కరు నెలకు 5 రూపాయల చొప్పున బ్యాంకులో కట్టేవారు. ఒక గ్రామంలో ఈ మహిళా మండలికి విడా తరపున (బ్యాంకులో 3 సంవత్సరాలు డబ్బులు కట్టిన తరువాత) ఒక్కొక్కరికి 1500/-, గొర్రె, అల్లం, పసుపు విత్తనాలు, పండ్ల మొక్కలు, కూరగాయల విత్తనాలు, మొసరి (దోమతెర), రగ్గులు ఇచ్చారు.

**యువజన సంగం :–** యువతీ యువకులతో గ్రామంలో యూనిట్ పెట్టి, వీళ్ళకు మెషిన్ (టైలరింగ్) ట్రైనింగ్, బైబిల్ ట్రైనింగ్, విస్తరాకులు కుట్టే ట్రైనింగ్ వగైరా...... రకరకాల ట్రైనింగ్‌లను ఇస్తారు. యువజన సంగం మీటింగ్‌లు చేసుకోవటానికి సోలార్ లైట్లు ఇచ్చారు.

ఒరిడా, యునిసెఫ్ సంస్థలు ప్రధానంగా గ్రామాలకు సోలార్ ప్లేటు, లైట్లు ఇచ్చారని చెప్పారు. అమర్‌జ్యోతి, బేర్‌షెబ్ సంస్థలు గ్రామంలో చర్చిలను నిర్మాణం చేయటం, యువతీ యువకులకు బైబిల్ ట్రైనింగ్‌లు ఇవ్వటం చేసింది. ఈ స్వచ్ఛంద సంస్థలు తమకు చాలా మేలు చేసాయని అయితే గతంలోలాగా ఇప్పుడు ఆ సంస్కరణలు అమలు కావటం లేదు. అవి వస్తే బాగుంటుందనే అభిప్రాయాలు ఈ ప్రాంత ప్రజల్లో వుంది.

***ఇక నిర్దిష్టంగా ఒక్కో గ్రామానికి సంబంధించిన రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలను పరిశీలిద్దా.***

### 1. ఎగువసీందెరి

**గ్రామచరిత్ర :–** ఈ గ్రామం ఏర్పడి సుమారు 2 సంవత్సరాల పైనే వుంటుంది. తాడంగి, మండంగి అనే ఇంటి పేరు గలవారే మొదట వచ్చి స్థిరపడ్డారు. అయితే తాడంగి వారే మెజార్టీగా వున్నారు. కనుక గ్రామపెద్దలు (హవంత, జాని, దీసరి) తాడంగి వారే వుంటారు. మొదట మునకర్ర గ్రామం దూరంగా వుండటం మూలంగా ఆ గ్రామానికి సరిహద్దును, పూజాస్థలం, స్మశానం వంటివన్నీ విడిగా ఏర్పర్చుకున్నారు. గ్రామపెద్దలను కూడా విడిగా పెట్టుకున్నారు. (ఇక్కడ కూడా తాడంగి వాళ్ళే పెద్దలుగా వుంటారు) ప్రభుత్వం లిస్టులో ఈ మునకర్ర గ్రామాన్ని పొట్టంగి బ్లాక్, కొటియ పంచాయితీకి చేర్చారు. ఎగువసీందెరి, దిగువసీందెరి రెండు గ్రామాలు పక్కపక్కనే వుండటంతో చాలా కాలం వరకూ ఒకటే సరిహద్దు వుండేది. తరువాత ఈ రెండు గ్రామాలకు విడిగా సరిహద్దు ఏర్పర్చుకున్నారు. అయితే ఇప్పటికీ ఈ రెండు గ్రామాలకు తెగపెద్దలు, వార్డుమెంబర్ కలిపే వున్నారు. పూజాస్థలం, స్మశానం కూడా ఉమ్మడిగానే వున్నాయి. ఈ గ్రామంలో ప్రస్తుతం 37 కుటుంబాలు (ఇళ్ళు) వున్నాయి. ఇందులో తాడంగి (వంతల)-28, మండంగి (పాంగి)-6, మెల్లక (కిల్లో)-3 కుటుంబాలు వున్నాయి. మండంగి, మెల్లక ఇంటి పేర్లు గలవారు ఈ గ్రామ మహిళలను పెళ్ళి చేసుకుని ఇక్కడే స్థిరపడి 'మామ కువ్వి'లుగా వున్నారు. వీళ్ళలో మండంగి వాళ్ళకు గ్రామంలో సాలన (కువ్వి బారిక), పెజ్జిని పోస్టులను మాత్రం ఇచ్చారు. 'గాసీరాం' అనే 'డొంబొ' వ్యక్తిని బారికగా పెట్టుకున్నారు (కింది సీందెరిలో వుంటాడు. రెండు గ్రామాలకు ఒకడే బారిక) ప్రస్తుతం ఇతను ముసలి అయిపోయాడు. ఇతని కొడుకులు వేరే వృత్తుల్లో స్థిరపడ్డారు. ఇతను చనిపోతే తరువాత ఎవరైనా డొంబొ వాళ్ళు బారిక పని చేస్తామంటే అవకాశం ఇస్తాం. లేకపోతే లేదు అని గ్రామస్తులు చెప్పారు. గతంతో పోల్చితే ఈ బారిక పద్ధతి కొంత క్షీణిస్తున్నది. కువ్వి కమ్మర ఈ గ్రామంలో లేదు ఖజ్జురి అని వేరే గ్రామంలో వున్నాడు. (అతను 5 గ్రామాలను చూస్తాడు) అతడికి సంవత్సరానికి ఇంటికి 50/- చొప్పున ఇస్తున్నారు. ఒస్సాగురు (గురవడు) వున్నాడు కానీ పూజలు చేయటం, మంత్రాలు చదవటం లేదు. ఎవరైనా వచ్చి అడిగితే చెట్ల మందులు ఇస్తుంటాడు. ఎంత ఇస్తే అంత తీసుకుంటాడు.

క్రిష్టియానిటి వచ్చి సుమారు 16 సంవత్సరాలు అయింది (2000లో) మొత్తంగా అన్ని కుటుంబాలు క్రిష్టియన్‌లో చేరి 7 సంవత్సరాలు అవుతుంది. 2006లో బేర్‌షెబ్ సంస్థ ద్వారా చర్చి (బిల్డింగ్) కట్టారు (దీనికి ముందు మట్టితో, ఈత కొమ్మలతో వుండేది) ప్రస్తుతం శోభ (పిచ్చుడి గ్రామం) ఈ గ్రామానికి పాస్టరుగా వున్నాడు. ఈ గ్రామం నుండి బైబిల్ ట్రైనింగ్‌కు వెళ్ళి సర్టిఫికేట్లు పొంది వేరే గ్రామంలో పాస్టర్లుగా పని చేస్తున్నవారు 5గురు వున్నారు.

**1. లాండు –(2 సంవత్సరాలు జగదల్‌పూర్‌లో ట్రైనింగ్) ప్రస్తుతం పిచ్చుడిలో పాస్టర్.**
**2. రొబి –(3నెలలు కుందెలిజ॥పూర్‌లో ట్రై.)సలీంపొదర్, ప్ర॥తం పిచ్చుడిలో పా॥**
**3. లింగ –(2 సం॥ జ॥పూర్‌లో ట్రై.) హత్తిమహ, ప్ర॥తం పిచ్చుడిలో పా॥**
**4. బాసు –(2 సం॥ జ॥పూర్‌లో ట్రై.) పిచ్చుడి, ప్ర॥తం పిచ్చుడిలో పా॥**
**5. బిహెను (1 1/2 సం॥ లక్షింపూర్‌లో ట్రై.) కుంబరి, ప్ర॥తం పిచ్చుడిలో పా॥**

**వైద్య సదుపాయాలు :–** ముందు పాస్టర్ ద్వారా ప్రార్థన చేయిస్తారు. మూర్ఛ, కాళ్ళు, చేతులు పొంగటం వంటి వాటికి గ్రామంలో గురవడు ఇచ్చిన మందులు తీసుకుంటారు. గతంలో విడా మెడికల్ వాహనం వచ్చేది. ఇప్పుడు లేదు డబ్బులుంటే హాస్పిటల్‌కు వెళతారు. గత సంవత్సరం వాంతులు, విరోచనాలతో ముగ్గురు చనిపోయారు. గత నెలలో అనారోగ్యంతో 6 నెలల పాప చనిపోయింది. ప్రస్తుతం మన పార్టీ ఈ గ్రామ సంగ నాయకులకు మెడికల్ ట్రైనింగ్ ఇచ్చిన తరువాత అతను ఊర్లోను, చుట్టు పక్కల గ్రామాలలోనూ మందులు ఇస్తున్నాడు.

**విద్య :–** ఈ గ్రామంలో స్కూలు లేదు. క్రింది సీందెరిలో స్కూలు కట్టారు. కానీ మాస్టరు రాడు. క్రింది గ్రామంలోనే ఇద్దరు అమ్మాయిలకు (10వ తరగతి చదువుకున్నారు) నెలకు వెయ్యి రూపాయలు ఇచ్చే ఒప్పందంతో స్కూలు చెప్పమన్నారు. కానీ వాళ్ళు పెళ్ళిళ్ళయ్యి వెళ్ళిపోయారు. 5వ తరగతి వరకూ స్కూలు వున్నా ప్రభుత్వం ఇద్దరు మాస్టర్లను (పుట్టుశిలి, జైపూర్ వాళ్ళు) కేటాయించినా స్కూలు నడవటం లేదు. పిల్లలందరినీ దూరంగా హాస్టల్ వసతి

వున్న స్కూల్స్‌లో జాయిన్ చేస్తున్నారు. గ్రామంలో ఇప్పుడు పిల్లలందరినీ స్కూలుకు పంపుతున్నారు (అబ్బాయిలు ఎక్కువ, అమ్మాయిలు తక్కువ) జాయినింగ్ సమయంలో సగటున 3000/- ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకూ ఈ గ్రామంలో +2 (ఇంటర్) చదివిన వారు -1 అమ్మాయి పెళ్ళి అయిపోయింది) ప్రస్తుతం +2 చదువుతున్న వారు ఒకరు వున్నారు. ఇప్పుడు 10వ తరగతి చదువుతున్న వాళ్ళు ఉన్నారు. డిగ్రీ చదివిన వాళ్ళు ఎవరూ లేరు.

**కరెంటు లేదు :-** ఏదో ఒక స్వచ్ఛంద సంస్థకు సోలార్ కోసం ఇంటికి 130/-చొప్పున కట్టారు కానీ సోలార్ రాలేదు. ఆ సంస్థ బంద్ అయ్యింది అన్నారు. గ్రామంలో కొంతమంది సోలార్‌లు, బ్యాటరీలు కొనుకున్నారు. మరికొద్దిమంది బ్యాటరీలు మాత్రం కొనుక్కుని సోలార్ వున్న వాళ్ళ దగ్గర చార్జింగా చేసుకుంటున్నారు. ఇవి లేని వాళ్ళు దీపం వెలిగించుకుంటున్నారు.

గ్రామంలో ఒక ధాన్యం మిల్లు ఉంది (ఆయిల్ ఇంజన్‌తో నడిచేది) దీన్ని 50,000/-లకు ఇద్దరు జాయింట్‌గా కొన్నారు. ఈ మిల్లు కోసం 1 తులం బంగారం తనఖా పెట్టి సిమిలిగూడ షావుకారి వద్ద 20 వేలు అప్పు తెచ్చారు. నెలకు వడ్డీ 600 చొప్పున 3 నెలలు కట్టి, తరువాత అల్లం అమ్మి 20 వేలు కట్టి బంగారం విడిపించుకున్నారు. ఈ మిల్లు రాక ముంద మహిళలు ధాన్యం దంచేవారు. మిల్లుకు ధాన్యం వేస్తే డబ్బులు తీసుకోరు. పొట్టు, తవుడు మాత్రం తీసుకుంటారు. ఈ పొట్టును మిల్లు యజమాని కేజి 4 రూపాయలకు అమ్ముతాడు.

**పర్యావరణం :-** గతంలో అడవి బాగా వుండేది.అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడి జీవనం వుండేది. అడ్డాకులను సాలురు (ఆంధ్రకు) తీసుకుపోయి అమ్మేవారు. జంతువులు వుండేవి కనుక వేట కూడా చేసేవారు. గతంలో ఈటెలు, వింటిబద్దలు వుండేవి. తరువాత బర్మార్లు వచ్చాయి. ఇప్పుడు గ్రామంలో 5 బర్మార్లు వున్నా ఇప్పుడు అడవి తగ్గిపోయింది. అటవీ ఉత్పత్తులు తగ్గిపోయాయి. జంతువులు కూడా తగ్గిపోయాయి. ఇప్పుడు వర్షాలు పడనప్పుడు జంతువుల అడుగులు కనిపిస్తే వేటకు వెళతారు. కొన్ని ఊటలు ఆగిపోయాయి, నీరు తగ్గిపోయింది. వంట చెరకు (కట్టెల) కూడా తీవ్ర సమస్యగా వుంది.

### ఆర్థిక విషయాలు

**గ్రామ ఉమ్మడి ఆస్తి :-** గ్రామంలో ప్రస్తుతం 10 చింతచెట్లు ఉమ్మడిగా ఉన్నాయి. హుదూద్ తుఫానులో 6,7 చెట్లు పడిపోయాయి. చింతపండు పండిన తరువాత గ్రామం నుండి ఇంటికి ఇద్దరు చొప్పున వెళ్ళి చింతపండు దులుపుతారు. (పురుషులు దులుపుతారు, మహిళలు ఏరుతారు) వచ్చిన చింతపండులో గొడ్ల కాపరికి ఒక వాటా, బారికకు ఒక వాటా, సమిష్టిగా గొడ్డు తినేటప్పుడు వాడుకునేందుకు ఒక వాటా విడిగా తీసి మిగిలినదంతా గ్రామంలో అన్ని కుటుంబాలు సమానంగా పంచుకుంటారు. వీళ్ళకు వచ్చేదే తక్కువ కనుక దీన్ని అమ్మకుండా వుపయోగించుకుంటారు.

✦ ఒక సంవత్సరం ఎక్కువ చింతపండు వచ్చినప్పుడు దాన్ని 6 నెలలక అమ్మి ఉమ్మడి ఆస్తిగా పెద్ద వంట పాత్రలను కొన్నారు. దీన్ని గ్రామంలో సమిష్టి అవసరాలకు ఉపయోగిస్తారు.

✦ మైక్‌సెట్‌ను 10 వేల రూపాయలు పెట్టి కొన్నారు. దీని కోసం గ్రామస్తులంతా గ్రామానికి వచ్చిన ఒక పనిని (ప్రభుత్వ పని) గుత్తగా తీసుకుని ఆ డబ్బులతో కొన్నారు. దీన్ని ఉమ్మడి అవసరాలకు వాడతారు.

✦ గతంలో గ్రామ సమిష్టి అవసరాల కోసం నెలకు 5/-రూ॥లు, కేజి బియ్యం కలెక్షన్ చేసేవారు. అది సరిగ్గా నిర్వహించలేకపోవటంతో మానేసారు. ఇప్పుడు అవసరం వచ్చినప్పుడే కలెక్షన్ చేస్తున్నారు.

✦ గతంలో గ్రామానికి ఏదైనా పని వస్తే కూలిగా గొడ్డు తినేవారు. ఇప్పుడు డబ్బులు తీసుకుంటున్నారు.

### ప్రభుత్వ సంస్కరణలు

✦ 10 సంవత్సరాల క్రితం ఒక తాగునీరు పైపు వేసారు.

✦ చెక్‌డ్యాం (కొత్తగా వచ్చింది పూర్తి కాలేదు), సిసి రోడ్డు, మట్టిరోడ్డు, ఇందిరావస్ ఇళ్ళు ఇచ్చారు.

✦ సిసి రోడ్డుకు 3 లక్షలు సాంక్షన్, గ్రామంలోనే 4గురు కలసి చేసారు. 125/- కూలి ఇచ్చారు.

✦ 2015 డిసెంబర్‌లో చెక్‌డ్యాం 3 లక్షల పని వచ్చింది. 165/-కూలి గ్రామస్తులే చేస్తున్నారు.

✦ ఇందిరావస్ ఇళ్ళు-11 వచ్చాయి. స్వంతపెంకు-7, రేకుల ఇళ్ళు (స్వంత)-19, ఇళ్ళు కట్టే పనికి గ్రామంలో వాళ్ళే కూలికి వస్తారు కనుక మనిషికి 50/-కూలి, మేస్త్రీకి-100/-కూలి ఇస్తారు.

✦ రేషన్‌కార్డులు 26 కుటుంబాలకు వచ్చాయి. ఇందులో 5 కుటుంబాలకు ఒక్కొక్కరికి 2 చొప్పున వున్నాయి. అంటే 31 కార్డులు వున్నాయి. 11 మందికి లేవు.

పెన్షన్ (వృద్ధాప్య) 24 మందికి 300/-చొప్పున వస్తుంది. ఒకరికి వికలాంగ పెన్షన్ 600/- చొప్పున వస్తుంది.

✦ మిని అంగన్‌వాడి ఉంది. గత సంవత్సరం నుండి లాండు (పాస్టర్) భార్య దీదిగా వుంది. 2000/-జీతం ఇస్తారు.

✦ ఈ సంవత్సరం గ్రామానికి లెట్రిన్‌లు కట్టమని వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ముందు స్వంత డబ్బుతో కట్టి దాన్ని ఫోటో తీసి చూపిస్తే, 12 వేలు ఇస్తామన్నారు. కానీ ఎవరూ డబ్బులు లేక కట్టలేదు.

### విడా సంస్థ ద్వారా

✦ ఈ గ్రామానికి విడా వచ్చి 10 సంవత్సరాలు అవుతున్నది. ఈ సంస్థ పెట్టిన బ్రిడ్జి కోర్స్ క్యాంప్‌లో 7వ తరగతి వరకు 8 మంది చదువుకున్నారు.

✦ 20 మంది మహిళలతో 'దేవ్‌మాలి' మహిళా మండలి వుంది. ఎస్‌హెచ్‌జి గ్రూపు ఉంది.

✦ యువజన సంగం వుండేది. ఇప్పుడు లేదు. అప్పుడు 7

సోలార్ లైట్లు ఇచ్చారు.

✦ హేపీస్ అనే సంస్థ ద్వారా చెరువు వచ్చింది (5 సంవత్సరాల క్రితమే)

✦ సంస్థ వాహనం గతంలో మందులు, దోమతెరలు, రగ్గులు ఇచ్చారు. ఇప్పుడు లేదు.

**భూములు**

ఈ ఊరి మొత్తానికి భూమి పట్టాలు 6 ఉన్నాయి. ఒక్కో పట్టా కింద 5,6 కుటుంబాలకు చెందిన భూమి ఉంటుంది. పట్టా ఉమ్మడిగా వున్న భూములను పంచుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో పట్టా ఉన్న/పట్టా లేని బంజరు భూమి అంతా పంచేసుకున్నారు. జనాభ పెరుగుతుంది భూమి సరిపోవటం లేదని అంటున్నారు.

**భూమి పట్టా, ఇంటి పట్టాలకు శిస్తు :–** సంవత్సరానికి ఒక్కో కుటుంబానికి ఏరు వున్న వాళ్ళకు 10/–, ఏరు లేని పార వున్న వాళ్ళకు 5/– చొప్పున ఊర్లో కలెక్షన్ చేసి ఆర్ఐ ఆఫీసులో కడతారు. ఎక్కువ పట్టాలు వుంటే ఎక్కువ శిస్తు కట్టాల్సి వస్తుందనే దాంతోపట్టాలు చేయించలేదని అన్నారు. ఈ సంవత్సరం 170/– శిస్తు కట్టారు.

✦ సంతలో అల్లం, పసుపు, చీపుర్లకు ఆశీలు కడతారు.

ఈ గ్రామంలో ప్రభుత్వానికి సంబంధించిన మహిళా ఎస్‌హెచ్‌జి గ్రూపు (10 మందితో)వుంది. ఇది 3 సంవత్సరాలుగా పని చేస్తున్నది. నెలకు 50/–చొప్పున సున్నాబెడ బ్యాంకులో డబ్బులు కడుతున్నారు. ఇప్పటి వరకూ 30 వేల రూపాయలు ఇస్తే 3 వేల చొప్పున పంచుకున్నారు.

✦ ఇప్పుడు 2 లక్షల రూపాయలు వస్తుందని అంటున్నారు. ఈ గ్రూపు పేరు 'సవరమాడి' మహిళా మండలి.

**రవాణా సౌకర్యం :–** 2 సంవత్సరాల క్రితం సెకండ్ హ్యాండ్‌లో ఈ గ్రామస్తులు ఇద్దరు జాయింట్‌గా కమాండర్ (4 వీలర్)ను 1 లక్షా 80 వేలు (ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కట్టారు) పెట్టి కొన్నారు. డ్రైవర్లు కూడా వీరే. ఈ వాహనం ప్రతి రోజు సిమిలిగూడకు వెళుతుంది. ఆర్‌టి ఆఫీస్‌లో టాక్స్ కడతారు. లాండు (పాస్టర్)కు బైక్ ఉంది.

**మార్కెట్ సంబంధాలు**

క్రయ విక్రయాలకు ప్రధానంగా సిమిలిగూడ, కుందిలికి వెళతారు. ప్రధానంగా వాణిజ్య పంటలు – అల్లం, పసుపు, చీపుర్లు, కందులు సిమిలిగూడలో అమ్ముతారు. కూరగాయలను (అరటి, ఉల్లి, మిర్చి, వంకాయ, టమాట, ముల్లంగి, క్యాబేజి) తినటానికి అమ్మటానికి కూడా వేస్తున్నారు. వీటిని కుందెలి మార్కెట్‌కు తీసుకు వెళతారు. ఇంటి అవసరాల కోసం, ఆహార అవసరాల కోసం సిమిలిగూడ (ఆదివారం), కుందెలి (శుక్రవారం) సంతలకు వెళతారు. ఎప్పుడైనా బంగారం కొనాలంటే మక్కువ (ఆంధ్ర)కు వెళతారు (అక్కడ నాణ్యమైనది, చవకగా వుంటుందని) ప్రస్తుతం వాహన సౌకర్యం వుంది కనుక సంతరోజే కాకుండా ఎప్పుడు అవసరమైతే అప్పుడు వెళతారు.

**కూలి పనులు**

ఈ గ్రామం నుండి ఇప్పటి వరకూ కూలికి వేరే ప్రాంతాలకు వలస వెళ్ళింది లేదు. గ్రామంలో వచ్చే పనులకే (ప్రభుత్వం ద్వారా/ సంస్థల ద్వారా) కూలి చేస్తారు. వ్యవసాయ పనులు సహకార పద్ధతిలో గ్రూపులుగా చేసుకుంటున్నారు. (ఉదా: పోడు నరకటం ఒక కుటుంబంకు సంబంధించిన దానికి అందరూ వెళ్ళి నరుకుతారు. వారికి భోజనం పెట్టాలి. ఇంటికి పెంకులు, రేకులు వేసే పనికి కూడా అందరూ కలుస్తారు. వారికి భోజనం పెడతారు. గ్రామంలోనే కూలి పద్దతి అయితే 50/–చొప్పున ఇస్తున్నారు.

**రాజకీయ అంశాలు**

ఓట్లు ఎప్పటి నుండి వేస్తున్నారో చెప్పలేకపోతున్నారు. కానీ మొదటి నుండీ చెయ్యి గుర్తు (కాంగ్రెస్)కే ఓట్లు వేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ వాళ్ళు ఊరికి ఒక గొడ్డు, సారా ఇస్తేనే ఓట్లు వేసేవారు. మన పార్టీ వచ్చిన తరువాత గతసారి నుండి ఓట్లు వేయటం లేదు. (కంటి పంచాయితి కమిటి పేరుతో తమ ఆర్థిక సమస్యలపై కొన్ని డిమాండ్స్ పెట్టి వాటిని పరిష్కరించకపోతే ఓట్లు వేయమని కరపత్రాలు వేసి ఓట్లను బహిష్కరించారు)

✦ ఎగువ, దిగువ సీందెరికి (రెండు గ్రామాలకు) ఒక్కరే వార్డ్ మెంబర్. మొదట కంటి, దుదారి రెండు కలసి దుదారి పంచాయితిగానే వుండేవి. జనాభ పెరగటంతో కంటి పంచాయితీని వేరు చేసారు.

✦ తెగ పెద్దల అధికారంలో కొంత మార్పు వచ్చింది. తగవులు (పంచాయితీలు), గ్రామానికి సంబంధించి అన్ని కార్యక్రమాలలోనూ పెద్దలతే నిర్ణయాధికారం వుంటుంది. కానీ పూజలు, పండుగలు, పుట్టుక, చావు, పెళ్ళిళ్ళు వగైరా కార్యక్రమాలన్నీ క్రిష్టియన్ సంప్రదాయం ప్రకారం నడుస్తుంటాయి. కనుక అలాంటి వాటిల్లో పాస్టర్‌లదే కీలక పాత్ర వుంటుంది.

**మన పార్టీ పరిచయం :–** 2002లో, మొదట్లో విశ్వాసం లేదు. భయాలు వున్నాయి. చాలా కాలం వరకూ, ఆదివారం పని చేస్తే పార్టీ చేతులు నరికేస్తుందిని ప్రచారం జరిగింది. ఒక గ్రామంలో ఆదివారం బట్టలు ఉతుకుతున్న అక్క మీద పార్టీ వాళ్ళు వేడి నీళ్ళు పోసేసారనీ ప్రచారంతో భయపడేవారు. 2002లో కొరాపుట్ దాడి సందర్భంగాను, 2009లో నాల్కో దాడి సందర్భంగానూ మన పార్టీ అవసరాల రీత్యా మనం ఈ గ్రామంపై (ఈ ప్రాంతంపై) ఆధారపడుతూ మన రాజకీయ ప్రచారం చేసాం. కానీ అక్కడ కేంద్రీకరించి నిర్మాణాలు పెట్టింది 2012లోనే. ఇప్పటి వరకు ఈ గ్రామంలో మనం ఎటువంటి చర్యలు (దేహశుద్దులు, హెచ్చరికలు, మతం వగైరా) తీసుకోలేదు. ఈ గ్రామంపై పోలీసుల దాడి కూడా పెద్దగా లేదు. గత 2 సంవత్సరాల నుండి అంటే మనం కేంద్రీకరించినప్పటి నుండి పోలీసు కూంబింగ్‌లు జరగటం,

గ్రామానికి పోలీసులు రావటం, పోవటం ఉంది కానీ ఇప్పటి వరూ అరెస్టులు, కొట్టటం, ధ్వంసం వంటివి ఈ గ్రామంలో జరగలేదు.

**2. చింతల మంజరి** ***(తెగ-కువ్వి, కుటుంబాలు-33, కంటి పంచాయితి, సిమిలిగూడ బ్లాక్)***

ఈ గ్రామంలో మొట్ట మొదటి తాడంగి సుంద్రు, తాడంగి లచ్చయ్య (తండ్రి కొడుకులు)లు వచ్చారు. వీరు పక్కనే వున్న బొడొమంజరి (అప్పటికే ఏర్పడి వున్నది)నుండి అక్కడ జనాభా పెరిగి పోవటంతో భూమి కోసం వీరు వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. వీళ్ళు ఈ భూమిలోకి రాకముందే చాలా కాలం క్రితం అక్కడ ఆరిక అనే ఇంటిపేరు గలవారు గ్రామంగా ఏర్పడి ఆరిక మంజరి అనే పేరుతో గ్రామం వుండేదట. అయితే వాళ్ళు ఇక్కడ వుండలేక ఆంధ్ర వైపు వెళ్ళిపోయిన చాలా కాలం తరువాత మళ్ళీ తాడంగి వాళ్ళు వచ్చారు. వీళ్ళలో లచ్చయ్య మొట్టమొదటి హవంతగా వున్నాడు. లచ్చయ్యను 'కప్ప' అని కూడా పిలిచేవారు. కనుక ఈ ఊరికి కప్పమంజరి అని కూడా అంటారు. అయితే ప్రభుత్వ రికార్డుల్లో చింతలమంజరి అని పెట్టారు. ప్రస్తుతం ఈ గ్రామంలో 33 కుటుంబాలు వున్నాయి. అందులో తాడంగి-25, మండంగి-2, గెమ్మెలి-2, బ్రాహ్మణ-3, డొంబ-1, వున్నారు. లచ్చయ్య వచ్చిన దగ్గర నుండి చూస్తే ఇప్పటి వరకు 4 తరాలు అయ్యాయి. బొడొమంజరి, చింతలమంజరి, పులుపొదర్ అనే మూడు గ్రామాలకు ఒకటే సరిహద్దు ఇప్పటికీ వుంది. అంటే బొడొమంజరి గ్రామం నుండీ అక్కడ జనాభ పెరగటంతో ఈ రెండు గ్రామాలు వేరుపడినట్లు అర్థమవుతుంది. తాడంగి వారే గ్రామపెద్దలుగా వున్నారు. పాంగి(మండంగి), గెమ్మెలి ఇంటి పేర్లు గలవారు 'మామకువ్వి'లుగా వున్నారు.

**బ్రాహ్మణ కుటుంబాలు :-** మొదట (50 ఏళ్ళ క్రితం) శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం కిమ్మలాంజి అనే గ్రామానికి చెందిన శ్యాంసుందర్ పాఢి అనే బ్రాహ్మణ వ్యక్తి (కొహడకుప్ప పక్క గ్రామం)లో స్కూలు మాస్టరుగా వచ్చాడు. తరువాత చింతలమంజరిలో మాస్టరుగా వుంటున్న క్రమంలో ఈ గ్రామంలో కువ్వి మహిళలను వివాహం చేసుకున్నాడు. ఇతను చనిపోయాడు. ఇతని కొడుకులు ముగ్గురు 3 కుటుంబాలుగా ఏర్పడి స్థిరపడ్డారు. వీళ్ళలో పెద్దవాడు రజనీకాంత్ పాఢి ప్రస్తుతం కొరాపుట్‌లో స్కూల్ ప్యూన్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను బ్రాహ్మణ మహిళనే వివాహం చేసుకున్నాడు. ఈమె (పుష్పరాణి పాఢి) సీందెరిలో అంగన్‌వాడి దీది ఉద్యోగం చేస్తుంది. మిగతా ఇద్దరూ కువ్వి మహిళలనే పెళ్ళి చేసుకున్నారు. వీరు వ్యవసాయమే చేస్తారు. వీరు గొడ్డు మాంసం తినరు. వీళ్ళను పెళ్ళి చేసుకున్న తరువాత కువ్వి మహిళలు కూడా మానేసారు.

**డొంబు కుటుంబం :-** కొర్ర రాజేశ్వరి (55 సంవత్సరాల మహిళ) ఈమె కొరాపుట్ జిల్లా దశమంతపూర్ బ్లాక్ నుండి వచ్చింది. ఈమె భర్త (డొంబొ) బొడొమంజరిలో పాస్టర్‌గా పనిచేస్తుండటంతో ముందు అక్కడకు వచ్చారు. ఈమె 5వ తరగతి చదువుకుంది. 1992లో బొడొమంజరిలో అంగన్‌వాడి దీదిగా ఉద్యోగం వచ్చింది. (ఇర్తుని, చింతలమంజరి, బొడొమంజరిలకు ఒక్కటే అంగన్‌వాడి సెంటర్ ఉండేది) అయితే అక్కడ అంగన్‌వాడి బిల్డింగ్ లేదు. చింతలమంజరిలో కట్టారు. దాంతో చింతలమంజరి అంగన్‌వాడి బిల్డింగ్‌లోనే వచ్చి ఉంటుంది. ఈమె మొదట ఉద్యోగంలో జాయిన్ అయినప్పుడు 270/- జీతం వుండేది. ఇప్పుడు నెలకు 3,500/- ఇస్తున్నారు. భర్త 10 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఇద్దరు కూతుర్లకు పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఒంటరిగా వుంటుంది. ఉద్యోగమే జీవనాధారం. మరో 6 సంవత్సరాలలో రిటైర్ అయిపోతుంది. అప్పుడు ఎలా ? అని అడిగితే....కూతుర్ల దగ్గరకు వెళ్ళి వాళ్ళ పిల్లలను చూసుకుంటాను అన్నది. ఈమె చెప్పిన కొన్ని అంగన్‌వాడి విషయాలు....సిమిలిగూడ బ్లాక్‌లో-180, కంటి పంచాయితీలో-13 మంది అంగన్‌వాడి దీదిలు వున్నారు.

**నిరుద్యోగ సమస్యలు :-** గతంలో 10వ తరగతి, +2 చదివిన వాళ్ళకు సీనియారిటీని బట్టి సూపర్‌వైజర్స్‌గా ప్రమోషన్స్ ఇచ్చేవారు. మోడి సర్కార్ వచ్చిన తరువాత ఇది బంద్ చేసారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయటం లేదు. కనుక రిటైర్ అయినా పెన్షన్ వుండదు.

✦ జీతాలు నెలనెలకు ఇవ్వటం లేదు. 3,4 నెలలకు ఒక్కోసారి 6 నెలలు కూడా దాటుతుంది.

పిల్లలకు (3 నుండి 6 సంవత్సరాల లోపు) ఒక్కొక్కరికి 3 రూపాయలు (ఒకరోజుకి) కేటాయిస్తున్నారు. అవి సరిపోవటం లేదు.

✦ దీదిలకు సంవత్సరానికి ఒకసారి చీరల కోసం 1000/- ఇస్తున్నారు. జీతం డబ్బుల నుండే రోజువారీ చార్జీలకు (మీటింగ్‌లు, ట్రైనింగ్‌లకు) ఖర్చు పెట్టాల్సి రావడంతో అవి సరిపోవటం లేదు.

పై సమస్యలపైన ఒకసారి భువనేశ్వర్‌లోనూ, సిమిలిగూడలోనూ ర్యాలీ చేసినట్లు చెప్పారు.

**మామ కువ్విలు :-** 2 పాంగి వాళ్ళు (లచ్చన్న, లింగు), 2 గెమ్మెలి (కొములు, గందు). వీళ్ళు ఈ గ్రామంలో మహిళలను పెళ్ళి చేసుకుని స్థిరపడ్డారు. వీళ్ళలో కొములికి కువ్వి సాలనగా పెట్టారు. ఇతని భార్య అంగన్‌వాడీ పిల్లలకు వంట చేసే కుక్ ఉద్యోగం చేస్తుంది. ఈమెకు నెలకు 1700/ జీతం వస్తుంది. కొములు గ్రామ సంఘనాయకుడిగా పని చేసాడు. గత సంవత్సరం కల్లు చెట్టు మీద వుండగా పక్కన పిడుగు పడటంతో షాక్‌వేవ్స్‌కి చెట్టు మీద నుండి పడి చనిపోయాడు.

బారిక 'శోభననాగ్' డొంబొ కులానికి చెందిన వ్యక్తి బారికగా 20 సంవత్సరాల నుండి పని చేస్తున్నాడు. ఇతని తండ్రి మొదట పూల్‌పొదర్ ((పక్క గ్రామం)లో బారికగా స్థిరపడ్డారు. కనుక ఇతని నివాసం పూల్‌పొదర్‌లోనే వుంది. అక్కడ వుండి ఈ గ్రామంలో బారికగా పని చేస్తున్నాడు. ఇతను ప్రతీ సంవత్సరం ఈ గ్రామానికి ఒక గొడ్డు, సారా బదులు (క్రిష్టియన్ వచ్చాక సారా ఇవ్వటం లేదు. డబ్బులు ఇస్తాడు. ఈ సంవత్సరం గొడ్డు (8,500), డబ్బులు-900

ఇచ్చాడు. ఇతనికి గ్రామంలో ప్రతిరోజూ ఒక చిన్న గ్లాసులో సోడిపిండి గానీ, సామలు, బియ్యం ఏదో ఒకటి ఇస్తారు. ఇవి రోజుకు 3,4 కేజీలు అవుతాయి. అలాగే 'పొల్లు'గా ఇంటికి 3 కుంచాల (12 కేజీలు) (ఆహారధాన్యాల్లో ఏదో ఒకటి ఇస్తారు) 30/- డబ్బులు ఇస్తున్నారు.

**భూముల వివరాలు**

ఈ గ్రామంలో మొత్తం 13 మంది పేర్లతో భూములు పట్టాలు వున్నాయి. ఈ పట్టాలు ఎప్పటి నుండి వచ్చాయనేది చెప్పలేకపోతున్నారు. ఒక పట్టా క్రింద 5,6 కుటుంబాలు భూమిని పంచుకుంటున్నారు. భూమి వారసత్వంగా వస్తుంది కనుక వారసులు పెరిగే కొద్ది భూమి తగ్గిపోవటం వుంది. ఉదాహరణకు చింతలమంజరి గ్రామంలో తాడంగి లక్కు (హవంత) పేరు మీద మొత్తం 72 ఎకరాల 123 సెంట్లు భూమి వున్నట్లు పట్టాతో వుంది (ఇందులో పొలం 2 ఎకరాల 30 సెంట్ల) అతనికి నలుగురు కొడుకులు. వీళ్ళకు సమానంగా పంచితే ఒక్కొక్కరికి 18 ఎకరాల 30 సెంట్లు వస్తుంది. మళ్ళీ వీళ్ళ కొడుకులకు ఈ భూమిని పంచితే ఇద్దరుంటే ఒక్కొక్కరికి 9ఎ 15 సెంట్లు, ముగ్గురు వుంటే 6 ఎకరాల 10 సెంట్లు వస్తుంది.

పై విధంగా చూసినట్లయితే ఒక పేరుతో వున్న భూమి పట్టా క్రింద ప్రస్తుతం 9 కుటుంబాలు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. ఇందులో వారసులుగా ఒకరే సంతానం వున్న వాళ్ళకు చివరకు 12 ఎకరాల 30 సెంట్లు రాగా, ముగ్గురు సంతానం వున్న వాళ్ళకు 3 ఎకరాల 3 సెంట్లు వచ్చింది.

✦ ఈ గ్రామాలలో తాడంగి గరియ పేరుతో భూమి పట్టా ఉంది (ఎంతో తెలియదు). ఇతనికి వారసులు లేరు. ఇతడు చనిపోయిన తరువాత ఈ భూమిని లివిరి, రమేష్‌లు (హవంత వారసులు) తీసుకుని సాగు చేస్తున్నారు. తాడంగి కాతృ అనే పేరుతో ఒక పట్టా ఉంది. ఇతడు ఊరు వదిలి వేరే ప్రాంతానికి వెళ్ళిపోయాడు. ఈ భూమిని కూడా లివిరి, రమేష్‌లే చేస్తున్నారు. అలాగే తాడంగి ముసురు తాలుకా భూమిని కూడా లివిరి, రమేష్‌లే చేసుకుంటున్నారు.

✦ తాడంగి పూలు, తాడంగి దేర్కు అనే పేర్లతో మరో 2 భూమి పట్టాలు వున్నాయి. వీళ్ళు, వీళ్ళ కొడుకులు చనిపోయారు. వారసులు ఎవరూ లేరు. ఈ భూములను కాను, డొమన అనే ఇద్దరు అన్నదమ్ములు చేసుకుంటున్నారు. వీళ్లకు తమ తండ్రి దస్సు పేరుతో పట్టా భూమి కూడా కొంత వుంది. వీళ్ళు దీసరి కుటుంబానికి చెందిన వారు.

ఈ విధంగా గ్రామంలో ఎవరైనా చనిపోయి, వారసత్వం కూడా లేనట్లయితే, లేక గ్రామం విడిచి వెళ్ళిపోయినా ఆ భూములను గ్రామ పెద్దలకు సంబంధించిన కుటుంబీకులే చేసుకుంటున్నారు. సహజంగానే గ్రామంలో తెగ పెద్దలకు ఎక్కువ భూములు వుంటున్నాయి. ఇలాంటి భూములను కూడా కలుపుకుని ఇంకా పెంచుకుంటున్నారు.

ఈ గ్రామంలో తాడంగి బంగ్రు (ఒస్సాగురు/గురవడు)కి 7 ఎకరాల 80 సెంట్లు భూమి పట్టా ఉంది.

పై విధంగా బంగ్రు వారసులలో రుహిణి, సీరు చనిపోవటం, ముస, సాంబలు ఊరు విడిచి పోవటం వలన వాళ్ళ వాటాకు వచ్చిన భూమితో పాటు ప్రస్తుతం వున్న మల్లు, దొబ్లుల్లో (అన్నదమ్ములు) దొబ్లు చనిపోయాడు కనుక అతని వాటా భూమి కూడా కలిపి మళ్ళీ మల్లుకే 7 ఎకరాల 180 సెంట్ల భూమి దక్కుతుంది. అయితే మల్లుకి ఇప్పుడు 5 గురు కొడుకులు వున్నారు. వీళ్ళకు ఇంకా పెళ్ళిళ్ళు కాలేదు. వుమ్మడిగానే వున్నారు. వీరు పెళ్ళిళ్ళయి వేరు పడితే మళ్ళీ ఆ 7 ఎకరాల 80 సెంట్ల భూమిని పంచుతారు.

✦ 'మామ కువ్వి' లకు అత్తమామలు ఇచ్చిన భూమే వుంటుంది (సాధారణంగా మగపిల్లలు లేనివారే అల్లుళ్ళను ఇల్లరికం తెచ్చుకుంటున్నారు)

✦ ఈ గ్రామంలో పట్టా భూమి కాకుండా ఒనబాది (బంజరు) భూమి కూడా ఉంది. దీన్ని గ్రామ పెద్దల అనుమతితో భూమి లేనివారు, తక్కువ ఉన్నవారు చేసుకుంటున్నారు.

✦ ఏ కారణం చేతనైనా ఈ గ్రామంలో భూమి ఉండి కూడా గ్రామం విడిచి ఎవరైనా వెళ్ళిపోయనట్లయితే, తరువాత ఎంతకాలానికైనా అతని వారసులు (కొడుకులు, మనవలు) వస్తే ఈ భూమి వారికే ఇస్తాం అంటున్నారు.

**క్రిష్టియన్**

✦ 50 ఏళ్ళ క్రితం 'లూథరన్' వచ్చినప్పుడు ఈ గ్రామానికి కూడా విదేశీ ప్రచారకులు వచ్చారు. చర్చి కట్టటం కోసం పునాదులు కూడా వేసారు. వారు చెప్పే మాటలు వినేవారు కానీ విశ్వసించలేదు. ఒకసారి గ్రామంలో అందరూ తాగి డగ్గ పూజ చేయటం, పెజ్జిణిలు తాగి ఆడటం జరుగుతున్న సమయంలో పాస్టరు చూసి ఎంత చెప్పినా వీరు మారరు అని తరువాత రావటం మానేసాడు. అలా లూథరన్ చర్చి పునాదుల దగ్గరే ఆగిపోయిందన్నారు.

✦ 15 సంవత్సరాల నుండి అందరూ క్రిష్టియన్‌లో చేరారు. బొడొమంజరి, పూలుపొదర్, చింతలమంజరి మూడు గ్రామాలకు కలిపి 'అమర జ్యోతి' సంస్థ ఒకటే చర్చి (బొడొమంజరిలో) కట్టారు. ఈ ఊరిలో చర్చి లేదు. పాస్టర్ మాత్రం బొడొమంజరి నుండి ప్రతి ఆదివారం వస్తాడు.

✦ ఈ గ్రామం నుండి ముగ్గురు బైబిల్ ట్రైనింగ్‌కు వెళ్ళి సర్టిఫికేట్ పొందారు. మరొకడు ఈ మధ్యనే గంజాయిబద్రలో ట్రైనింగ్‌కు వెళుతున్నాడు (నెలకు 5 రోజుల ట్రైనింగ్)

✦ లేంగు అనే వ్యక్తి ప్రచిన/పర్చిన్‌గా వున్నాడు. చర్చి లేకపోయినా క్రిష్టియన్ పండుగలు, కార్యక్రమాలకు డబ్బులు వసూలు చేయటం, బద్రపర్చటం చేస్తాడు. ఇప్పటికే ప్రతీ వారం బియ్యం, డబ్బులు

సమిష్టిగా పెడుతున్నారు.

✦ ఆదివాసీ తెగ సాంప్రదాయాల ప్రకారం పూజలు, పండుగలు పూర్తిగా వదిలిపెట్టారు. కానీ వ్యవసాయ పనులకు (విత్తనాలు చల్లటం వగైరా) ముహూర్తం దీసరి చూసి చెబుతాడు. దాని ప్రకారం చేస్తారు. అయితే పూజ చేయరు.

**వైద్యం :–** ఆశాదీది వుంది. ప్రభుత్వ మెడికల్ గాడి అప్పుడప్పుడు వస్తుంది. సం॥నికి ఒకసారి దోమల మందు జల్లుతారు. విడా సంస్థ ద్వారా 3,4 సార్లు దోమతెరలు ఇచ్చారు.

ఒస్సాగురు (చెట్ల మందులు ఇచ్చేవాడు) వున్నాడు. మందులు ఇస్తాడు కానీ పూజ చేయడు. వేరే వాళ్ళను నేర్చుకొమ్మంటే ఈ పనికి సిద్ధపడటం లేదనీ "ఈ పనిలోకి వెళితే మందుల కోసం కొండలు, కొండలు తిరగాలి, ఎవరు ఎప్పుడొచ్చి పిలిస్తే అప్పుడు ఖచ్చితంగా వెళ్ళాలి. ఇంటి దగ్గర ఏ పనీ చేసుకోలేము" అని అంటున్నారని చెప్పాడు.

**విద్య :–** 5వ తరగతి వరకు స్కూలు వుంది, మాస్టర్లు అప్పుడప్పుడు వస్తుంటారు. మెజార్టీ దూరం స్కూల్స్‌లోనే (హాస్టల్స్‌లో) జాయిన్ చేస్తున్నారు.

### 3. గందెరిగండ *(తెగ :మటియ)* ఇండ్లు-22, *గుమ్మండి పంచాయితి, నారాయణపట్నా బ్లాక్*

నారాయణపట్నా ఏరియాలో మటియ తెగకు చెందిన గ్రామాలు, జనాభ చాలా మైనార్టీగా వుంది. వాస్తవంగా ఈ తెగకు చెందిన ప్రజలే మొట్టమొదట నారాయణపట్నా ప్రాంతానికి వచ్చారని వీళ్ళ తరువాతనే కువ్వి తెగ వచ్చిందని చెబుతున్నారు. మట్టిలోనుండి (భూమ్మీద) మేమే మొదట పుట్టామని అందుకే 'మటియా' అంటారని అంటున్నారు. మటియా వాళ్ళే తరువాత వచ్చిన కువ్వి ప్రజలకు ఇక్కడ వుండటానికి 'నీళ్ళ' జాగాలను, భూమిని చూపించారని కూడా అంటారు. అయితే మరి మటియా కంటే కువ్వి జనభా ఎలా పెరిగింది, వాళ్ళే సాపేక్షింగా ఎందుకు అభివృద్ధి అయ్యారు? అన్న ప్రశ్నకు మటియాలు ప్రధానంగా సంచారం చేసేవారని, వేట మీదనే ఆధారపడేవారని, వ్యవసాయం చేసేవారు కాదని, అందువలనే వీరు కొండలు, అడవులు తిరుగుతూ జంతువులను వేటాడటం, దుంపలను తవ్వటం, కాలువల్లో పీతలు పట్టటం వలన వీళ్ళకు ఈ టెర్రయిన్‌పై పట్టు/ఆధిపత్యం, నీళ్ళ జాగాలు అన్నీ తెలిసి వుండటం మొదట వుండేదనీ, కువ్వీ వాళ్ళు వచ్చిన తరువాత వాళ్ళను కూడా కలుపుకోవటం వలన బలం వుంటుందనే ఉద్ధేశ్యంతో వాళ్ళకు భూములను చూపించారని అయితే కువ్వి ప్రజలు వ్యవసాయం చేయటం మొదలు పెట్టారనీ, మటియలు కువ్వి ప్రజల దగ్గర ఆహారధాన్యాలు (సోళ్ళు, సామలు), పొగాకు కోసం వాళ్ళకు భూములను ఇచ్చేసేవారనీ ఈరకంగా మటియా కంటే క్రమంగా కువ్వి ప్రజలు మెజార్టీగా ఈ ప్రాంతానికి రావటం, వ్యవసాయం చేయటం ఆర్థికంగా బలపడటం జరిగిందని, జైపూర్ మహారాజు మొదట మటియా వాడే వుండేవాడనీ, సూదేష్ కొండ మీద కూడా మటియా రాజు వుండే వాడనీ అంటున్నారు. ఇప్పటికీ కూడా 'మటియా' మైనార్టీగా వున్నప్పటికీ 'కువ్వి' తెగను సాంస్కృతికంగా తక్కువ చూస్తారు. 'కువ్వి' వాళ్ళు గొడ్డు మాంసం తింటారని వాళ్ళ ఇళ్ళలో భోజనం చేయరు. 'మటియ'లు గొడ్డు మాంసం తినరు.

✦ మటియల్లో రెండే రెండు ఇంటిపేర్లు వున్నాయి. 1. నాగబొంశొ 2. పూల్‌బొంశ్ అంటారు. ఈ రెండు ఇంటిపేర్లు గలవాళ్ళ మధ్యనే వివాహాలు జరుగుతాయి. వీళ్ళ జనాభ తక్కువగా వుండటం వలన ఒకే కుటుంబాలకు సంబంధించిన వాళ్ల మధ్యనే (మేనరికాలు) వివాహాలు జరగటం మూలంగా 'జీన్స్'లో పెద్దగా మార్పులు వుండకపోవటం వలన పుట్టే పిల్లలు అంగవైకల్యంతోనూ, బుద్ధి మాంద్యంతోనూ వుంటున్నారు. గందెరిగండలో ఒక కుటుంబంలో పుట్టిన ముగ్గురు పిల్లలకూ కళ్ళు కనిపించవు. మరో కుటుంబంలో అమ్మాయి బుద్ధి మాంద్యంతో పుట్టింది. పిల్లలు అనారోగ్యంతో చనిపోవటం కూడా ఎక్కువగానే వుంటుంది. కనుక వీళ్ళు తమ సంతానం, తెగ అభివృద్ధి కోసం ఆపరేషన్లు (ఫామిలి ఆపరేషన్లు) చేయించుకోవటం లేదు.

✦ గందెరిగండలో క్రిష్టియానిటీ లేదు. ఇక్కడే కాదు మటియా గ్రామాల్లో ఎక్కడా క్రిష్టియానిటి లేదు. ఇప్పుడిప్పుడే కొన్ని గ్రామాల్లో వ్యక్తులుగా (కుటుంబాలుగా) క్రిష్టియన్‌లో చేరుతున్నట్లు తెలుస్తుంది. అటువంటి వారు మటియ గ్రామాలకు వచ్చి క్రిష్టియన్లో చేరమని ప్రోత్సహిస్తున్నారు. కానీ తెగ సాంప్రదాయాలు, కట్టుబాట్ల పట్ల వున్న విశ్వాసాలు, భయాలు (క్రిష్టియన్లో చేరితే తమ తెగ నాశనం అయిపోతుందని బలంగా నమ్ముతున్నారు) కారణంగా అందులో చేరటానికి సిద్ధపడటం లేదు. మటియ తెగలో కూడా కువ్వి తెగలో వున్నట్లే సం॥లో 13 పండుగలు చేయటం వుంది. వీరు పందిని ప్రియంగా తింటారు. పూజలకు, పండుగలకు దీన్నే బలి ఇస్తుంటారు. అయితే వీళ్ళలో పందిని తినని 'మటియ' కూడా వున్నారు. వాళ్ళు 'పంది'ని తినే మటియాలను తక్కువ చూస్తారు. వారిని పూజార్లుగా చెబుతుంటారు. ఇతర ఆచార, వ్యవహారాలన్నీ కూడా (పెళ్ళి, పుట్టుక, చావుల సందర్భంగా) దాదాపు కువ్వి తెగలో వున్న విధంగానే వుంటున్నాయి.

✦ 'మటియ' ప్రజలు ఆదివాసేతరులు (షావుకార్ల) దోపిడితో పాటు, కువ్వి తెగ ప్రజల ఆధిపత్యానికి గురవుతున్నారు. గందెరిగండ గ్రామంలో 22 కుటుంబాలలో జనసంఖ్య మొత్తం-100 మంది. వీళ్ళకు వున్న భూమి పొలం 1 ఎకరం (ఒకరి పేరునే వుంది)మాత్రమే వుంది. మెట్ట 9 ఎకరాలు వుంది. అందరూ ప్రధానంగా పోడు వ్యవసాయం మీదనే ఆధారపడుతున్నారు. వ్యవసాయ పరికరాలు ఈ గ్రామంలో 9 ఏర్లు (9 కుటుంబాలకు మాత్రమే) వున్నాయి. వీరి గ్రామ పరిసరాల్లో ( వీరి సరిహద్దు క్రింద) వున్న భూముల్లో కూడా 'మంకిడి' (కువ్వి గ్రామం) గ్రామస్తులే కొండపోడు చేసుకుంటున్నారు. ఈ గ్రామం మీద మంకిడి గ్రామ పెద్దల ఆధిపత్యం వుంటుంది.

**తరువాయి భాగం 33వ పేజిలో...**

పత్రికా ప్రకటన

## ఏప్రిల్ 2, 2018న ఎస్.సి, ఎస్.టి చట్టంలో చేసిన మార్పులకు వ్యతిరేకంగా భారత్ బందు జరిపి, హిందూ బ్రాహ్మణీయ మను-వర్ణ ధర్మ భావజాలంతో విర్రవీగుతున్న మోడీ ప్రభుత్వానికి చెంపపెట్టు పెట్టిన దళిత ఆందోళన కారులకు విప్లవ జేజేలు ! ఈ ఆందోళనలో అసువులు బాసిన యువ కిశోరాలకు విప్లవ జోహార్లు! ఉనా ( గుజరాత్ ) ఉద్యమ స్ఫూర్తితో ఇనుమడించిన ఉత్సాహంతో దళిత శక్తులు, ఇతర పీడిత ప్రజలు, ప్రగతిశీల శక్తులు, విప్లవ శక్తులు ఐక్యమై, కుల వ్యవస్థకు పునాది అయిన అర్ధవలస-అర్ధ భూస్వామ్య, రాజకీయ, ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసి, అందరికీ సమానత్వం, ప్రజాస్వామ్యాన్ని ఇచ్చే నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించాలి!

*ప్రియమైన మిత్రులారా, ప్రజలారా!*

2018, ఏప్రిల్ 2వ తేదీ మన దేశ ప్రజాస్వామిక ఉద్యమ చరిత్రలో గుర్తుంచుకొనదగిన రోజు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత్ బంద్ జరిగిన రోజు. మోడీ ప్రభుత్వం ఇచ్చిన సలహా మేరకు, సుప్రీంకోర్టు ఇద్దరు జడ్జీల బెంచ్ ఎస్.సి, ఎస్.టి చట్టంలో మార్చి 20న సవరణలు చేసింది.

ఎస్.సి, ఎస్.టి చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారనీ, అమాయకుల మీద కేసులు పెడుతున్నారనీ, ఈ చట్టం ద్వారా పెట్టిన కేసులు చాలా వరకు వీగిపోతున్నాయనీ, ఈ కేసులలో శిక్షల శాతం చాలా తక్కువగా వుంటుందని ఆరోపణలు చేసి ఈ చట్టాన్ని సవరించారు. సవరించిన చట్టం ప్రకారం వెంటనే కేసులు పెట్టరాదనీ, దర్యాప్తు అధికారి అనుమతి కావాలనీ, ఒకవేళ అరెస్టు చేసినా బెయిల్‌కు అవకాశం కల్పించే సవరణలు చేశారు. ఈ విధంగా దేశంలో మోడీ ప్రభుత్వం కోర్టులను కూడా తన జేబులో పెట్టుకొని మను ధర్మ భావజాలం వ్యాప్తిలో భాగంగా ఉత్తర భారత దేశంలోని అగ్రవర్ణ కులాలలోని భూస్వామ్య శక్తులను సంతృప్తి పరుచుటకు మార్పులు చేయించింది. సాధారణంగా చట్టాలలో మార్పులు లేదా పాత చట్టాలను రద్దు చేసి, కొత్త చట్టాలను ప్రభుత్వాలు పార్లమెంటులో చర్చల ద్వారా చేస్తారు. వాస్తవానికి ఈ మార్పులు ప్రభుత్వమే చేయవలసి వున్నది. అడిగిన వెంటనే ఇద్దరు జడ్జీల బెంచ్ ఈ మార్పులను చేసింది. కోర్టు చేసిన ఈ సవరణలను దేశంలోని ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు అందరూ నిరసించారు. చివరకు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ చర్యను వ్యతిరేకించారు. ఈ చర్య ద్వారా మన దేశంలో ప్రభుత్వాలు, కోర్టులు, ఇతర రాజ్యాంగ అంగాలు అగ్రవర్ణ భావజాలంతో నిండివున్నాయనీ, రాజ్యాంగ యంత్రాంగానికి బ్రాహ్మణీయ హిందూ భావజాలం వుందని రుజువైంది. దానికి పునాదిగా ఈ దేశంలో అర్ధ వలస, అర్ధ భూస్వామ్య రాజకీయ, ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్నది.

మోడీ నాయకత్వంలోని బి.జె.పి ప్రభుత్వానికి ఆర్.ఎస్.ఎస్ గుండెకాయ. ఆర్.ఎస్.ఎస్ భావజాలాన్నీ, సిద్ధాంతాన్ని బి.జె.పి ప్రభుత్వం కొన్నిసార్లు నర్మగర్భంగా, కొన్నిసార్లు బహిరంగంగానే ప్రచారం చేస్తున్నది. హిందూ-మనువర్ణ సిద్ధాంతం-నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను కాపాడటం దాని కర్తవ్యం. ఈ దేశంలోని పీడిత, దళిత, మైనారిటీ, ప్రజాస్వామిక శక్తులకు ఇది ప్రాణ సంకటం లాంటిది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోరక్షణ చట్టాలు చేసింది. దళితుల ఆహారపు అలవాట్ల మీద దాడి మొదలైంది. దళితుల రిజర్వేషన్ విధానాన్ని రద్దు చేయాలని ఆర్.ఎస్.ఎస్ చర్చలు చేసింది. ఆర్థిక ప్రాతిపదిక మీద రిజర్వేషన్లను కల్పించాలని చర్చలు మొదలుపెట్టింది. మోడీ ప్రభుత్వం ఎస్.సి, ఎస్.టి హాస్టళ్ళను కొన్నింటిని రద్దు చేసింది. స్కాలర్‌షిప్‌ల విడుదలలో జాప్యం చేస్తున్నది. మొత్తంగా విద్యా వ్యవస్థలో ఆర్యుల వర్ణవ్యవస్థలోని విషయాలను చొప్పించాలని ప్రయత్నం చేస్తున్నది. విశ్వవిద్యాలయాలలో ఆర్.ఎస్.ఎస్ భావజాలం వున్నవారిని వైస్‌చాన్స్‌లర్‌లుగా నియామకాలు చేసింది. రిజర్వుడ్ క్యాటగిరిలో ప్రమోషన్లు విశ్వవిద్యాలయ వ్యాపితంగా కాకుండా, డిపార్ట్‌మెంట్‌ల వారిగా అమలు జరపాలని నిర్ణయించింది. కులాంతరంగా ప్రేమించుకున్నవారి మీద హిందూ ఫాసిస్టు మూకలు దాడులు చేస్తున్నాయి. బి.జె.పి పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా గుజరాత్‌లలో దళితుల మీద దాడులు పెరిగిపోయాయి.

ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో యోగి ముఖ్యమంత్రి అయిన తర్వాత అగ్రవర్ణ భూస్వాములైన రాజ్‌పుట్, భూమిహార్‌లు హిందూ బ్రాహ్మణీయ కుల భావజాలంతో రెచ్చిపోతున్నారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, రెవిన్యూ వ్యవస్థలను బి.జె.పి పాలిత రాష్ట్రాలలో భూస్వాములు తమ జేబుల్లో పెట్టుకున్నారు. ప్రభుత్వ చట్టాలను పక్కన పెట్టి భూస్వామ్య పాలనను అమలు జరుపుతున్నారు.

మోడీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అగ్రవర్ణ భావజాలంతో మార్పులు చేస్తోంది. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేములను వైస్ చాన్స్‌లర్ అప్పారావు ద్వారా బ్రాహ్మణీయ హిందూ భావజాలంతో వేధించడం, అవమానాల పాలు చేయడం వలన రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, డిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాల్లో వర్ణ, భావజాలంతో ప్రశ్నించే గొంతులను పీక నొక్కాలని మోడీ ప్రభుత్వం అండతో ప్రయత్నాలు జరుగుతున్నాయి. చెన్నైలోని పెరియార్ స్టడీ సర్కిల్‌ని మూసివేయించారు. సొరాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు, తులసి ప్రజాపతి ఎన్‌కౌంటర్ కేసులలో అమిత్‌షా అరెస్టయి

జైలుకు పోయాడు. ఆ సమయంలో ఉదయ్ ఉమేష్ లలిత్ అమిత్‌షాకు డిఫెన్స్ లాయర్‌గా ఉన్నాడు. ప్రసిద్ధి చెందిన బినాయక్‌సేన్ కేసులో హైకోర్టు ఆయనకు బెయిల్ ఇవ్వడానికి సుముఖంగా వున్నప్పుడు ప్రభుత్వం తరపున ప్రత్యేక అడ్వకేట్‌గా యు.యు లలిత్ ఉండి బెయిల్‌ను వ్యతిరేకించారు. ఇంతటి ఘన చరిత్ర గలిగిన యు.యు లలిత్‌ను, గుజరాత్‌కు చెందిన ఆదర్శ కుమార్ గోయల్‌లను 2014లో మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించింది.

2016 ఆగస్టు నెలలో గుజరాత్‌లోని ఉనా పట్టణంలో జరిగిన సంఘటన దళిత ప్రజాస్వామిక ఉద్యమంలో ఒక మలుపును తిప్పింది. గోవులను తీసుకువెలుతున్నారని నలుగురు దళిత యువకులను ఆర్.ఎస్.ఎస్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు తీవ్రంగా హింసించారు. దీనిని మొత్తం వీడియో తీసి ఇంటర్‌నెట్‌లో పెట్టారు. దీనితో తరతరాలుగా అణిగిమణిగివున్న దళిత ప్రజలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. అహ్మదాబాద్ నుండి ఉనా వరకు 20 వేల మంది ప్రజలు దళిత అస్మిత యాత్రను నిర్వహించారు. 350 కిలోమీటర్ల వరకు మిలిటెంట్ నిరసనలు, బందులు, రాస్తారోకోలు, ర్యాలీలు మొదలగునవి నిర్వహించారు. మనువాద వర్ణ వ్యవస్థలో దళితుల మీద బలవంతంగా రుద్దబడిన వృత్తులను (మిగతా సమాజం చేత నీచ వృత్తులుగా చూడబడుతున్న) బహిష్కరిస్తూ ఉద్యమం పురోగమించింది. చనిపోయిన పశువులను ఉనా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పడవేశారు. చనిపోయిన పశువులను శుభ్రం చేసే వృత్తిని తాము ఇక నుండి బందు పెడుతున్నామని చెప్పారు. సమాజంలో మిగతావారి లాగా సమాన హక్కులతో, గౌరవప్రదంగా జీవించాలనుకుంటున్నామని చెప్పారు. భూస్వామ్య బంధనాల నుండి విముక్తి అయి, స్వేచ్ఛా మానవులుగా బతకాలంటే తమకు సరిపడ భూములను, ఉత్పత్తి సాధనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది కులవ్యవస్థకు ఆధారమైన అర్ధ భూస్వామ్య-అర్ధ వలస, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ పునాదుల మీదకు ఎక్కుపెట్టబడింది. మిగతా దళిత ఉద్యమాలకు, ఈ ఉద్యమానికి ఈ విషయంలో తేడా వున్నది. ఈ ఉద్యమం ఒకప్పుడు అంబేడ్కర్ నాయకత్వంలో నడిచిన మహద్ సత్యాగ్రహం, మహరాష్ట్రలో నడిచిన దళిత పాంథర్‌ల ఉద్యమంలో ఎంత మిలిటెన్సీ ఉండిందో, ఉనా ఉద్యమంలో కూడా అటువంటి మిలిటెన్సీయే కనిపించింది.

మన దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థలో దళితులను పీడిస్తున్నారు, అణచివేస్తున్నారు. అగ్రకుల భూస్వామ్య శక్తులు దీనికి నాయకత్వం వహిస్తున్నారు. 1968లో తమిళనాడులో కీలవేల్మణిలో 44 మంది దళితులను హత్య చేశారు. మన రాష్ట్రంలో కారంచేడు, చుండూరు, పిప్పర, నీరకొండ, లక్ష్మింపేట, పాతపల్లిల నుండి ఇటీవలి పెదగొట్టిపాడు వరకు దాడులు, అణచివేతలు కొనసాగుతున్నాయి. బీహార్‌లో లక్ష్మీపూర్ బాతే, బతానిటోల మొదలైనవి కొన్ని మాత్రమే. ఉత్తరప్రదేశ్‌లో 2015లో 25% దళితుల మీద దాడులు పెరిగాయి. చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్‌లో దళితులు భీమ్‌సేనను స్థాపించారు. వీరు పోలీసులతో ఘర్షణ పడ్డారు. ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నాడని చంద్రశేఖర్‌ను యోగి ప్రభుత్వం జైల్లో పెట్టింది. హైకోర్టు బెయిల్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అతనిని ఎన్.ఎస్.ఎ పెట్టి జైలులోనే ఉంచింది.

2018 జనవరిలో మహారాష్ట్రలోని పూనే జిల్లాలో భీమా-కోరేగావ్‌లో దళితులు పెద్ద పెత్తున సమీకృతులయ్యారు. 200వ సం॥ల క్రితం ఇదేచోట అగ్రవర్ణ పీష్వాల సైన్యాన్ని మహర్ సైన్యం ఓడించింది. ఆ విజయ ప్రేరణను పొందటానికి సంస్మరణ సభలు జరుపుకుంటున్న సందర్భంగా హిందూ ఫాసిస్టు మూకలు దళిత ప్రజానీకంపై దాడులకు దిగారు. దళిత ప్రజానీకం కూడా ప్రతిఘటించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లింది.

మనదేశ జనాభాలో 30 కోట్ల మంది దళితులున్నారు. సుమారు దేశ జనాభాలో 25% మంది వున్నారు. రిజర్వేషన్ల ద్వారా దళితులకు తేలికపాటి ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. చాలా తక్కువ మందికి మాత్రమే అధికార వర్గంలో ఉద్యోగాలు లభించాయి.

మోడీ ప్రభుత్వం జన్‌ధన్‌యోజన, స్టార్టఫ్, స్టాండప్ పథకాల పేరుతో దళిత పెట్టుబడిదారులను 1000 మందిని సమావేశపరిచి వారికి ఋణాలిచ్చామని డోలుకొట్టినా, అంబేడ్కర్ విగ్రహాన్ని లండన్ నగరంలో ప్రతిష్ట చేయించినా, అంబేడ్కర్ జపం చేసినా-ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఏప్రిల్ 2 భారత్ బందునాడు అత్యంత మిలిటెంట్‌గా కదిలి హిందూ ఫాసిస్టులకు ఎదురు నిలబడతామని నిరూపించారు.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రహ్మణీయ -హిందూ, మను-వర్ణ భావజాల ప్రచారం పెరిగింది. అగ్రవర్ణ కులతత్వం పెరిగింది. దీనికి ప్రతిగా దళితుల్లో కూడా ఆత్మగౌరవ చైతన్యం పెరిగింది. దీని ఫలితంగానే ఏప్రిల్ 2న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్, బీహార్‌లలో భారత్ బంద్ రోజు ఎక్కువ మిలిటెన్సీ ప్రదర్శించారు. అగ్రవర్ణ రాజ్‌పుట్‌లకు చెందిన కర్ణిసేన దళిత ప్రదర్శన కారులతో ఘర్షణ పడింది. పోలీసులు కర్ణిసేనను ఏమి చేయకపోగా, దళిత ఆందోళనకారులపై కాల్పులు జరిపారు. 12 మంది ఆందోళనకారులు చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. పద్మావతి సినిమా విడుదల సందర్భంలో రాజ్‌పుట్‌లు కర్ణిసేన అనే ప్రైవేటు సైన్యాన్ని నిర్మాణం చేశారు. దీనికి మోడీ ప్రభుత్వంలోని రాజ్‌నాథ్‌సింగ్ అండదండలు పూర్తిగా వున్నాయి.

పి.ఎస్ కృష్ణన్ అనే రిటైర్డ్ అధికారి ఇలా అంటున్నాడు. "ప్రభుత్వ అన్ని డిపార్ట్‌మెంట్‌లలోనూ, కుల వివక్ష, కుల అణచివేత వున్నది. పీడితుల, పీడకుల ప్రయోజనాలు వేరు వేరుగా వున్నాయి. దళితులకు భూములు పంచే విషయంలో ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా న్యాయం చేయలేదు. అన్ని రాజకీయ పార్టీలలో భూస్వామ్య, దళారీ శక్తులు నిండిపోయాయి. పీడితులు దీనిని ఎదుర్కోవడానికి ఐక్యమై పోరాడాలి".

మన దేశంలో కొనసాగుతున్న నిచ్చెన మెట్ల కులవ్యవస్థ ధ్వంసం కావాలనీ, సాంఘిక సమానత్వం రావాలని దళితుల ఆకాంక్ష. ఇది ఉనా పోరాటంలోనూ, నిన్నటి భారత్ బంద్ వరకు ఈ ఆకాంక్ష కొనసాగుతోంది. ఉనా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు పోవాలి. ఉనా ఉద్యమ్యంలో వారు పెట్టిన డిమాండ్‌లు వ్యవస్థ మూలాలను ఛేదించేవే. దీనిలో ఎటువంటి అనుమానం లేదు. కానీ దీనిని వారు ప్రస్తుత రాజ్యాంగ చట్రంలోనే సాధించాలని లేదా పాలకులను వాటిని అమలు జరపమని డిమాండ్ చేస్తున్నారు. భూస్వామ్య, దళారీ,

నిరంకుశ బూర్జువా వర్గాలు అధికారంలో వున్న నేటి పరిస్థితిలో భూములు, సంపద, వనరులు, ఉత్పత్తి సాధనాలను ప్రజలకు పంచరుగాక పంచరు. ఇంకా 1990ల నుండి నూతన ఆర్థిక విధానాల అమలు ప్రారంభం నుండి పాలక వర్గాల సంపద 1000 రెట్లు పెరుగుతూ పోతున్నది. అట్టడుగున వున్న ప్రజానీకం ఇంకా రోజురోజుకి పేదరికంలో కూరుకుపోతున్నారు.

పైన ఉదహరించిన డిమాండ్ల సాధన కోసం వారు సాయుధ వ్యవసాయక విప్లవంలో భాగం కావాలి. దళిత విముక్తికి మిగతా పీడిత ప్రజల విముక్తికి ప్రత్యక్ష సంబంధం వున్నది. వర్ణ ధర్మం మీద ఆధారపడిన కుల వ్యవస్థ అర్ధవలస-అర్ధభూస్వామ్యం మీద ఆధారపడింది. ఈ వ్యవస్థను ధ్వంసం చేయాలి. దీని పునాదిని ధ్వంసం చేస్తూనే ఉపరితల రంగంలో హిందూ బ్రహ్మణీయ భావజాలం మీద పోరాటం చేయాలి. దానికి సంబంధించిన అనేక రూపాల మీద పోరాటం చేయాలి. మను వర్ణ భావజాలంతో ప్రభుత్వాలు తీసుకువచ్చే చట్టాలకు, విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. దీనిపట్ల ప్రజలలో జాగరూకతను పెంచాలి. సిద్ధాంత భావజాల రంగంలో జరిగే ఈ పోరాటంలో పీడితులు, దళితులు, బలహీనులు, ప్రగతిశీల శక్తులు, అగ్రవర్ణాలలోని పేదలు, విప్లవ శక్తులు అందరూ కలిసి ఐక్యంగా పోరాడాలి.

మన దేశంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం వెలుగులో నూతన ప్రజాస్వామిక విప్లవం కొనసాగుతున్నది. ఇందులో భూస్వామ్య, దళారీ, నిరంకుశ బూర్జువా వర్గాలను అధికారం నుండి కూలదోసి, కార్మిక, కర్షక, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల ప్రభుత్వాన్ని ఏర్పర్చాలి. ఇందులో భూమిలేని రైతు కూలీలు నాయకత్వంలో వుంటారు. అనగా 95% మంది దళితులు ఇందులోకి వస్తారు. అందరికీ సమాన అవకాశాలు, సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సమాన ప్రాతిపదికన నూతన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడుతుంది. సరైన మార్గంలో ఐక్యంగా పోరాడి దుర్మార్గమైన నిచ్చెనమెట్ల కుల-వర్గ వ్యవస్థను ధ్వంసం చేయాలి. కష్టభరితమైనప్పటికీ, ఇదే సరైన మార్గం. ఈ మార్గంలో ప్రయాణం చేసినప్పుడే గమ్యాన్ని చేరగల్గుతాం.

- **కుల వ్యవస్థకు పునాది అయిన అర్ధవలస -అర్ధభూస్వామ్య, రాజకీయ, ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేయాలి.**
- **బ్రాహ్మణీయ-హిందూ ఫాసిస్టు, వర్ణ భావజాలం మీద సిద్ధాంత పోరాటం చేయాలి.**
- **దున్నేవారికే భూమి ఆధారంగా వ్యవసాయక విప్లవాన్నిపురోగమింపజేయాలి.**
- **మను వర్ణ, ధర్మం ఆపాదించిన నీచమైన వృత్తులను త్యజించాలి. దీని మీద విస్తృతంగా ప్రచారం చేయాలి.**
- **అగ్రవర్ణ ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచార ఆందోళనను చేపట్టాలి.**
- **కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి. ప్రచారం చేయాలి. వారికి రక్షణ కల్పించాలి.**
- **దళితుల మీద దాడులకు వ్యతిరేకంగా ప్రతిఘటన ఉద్యమాన్ని నిర్మించాలి.**
- **సి.పి.ఐ (మావోయిస్టు) వర్ధిల్లాలి.**

**విప్లవాభివందనాలతో,**
**ఎ.ఓ.బి-ఎస్.జడ్.సి,**
**జూన్ 2018.**

▲

30వ పేజి తరువాయి భాగం...

**ప్రభుత్వ సంస్కరణల ద్వారా లబ్ధి :-** ఈ గ్రామానికి ఇప్పటి వరకు 19 రేషన్ కార్డులు, 6గురికి పెన్షన్లు, గ్రామానికి కరెంటు, సిసి రోడ్డు (వీధిరోడ్డు) తప్ప ఇంక ఏ రకమైన సదుపాయాలు లేవు. స్వచ్ఛంద సంస్థలు ఏమీ లేవు. స్కూలు లేదు. అక్షరాస్యులు ఒక్కరు కూడా లేరు. అనారోగ్యంకు గురయితే పూజలు, నాటు వైద్యమే ప్రధానం. డాక్టరు, మందులు లేవు. అందుకే ఈ గ్రామానికి సం॥ వైద్యం ఖర్చు (మందులకు) 2000/- మాత్రమే వచ్చింది. పూజలు/పండుగలకు 59,000/-, మత్తు పదార్థాలకు 1,31,438 సం॥ ఖర్చులుగా వున్నాయి. ▲

> "పెట్టుబడిదారులు ప్రజాస్వామ్యంగా చెప్పుకునేది నిజానికి పార్లమెంటరీ రూపం ముసుగును ధరించిన బూర్జువావర్గ నియంతృత్వమే"
>
> **- (మార్క్స్ ఫ్యూయర్‌బాపై సిద్ధాంతం నుండి).**

# 2018 మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినంను

## మహిళలపై జరుగుతున్న రాజ్యహింస వ్యతిరేక పోరాట దినంగా జరుపుకోవాలి!

*ప్రియమైన ప్రజలారా!*

మార్చి 8 గురించి ప్రత్యేకంగా, విశేషంగా వివరించవలసిన అవసరం లేదు. మహిళల హక్కుల కోసం, అధికారం కోసం క్లారాజెట్కిన్ నాయకత్వంలో 1907 మార్చి 8న, కోపెన్‌హగెన్ నగరంలో, విప్లవ మహిళలు సమావేశమై పోరాటపిలుపునిచ్చారు. దీని వెనక కమ్యూనిస్టు పార్టీ, ముఖ్యంగా మహోపాధ్యాయుడు లెనిన్ కృషి ఉండింది. ఆనాటి నుండి నేటి వరకు మార్చి 8 పోరాట హక్కుల దినోత్సవంగా ప్రపంచ వ్యాపితంగా జరుపుకుంటున్నారు.

మన దేశం, బ్రిటిషు సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష అజమాయిషీ నుంచి, అనేక సామ్రాజ్యవాద దేశాల పరోక్ష అజమాయిషీకి మారింది. దాని ఫలితంగా సామ్రాజ్యవాద బంటులైన భూస్వామ్య, దళారీ, నిరంకుశ బూర్జువా వర్గాలకు అధికారం దక్కింది. 70 సం॥ల కాలం గడిచిపోయింది. దేశంలో అనేక ప్రజాస్వామిక పోరాటాలు, మహిళల పోరాటాలు జరిగాయి. వాటి ఫలితంగా అనేక చట్టాలు వచ్చాయి. వాటిని చిత్తశుద్ధితో అమలు జరిపింది లేదు. దీనితో కూడా స్త్రీ, పురుష సమానత్వం ఆచరణలోకి రాలేదు. మన దేశంలోని ప్రభుత్వ యంత్రాంగం, బ్రాహ్మణీయ హిందూమతం భావజాల పునాదిపై పని చేస్తుంది. హిందూమతం, మనువాద భావజాల ఆధారంగా మహిళలకు ఎటువంటి హక్కులను, సమానత్వాన్ని ఇవ్వలేదు. ముస్లీం, క్రిష్టియన్... వగైరా మతాలు కూడా తరతమ స్థాయిలో ఇదే భావజాలాన్ని కలిగి వున్నాయి.

నేడు దేశంలో, ఈ 70 సం॥ల కాలాన్ని పరిశీలిస్తే, ఒక వైపు భూస్వామ్య భావజాలం, దానికి జతగా సామ్రాజ్యవాద భావజాలం జమిలిగా మహిళల అణచివేతను కొనసాగిస్తున్నాయి. కుటుంబం ద్వారా, బాల్యం నుండే మహిళల మీద అణచివేత ప్రారంభమవుతుంది. ఈ యధాతథ స్థితిని నేటి పాలక వర్గాలు పెంచి కాపాడుతున్నాయి. దీని ఫలితంగా మహిళల స్థితి రోజు రోజుకు దయనీయంగా తయారవుతున్నది. ఈ అణచివేతకు వ్యతిరేకంగా మరోవైపున మహిళల పోరాటాలు కూడా కొనసాగుతున్నాయి.

నేడు పట్టణ, మైదాన ప్రాంతాలలో భూస్వామ్య సంస్కృతికి తోడుగా, పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద విష సంస్కృతి వెర్రితలలు వేస్తున్నది. ఈ సంస్కృతి, దాని భావజాలం పెరిగేలా నేడున్న ప్రభుత్వాలు అన్ని విధాల ప్రోత్సహిస్తున్నాయి. ప్రస్తుత వ్యవస్థకు కొమ్ముగాసే కొందరు పెట్టుబడిదారులు, సినిమాల ద్వారా ప్రజల డబ్బును దోచుకోవడమే కాక, యువతలోని బలహీనతలను రెచ్చగొట్టి పక్కదారి పట్టిస్తున్నారు. మహిళలను అందాల బొమ్మలుగా, మార్కెట్‌లో సరుకులుగా చూపిస్తున్నారు. దీని విష ఫలితాన్ని మహిళలు ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్నారు. ప్రేమించలేదని గొంతులు కొయ్యడం, ఈవ్ టీజింగ్‌ను వ్యతిరేకించినందుకు యాసిడ్ దాడులు చేయడం జరుగుతున్నాయి. మరింత వికృతంగా అత్యాచార సంఘటనలను విడియోలుగా తీసి, మహిళలను బ్లాక్‌మెయిల్ చేసి, పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. సెల్‌ఫోన్‌ల ద్వారా అశ్లీల చిత్రాలను పోస్ట్ చేయడం లాంటివి నిత్యకృత్యమైపోయాయి. ఇంటర్‌నెట్ ద్వారా ఫోర్నోగ్రఫీ (సెక్స్ ప్రక్రియను చూపించే సినిమాలు)ని ప్రచారం చేసి యువతను భ్రష్టు పట్టిస్తున్నారు. ప్రకృతి సౌందర్యం కలిగినటువంటి ప్రాంతాలను, టూరిజం అభివృద్ధి చేస్తున్నామనే పేరుతో, సెక్స్ ఇండస్ట్రీని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగానే విశాఖ జిల్లా, అరకు వ్యాలీ, లంబసింగి ప్రాంతంలో టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం పథకాలు వేసింది. అంతకు ముందు నుండే కొనసాగుతున్న వరకట్న హత్యలు, భర్తల వేధింపులు, పని స్థలాల్లో వేధింపులు, అధికారుల లైంగిక వేధింపులు... మొదలగు రూపాల్లో మహిళల మీద అణచివేత కొనసాగుతున్నది.

పైన ఉదహరించిన సంఘటనలకు మూలమైన భావజాలాన్ని, ఈ ప్రభుత్వాలు అరికట్టకపోగా పెంచి పోషిస్తున్నాయి. నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఉత్తరప్రదేశ్‌లో యోగిఆధిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యాక, బెనారస్ యూనివర్సిటీలో అధికార యంత్రాంగం భూస్వామ్య విలువలతో కూడిన ఒక 'ఫర్మానా' జారీ చేసింది. విద్యార్థిని, విద్యార్థులు చీకటి పడిన తర్వాత క్యాంపస్ నుండి బయటకు వెళ్ళరాదని ఈ 'ఫర్మానా' చెబుతుంది. ఈ 'ఫర్మానా'ను యూనివర్సిటీ విద్యార్థిని, విద్యార్థులు తీవ్రంగా ప్రతిఘటించారు.

మరోవైపున వెనకబడిన, ఆదివాసీ ప్రాంతాలలో కూడా మహిళలు తెగ పెద్దల పెత్తనాన్ని, పురుషాధిపత్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఇద్దరు లేక ముగ్గురు భార్యలను కలిగి వుండే పద్ధతులు వున్నాయి. బహిష్ట సమయంలో మహిళలను ఇంట్లోకి రాకుండా చేయడం, మహిళలకు కొన్ని ఆహార పదార్థాలను తినకుండా నిషేధించడం, బాల్య వివాహాలు, బలవంతపు వివాహాలు మొదలైన రూపాలలో పితృస్వామ్య రూపాలు మహిళలపైనా అణచివేతను కొనసాగిస్తున్నాయి.

పోరాట ప్రాంతాలైన చత్తీస్‌ఘడ్, ఆంధ్ర-ఒడిశా బోర్డర్, జార్ఖండ్, బీహార్, కాశ్మీర్ మరియు ఈశాన్య రాష్ట్రాలలో మహిళల మీద వ్యవస్థీకృత హింస, అణచివేతకు తోడుగా ప్రత్యేకంగా ప్రభుత్వ సాయుధ బలగాలు, పోరాట ప్రాంతాలలోని మహిళల మీద అత్యాచారాలను, హత్యలను ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. దండకారణ్యంలో 2005 సల్వాజుడుం నుంచి, నేటి గ్రీన్‌హంట్ ఆపరేషన్ వరకు అత్యాచార హత్యలు ఎన్నో

జరిగాయి, జరిగుతూనే ఉన్నాయి. మణిపూర్‌లో మనోరమ సంఘటన నుండి నేటి వరకు ఇటువంటివే కొనసాగుతున్నాయి. కాశ్మీర్‌లో 2016, 17సం॥లలో కూడా అత్యాచార హత్యలు ఎన్నో జరిగాయి. 2017 అక్టోబర్‌లో కోరాపుట్ జిల్లా, కుందిలి ప్రాంతం, ముస్నాగూడ గ్రామంలో ప్రభుత్వ సాయుధ బలగాలు 8వ తరగతి చదువుతున్న బాలికను అత్యాచారం చేశారు. తదుపరి ఈ ఘటనపై నిరసనలు రావడంతో బయటి ప్రపంచానికి తెలిసింది. తర్వాత ఆ బాలికను సాయుధ బలగాలు తీసుకొని వెళ్ళి, భువనేశ్వర్‌లో తమ అదుపులో వుంచుకున్నారు. ఈ బలవంతపు ఒత్తిడికి తట్టుకోలేక, ఆ బాలిక అంతార్జతీయ బాలికల దినోత్సవం రోజునే ఆత్మహత్యకు పాల్పడింది. విశాఖ జిల్లాలోని, గాజువాక ప్రాంతంలో 2017 నవంబర్ నెలలో డి.ఎస్.పి. రవి, కాకర్ల పద్మ అనే మహిళతో గతం నుండి శారీరక సంబంధాన్ని కొనసాగిస్తూ, విషయం బయటకు పొక్కటంతో ఆమెను హత్య చేయించాడు. 2009లో విశాఖ జిల్లా, ముంచంగిపుట్టు మండలం, బల్లుగూడ గ్రామానికి కూంబింగ్ పేరుతో వెళ్ళిన పోలీసులు, ఆ గ్రామ మహిళలను అత్యాచారం చేశారు. ఈ విషయంపై చివరికి ప్రభుత్వం కేసును కూడా అనుమతించలేదు. అదే విశాఖ జిల్లాలో, వాకపల్లి గ్రామంలో 2007 కూంబింగ్ పోలీసులు చేసిన నిర్వాకం అందరికీ తెలిసినదే. చివరికి 10 సం॥ల తర్వాత సుప్రీంకోర్టు దోషులను విచారించాలంటూ ఆదేశించగా, ప్రభుత్వం, పోలీసులు కలవరపడ్డారు. బాధితుల పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేయడానికి పల్లా త్రినాథరావు అనే వ్యక్తిని హైకోర్టు నియమిస్తే, అతని మీద కూడా ఒక తప్పుడు కేసును మోపారు. కనీసం బూర్జువా కోర్టుకు కూడా వచ్చి నిలబడి కేసును ఎదుర్కొనే ధైర్యం లేక పోలీసులు, ప్రభుత్వాలు ఇటువంటి నీచ, కుట్ర, పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారు. పైన ఉదహరించిన అన్ని సందర్భాలలోనూ, ప్రభుత్వాలు సాయుధ బలగాలను నిర్లజ్జగా కాపాడుతూనే ఉన్నాయి. అసలు పాలకవర్గాల అధికారం, సాయుధ బలగాల మీదనే ఆధారపడి వుంది. ఉద్యమాల అణచివేతలో భాగంగా అత్యాచారాలను, ఒక అణచివేత రూపంగానే ప్రభుత్వాలు అమలు జరుపుతున్నాయి.

పరిస్థితి ఈ విధంగా వుండగా మోడీ ప్రభుత్వం ఇస్తున్న 'బేటీ బచావో బేటీ పడావో' అనే నినాదాలు ఒట్టి డొల్ల అని తేలిపోతున్నది. ఈ ప్రభుత్వాల మరియు ఓట్ల రాజకీయ పార్టీల నాటకాలు ప్రజలకు అర్థమైపోతున్నాయి. ప్రజలలో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. అవి ఉద్యమాలుగా మారుతున్నాయి. వాటిలో కొన్ని లక్ష్యరహితంగా సమాప్తమవుతున్నాయి. కొన్ని ఉద్యమాలను పాలక వర్గాలు తప్పుదారి పట్టించి, తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయి. కొందరు ఈ ఉద్యమాలను సంస్కరణవాద రొంపిలోకి తీసుకువెళుతున్నారు. ఇవి అన్ని కూడా మహిళల సమస్యకు సరైన పరిష్కారాన్ని చూపించకుండా, వారి ఆగ్రహావేశాలను తగ్గించే సేఫ్టివాల్వులుగా పని చేస్తున్నాయి.

సి.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ నాయకత్వంలో (ఛత్తీస్‌ఘడ్) దండకారణ్యం, ఆంధ్ర-ఒడిశా బోర్డర్, జార్ఖండ్, బీహార్, ట్రైజంక్షన్ (కేరళ, తమిళనాడు, కర్ణాటక) మొదలగు ప్రాంతాలలోని, కొన్ని గ్రామాలలో విప్లవ ప్రజా ప్రభుత్వాల(ఆర్.పి.సి)ను ఏర్పరిచారు. ఇవి మహిళా విముక్తి లక్ష్యంతో ముందుకు పోతున్నాయి. ఈ ప్రభుత్వాలలో మహిళలకు సమాన హక్కులతో పాటు, రాజకీయ నిర్ణయాలలో సమాన భాగస్వామాన్ని కల్పిస్తున్నాయి. పితృస్వామ్య భావజాలం మీద నిరంతరాయ పోరాటం చేస్తున్నాయి. దీని ఫలితంగా మహిళలు చైతన్యవంతులవుతున్నారు. మహిళా విముక్తి దిశగా, మొత్తం సమాజ విముక్తి లక్ష్యంగా ప్రయాణమవుతున్నారు. కాబట్టి మహిళా సమస్యకు పరిష్కారం, కుళ్ళిపోయిన భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యవస్థను ధ్వంసం చేసి, నూతన వ్యవస్థను నిర్మాణం చేయాలి. దానిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు భాగస్వామ్యం కావాలి. ఇదే నిజమైన మహిళా విముక్తికి మార్గం.

- ★ **మహిళలపై అమలవుతున్న రాజ్యహింసను ఖండించాలి.**
- ★ **మహిళలు వేలాదిగా ఉద్యమంలోకి కదిలి రావాలి.**
- ★ **పితృస్వామ్య విలువలను, భూస్వామ్య, సామ్రాజ్యవాద విష సంస్కృతిని ధ్వంసం చేయాలి.**
- ★ **వేలాదిగా మహిళలు సంఘాలలోకి రావాలి, పి.ఎల్.జి.ఎ. సైన్యంలో చేరాలి.**
- ★ **వందలాదిగా మహిళలు విప్లవ ప్రజా ప్రభుత్వంలోకి రావాలి.**
- ★ **వాకపల్లి, బల్లుగూడ, కుందిలి గ్రామాల ఆదివాసీ, దళిత మహిళలపై, అత్యాచారానికి పాల్పడ్డ పోలీసులపై విచారణ జరిపి, దోషులను శిక్షించాలి.**
- ★ **నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.**
- ★ **అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం వర్ధిల్లాలి.**
- ★ **సోషలిజమే ప్రత్యామ్నాయమని ఎలుగెత్తి చాటాలి.**
- ★ **సి.పి.ఐ. మావోయిస్టు వర్ధిల్లాలి.**

**విప్లవాభివందనాలతో,**

**ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి,**

**2018 మార్చి 8** — **సి.పి.ఐ(మావోయిస్టు).**

▲

> "కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలనూ, లక్ష్యాలను దాచుకోవడమంటే అసహ్యం. వర్తమాన, సామాజిక పరిస్థితులను సమస్తాన్నీ బలప్రయోగం ద్వారా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవాలను చూసి, పాలకవర్గాలను గజగజ వణకనివ్వండి. కార్మికవర్గం పోగొట్టుకునేదేమిలేదు, బానిస సంకెళ్ళు తప్ప. ఒక ప్రపంచాన్ని వాళ్ళు గెలుచుకోవాల్సి ఉంది."
>
> -(మార్క్స్, ఎంగెల్స్ ఎంపిక రచనలు 63 పేజి)



## వాళ్ళిప్పుడు హుందాగా తమ తలలు పైకెత్తి నిఠారుగా నిల్చున్నారు

# వాళ్ళే ప్రజా గెరిల్లాలు

ఊరినంతా తన పచ్చదనంతో చుట్టేసినట్లుగా పనస, మామిడి, చింత చెట్ల అందాలు. ఆ చెట్లకన్న ఎత్తున కనిపించే ఎత్తైన కొండలు. ఆ కొండలను వదలనన్నట్లుగా ఆ పైనే నీలాకాశం. వీటన్నింటి మధ్యలో మాది ఒక చిన్న గ్రామం. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా, నారాయణపట్నా బ్లాక్ పరిధిలోని, పీల్‌బరి అనే గ్రామంలో, మెజారిటీ కుయి ఆదివాసీ పేదప్రజల కుటుంబాల్లో మాదొకటి. తాత (సొయి) కష్టపడి సంపాదించిన భూమిని మునసబులు, ఆదివాసేతరులు లాక్కోగా, మిగిలిన భూమిని నాన్న (ఆబ) సాగుచేసేవాడు. వ్యవసాయంపైనే ఆధారపడి బతికేవాళ్ళం. 20 గొడ్లు, 15 మేకలు నాన్న సంపాదించిన ఆస్తి. ధాన్యం, సోళ్ళు కాలువకి పక్కనే వేసే ఆలు, ముల్లంగి, వేరుశనగ, బఠానీ, కూరగాయలతో రోజులు గడిచేవి. నాన్నతోపాటు అమ్మ (ఇయ), మేము ఎప్పుడు పొలం పనుల్లోనే మెలిగేవాళ్ళం. మా అమ్మ, నాన్నలకి మేము ఐదుగురం. ఇద్దరు అక్కలు, అన్న, తమ్ముడు. నేను బుధవారం పుట్టానని మా ముసలామె (నాన్నమ్మ-బాయి) బుద్రి అని పేరు పెట్టిందంట. ఆ పేరునే అందరు పిలిచేవాళ్ళు. నాన్నకి నలుగురు అక్కలు, ఇద్దరు తమ్ములు, అక్కల పెళ్ళిళ్ళు నాన్నకి ఊహ తెలిసే నాటికే అయిపోయాయంట. ఇక మునసబు బెదిరింపులు తాళలేక ముసలోళ్ళిద్దరు చిన్నాన్నలను ఇద్దరిని తీసుకొని వేరే ఊరు వెళ్ళిపోయారంట. నాన్న మాత్రం వాళ్ళ బెదిరింపులు భరిస్తూనే అక్కడే వుండిపోయాడు.

మునసబు ఆధిపత్యంతో గ్రామస్తులందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఎవరు కూడా ప్రశ్నించేవారు కాదు. అయితే మా కుటుంబం అప్పటికే ఏడు ఇళ్ళుగా వున్న సంఖ్య అంతా, వీరి బెదిరింపులకు పారిపోవడంతో, చివరకు మా ఒక్క ఇల్లే మిగిలింది. అయినా నాన్న వాళ్ళకి భయపడేవాడు కాదు. ధైర్యంగానే తన పని తాను చేసుకుపోయేవాడు. వున్న మా ఒక్క కుటుంబాన్ని ఎలాగైనా తరిమేయాలని మునసబువాళ్ళ పన్నాగం. చాలాసార్లు నాన్నని "ఊర్లో ఉండి నీ ఒక్కడివి ఏం ఎలగబెడదామని, మీ కుటుంబాలు అన్ని వెళ్ళిపోయాయిగా. మేము ఏం అనకముందే నీవు ఊరు విడిచి వెళ్ళిపోతే మంచిది. ఆ తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత మాది కాదు, సీరియస్‌గా గుర్తుంచుకో" అని వాళ్ళు అన్నారంట. "వాళ్ళు బెదిరిస్తే మనమెందుకు పారిపోవాలి? ఎలాగైనా ఇక్కడే వుండి మన బతుకేదో మనం బతుకుదాం. వాళ్ళపైన ఆధారపడటం లేదుగా" అమ్మతో చెబుతూ ఆవేశపడుతున్నాడు నాన్న. ఇలా రెండు, మూడు నెలలు గడిచాక గుంపుతో కూడిన ఏడు మంది చీకట్లో మా ఇంటికి వచ్చి నాన్నని "వెళ్ళమంటే నీకెంత పొగరురా! మా మాటంటే లెక్కలేదు. ఇప్పటికైనా మించింది లేదు. వెళ్తావా సరే, లేదంటే నీ ప్రాణానికే ప్రమాదం ఆలోచించు" అంటూ నాన్నపై పడి బాగా కొట్టారు. జరిగే సంఘటనను అందరూ చూస్తున్నా, ఆపడానికి మాత్రం ఎవరు ముందుకు రాలేదు. అమ్మ అడ్డుపోతే తన్నుతూ తోసేసారు. ఆ గుంపులో నుండి నాన్న పరుగెత్తుకొని పారిపోయాడు. అయినా వదల్లేదు. ఒకరింట్లో దూరాడు. మనసబు మనుషులు వెళ్ళి ఆ ఇంటి అక్కని అడిగినా, అప్పటికే నాన్న తనని వాళ్ళనుండి కాపాడమని ప్రాధేయపడటంతో, తను నాన్న గురించి చెప్పలేదు. తనను తిట్టి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆమె నాన్నని రహస్యంగా తన ఇంట్లనుండి బయట పడేసింది. అదే రోజురాత్రి నాన్న గొర్కజాల అనే గ్రామానికి పారిపోయాడని మాకు నెల రోజుల తర్వాతగాని తెలియలేదు. ఇంటినంతా వల్లకాడులా మార్చి పోయారు మునసబు మనుషులు. అమ్మ కూలిన రేకుల్ని, చెదిరిన సామాన్లని అంతాసర్ది ఎప్పటి ఇల్లులా చేసింది. మాకున్న ఆస్తితోపాటు పెరిగిన మేకలు, గొడ్లను కసిగా గొడ్డలితో నరికి చంపారు. మా నాన్న లేకపోవడంతో తర్వాత కూడా అమ్మ వాటి గురించి వాళ్ళను అడగలేదు. మమ్మల్ని బతికించినందుకు సంతోషపడింది. నాన్న ఏమైపోయాడోనని ఆ నెల రోజులు అమ్మ పడ్డ వేదన మాటల్లో చెప్పలేను. అంతగా బాధ పడింది. ఇంత జరిగినా కూడా మనసబువాళ్ళు మా ఇంటిని వదల్లేదు. పొలం కెల్లడం పూర్తిగా మానేసింది అమ్మ. మా పొలంలో మునసబు కుటుంబం, వాళ్ళ పనివాళ్ళు తిరుగుతున్నారు. "వాళ్ళతో గొడవ పడి, నేను పొలంలో పని చేస్తే, వాళ్ళు నన్ను బతకనిస్తారా? తండ్రి దూరమైన నా పిల్లలకు నేను కూడా దూరమైతే వాళ్ళ పరిస్థితి ఏంటి?" అని ఆలోచించి వాళ్ళను ఏమి కదిలించలేదు. అటువైపుగా అడవికి వెళ్ళినప్పుడల్లా పొలాన్ని చూసి తాను, నాన్నతో కష్టపడి పని చేసిన రోజులు గుర్తు చేసుకొని బాధపడేది. ఆ సమయంలో తిండి కూడా సంహించేది కాదు అమ్మకి. ఇంటి వెనక వున్న కూరగాయాల తోటకు నిరంతరం సేవ చేసేది. దాని పని లేని సమయాల్లో అడవికి మమ్మల్ని వెంట పెట్టకొని వెళ్ళేది. అడవిలో దొరికే దుంపలు, వెదురు, కర్రలు తెచ్చుకునేవాళ్ళం. ఎప్పటిలాగే ఒకసారి అడవికి వెళ్ళాం. నాన్న వచ్చి ఎంతసేపయ్యిందో తెలియదు. మా కోసం చాలాసార్లు అడవికి వచ్చాడంట కాని మేము, నాన్న ఎప్పుడు కలుసుకోలేదు. ఒక్కసారిగా అందరం వెళ్ళి నాన్నను గట్టిగా పట్టుకున్నాం. మమ్మల్ని వదిలి ఎక్కడికి వెళ్ళొదని అక్క, అన్న ఏడుస్తున్నారు. అప్పటికి నేను ఎక్కువ సమయాన్ని అమ్మతోనే

గడిపేదాన్ని కాబట్టి నాన్న గురించి నాకేం అర్థం కాలేదు. అమ్మ మాత్రం నాన్న వెళ్ళాక జరిగిన పరిణామాల గురించి చెప్తున్నది. మా కోసం తెచ్చిన జావను నాన్నకి పోసి, మిగిలిన దాన్ని మాకు సర్దింది. అప్పుడే పెద్ద మొత్తంలో వున్న మునసబు గొడ్లు, మేకల గుంపు అటువైపుగా రావడంతో "ఇంకోసారి కలుద్దాం" అంటూ నాన్న వెళ్ళిపోయాడు. నాన్న ఊరు విడిచి వెళ్ళాక రెండు, మూడు సార్లు అడవిలోనే కలిసాడు. నాన్న మాతో లేని రోజులల్లో పక్కవాళ్ళు కూడా మునసబు భయానికి మాతో మాట్లాడేవారు కాదు. మా ఐదుగురితోనే గడిపేది అమ్మ. నాన్న వెళ్ళినప్పటికే ఇంట్లో కొన్ని సోళ్ళు, సామబియ్యం వున్నా, మూడు నెలలకల్లా పూర్తిగా అయిపోయాయి. ఆ తర్వాత అమ్మ నిలువ చేసిన మామిడి, పనస పిక్కలు, వెదురు కొమ్ములు ఉడికించి ఇచ్చేది. నెల తిరక్కుండానే ఇవి కూడా ఐపోయాయి. జావ కావాలని మేము ఏడవని రోజంటూ లేదు. మా ఏడుపు భరించలేక అమ్మ ఒక్కతే అడవికి వెళ్ళి రెండు, మూడు రకాల దుంపలు తెచ్చి మా ఆకలి తీర్చేది. మునసబు భయానికి ఎవరు పనికి పిలిచేవారు కాదు. ఉన్న పొలం వాళ్ళ చేతుల్లోనే. ఏమి చేయలేని పరిస్థితి. అడవిపై ఆధారపడటం తప్ప గత్యంతరం లేకపోయేది. కానీ ఆ ఆరు నెలలు మా కోసం అమ్మ పడ్డ కాష్టాలు మాత్రం ఇప్పటికీ గతాన్ని గుర్తు చేస్తాయి.

సరిగ్గా అర్థసంవత్సరం గడిచాక నాన్న నుండి కబురు. వచ్చిన వ్యక్తి అమ్మతో ఏం మాట్లాడాడో తెలియదు కానీ, ఆ సాయంత్రానికి మా ప్రయాణం ప్రారంభమైంది. చీకటి పడే సరికి గొర్కజాల ఊర్లో నాన్న కళ్ళముందున్నాం. ఆ ఊర్లో మొత్తం మా కుటుంబానికే చెందిన వాళ్ళని తాత మాకు చెప్పాడు. అప్పుడు తెలిసింది, మునసబు బెదిరింపులకు పారిపోయిన మా ఏడు కుటుంబాలు ఇక్కడికే చేరుకున్నాయని. అమ్మ, నాన్న, మేము ఐదుగురం. మా బతుకుదెరువు గురించి ఆలోచించిన (మా ఏడు కుటుంబాల వారు) ఊరివాళ్ళు పోడు చేసుకోవడానికి భూమి ఇచ్చారు. తోటి మిత్రులతోపాటు తాతవాళ్ళ గొడ్ల వెనక నేను పోయేదాన్ని. చిన్నాన్నలిద్దరికి పెళ్ళి కాకపోవడంతో ఇంట్లో పెద్ద సమస్యలు వచ్చేవి కావు. అన్ని పనులు అమ్మే చేసేది. అమ్మకు అక్కలిద్దరూ సహకరించేవాళ్ళు. మా అందరికన్నా పెద్దవాడైన అన్న జ్వరం బారిన పడటంతో నాటువైద్యం అందించారు తాతవాళ్ళు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే, చెట్ల మందులు ఇవ్వడమే చూసా. అదే మందులు అన్నకి తాత ఇచ్చాడు. 15 రోజులు తిరక్కముందే అన్న చనిపోయాడు. అన్న ఒక్కడే కాదంట. ఆ చుట్టు పక్కల గ్రామాల్లో అనేక మంది జ్వరాల బారిన పడి మరణిస్తున్నారంట. "ఈ మరణాలకు కారణం సర్కారు మనపై చూపే నిర్లక్ష్యమే కారణం. ఈ సారి ఓట్లకోసం వచ్చే నాయకులను మన గ్రామాల్లో అడుగు పెట్టనిచ్చేది లేదు" అంటూ తన తోటివాళ్ళతో చెబుతున్నాడు చిన్నాన్న (పాబు). చిన్నన్న మాటలు అర్థం కాలేదు కానీ, కోపంగా అనే మాటలను బట్టి రాజకీయ నాయకులు కూడా మునసబులలాంటి వాళ్ళే అనుకున్న.

చిన్నాన్నకి పార్టీ ఎప్పటి నుండి పరిచయమో తెలియదు గానీ, ఇంటికి రాక వారం రోజులవుతుందని నాన్నమ్మ ఇంట్లో అందరిమీద మండిపడుతున్నది. తెలిసినవాళ్ళందరిని అడిగింది. అయినా ఆయన జాడ తెలుసుకోలేకపోయింది. వారం తిరిగాక తనే ఇంటికొచ్చాడు. ఎక్కడికెల్లాడో ఏమి చెప్పలేదు. సాయంత్రం తీరిగ్గా కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాడు. నాన్న పలకరిస్తూనే వెళ్ళాడు చిన్నాన్న దగ్గరికి. మాటలు కలుపుతూ అసలు విషయాన్ని అడిగాడు. నాన్నకు మాత్రం నిజం చెప్పాడు. మనలాంటి ఆదివాసీ, పీడిత ప్రజలకోసం పని చేస్తున్న పార్టీవాళ్ళను కలిసాననీ, ఈ వారం రోజులు వాళ్ళతోనే వున్నానని చెప్పాడు. విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు నాన్న. చిన్నాన్న ఎక్కువ సమయాన్ని పార్టీ వాళ్ళతోనే గుడుపుతున్నాడు. వివిధ గ్రామాలలో వాళ్లు నిర్వహించే మీటింగ్‌లకు వెలుతూ, తన తోటివారిని భాగస్వాముల్ని చేస్తున్నాడు.

చిన్నాన్న వెళ్ళడమే కాకుండా, వాళ్ళను మా ఊళ్లోకి తీసుకొని వచ్చి మీటింగ్‌లు నిర్వహిస్తున్నాడనీ కోప్పడుతుంది నాన్నమ్మ. "భూస్వాముల, ఆదివాసేతరుల చేతిలో నలిగిపోతున్న ప్రజలందరికీ అందుకు గల పరిష్కారం వారికి ఎదురు నిలిచి పోరాడాలనీ, ఐక్యంగా వుంటేనే పోరాడటానికి బలం చేకురుతుంద"నే విషయాలను మీటింగ్‌లో మాట్లాడారని వంట చేస్తున్న అమ్మతో చెబుతున్నాడు నాన్న. నేను అమ్మ పక్కనే వున్నప్పటికీ ఆ విషయాలేవి నా బుర్రకి తట్టలేదు. చిన్నాన్న పార్టీవాళ్ళు పెట్టిన సంఘంలో కూడా పని చేస్తున్నాడంట. చాలా రోజుల తర్వాత మాకు తెలిసింది. చిన్నాన్న ద్వారా నాన్నకు కూడా పార్టీ పరిచయం అయ్యిందని ఇద్దరు అక్కడే వుంటున్నారనీ, ఇంటిపని, పొలంపని తన వంతయ్యిందని అమ్మ గొడవ అమ్మది. పార్టీ మీటింగ్‌లు, చిన్నాన్న, నాన్న పార్టీలో పని చేయడం....వీటి గురించి ఎవరినైనా అడిగి తెలుసుకుంటే బాగుండని మనస్సులో ఘర్షణ. నాన్ననే అడిగితే బాగుంటుదని నిర్ణయించుకున్న. కాని అడగడానికి భయం. పార్టీ పేద ప్రజల కోసం పని చేయడం అమ్మకి ఇష్టంలేక కాదనీ, ఎంతో కొంత ఇంటి పని గురించి కూడా పట్టించుకుంటే బాగుంటుదని అమ్మ బాధంత. అదే విషయాన్ని నాన్నకి అన్నం పెడుతూ చెప్పింది. అమ్మ అనుకున్నట్లుగానే తనకు పొలం పనుల్లో సహకరిస్తూనే, పార్టీపనిలో చురుగ్గా పాల్గొంటున్నాడు నాన్న. ఊర్లో జరిగే మీటింగ్‌లకు నాన్నతో పాటు, అమ్మ కూడా వెళ్ళడం మొదలపెట్టింది. పార్టీ గురించి ఇంట్లోవాళ్ళు, బయటివాళ్ళు చెప్పుకుంటుంటే నాకు ఈ సారి నాన్నని భయపడకుండా కచ్చితంగా అడగాలని మనస్సులో దృఢంగా నిర్ణయించుకున్న.

ఆకాశంలో చుక్కలు మినుగుమినుగుమంటున్నాయి. నాన్న వాటిని లెక్కపెడుతున్నట్లుగా పగుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. మెల్లమెల్లగా నాన్న దగ్గరికి వెళ్ళి కూర్చున్న. 'నాన్న పార్టీ అంటే ఎలా వుంటుంది? అసలు అది ఏం పని చేస్తుంది? నీవు, చిన్నాన్న వాళ్ళ దగ్గరికి ఎందుకు వెలుతున్నారు?' అని వెంటవెంటనే నేనడిగిన ప్రశ్నలకు నవ్వుతూ దగ్గర కూర్చోబెట్టుకొని "మన భూములు గుంజుకొని, మనకు తిప్పలు పెట్టిన, మన ఊరి మునసబ్ లాంటి

వాళ్ళకు వ్యతిరేకంగా పార్టీ మనలాంటి పేద ప్రజలను కూడగడ్తుంది. సంఘం పెట్టి మునసబ్‌ల పెత్తనాన్ని దెబ్బతీస్తుంది. సంఘం నాయకత్వంలో మనలాంటి పేదవాళ్ళం మునసబ్‌ల నుండి భూములతో పాటు, అధికారాన్ని కూడా గుంజుకుంటాము. మన గ్రామంలో కూడా పోరాటం చేయాలనుకుంటున్నాము" అంటూ అప్పటికే నాన్న కోసం వచ్చిన వ్యక్తిని తీసుకొని ఊర్లోకి వెళ్ళిపోయాడు.

నాన్న పార్టీవాళ్ళతో ఏం మాట్లాడాడో తెలియదుగానీ, వెంటనే ఇంటికొచ్చి అమ్మతో "మనం పాతఊరు పీల్‌బరికి వెలుతున్నాం. రేపే మన ప్రయాణం. అన్ని సర్దిపెట్టు, ఈ రాత్రికి నేను కలవాల్సిన వ్యక్తులను కలిసొస్తా, ఆలస్యం అవుతది, అన్ని సర్ది పడుకొండి" అంటూ వెళ్ళిపోయాడు. ఎప్పుడొచ్చి పడుకున్నాడో తెలియదు. ఉదయాన్నే మా మధ్యలో నాన్న. అన్ని సర్ది, సడన్‌గా నాన్న ఎందుకు అలా అన్నాడో ఆలోచిస్తూ కూర్చున్నది అమ్మ. నాన్నమ్మ, తాత వెళ్ళొద్దని బాధపడుతున్నారు. వెళ్ళక తప్పదంటూ వాళ్ళకి సర్దిచెప్పి మమ్మల్ని వెలదాం అన్నట్లుగా కనులు సైగ చేసి, ఒక చేతితో తమ్ముడి చేయి, మరో చేతిలో సంచి పట్టుకొని నాన్న ముందు నడవగ, తన వెనకే మేము అడుగులేసాం.

ఆశ్చర్యమేమిటంటే పాతఊరు ముందులా లేదు. పార్టీ ప్రభావమే కారణమని నాన్న అమ్మతో చెబుతున్నాడు. ఊర్లో పార్టీ పెట్టిన సంఘంలో నాన్న చురుగ్గా పని చేస్తున్నాడు. మా పరిస్థితి గురించి అన్ని విషయాలు తెలిసిన పార్టీ, ప్రజల ఆధ్వర్యంలో మునసబు కుటుంబంతో మాట్లాడి, వారిని నిలదీసి మా భూమిని మాకిప్పించింది. అయితే ఆ రోజు రాత్రి నాన్న పెద్ద కథే చెప్పాడు మా ఐదుగురికి. ''నారాయణపట్నా బ్లాక్‌లోని అనేకమంది ఎక్కడెక్కడినుండో ఇక్కడికొచ్చిన ఆదివాసేతరులు మన ప్రజల భూములను కబ్జా చేసుకున్నారు. భూములను ఆక్రమించుకున్న వారిలో బ్రాహ్మణులు, కోమట్లు, సుండీలు, డోంబాలు వున్నారు. ప్రధానంగా ఎక్కువ భూములను ఆక్రమించుకున్నవాళ్ళు, మనపై ఆధిపత్యం చెలాయించినవాళ్ళు కోమట్లు, సుండీలు. డోంబుల్లో ఎక్కువ శాతం పేదలే. వీరంతా సారా వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తూ, అనేక మంది ఆదివాసీ ప్రజలను సారాకి బానిసలుగా చేసి, వాళ్ళ భూములను లాగేసుకున్నారు. మరికొందరు ఆదివాసేతరులు తమ పొలాల్లో, ఇంటిలో మన కుయి ప్రజలచేత వెట్టిచాకిరి చేయించుకున్నారు. అయితే వీరి ఆటలు పార్టీ వచ్చాక సాగలేదు. గత రెండున్నర సంవత్సరాల నుండి పార్టీ ఆధ్వర్యంలో నారాయణపట్నా బ్లాక్‌లోని అన్ని గ్రామాల ప్రజలందరిని ఏకం చేసి, ఛసి మూల్యా సంఘం పెట్టి భూస్వాములకు వ్యతిరేకంగా భూపోరాటాన్ని ప్రారంభించింది. ఈ పోరాటంలో ముఖ్యంగా అనేక మంది ఆదివాసేతర, భూస్వాముల దగ్గర వున్న భూములను, భూమిలేని నిరుపేద, స్థానిక ఆదివాసీ ప్రజలకు పంచింది. అనేక మంది ప్రజా వ్యతిరేకులైన తెగ పెద్దలను ప్రజల్లో పెట్టి, వారికున్న పదుల సంఖ్యల్లో భూమిని స్వయంగా వారే ప్రజలకిచ్చేలా చేసింది. అలా ఇవ్వనివారిని ప్రజలే తిరగబడి, పార్టీ సంఘాల నాయకత్వంలో మునసబుల భూముల్లో ఎర్రజెండాలు పాతారు. పార్టీ తీసుకున్న ఈ క్యాంపెయిన్ ప్రజా శత్రువుల్లో భయం పుట్టించడం, కొందరు ప్రజల తిరుగుబాటుకు సరెండర్ అయ్యి, తమ ఆస్తులను ప్రజలకు అప్పజెప్పడం, మరికొందరైతే ప్రజల పోరాట చైతన్యాన్ని జీర్ణించుకోలేక పారిపోవడం.... మొదలైన అనేక రకాల మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ మన బ్లాక్‌లోని ప్రజలు ఈ క్యాంపెయిన్ కొనసాగిస్తున్నారు. ఎర్రజెండాలు పాతిన భూములలో ప్రజలందరూ సమిష్టి వ్యవసాయం చేసి, పండిన పంటను సమిష్టిగా పంచుకోవాలని పార్టీ నిర్ణయించింది. పార్టీ మన ప్రజల క్షేమం కోరి తీసుకున్న ఈ నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యం కావడంతో, ఇప్పుడు సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో పెద్దలు, పిల్లలు అందరు పాల్గొంటున్నారు. సమిష్టి పనుల్లో మన అందరి బాధ్యత వుంది. మనం కూడా పాల్గొనాలి. అయితే పార్టీ మరో విషయాన్ని గుర్తు చేసింది. పార్టీ ఆధ్వర్యంలో భూములైతే ప్రజల పరం అయ్యాయి కానీ, శత్రువు చాలా బలమైనవాడు కదా! వాడి కాపలా కుక్కలైన పోలీసు బలగాలతో మన ప్రజల్ని చంపి, మన వరం అయ్యాయనుకుంటున్న భూములను వాడు వశపరచుకోవచ్చు. అందుకనే డిసెంబర్ 2వ తారీఖున జరిగిన పి.ఎల్.జి.ఎ వారోత్సవాల్లో భాగంగా పార్టీ ఓ ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేసింది. అదేమిటంటే 'మనం పెద్దాళ్ళ పెత్తనాన్ని ఎదిరించడం, వ్యాపారుల మోసాన్ని అరికట్టడం, భూస్వాముల నుండి భూములు స్వాధీనపర్చుకోడం వంటివి చేశాం. ఇవన్నీ మంచి పరిణామాలే. సాధించుకున్న భూములను నిలబెట్టుకోవాలంటే మనం తుపాకలు పట్టుకోవాలి. పోలీసులతో లడాయి చేయాలి. అందుకు గెనొబాహిని మిలీషియాలోనూ, దళంలోను చేరాలి. పార్టీ ఇచ్చిన పిలుపుకనుగుణంగా మన పాకెట్ నుండి 30 మందిని పంపాల"ని నాన్న చెప్పిన విషయానికి "మన ఇంట్లో ఎవరు?"అని ప్రశ్నించింది అక్క (నాన). ''ఊర్లో అందరు పంపుతామన్నారు కానీ పేర్లు ప్రకటించలేదు నేనైతే సంఘం అధ్యక్షుడిగా నానుండే ప్రారంభించాలనుకున్న. మన ఇంట్లో బుద్రిని పంపాలనుకున్నాం. ఇంట్లో ఎవరికి ఇష్టం లేకున్న తను వెలుతుంది" అని అమ్మ ముఖం చూస్తునే చెప్పాడు నాన్న. "ఇప్పటికే పొద్దు పోయింది పండుకోండి. నాకు మీటింగ్‌కు వెళ్ళాల్సిన అవసరం కూడా ఉంది" అంటూ చిన్నాన్నతో మాట్లాడుకుంటూ గుంపుగా కూర్చున్న ప్రజలదగ్గరికెళ్ళాడు. నాన్న సంఘంలో చేరకముందు ఇలాంటి విషయాలు ఎప్పుడు చెప్పలేదు. 14 సంవత్సరాలు పైబడుతున్న నాకు, మొత్తంగా నాన్న చెప్పిన ఇన్ని విషయాల్లో చాలా మేరకు అర్థమయ్యాయి. ఇంతకు ముందులా మునసబుకు భయపడి దొంగచాటుగా మాతో మాట్లాడేవారందరూ ఇప్పుడు ధైర్యంగా, ఏకంగా మా ఇంటికి వచ్చి తమ సమస్యలను నాన్నతో చెప్పుకుంటున్నారు. పార్టీ పెట్టిన సంఘాలు ఊర్లో చురుగ్గా పని చేస్తున్నాయి. వారి కార్యకలాపాలతో మోడుబారిన చెట్టు తొలకరి వర్షాలకు కొత్త చిగుళ్ళతో తన సౌందర్యాన్ని వెదజల్లుతున్నట్లుగా

వుంది ఊరి వాతావరణం. ఈ పనులన్నింటిలో నేనెప్పుడు భాగమవుతానని బాగా కుతూహలంగా వుండేది.

ఊర్లో మీటింగులు పెట్టడంతో పాటు, పాటలు కూడా పాడుతున్నారు. ఆ పాటల శబ్దం వినబడితే చాలు వెంటనే మీటింగ్ స్థలానికి చేరుకునేదాన్ని. కాని మొదటిసారి మాత్రం ఎరుపు, తెలుపు రంగులు కలిసిన వాళ్ళ వస్త్రాధరణ, చేతిలో ఎర్రజెండా, కాళ్ళకి మువ్వలు, డప్పు కొడుతూ వందల మందిలో దరువేస్తూ, పాటలు పాడుతున్నారు. వాళ్ళ వేషాధరణ, పాడే పాటలు వింటుంటే వెళ్ళి వారిపక్కన పాడాలనిపించేది. ఆ విధంగా నాలో పడిన ముద్ర వాళ్ళెప్పుడొచ్చినా నన్ను ఆకర్షించేది. నా వయస్సుగల వాళ్ళందరికీ మా ఊరి పరిసర ప్రాంతంలోకి పార్టీ వచ్చినప్పుడు పాటలు నేర్పించే కార్యక్రమం పెట్టుకొని నేర్పిస్తున్నారు. అలా నేర్చుకున్న పాటలను ఇంట్లోవున్నా, పని చేసినా ఎప్పుడు పాడేదాన్ని. నాన్న నా పాటలు చూసి, పాడించుకొని మురిసిపోయేవాడు. ఓ రోజు పార్టీవాళ్ళు వచ్చారనే వార్త నాన్నకి కబురొచ్చింది. వెంటనే నేను పాటల కోసం పరుగుతీసా. అప్పటికే పాటలు పాడుతూ పార్టీవాళ్ళు మీటింగ్ ప్రారంభించారు. అందులో నుండి ఒక మహిళా నా దగ్గరికి వచ్చి "మొన్న మేము నేర్పించిన పాట ఇప్పుడు మీటింగ్‌లో పాడతావా" అని అడిగింది. సరేనన్నట్లుగా వెంటనే తల ఊపాను. ప్రజలందరొచ్చారు. మీటింగ్ ఊపందుకుంటుంది. రమ్మన్నట్లుగా చేయితో సైగ చేసింది. తననుసరిస్తూ వెళ్ళి చాలా ఉత్సాహంగా పాట పాడాను. మీటింగ్ అయిపోయిన తర్వాత నేను ఇంటికి వెలుతున్న క్రమంలో నా వెనకాలే ఎప్పుడొచ్చిందో తెలియదు. భుజం తట్టి "లాల్‌సలామ్ కామ్రేడ్ బుద్రి చాలా ధైర్యంగా పాడావు తెలుసా, మరీ మనకు పాటలు పాడే సంఘం జి.ఎన్.ఎస్ (గొనొ నాట్య సంఘ్)లో చేరతావా" అంది. అంటే అని అడిగా "జి.ఎన్.ఎస్ అంటే 'గొనొ నాట్య సంఘ్'. పాటల ద్వారా ప్రజలను ఐక్యం చేసి, మన పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవారెవరికైనా సరైన బుద్ధి చెబుతుంది. అంతే కాకుండా నీకిష్టమైన పాటలు నేర్చుకోవచ్చు, పాడొచ్చు, మళ్ళీ మనం కలిసే వరకు ఆలోచించు, వెళ్ళొస్తాం బుద్రి" అంటూ చేతిలో వున్న తుపాకిని భుజానికి తగిలించుకొని, చేయి కలిపి మరోసారి లాల్‌సలామ్' అని చెప్పి వెళ్ళిపోయింది. నవ్వుతూ ప్రేమగా తను మాట్లాడిన విషయం, ఆప్యాయంగా చేయి కలిపి లాల్‌సలామ్ అని చెప్పిన కొత్త మాట మళ్ళీ మళ్ళీ నాకు గుర్తొస్తున్నాయి. సరిగ్గా పదిరోజుల తర్వాత వచ్చిన తనకి మొదట కలవగానే 'నేను పాటల సంఘంలో చేరతాను' అని మనసులో వున్న మాటను తనకు చెప్పా. ఆ రోజు నుండి నా సంతోషం రెట్టింపయింది. విషయం నాన్నకి చెప్పా. "చేరగానే సరిపోదు మరి, వాళ్ళలాగే బాగా నేర్చుకొని పాడాలి'' నా నవ్వుతోనే సరేనన్నట్లుగా సమాధానమిచ్చా. వాకిట్లో గొడ్ల పేడ తీస్తున్న అమ్మకి మాత్రం బాగా కోపం వచ్చింది. ఇప్పటికే నాన్న సంఘంలో పని చేయడం, చిన్నాన్న పార్టీ పనులతో ఇంటిని అసలే పట్టించుకోకపోవడం, అక్క నాన్నతో మీటింగ్‌లకి వెళ్ళడం, మరో చిన్నాన్న మిలీషియా పనుల్లో పాల్గొనడం, ఇప్పుడు మళ్ళీ నేను జి.ఎన్.ఎస్.... ఒక్కసారిగా నాన్నపైకి సింహంలా గర్జించినట్లే అరిచింది. "నా పిల్లల్ని నాకు దూరం చేస్తున్నావ్" అని ఏడ్చింది. అమ్మ మాటలకు, ఏడుపుకు నాన్న ఏం సమాధానం చెప్పలేదు. అందరం ఇంటివెనక వున్న కూరగాయల తోట దగ్గరకి చేరుకున్నాం. నాన్న పాట పాడమన్నాడు. నేను ప్రారంభించా. అక్కలు, నాన్న, తమ్ముడు కోరస్ ఇస్తున్నారు. పేడ చేతులతోనే మా దగ్గరకొచ్చి కోరస్ కలిపింది అమ్మ. నాన్న కళ్ళ సైగతోనే మమ్మల్ని అమ్మ వైపు చూడమన్నాడు. ఒక్కసారిగా తోటంతా మా నవ్వులతో దద్దరిల్లింది.

జి.ఎస్.ఎస్‌లో చేరాక ఆ టీంతో మా ఊరేకాక, మా పాకెట్ గ్రామాలన్నింటిలో తిరుగుతూ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయితే 'గ్రామ మిలీషియా' పాకెట్‌లో చాలా బలంగా పని చేస్తుంది. దానికి కమాండర్ కా॥ పూర్ణో. మిలీషియా, జి.ఎన్.ఎస్ కలిసి అనేక మీటింగ్‌లు నిర్వహిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇలా కొనసాగుతున్న క్రమంలో ఒక రోజు మీటింగ్ ముగియగానే "బుద్రి నీతో మాట్లాడాలి రేపు మీటింగ్ ముగిసాక కూర్చుందాం" అన్నాడు కా॥ పూర్ణో. అనుకునట్టుగానే పక్క గ్రామంలో మీటింగ్ ముగిసాక కూర్చున్నాం. "జి.ఎస్.ఎస్‌లో పని చేస్తూనే, మిలీషియా కార్యక్రమాల్లో భాగమైతే బాగుంటుంది. మన పాకెట్‌లోని చుట్టపక్కల గ్రామాల్లో పార్టీ చేపట్టిన విప్లవ సంస్కరణల్లో భాగంగా భూస్వాముల నుండి స్వాధీనం చేసుకున్న భూములను చదును చేసే కార్యక్రమంలో, సమిష్టి వ్యవసాయంలో... మొదలైన వాటిలో మనవంతు పాత్ర బాధ్యతగా నిర్వహించాల్సి వుంటుంది. వీటిలో పాల్గొంటే నీకు కూడా మంచి అనుభవం వస్తుంది ఆలోచించు, ఇది నా మాట కాదు పార్టీ చెప్పిన మాట. మేము దళాన్ని కలిసే పనుంది చాలా దూరం నడవాలి, మళ్ళీ కలుద్దాం" అని చేతులు కలిపి వెళ్ళిపోయాడు.

పై విషయాలన్నీ పూర్ణో చెప్పడమే కాదు, నేను జి.ఎన్.ఎస్‌లో చేరినప్పటినుండి "పాటలు పాడటమే కాదు, పార్టీ చేపట్టే పనుల్లో భాగమవ్వాల"ని చాలా సార్లు నాన్న అన్నాడు. ఆ మరుసటి రోజు నుండే మిలీషియా కామ్రేడ్స్‌తో కలిసి వెళ్ళడం ప్రారంభించా. మిలీషియా భాగమయ్యే ప్రజల పొలం పనులు, గ్రామాల్లో పరిశుభ్రత కార్యకలాపాలలో పాల్గొంటున్నా. ఈ పనులేకాక భూపోరాటంలో సాధించుకున్న భూముల్లో భూమి చదును కార్యక్రమాల్లో పాల్గొనడానికి పాకెట్ మిలీషియా నుండి 50 మందిమి పాల్గొన్నాం. మేము కాకుండా ఛసి మూల్యా సంఘం, మహిళా సంఘం కార్యకర్తలు, ప్రజలు, పిల్లలు, వృద్ధులు అందరు 200 మంది వరకు పాల్గొన్నారు. ఇంత మందికి భోజనాలు ప్రజలే బాధ్యతపడి వండిపెట్టారు. ఓ రోజు మధ్యాహ్నం భోజనాలు ముగించుకొని నడుం వాల్చాం. భూపోరాటం గురించిన వివరాలు చెబుతోంది మహిళా సంఘం అధ్యక్షురాలు. ఆ విషయాలను వివరిస్తూ 'పార్టీ ఆధ్వర్యంలో పెద్ద 'మనోబల్' సభ జరిగింది. ఆ సభకు వేలమంది ప్రజలు హాజరయ్యారు. ఆ సభలో మన నేతలు

భూఆక్రమణకు పిలుపునిచ్చారు. ఈ పిలుపునందుకొని వేలాది మంది ప్రజలు కామ్రేడ్ సింగన్న నాయకత్వంలో ఆదివాసేతర, భూస్వాముల, పెత్తందార్ల, ప్రజావ్యతిరేకులైన తెగపెద్దల భూములపై ఉప్పెనలా విరుచుకుపడ్డారు. ఈ ప్రజా దాడితో వాళ్ళంతా భూములనూ, ఇళ్ళను వదిలి పారిపోయారు. దీంతో భూపోరాటాన్ని అణచివేయడం కోసం ప్రభుత్వం శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. ఇది దండకారణ్యంలో కుఖ్యాతిగాంచిన సల్వాజుడుం వంటిది. దీనిలో ప్రజా వ్యతిరేకులైన రాజకీయ నాయకులు, భూస్వాములు, పెత్తందార్లు, రౌడి మూకలు చేరాయి. ఈ ప్రజా వ్యతిరేక రౌడి మూకలను కూడా సింగన్న నేతృత్వంలో గెనొబాహిని..... మిలీషియా సాహసంగా ఎదుర్కొన్నది. కొంత మందిని మట్టు పెట్టింది. పోరాటం ఉధృతమయ్యేసరికి ప్రభుత్వం, పోలీసులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో దుంబగూడ గ్రామంపై ప్రభుత్వ సాయుధ పోలీసులు, పెత్తందార్లు దాడి చేసి ఆ ఊరిని వల్లకాడులా మార్చేసారు. ఊరి మహిళను పోలీసులు అత్యాచారం చేశారు. గ్రామస్తులు అడ్డుకోవడానికి వెలితే వారిని కొట్టి గాయపర్చారు. లాభం లేదని తెలుసుకున్న ప్రజలు కొమ్ము ఊదడంతో సింగన్నతో సహా, 500 మంది ప్రజలు గుమ్మిగూడారు. గత కొంత కాలంగా గ్రామాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, అదేరోజు సింగన్న ఆధ్వర్యంలో గుమ్మిగూడిన జనమంతా నారాయణపట్నా పోలీస్టేసన్‌ను చుట్టుముట్టారు. "మా గ్రామాలపై దాడులు చేయడానికి గల కారణమేంట"ని నిలదీసారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల తిరుగుబాటుకు ఖంగుతిన్న పోలీసులు, వెంటనే ఎటువంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ధైర్యశాలి, ప్రజా నాయకుడు కామ్రేడ్ సింగన్న అమరుడయ్యాడు. ఇతనితోపాటు ఛసి మూల్య సంఘం కార్యకర్త ఆంద్రు కూడా నేలకొరిగాడు. మొత్తం 19 మంది ఈ ఘటనలో గాయపడ్డారు. అప్పుడు పార్టీ నాయకత్వంలో సింగన్నతో కలిసి ఈ భూముల కోసం ఎంత పోరాడమో వాళ్ళ జ్ఞాపకాలు మరువలేనివి" అంటూ కన్నీరు పెట్టుకుంది. "కామ్రేడ్స్ సమయం రెండున్నర, పనిలోకి వెళ్ళాలి" అంటూ పూర్ణో నుండి మాటలు. వెళ్ళి పని చేస్తుంటే తను చెప్పిన విషయాలే నా కళ్ళముందు తిరుగుతున్నాయి. సింగన్న గురించి ప్రజలు కథలు కథలుగా చెప్పుకొంటుంటే విన్నా, ఆయనకు తుపాకీ తూటాలు తగలవని చెప్పుకొనేవాళ్ళు. ఒకటి రెండుసార్లు చూసా. కానీ అతని గురించి లోతుగా తెలుసుకోవడం తన ద్వారానే. ప్రజల కోసం పని చేసే పార్టీ, పార్టీ నాయకత్వంలో ప్రజా నాయకులు, ఎంతో మంది ప్రజలు ఈ భూములకోసం తమ ప్రాణాలర్పించారు. అలాంటి భూముల్లో పని చేయడం నాకు చాలా గర్వంగా అనిపించింది.

మిలీషియాను కలవడానికి పార్టీ కామ్రేడ్స్ జైరాం, మున్నా దాదాలు తరచు వచ్చిపోయేవారు. మిలీషియా నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఏ విధంగా చేపట్టాలనే విషయాలు వివరించేవారు. అయితే మిలీషియాకి మిలటరీ ట్రైనింగ్ ఇవ్వాలనీ, అందుకోసం కమాండర్ పూర్ణోని కలిసి సరైన తేది కరారు చేశారు. ఈ విషయాన్ని నాన్నతో కబురు పెట్టాడు మా కమాండర్. నాన్న నాకు, అక్కకు విషయం చెప్పాడు. అయితే నాకన్న ముందే అక్క మిలీషయాలో పని చేసేది. ఈ విషయాన్ని విన్న అక్క నేను కచ్చితంగా వెళతానని చెప్పింది. అందుకు సరేనన్నాడు నాన్న. ఆ సమయానికి నేను మలేరియా జ్వరంతో బాధపడుతున్నాను. అందువలన నాకు వెళ్ళాలనే ఇష్టం వున్నప్పటికీ, నాన్న కూడా ఒప్పుకోలేదు. అమ్మకు చెప్పకుండా అక్క ఎప్పుడెళ్ళిందో అర్థం కాలేదు. ఇంట్లో మళ్ళీ అమ్మ, నాన్నలకి గొడవ. ఏరియాలోని మొత్తం 40 మంది ట్రైనింగ్‌కి వెళ్ళారని నాన్న ఎవరితోనో చెబుతుంటే విన్న. ఏడుపాగలేదు, జ్వరం ఎందుకొచ్చిందా అని నాపై నాకే కోపం వచ్చింది. సరిగ్గా 12 రోజులకు ఇంటికి చేరుకుంది అక్క. నన్ను పంపలేదనే కోపంలో అక్కతో మాట్లాడకపోయేసరికి  తానే దగ్గరకొచ్చి, కలగజేసుకొని పదిరోజుల విషయాలు చెప్పడం ప్రారంభించింది. "పార్టీ పద్ధతులు నాకు బాగా నచ్చాయి తెలుసా! ఉదయాన్నే 4గం॥లకు లేచి కాలకృత్యాలు ముగించుకొని, పాంట్, షర్ట్ వేసుకొని 5గం॥లకు గ్రౌండ్‌లో రోల్‌కాల్‌కి హాజరవ్వాలి. అక్కడ వివిధ సెక్షన్‌లుగా 10 మంది చొప్పున డివైడ్ చేస్తారు. రోల్‌కాల్‌లో ఆ రోజుకు సంబంధించిన డ్రిల్స్ గురించి చెప్తారు. తర్వాత ట్రైనింగ్ ఇచ్చే కామ్రేడ్స్ మున్నా, జైరాంలు ఎక్సర్‌సైజ్‌లతో ప్రారంభిస్తారు. వాళ్ళిద్దరిని యూనిఫాం, బూట్లు, టోపి, వెపన్స్‌తో చూసేసరికి మన మిలీషియా అందరం యూనిఫాం, వెపన్స్.... ఎప్పుడేసుకుంటామోనని బలే ముచ్చటపడేవాళ్ళం. శారీరక ధారుఢ్యాన్ని పెంచే విన్యాసాలతో పాటు, శతృవును దెబ్బతీయడానికి సంబంధించిన డ్రిల్స్ నేర్పించారు. సాయుధ శతృవును దెబ్బతీయడం కోసం బూబీట్రాప్స్ పెట్టడం, మైన్స్ పేల్చడం... వంటి అనేక రకాలైన మిలటరీ టెక్నిక్‌లు చెప్పారు. ఇక సమయపాలన, క్రమశిక్షణ నియమాలు ప్రతిఒక్కరు అమలు చేయాల్సిందే. పార్టీవాళ్ళందరితో పది రోజులు తొందరగా గడిచిపోయాయి. మరోసారి అవకాశం వస్తే కలిసివెళదాం సరేనా" అంటూ కోపంగా వున్న అమ్మ దగ్గరకి వెళ్ళిపోయింది. నేను ఎంతో మిస్సాయానని బాధేసింది.

మిలటరీ క్యాంపు జరిగిన నెల రోజుల తర్వాత మిలిషియాతో మాట్లాడటానికి కామ్రేడ్ మున్నాదాదా గ్రామ పరిసరప్రాంతంలోకి వచ్చాడు. 30 మంది వరకు సమావేశమయ్యాం. మాకు ప్రోగ్రాం చెప్పిన తర్వాత దేవమాలి కొండలకు సంబంధించిన కరపత్రం చదివాడు. దాన్ని వివరిస్తూ "మాలి, దేవమాలి పర్వతాలను బహుళజాతి కంపెనీలైన నాల్కో, ఇండాల్కో కంపనీలు కబలించదలచుకున్నాయి. ఈ పర్వత శ్రేణులు కోరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్‌లోని కొటియా, తురియా, కంటి పంచాయితీలలో 17 కి.మీ వైశాల్యంతో విస్తరించి వున్నాయి. సముద్ర మట్టానికి 4,385 అడుగుల ఎత్తున దేవమాలి పర్వత శ్రేణులు ఒడిశా రాష్ట్రంలోనే ఎత్తుయినవి. ఈ పర్వతాల గర్భంలో 3,000 లక్షల టన్నుల బాక్సైట్ నిల్వలున్నట్లు శాస్త్రవేత్తల అంచనా. వీటిని కొల్లగొట్టడానికి 15 సం॥లకుగాను ఇండాల్కో కంపెనీ లీజుకు

తీసుకుంది. అయితే ఈ పర్వత శ్రేణులపై 22 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో 10 వేలకు పైగా ప్రజలు జీవిస్తున్నారు. ఇందులో అత్యధిక మెజారిటీ ప్రజలు మన ఆదివాసీలే. తమ బతుకుదెరువు కోసం ఈ కొండలపైనే ఆధారపడుతున్నారు. అక్కడున్న గ్రామ ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా నవీన్‌పట్నాయక్ సర్కార్ నోటీసులు జారీ చేసింది. ఇక్కడ తవ్వకాలు మొదలుపెడితే పెద్ద మొత్తంలో మన ప్రజలు విస్తాపితులు అవ్వడం ఒకటైతే, పెద్దఎత్తున పర్యావరణ కాలుష్యం జరిగి, చుట్టుపక్కల అనేక గ్రామాలపై దీని ప్రభావం పడుతుంది. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనకు ఈ సమస్య జీవన్మరణ సమస్యగా మారింది. గతంలో ఆదివాసీ ఛసి మూల్యా సంఘం 12,000 మంది ప్రజలతో బహిరంగ సభను జరిపి, పోరాటానికి పిలుపునిచ్చింది. అప్పుడు మన ప్రజలందరూ పెద్దమొత్తంలో కదిలారు" అంటూ తను మట్లాడటం పూర్తి కాకముందే 'నాల్కో కంపెనీలో ఏం తయారవుతుంది?' అని ప్రశ్నించాను. అందుకు సమాధానంగా మాట్లాడుతూ "దామన్‌జోడి పట్టణానికి 16 కి.మీ దూరంలో నాల్కో కంపెనీ ఉంటుంది. ఇది కోరాపుట్ బ్లాక్‌లోని మతలపుట్ పంచాయితీ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ బాక్సైట్ గనులు వున్నాయి. ఇక్కడ నుండి బాక్సైట్‌ను నాల్కో కంపెనీకి తరలించి, అక్కడ శుద్ధి చేసి, ఫౌడర్ రూపంలోకి మార్చి ఎగుమతి చేస్తారు. ఈ కంపెనీ గనులు ఇక్కడి స్థానికుల మీద వేసిన, వేస్తున్న ప్రభావం అంత ఇంతకాదు... సరే కామ్రేడ్స్ ఆలస్యమవుతుంది. దీని గురించి మరింత లోతుగా మరోసారి కలిసినప్పుడు మ్యాప్ చూపుతూ మాట్లాడుకుందాం" అంటూ ఆ రాత్రి మా నుండి సెలవు తీసుకున్నాడు. దేవమాలి పర్వతాలు, ఇండాల్కో కంపెనీలు వున్నవి అని మాత్రమే తెలుసు. కానీ వాటి గురించి సరైన వివరాలు మాత్రం మున్నాదాదా చెప్పిన తర్వాతే అర్థమయ్యాయి. ఆ కొండల చుట్టుపక్కల వున్న ప్రజల పరిస్థితి గురించి అర్థం చేసుకోగలిగాను కానీ, పర్యావరణం వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్న విషయాలు అంతగా నా మెదడు ఆలోచించలేకపోయింది. ఈ సారి వచ్చినప్పుడు నేనే స్వయంగా కొన్ని విషయాల గురించి అడిగి తెలుసుకుంటానని మనసులో అనుకున్న. మున్నాదాదా వాళ్ళతోనే పార్టీలో వుండిపోతే ఇలాంటి దోపిడీ కంపెనీల గురించి, ముఖ్యంగా వీటివల్ల గరీబ్ జనతా ఎదుర్కొంటున్న సమస్యల గురించి, రోజురోజుకు బయటి సమాజంలో జరుగుతున్న మార్పుల గురించి.... ఇంకా ఎన్నో, ఎన్నెన్నో విషయాల గురించి తెలుసుకోవచ్చని నాలో నాకే సంతోషం కలిగింది.

అప్పుడే మిలీషియాలో పని చేసి సంవత్సరం గడిచిపోయింది. పార్టీ నుండి పిలుపు రానే వచ్చింది. కమాండర్ పూర్ణో నాన్నకి చెప్పడం, నాన్న ఇంట్లో అమ్మతో చెప్పడం, అమ్మ గొడవ చేయడం ఒక్క రోజులో జరిగిపోయాయి. "నేను బుద్రిని పార్టీకి పంపడానికి గట్టిగా నిర్ణయించుకున్న. నీవు కూడా ఆ విధంగా ఆలోచిస్తే బాగుంటుంది. ఎప్పుడు మన గురించే తప్ప మనలాంటి ప్రజలకోసం పని చేసే పార్టీ గురించి ఆలోచించవా?" అంటూ కోపంగానే అమ్మకు సమాధానమిచ్చాడు నాన్న. "నాకు పార్టీపై కోపం ఏమి లేదు. మిలీషియాలో పని చేస్తుంది కదా! అది సరిపోతదని నా ఉద్దేశం" అమ్మ నుండి నిదానంగా మాటలు. మరుసటిరోజే తెలిసిన బంధువుల దగ్గరకు వెళ్ళిన నన్ను మా అత్తవాళ్ళు ఎత్తుకుపోయారు. విషయం ఇంట్లో తెలియదు. పార్టీ పనుల్లో ఉన్నాననుకున్నారు ఇంటివాళ్ళు. వారం గడిచాక అక్కడినుండి పారిపోయి ఇంటికొచ్చా. ఇలా రెండు, మూడుసార్లు జరిగాక నాన్న సీరియస్‌గానే అత్తవాళ్ళతో గొడవపడ్డాడు. మరోసారి ఇలా జరిగితే పరిణామాలు సీరియస్‌గా వుంటాయని హెచ్చరించాడు. తెల్లవారే ఊర్లో మీటింగ్ అని నాన్న నాతో అన్నాడు. నాకు అర్థం కాలేదు. రిక్రూట్ అయ్యే మిలీషియా వాళ్ళకు మీటింగ్‌కు రావాలని కబురు పెట్టాడు కమాండర్ పూర్ణో. 12గం॥ సమయానికి అందరం అక్కడకి చేరుకున్నాం. ప్రజల సమక్షంలో మమ్మల్ని మాట్లాడించారు. ఆయా కామ్రేడ్స్‌కి సంబంధించిన తల్లిదండ్రులు కూడా మాట్లాడారు. అమ్మకి విషయం తెలియదు. నా తరపున నాన్న మాట్లాడుతూ "పార్టీ అంటే ప్రజలు, ప్రజలు అంటే పార్టీ. ఎవరికి ద్రోహం చేసినా ప్రజా ద్రోహులుగా మిగులుతారు. సరెండర్ అవడం, పారిపోవడం వంటివి చేస్తే ఇదే ప్రజల ముందు మీకు శిక్ష తప్పదు. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసం మీరు తీసుకున్న ఈ నిర్ణయానికి చివరి ఊపిరి వరకు కట్టుబడి వుండాలి. శత్రు చేతికి చిక్కినగాని పార్టీ రహస్యాన్ని కాపాడాలి. చిత్రహింతలు పెట్టినా శత్రువుకు లొంగకూడదు. మీ చివరి రక్తపు బొట్టు కూడా ఈ పీడిత ప్రజలకు ఉపయోగపడాలి" అంటూ ముగించాడు నాన్న. అబ్బో నాన్న మాట్లాడిన మాటల్లో పెద్ద అర్థమే దాగి వుంది. అందుకు అందరం పంచాయితీ ప్రజలందరి ముందు పార్టీకి ద్రోహం చేయమని ఒప్పుకున్నాం. ప్రజలందరూ మా పంచాయితీలోని 30 మందికి లాల్‌సలామ్ చెబుతూ ఆనంద బాష్పాలతో చాలా గర్వపడుతూ పిడికిళ్ళెత్తారు.

సూర్యుడు పడమరవైపున అస్తమిస్తున్నాడు. తన కసినంతా వలబోస్తున్నట్లుగా, అప్పటివరకు కురిసిన కుండపోత వర్షం ఆగిపోవడంతో, నిశబ్దం సంతరించుకుంది. అప్పటికే చిన్న చిన్న వర్షాలతో చిగురిస్తున్న ఆకులు, వర్షపు చినుకులతో మెరుస్తున్నాయి. పార్టీ ఆధ్వర్యంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న భూముల్లో, ఎర్రజెండాలు స్వేచ్ఛగా ఎగురుతున్నాయి. తిరిగి వెళ్ళాల్సిన ఊరివాళ్ళ నడక ఆగింది. పక్కకి తల తిప్పగానే నాన్న. చివరిసారిగా అన్నట్లు లాల్‌సలామ్ చెప్పా. "పేద పీడిత ప్రజల విముక్తి కోసం చివరి వరకు ప్రజల పక్షానే నిలబడతా"నని ప్రజల ముందు చేసిన వాగ్దానం, నాన్న చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అప్పటికే అటువైపొచ్చిన దళం మా కోసం ఎదురు చూస్తోంది వెళ్ళే సమయం అయ్యిందన్నట్లు. మున్నాదాదా దళం నుండి లిప్తపాటి చూపు. వెంటనే నాన్నిచిన్న కేఫ్ తుపాకీ భూజాన వేసుకొని, మాలి కొండలవైపు కదులుతున్న దళంలో కలిసిపోయా.

▲

# ఎస్.కె.ఎల్-కె.పి డివిజన్ ఉద్యమానికి దండకారణ్య పరిమళాలు అద్దిన రేగడగట్ట రేలపువ్వు
# కామ్రేడ్ ఆరతి (ముసాకి ఉంగి) అమర్‌రహే!



మార్చి 25, 2018న నారాయణపట్నా బ్లాక్, డొకిరిగాటిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరురాలైన కామ్రేడ్ ఆరతి అసలు పేరు ముసాకి ఉంగి. వయస్సు 28 సంవత్సరాలు. సుక్మా జిల్లా, కుంట తాలుక, రేగడగట్ట గ్రామం. ఆమె తన తల్లిదండ్రులకు మూడవ సంతానం. రేగడగట్ట గ్రామం, ఆ ప్రాంతంలో విప్లవోద్యమం ప్రారంభమైనప్పటినుండీ, అది అభివృద్ధి చెందే క్రమంలోని అన్ని మలుపులలో ముందు పీఠిన ఉన్నది. సాయుధ వ్యవసాయ విప్లవంలోనూ, పార్టీ, మిలీషియా, ప్రజా నిర్మాణాలు, జనతనసర్కార్‌ల నిర్మాణాల్లోనూ ఆ గ్రామం ముందు వరుసలోనే ఉన్నది. ఆ గ్రామం సల్వాజుడుంతో పాటు, రాజ్య నిర్బంధాన్ని తీవ్రంగా ఎదుర్కొన్నది. ఈ క్రమంలో శత్రు సాయుధ దాడిని ఓడించేందుకు ఆ గ్రామ ప్రజలు ప్రజాయుద్ధంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా, పార్టీ, పి.ఎల్.జి.ఎలోకి పెద్దఎత్తున రిక్రూట్ అయ్యారు. ఇంతటి వీరోచిత వర్గపోరాట చరిత్ర కలిగిన రేగడగట్టలో ఆరతి జన్మించింది. ఆమె చిన్నతనంలో బాలల సంఘంలో పని చేసింది. అనంతరం 2007లో మిలీషియాలోకి భర్తీ అయ్యింది. ఎర్రబోరు, వింజరంలోని సల్వాజుడుం క్యాంపులపై జరిగిన దాడులలో పాల్గొన్నది. 2008 నాటికి పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యి స్థానిక ఎల్.జి.ఎస్‌లో 5,6 నెలలు పని చేసింది. తర్వాత దండకారణ్య జోన్‌కు చెందిన 4వ పి.ఎల్‌లో సభ్యురాలిగా తన విధులు నిర్వర్తించింది. ఈ క్రమంలోనే పార్టీ అవసరాల దృష్ట్యా, 2009లో ఎ.ఒ.బికి బదిలీ అయ్యి, పి.ఎస్‌లో సభ్యురాలిగా 2010 చివరి వరకు నాయకత్వ రక్షణ బాధ్యతలలో పాలుపంచుకుంది. పి.ఎస్‌లో పని చేస్తున్నప్పుడు 2010 డిసెంబర్‌లో తనతో కలిసి పని చేస్తున్న సోనును ఇష్టపడి పార్టీ ఆమోదంతో వివాహం చేసుకుంది. తదనంతరం ఎస్.కె.ఎల్-కె.పి డివిజన్‌లో ఏర్పాటయిన సి.ఆర్.సి 3వ కంపెనీలో సభ్యురాలిగా జాయిన్ అయ్యింది. సి.ఆర్.సి 3వ కంపెనీలో సభ్యురాలు అయిన దగ్గరనుండీ, అమరురాలు అయ్యేంత వరకు కంపెనీ చేపట్టిన అనేక కార్యకలాపాలలో భాగమయ్యింది. సామన, పనికి, కుమ్మరిపుట్, కుత్తుడి, టుడువ, జోడిగూడ(బైపరిగూడ)లలో జరిగిన ఎదురు కాల్పులలో పాల్గొంది. 2012 బసనపుట్ (నారాయణపట్నా)లోని బి.ఎస్.ఎఫ్ క్యాంపుని చికాకు పర్చడంలో భాగంగా, మిలీషియాతో చేసిన దాడిలో పాల్గొంది. నారాయణపట్నా, నందపూర్ ఎ.సిల పరిధిలో అనేక మంది ఇన్‌ఫార్మర్‌లను శిక్షించిన సంఘటనలలో పాల్గొంది. 2013 ఆగస్టు రాళ్ళగడ్డ ఆంబుష్‌లో పాల్గొంది. 2017 ఫిబ్రవరి 1న జరిగిన సుంకి ఆంబుష్‌లో పాల్గొంది.

సల్వాజుడుం నిర్బంధ వాతావరణంలో పెరిగిన ఆరతి, సహజంగానే ప్రజా శతృవులు, సాయుధ శతృవుల పట్ల వర్గకసిని పెంచుకున్నది. ముఖ్యంగా ఇన్‌ఫార్మర్ల విషయంలో ఎటువంటి రాజీ ధోరణిని ప్రదర్శించేది కాదు. పార్టీ పంథా పట్ల స్పష్టత కలిగి ఉండేది. ఉద్యమ ప్రయోజనాలకు అనుగుణంగా ఆమెలో పెరుగుతున్న నిబద్ధత, సమర్థతలను గమనంలో ఉంచుకొని, 2017 జూన్‌లో పార్టీ ఆమెను పి.పి.సి.ఎమ్‌గా ప్రమోట్ చేసింది. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేస్తూ, గతం కంటే మెరుగ్గా తన భావాలలో, ఆచరణలో అభివృద్ధికరంగా వ్యవహరిస్తూ వచ్చింది. అయితే ఆమె వైవాహిక జీవితం అంత సజావుగా సాగలేదు. సహచరుడు సోనులో పెరుగుతున్న అన్యవర్గ ధోరణులు ఆమెను వ్యధకు గురి చేశాయి. ఈ క్రమంలోనే సోను దళంలోని మరో మహిళను తీసుకొని పారిపోయాడు. ఈ సంఘటన ఆమెను పెద్దగా కుంగదీయలేదు. గత కొంతకాలంగా అతని బలహీనతలపై పోరాడుతూ వచ్చిన ఆమె, పార్టీకి అతడు చేసిన ద్రోహాన్ని ఛీదరించుకొని మరింత వర్గకసితో, పట్టుదలతో, దృఢదీక్షతో ఉద్యమకార్యాచరణలో నిమగ్నమయ్యింది. తనలోని ఈ మార్పు అందరిని సంతోషం కల్గిస్తున్న తరుణంలోనే ఆమెను డొకిరిగాటి ఎన్‌కౌంటర్‌లో కోల్పోవడం ఎస్.కె.ఎల్-కె.పి డివిజన్ ఉద్యమానికి తీవ్ర నష్టం. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, తన ప్రాంతాన్ని, భాషను, సంస్కృతిని వదిలి, అనేక కష్టనష్టాల కోర్చి, అంతిమ శ్వాస వరకు నారాయణపట్నాలో ప్రజల కోసం పని చేసిన కామ్రేడ్ ఆరతి సదా చిరస్మరణీయురాలు. కార్మికవర్గ అంతర్జాతీయతను చాటి చెప్పిన ఆమె చైతన్యం చాలా ఉన్నతమైనది. కామ్రేడ్ ఆరతి ఆదర్శాలను, స్వప్నాలను సాకారం చేద్దాం.

### నారాయణపట్నా ఆదివాసీ రైతాంగ పోరాటంతో మమేకమై

### వారికి నమ్మకమైన, ఆధారపడదగిన నేతగా ఎదిగిన

# కామ్రేడ్ కుమారి (కోసికి) అరుణారుణ జోహార్లు!



చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంగులూర్ ఏరియా, పుంబాడ్ గ్రామంలో కామ్రేడ్ కోసి జన్మించింది. తనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు పొట్టాం కోసి. తను పుట్టేనాటికే ఆ ప్రాంతమంతా పార్టీ ప్రభావంతో సంఘాలుగా ఏర్పడి, విప్లవోద్యమం పురోగమన దిశగా అడుగులు వేస్తున్న రోజులవి. కామ్రేడ్ కోసి ఆ వాతావరణంలో పెరగడంతో, పార్టీ రాజకీయాలకు ఆకర్షితురాలైంది. చిన్నప్పుడే చేతన నాట్య మంచ్ నిర్వహించే కార్యకలాపాలలో పాల్గొనేది. ఆ క్రమంలో బాలల సంఘంలో చేరింది. 16 సంవత్సరాలు వచ్చే నాటికి పాటలపైన తనకున్న మక్కువతో సి.ఎన్.ఎమ్‌లో చేరి, అది నిర్వహించే అన్ని కార్యక్రమాలలో పాలుపంచుకునేది. ఆ క్రమంలో 2009లో భర్తీ అయి, స్థానిక దళంలో సభ్యురాలిగా చేరింది. 2010లో, పార్టీ పిలుపునందుకొని ఎ.ఒ.బిలో ఏర్పాటు చేసిన సి.ఆర్.సి 3వ కంపెనీలో సభ్యురాలైంది.

శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్‌లోని సి.ఆర్.సి 3వ కంపెనీలో పని చేస్తున్న క్రమంలో కామ్రేడ్ కోసి డాక్టర్ బాధ్యతలు చేపట్టింది. అయితే తనకు ఇంగ్లీషు భాష తెలియకపోవడం వలన, డాక్టర్ పని చేయడంలో కొంత ఇబ్బంది ఎదురైనప్పటికీ, క్రమంగా ఇంగ్లీషు అక్షరాలను నేర్చుకుంటూ, మందులను గుర్తు పట్టడంలో పట్టు సంపాదించింది. ఈ పనికి అవసరమైన సేవాదృక్పథాన్ని పెంచుకుంటూ, పి.ఎల్.జి.ఎ శ్రేణులకే కాకుండా, గ్రామాలలోని పీడిత ప్రజలకు సైతం తన సేవలను అందించింది. కంపెనీలోని కామ్రేడ్స్ అందరితో కలిసిపోయేది. రోజువారి సమిష్టి పనులు, అధ్యయనం వంటి పనుల్లో ముందుండేది. మిలటరీ కర్తవ్యాలను అమలు చేయడంలో భాగంగా, గెరిల్లా యుద్ధ నియమాలను దృఢంగా అమలు చేసేది. అదే కంపెనీలో పని చేస్తున్న కామ్రేడ్ జైరాంను ఇష్టపడి, 2012లో పార్టీ అనుమతితో వివాహం చేసుకుంది. వివాహానంతరం తన వైవాహిక జీవితంలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ, పరిణితి చెందిన కామ్రేడ్‌గా, తానే చొరవ చేసి, పార్టీ సహాయంతో వాటిని పరిష్కరించుకునేది. ఈ కుటుంబ సమస్యలు, తను నిర్వహించే విప్లవ కర్తవ్యాలకు ఏ మాత్రం ఆటంకం కాకుండా చూసుకునేది. ఈ క్రమంలో ఆమెలో పెరుగుతున్న రాజకీయ నిబద్ధత సమర్థతలను గమనించిన పై కమిటీ ఆమెకు ప్లాటూన్ పార్టీ కమిటీ స్థాయిని కల్పించాలనుకున్నది. అయితే అదే సమయంలో ఆ ప్రాంతంలో ప్రజలను సంఘటితం చేసేందుకు ఆర్గనైజర్ కావాల్సి రావడంతో, కామ్రేడ్ కోసిని అందుకు తగిన కామ్రేడ్‌గా గుర్తించి తనను డిప్యూటేషన్‌పై స్థానిక ఎ.సిలో సభ్యురాలిగా ప్రమోషన్‌పై పంపారు.

2013లో ఆర్గనైజేషన్ బాధ్యత చేపట్టి, స్థానిక ప్రజల భాషా అయిన కువ్వి, ఒడియా భాషలపై అతి తక్కువ సమయంలోనే పట్టు సంపాదించింది. సొంబి గ్రామం వద్ద 2004లో జరిగినటువంటి ఫైరింగ్‌లో కామ్రేడ్ శశి, విజయ్‌లతో పాటు అమరురాలైన కామ్రేడ్ కుమారిని తనకు ఆదర్శంగా చేసుకుంది. ఎందుకుంటే, ఆ ప్రాంత ప్రజలలో కుమారికి వున్న స్థానం కోసిని ఎంతగానో ఉత్తేజపరిచింది. ఆమె జీవితం తనకు ప్రేరణగా వుందని భావించి తన పేరును కుమారిగా మార్చుకున్నది. అప్పటినుండి ఆర్గనైజేషన్ పనుల నిమిత్తం ప్రజలలోకి వెళ్ళినప్పుడు వారితో పూర్తిగా కలిసిపోయేది. వివిధ సందర్భాలలో పార్టీ నిర్వహించే మీటింగ్‌లలో ప్రజల భాషలోనే మాట్లాడి, వారి మన్ననలను పొందింది. ప్రజల నుండి అనేక ప్రశ్నలను ఓపికగా విని సమాధానాలు చెప్పేది. ఈ సందర్భంగా పార్టీ లైన్‌ని అర్థం చేయించేది. ప్రతి గ్రామంలో మిత్రులకు, శత్రువులకు మధ్య విభజన రేఖ గీసి, ప్రజలకు శత్రువులెవరో అర్థం చేయించేది. పై నాయకత్వం తను పని చేసే ప్రాంతాల్లోకి వెళ్ళినప్పుడు రహస్య పద్ధతులు పాటిస్తూ, రక్షణ బాధ్యతల్లో తగిన జాగ్రత్తలు తీసుకునేది. ఆర్గనైజేషన్ పనుల్లో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు తనను గైడ్ చేసే నాయకత్వ కామ్రేడ్‌తో చర్చించి, పార్టీ పద్ధతులకు అనుగుణంగా పరిష్కరించేది. ఒక ఆర్గనైజర్‌గా అభివృద్ధి చెందుతూనే, మిలటరీ క్రమశిక్షణను తు.చ తప్పక పాటించేది. ఎక్సర్‌సైజ్‌లు, డ్రిల్స్, గ్రామాలలో సెంట్రీ బాధ్యత, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను తెలుసుకోవడం వంటి పనుల్లో చాలా చురుగ్గా వుండేది. చిన్నప్పటి నుండి పాటలపై తనకున్న ఇష్టాన్ని మరవకుండా ఓపికగా పాటలు నేర్చుకొని ప్రజల ముందు పాడేది.

తరువాయి భాగం 47వ పేజిలో...

# పితృస్వామ్యాన్ని ధిక్కరించి. పీడిత ప్రజల విముక్తికోసం ప్రత్యేకించి మహిళల విముక్తికోసం ప్రజాయుద్ధ బాట నడిచిన వీరవనిత

# కామ్రేడ్ రణిత (పాయికే)కు విప్లవ జోహార్లు



ఎస్.కె.ఎల్-కె.పి డివిజన్‌లోని నారాయణపట్నా బ్లాక్, డొకిరిగాటిలో మార్చి 25, 2018న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులైన నలుగురు మహిళా కామ్రేడ్స్‌లో కామ్రేడ్ రణిత ఉంది. ఆమె వయస్సు 25 సంవత్సరాలు. బీజాపూర్ జిల్లా, బైరంగడ్ ఏరియాలోని కమ్మ గ్రామంలో, తన తల్లిదండ్రులకు రెండవ సంతానంగా జన్మించింది. డి.కెలోని అనేక గ్రామాల లాగానే కమ్మ గ్రామం కూడా, పార్టీ కార్యకలాపాలకు, ముఖ్యంగా సి.ఎన్.ఎమ్ (చేతన నాట్య మంచ్) సాంస్కృతిక కార్యకలాపాలకు కేంద్రం. ఈ గ్రామంలో జనతనసర్కార్ ఏర్పడింది. జనతనసర్కార్ ప్రోత్సాహంతో ఈ గ్రామం నుండి అనేక మంది యువతీ, యువకులు పార్టీలోకి భర్తీ అయ్యారు.

కా॥ రణిత తల్లిదండ్రులు ఆమె చిన్నతనంలోనే చనిపోయారు. దీంతో ఆమె తాతయ్య, నాన్నమ్మల దగ్గర ఉంటూ పెరిగింది. కుటుంబంలోని పేదరికం వల్ల చిన్నతనం నుండే పశువుల కాపుకు వెళ్ళేది. కా॥ రణితకు 11, 12 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి ఆమెకు పెళ్ళి సంబంధం వచ్చింది. రణిత ఇంటివాళ్ళు మగపెళ్ళివాళ్ళు తెచ్చిన కల్లు తాగి, సంబంధం ఖాయం చేసుకున్నారు. ఈ విషయం రణితకు తెలియనేలేదు. కొద్ది నెలల అనంతరం పెళ్ళికి ముహూర్తం నిర్ణయించారు. ఒక రోజు సాయంత్రం అడవి నుండి తిరిగి వచ్చిన రణితకు, ఇంట్లో జరుగుతున్న పెళ్ళి ఏర్పాట్లు అర్థమై, పశువులను కట్టేసి, ఇంటికి సమీపంలో ఉన్న చెట్టు ఎక్కి దాక్కుని ఉండిపోయింది. చీకటి పడుతుండటంతో ఇంటి వెనకకు చేరి, తువ్వాలు పర్చుకొని నిద్రపోయింది. ఆమె కోసం రాత్రంతా వెతికిన కుటుంబ సభ్యులు, ఎట్టకేలకు ఆమెను పట్టుకొని తీసుకుపోయి పెళ్ళి చేశారు. కానీ, ఆమె భర్తతో సంసారం చేయడానికి ఇష్టపడలేదు. కుటుంబ సభ్యులు, ఊరి పెద్దలు ఆమెను బలవంతంగా భర్త ఇంటివద్ద దింపి, తిరుగు ప్రయాణంలో వుండగానే ఆమె మాత్రం భర్త ఇంటి నుండి పారిపోయి, తన పరివార్ కన్న ముందుగా గ్రామాన్ని చేరుకున్నది. ఇలా ఆమెను కుటుంబ సభ్యులు బలవంతంగా అత్తవారింటివద్ద దింపడం, ఆమె పారిపోయిరావడం పరిపాటైపోయింది. మొత్తంగా మూడు సంవత్సరాలలో ఒక్క రాత్రి కూడా అక్కడ గడిపింది లేదు. దీంతో విసిగిపోయిన కుటుంబ సభ్యులు ఆమెను బలవంతం చేయడం మానుకున్నారు.

అప్పటికే రణిత అన్నయ్య పి.ఎల్.జి.ఎలో దళ సభ్యుడిగా పని చేస్తున్నాడు. 2007-08 మధ్య కాలంలో తోంగగూడెంలోని సల్వాజుడుం క్యాంప్‌పై మనం చేసిన దాడి సందర్భంగా, శత్రువు నుండి వచ్చిన కాల్పులలో అమరుడయ్యాడు. తన అన్నయ్య అమరత్వం తర్వాత తీవ్రమైన ఆలోచనలో పడింది రణిత. ఇంటి పరిస్థితి, ఇష్టంలేని వివాహం, దాని వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు... వీటన్నింటి కంటే ప్రజల కోసం పని చేసి ప్రాణమివ్వడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చి, 2009 నాటికి పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యింది. ప్రారంభంలో గంగులూరు ఏరియాలోని ఎల్.ఒ.ఎస్‌లో పని చేసింది. 2010 డిసెంబర్‌లో ఎ.ఒ.బికి బదిలీ అయ్యి, ఎస్.కె.ఎల్-కె.పి డివిజన్‌లో, సి.ఆర్.సి 3వ కంపెనీ సభ్యురాలిగా జాయిన్ అయ్యింది. 3వ కంపెనీ చేపట్టిన కార్యకలాపాలలో అధికశాతం వాటిలో పాల్గొన్నది. 2017 ఫిబ్రవరి 1న జరిగిన సుంకి ఆంబుష్‌లో పాల్గొంది. సామన, పనికి, రణసింగి, కలహండి, టుడువ, కుత్తుడి, జోడిగూడ (బైపరిగూడ) ఎదురు కాల్పులలో పాల్గొన్నది. కోరాపుట్ జిల్లాలోని విస్థాపన సమస్యకు వ్యతిరేకంగా గుమ్మండిలో వాహనాల కాల్చివేత, కురిడిపొదర్‌లో వాహనాల దగ్ధం వంటి వాటిలో పాల్గొన్నది. వీటితో పాటుగా ప్రజాద్రోహులను పి.ఎల్.జి.ఎ శిక్షించిన అనేక సంఘటనలలో పాలుపంచుకుంది. ఈ క్రమంలోనే 2017లో రణిత కంపెనీలో పి.పి.సి.ఎమ్‌గా ప్రమోట్ అయ్యింది.

తరువాయి భాగం 45వ పేజిలో...

## దండకారణ్య వ్యవసాయవిప్లవంలో ఉద్భవించిన సాయుధ రైతాంగ వీరవనిత

# కామ్రేడ్ లక్కె



సుక్మా జిల్లా, కుంట తహసిల్, మడిపి దూలోడ్ గ్రామంలో కామ్రేడ్ లక్కె జన్మించింది. తల్లిదండ్రులు పెట్టిన పేరు ముచాకి లక్కె. వీరు మొదట దర్భ డివిజన్‌లోని పొర్రవెడమ గ్రామంలో వుండేవారు. ఇక్కడ భూమి లేకపోవడంతో బ్రతుకు దెరువు కోసం దక్షిణ్ బస్తర్‌లోని మడిపి దూలోడ్‌కి చేరారు. చివరికి అక్కడే స్థిరపడ్డారు. లక్కె చిన్నతనంలోనే తండ్రి అనారోగ్యం బారినపడి మరణించడంతో, తల్లే పిల్లల ఆలనా పాలనా చూసేది. ఈ పరిస్థితుల్లో లక్కె మేనమామ తమ కుటుంబాన్నంతటిని కాకేర్‌లంకకి తీసుకెళ్ళాడు. అక్కడ కూడా వీళ్ళ బాధలు తగ్గలేదు. లక్కె తల్లి రక్తహీనతతో కొంత కాలానికి చనిపోయింది. లక్కె మామ దగ్గరే పెరిగి పెద్దదైంది. అప్పటికే సంఘంలో తన మామ పని చేసేవాడు. ఊర్లో అన్ని విప్లవ సంఘాలు చురుగ్గా పని చేసేవి. అందరి పిల్లలలాగానే లక్కె కూడా చిన్నతనంలో బాలల సంఘంలో పని చేసింది. 16 సంవత్సరాలు వచ్చే నాటికి, పాటలపై తనకున్న ఇష్టంతో సి.ఎన్.ఎమ్ (చేతన నాట్య మంచ్)లో సభ్యత్వం పొందింది. 2016 డిసెంబర్‌లో పార్టీలోకి పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యింది. కొంతకాలం స్థానికంగా పని చేసి, 2017 జూన్‌లో ఎ.ఒ.బికి బదిలీ అయ్యింది. పార్టీ నిర్ణయం ప్రకారం నాయకత్వ (ఎస్.జడ్.సి.ఎమ్) కామ్రేడ్‌కి గార్డుగా బాధ్యతలు చేపట్టింది.

కామ్రేడ్ లక్కె గార్డుగా పని చేస్తూనే సమిష్టి పనుల్లో భాగమయ్యేది. చదువు నేర్చుకునే విషయంలో చాలా చురుకుగా వుండేది. పార్టీలోనే తన ప్రాథమిక చదువు ప్రారంభమైనప్పటికీ, అతి తక్కువ సమయంలోనే దానిలో మెరుగుదల సాధించింది. తన బాధ్యులకు సంబంధించిన బరువులను మోస్తూనే సమిష్టి బరువులు మోసేది. గార్డ్‌గా తన రక్షణ విధిని నిర్వహిస్తూనే రోజువారి ఎక్సర్‌సైజ్, డ్రిల్స్‌లో పాల్గొనేది. చురుకుదనం, క్రమశిక్షణ, చొరవ మొదలైనవి చాలా తక్కువ సమయంలో అలవర్చుకుంది. తను ఏ పనిలో వున్నప్పటికీ, బాధ్యురాలిని ఓ కంట కనిపెట్టుకొని ఉండేది. బాధ్యురాలి రక్షణ విషయంలో ఏ మాత్రం ఏమరపాటుకు గురయ్యేది కాదు. ఆమె పని చేస్తున్న నారాయణపట్నా ప్రాంతంలో ఎత్తైన కొండలు, గుట్టలు, తెలియని ప్రజలు, తెలియని భాష ఇలా అన్ని ఆమెకు కొత్తే. అయినా ఆమె ఏ మాత్రం ఆందోళన పడలేదు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకూడదనే పట్టుదలతో, క్రమంగా నూతన పరిస్థితులకు ఒదిగిపోతూ వచ్చింది. అయితే మార్చి 18, 2018న డొకిరిగాటి గ్రామంలో శత్రువు ఊహించని విధంగా చేసిన సర్‌ప్రైజ్ దాడిలో తన ముగ్గురు సహచర కామ్రేడ్స్‌తోపాటు, లక్కె కూడా నేలకొరిగింది. విప్లవోద్యమంలో ఎంతో భవిష్యత్ వున్న ఈ యువ కామ్రేడ్‌ను కోల్పోవడం పార్టీకి, విప్లవోద్యమానికి ఎంతో నష్టాన్ని కలిగించింది. లక్కె ఆశయ సాధనలో భాగంగా నారాయణపట్నా సాయుధ రైతాంగ ఉద్యమాన్ని పునర్నిర్మించేందుకు మన సర్వశక్తులు కేంద్రీకరించి కృషి చేద్దాం. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కొరకు తుదివరకు పోరాడుదాం.

---

44వ పేజి తరువాయి భాగం...

కంపెనీలో రణిత పి.పి.సి.ఎమ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత, పైకమిటీ ఇచ్చిన ఒక ముఖ్యమైన పనిని నిర్వహించే క్రమంలో తన సహచర కామ్రేడ్స్‌తో డొకిరిగాటిలో ఆగింది. ఈ గ్రామంలో రాత్రి 9 గం॥ల సమయంలో వంట పనిలో వుండి ఆదమరిచి వున్న మన కామ్రేడ్స్‌పై శత్రువు అకస్మాత్తుగా గుండ్లవర్షం కురిపించాడు. ఈ సందర్భంగా కామ్రేడ్ రణిత ఆ ప్రమాదం నుండి తప్పించుకోవడమే కాకుండా గాయపడిన తన సహచర కామ్రేడ్‌ను కొంతదూరం తీసుకుపోయింది. గాయపడిన కామ్రేడ్ తను ఇక నడవలేనని తన తుపాకీ తీసుకెళ్ళమని కోరగా, ఆ తుపాకిని కూడా రణిత తీసుకుని ముందుకు పోయింది. అయితే ఊహించని విధంగా తిరిగి శత్రువు మాటుగాసి చేసిన దాడిలో కామ్రేడ్ రణిత వీరమరణం పొందింది.

ఉద్యమం పట్ల అంకితభావం, పార్టీ ఇచ్చిన బాధ్యతలను స్వీకరించి కృషి చేయడం ఆమెలోని సుగుణాలు. ఆమె మరణం ఉద్యమానికి తీరనిలోటు. కామ్రేడ్ రణిత అసంపూర్తిగా వదిలి వెళ్ళిన కర్తవ్యాలను పరిపూర్తి చేద్దామని శపథం చేద్దాం.

సుక్మా జిల్లా యువ కిశోరం, ముండుమ్ పోరుకెరటం

# కామ్రేడ్ సందీప్

## (పీసాల్)కు విప్లవ జోహార్లు!



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, ముండుమ్ గ్రామంలో కామ్రేడ్ సందీప్ జన్మించాడు. తల్లిదండ్రులు పెట్టిన పేరు పీసాల్. అతని చిన్నతనంలోనే తల్లి మరణించింది. తండ్రి, అన్న చేతుల మీదుగా పెరిగి పెద్దవాడయ్యాడు. వున్న కొద్ది భూమిలో, వర్షాకాలపు పంటలేసుకొని ఆ కుటుంబం జీవనం సాగించేది. అప్పటికే ఆ ప్రాంతమంతా పార్టీ నిర్మాణాలు వుండటంతో, సందీప్ అన్న సంఘంలో పని చేసేవాడు. కామ్రేడ్ సందీప్ మొదట్లో బాలల సంఘంలో పని చేసి, 16 సంవత్సరాలు వచ్చే నాటికి మిలీషియాలో సభ్యత్వం పొందాడు. పార్టీ మిలీషియాకు అప్పజెప్పిన పనుల్లో చురుగ్గా, హుషారుగా తన వంతు పాత్ర నిర్వహించేవాడు. 2017 ప్రారంభంలో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలోకి రిక్రూట్ అయ్యాడు. 6 నెలల పాటు స్థానిక దళంలో పని చేసాడు. ఈ క్రమంలోనే పార్టీ అవసరాల రీత్యా, వేరే జోన్‌లోని బాధ్యుడికి గార్డుగా వుండాలని స్థానిక పార్టీ సందీప్‌తో చెప్పినప్పుడు, మరోమాట ఎదురు చెప్పకుండా ఒప్పుకున్నాడు.

2017 సెప్టెంబర్‌లో ఎ.ఒ.బికి వచ్చి, నాయకత్వ కామ్రేడ్‌కి గార్డుగా తన విధులను ప్రారంభించాడు. మిగతా కామ్రేడ్స్ అందరూ తనకి మొదటి పరిచయమే అయినప్పటికీ, అందరితో చాలా తక్కువ సమయంలో దగ్గరయ్యాడు. తెలియని ఏ పనినైనా చొరవతో తెలుసుకొని చేసేవాడు. మిలటరీపరంగా డ్రిల్స్ నేర్చుకోవడంలో గానీ, నేర్చుకున్నదాన్ని ఇతరులకు నేర్పించడంలో గాని ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవాడు. మొదట్లో చదువు రావట్లేదని కొంత ఇబ్బంది పడ్డాడు. "మనిషి కష్టపడి నేర్చుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదనీ, నేర్చుకోవడంపై దృష్టి పెడితే ఖచ్చితంగా నేర్చుకుంటావని" తోటి సహచరులు ప్రోత్సహించడంతో, స్వల్పకాలంలోనే పట్టుదలతో కృషి చేసి, చదువులో రాణించాడు. ఉద్యమ అవసరాలకు అనుగుణంగా ఏ పనినైనా కష్టపడి నేర్చుకునేవాడు. అంతేకాదు పనిలో సృజనాత్మకతను ప్రదర్శించేవాడు. అందుకే అయన ఏ పని చేసినా అందరి మెప్పుకోలును పొందేవాడు. నాయకత్వ రక్షణ బాధ్యత రీత్యా సందీప్‌కు ప్రజలను కలిసే అవకాశం తక్కువగా ఉండేది. అయినప్పటికీ, స్థానిక ప్రజల భాషను నేర్చుకోవడంలో శ్రద్ధ పెట్టేవాడు. తెలుగు, కువ్వి, ఒడియా కామ్రేడ్స్‌తో వారి భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నించేవాడు. ఆయా కామ్రేడ్స్‌తో వారి భాషనే మాట్లాడుతూ, తనకు తెలియని ఎన్నో విషయాలను తెలుసుకునేవాడు. సహచర కామ్రేడ్స్ ఇబ్బంది పడితే తట్టుకోలేకపోయేవాడు. తన శక్తిమేరకు వారికి సహకరించేవాడు. మహిళా కామ్రేడ్స్‌ని గౌరవించేవాడు.

పార్టీ పనులన్నింటిలో రాణిస్తూనే, గార్డుగా తన ప్రధాన కర్తవ్యాన్ని ఆద మరవక నిర్వహించేవాడు. సమయపాలనను తు.చ తప్పక పాటించేవాడు. తన బాధ్యుడు అధ్యయనంలో లీనమైనప్పుడు గానీ, పని వత్తిడిలో వున్నప్పుడుగానీ, తనకు ఏం కావాలో ఆ సమయానికి గుర్తుచేసి అందించేవాడు. తన బాధ్యుడిని ఎంతగా అధ్యయనం చేశాడంటే, తను ఒక పని ముగించుకొని మరో పనిలోని ప్రవేశించబోతున్నాడంటే ఆ పనికి కావాల్సిన వాటిని పసిగట్టి, ఆ వెంటనే సమకూర్చేవాడు. బాధ్యుడు ఏదైనా మరిచిపోయినప్పుడు, మరోకంటితో కనిపెట్టుకొని వుండి ఆ వస్తువును ఏ సమయానికి ఉపయోగిస్తాడో ఆ సమయానికి తీసుకెళ్ళి ఇచ్చేవాడు. రక్షణకు సంబంధించిన విషయంలో కొద్ది కాలంలోనే మంచి పట్టు సంపాదించాడు. తను ఏ పనిలో వున్నప్పటికీ, బాధ్యుడి రక్షణ విషయంలో అప్రమత్తంగా వుండేవాడు. పార్టీ అవసరాల నిమిత్తం తను బయటికి వెళ్ళాల్సివచ్చినప్పుడు బాధ్యుడికి సంబంధించిన రక్షణ విషయాలతో పాటు, ఇతర అవసరాలను సహచరులకు చెప్పి వెళ్ళేవాడు. బాధ్యుడికి కావాల్సిన పనులు చేసిపెట్టడమే కాకుండా, తనకు కావాల్సిన పార్టీ రాజకీయాల్ని, రోజువారి రేడియో సమాచారాన్ని అడిగి తెలుసుకునేవాడు. మొత్తంగా పార్టీ తనకు అప్పజెప్పిన రక్షణ (గార్డ్) కర్తవ్యాన్ని అర్థం చేసుకుంటూ, ఆచరిస్తూ, అభివృద్ధి చేసుకుంటూ ఉత్తమగార్డుగా అందరి మన్ననలను

పొందాడు.

అక్టోబర్ 2016, రాంగూడలో శత్రువు మన బలగాలపై చేసిన భారీ దాడి సందర్భంలోనూ, ఫిబ్రవరి 2018 టిక్రపాడు వద్ద శత్రువు చేసిన మరో దాడి సందర్భంలోను కామ్రేడ్ సందీప్ నాయకత్వ రక్షణలో కీలకమైన పాత్ర పోషించాడు.

ఈ క్రమంలోనే మే 17, 2018న పాణిపొదర్ పరిసరాలలో నాయకత్వం వుందన్న సమాచారంతో శత్రువు భారీ దాడి అభియాన్ చేపట్టాడు. ఈ సందర్భంగా మన సెంట్రీ ముందుగా శత్రువును గమనించి ఫైర్ చేయడంతోపాటు, ఫ్రంట్ టీంలోని కామ్రేడ్స్ మైన్ పేల్చడంతో, శత్రువు గాబరాతో వెనక్కుతగ్గాడు. ఇదే అదునుగా మన బలగాలు రిట్రీట్ అయ్యాయి. అయితే శత్రువు మన రిట్రీట్ దారులన్నింటిని తన బలగాలతో మూసివేయడంతో, మన రిట్రీట్‌కు అవరోధం ఏర్పడింది. ఈ క్రమంలోనే, శత్రువు జోడాం వద్ద ఏర్పాటు చేసిన ఆంబుష్‌ను నిర్ధాంచుకొనేందుకు చెకింగ్ నిమిత్తం, ఒక టీంను పంపవలసి వచ్చింది. ఆ సందర్భంలో నాయకత్వ రక్షణ బాధ్యతనే కాకుండా, అక్కడున్న మొత్తం బలగాల రక్షణను చేపట్టే అత్యంత సాహసంతో కూడిన, త్యాగనిరతితో కూడిన చెకింగ్ కర్తవ్యాన్ని నిర్వహించడంలో ముందుపీఠిన నిలిచిన నలుగురు కామ్రేడ్స్‌లో కామ్రేడ్ సందీప్ ఒకడిగా ముందుకు వచ్చాడు. ఇలా ముందుకు వచ్చిన కామ్రేడ్స్‌తో ఏర్పాటైన చెకింగ్ టీం ఫార్మేషన్‌లో కామ్రేడ్ సందీప్ మొదటి వ్యక్తిగా వున్నాడు. ఈ టీం శత్రువు ఆచూకీని తెలుసుకునేందుకు వెళ్తున్న క్రమంలోనే, మాటుగాసి వున్న శత్రువు చేసిన ర్యాపిడ్ ఫైరింగ్‌లో సందీప్ అమరుడైనాడు. మిగిలిన కామ్రేడ్స్ తృటిలో తప్పుకున్నారు.

కామ్రేడ్ సందీప్ ఉద్యమంలోకి వచ్చి కొద్ది కాలమే అయినా, వయస్సులో చిన్నవాడే అయినా అనతికాలంలోనే కార్మికవర్గ లక్షణాలను సంతరించుకొని, తన వర్గవిముక్తి కోసం ఏ మాత్రం శషబిషలు లేకుండా, తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిన గొప్ప కమ్యూనిస్టు, ప్రజా సైనికుడు, ఉత్తమ గార్డుగా మనస్మృతిలో చిరస్థాయిగా నిలుస్తాడు. మనందరికి ఆదర్శప్రాయుడు. ▲

---

**43వ పేజి తరువాయి భాగం...**

అమరులపై పాటలు కూడా రాసేది. 2016లో తన సహచరుడు కామ్రేడ్ జైరాం ప్రజా శత్రువును మట్టుబెట్టడం కోసం బూబీట్రాప్‌ను పెట్టి చెక్ చేస్తున్న క్రమంలో, సాంకేతిక లోపం వలన, అది పేలి అమరుడయ్యాడు. ఆ సమయంలో కామ్రేడ్ కుమారి పార్టీ పని మీద సివిల్‌లో వెళ్ళింది. ఈ విషయం తెలిసినప్పటికీ, గుండెలో బాధని దిగమింగుకుంటూ, తనతో వున్న సహచర కామ్రేడ్‌కి ధైర్యం చెబుతూ, పార్టీ ఇచ్చిన పనిని పూర్తి చేసుకుని దళాన్ని చేరుకుంది. జరిగిన విషాదాన్ని తనకు ఎలా చెప్పాలని ఆలోచిస్తున్న సహచర కామ్రేడ్స్‌కి వాళ్ళ ముందు కన్నీరు పెట్టుకోకుండా "జైరాం ప్రజల కోసమే ప్రాణాలిచ్చాడు. తన మరణం మనల్ని బాధకు గురి చేసినా తన ఆశయం మనలో మరింత బాధ్యతను తెలుపుతుంది. జైరాం ఆశయాలను చివరివరకు కొనసాగిస్తా" అని ఎంతో నిబ్బరంతో, పార్టీ అందించిన రాజకీయ చైతన్యంతో తను మాట్లాడిన ఆ మాటలు అందరి కామ్రేడ్స్‌ని ఆశ్చర్యానికి గురి చేశాయి. చైతన్యపూరితమైన తన మాటలు నాయకత్వ కామ్రేడ్స్‌కి, సహచర కామ్రేడ్స్‌కి గర్వంగా తోచాయి.

కామ్రేడ్ కుమారి పార్టీ, సైనిక క్రమశిక్షణకు కట్టుబడివుండటం, పార్టీ ఇచ్చిన బాధ్యతలను విధిగా నిర్వహించడం వంటి విషయాలను విప్లవ జీవితంలో అలవాటుగా మార్చుకుంది. రాజకీయంగా, సైద్ధాంతికంగా అభివృద్ధి చెందింది. ఓడియా, కువ్వి, తెలుగు భాషలు మాట్లడటమే కాకుండా చదవడం, రాయడం నేర్చుకుంది. కంపెనీలో మంచి సైనికురాలిగా, డాక్టర్‌గా, నారాయణపట్నా ఏరియా ఆర్గనైజర్‌గా ప్రజల్లో చెరగని ముద్ర వేసింది. పూర్తిగా తన శక్తి, సామర్థ్యాలను నారాయణపట్నా ప్రజల కోసం వెచ్చించింది. వాళ్ళ వేష, భాషలో లీనమై, వాళ్ళతో విడదీయరాని వర్గ సంబంధాన్ని కొనసాగించింది. నారాయణపట్నా, నందపూర్ ... ఏ ఏరియాలోనైనా పని చేయగలిగే సామర్థ్యాన్ని సంపాదించింది. శ్రీకాకుళం–కోరాపుట్ డివిజన్ టెర్రయిన్‌పై పూర్తి పట్టు సాధించింది. నారాయణపట్నా ఏరియాలోని అన్ని గ్రామాలలో స్థానిక పరిస్థితులపై చర్చించి, ప్రజలు ఆ సమస్యల్లోంచి బయటపడేందుకు సాయశక్తుల కృషి చేసింది. మొత్తంగా కామ్రేడ్ కుమారి శ్రీకాకుళం–కోరాపుట్ డివిజన్ ఆధారదదగ్గ కామ్రేడ్‌గా ఎదిగింది. అంచలంచలుగా ఎదిగి నారాయణపట్నా ఉద్యమంలో ఒరిగిపోయింది. అక్కడి ప్రజల హృదయాల్లో ధృవతారగా నిలిచిపోయింది.

నారాయణపట్నా ఉద్యమం తిరిగి పునర్నిర్మానమవుతున్న సమయంలో, డొకిరిగాటిలో నరహంతక పోలీసు బలగాలు చేసిన కాల్పులలో కామ్రేడ్ కుమారితో పాటు, మరో ముగ్గురు మహిళా కామ్రేడ్స్ నేలకొరిగారు. ఆమె మరణం పార్టీకి, పి.ఎల్.జి.ఎకి, విప్లవ ప్రజానీకానికి చెప్పలేనంత దు:ఖాన్ని మిగిల్చినా, ఆమె విప్లవ జీవితం మాత్రం మనకు శత్రువును ఓడించేందుకు పర్వతమంత గట్టి దృఢసంకల్పాన్ని ఇస్తుంది. ▲

> "సోషలిజాన్ని విజ్ఞానశాస్త్రం చేయాలంటే ముందుగా దాన్ని వాస్తవ ప్రాతిపదికపై నిలబెట్టాలి."
>
> (యాంటి డ్యూరింగ్ ఎంగెల్స్ 29వ పేజి)

## ఎమ్.కె.వి.బి డివిజన్‌లో 'అడవి మీద అధికారం ఆదివాసీలది, పీడిత ప్రజలదే', 'విప్లవ ప్రజా కమిటీలకే రాజకీయ అధికారం' అనే నినాదాలతో పురోగమిస్తున్న

# సాయుధ వ్యవసాయక విప్లవ కార్యకలాపాలు

గత మూడున్నర దశాబ్దాలు (ముప్పై ఐదు సంవత్సరాలు)గా, మన పార్టీ నాయకత్వంలో కొనసాగిన వర్గపోరాటం ఫలితంగానూ, భారత దళారీ పాలకవర్గాలు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుకూలంగా చేపట్టిన విధానాల (ఎల్.పి.జి) మూలంగాను, ప్రస్తుత అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థ చట్రంలోనే, వర్గ సంపుటిలో, కొన్ని మార్పులు జరుగుతూ వస్తున్నాయి. సామాజికంగా వస్తున్న ఈ మార్పులను నిశితంగా పరిశీలిస్తూనే, అందుకు అనుగుణంగా వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ఈ దృష్టితోనే, 2016 సంవత్సరంలో మనం, ఎ.ఒ.బిలో చేపట్టిన సామాజిక, వర్గ సంబంధాల పరిశీలనపై ఆధారపడి, గెరిల్లా జోన్‌లో 'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజా కమిటీలకే అధికారం' అనే కేంద్ర నినాదంతో, సాయుధ వ్యవసాయిక విప్లవాన్ని, ముందుకు తీసుకుపోయే కార్యక్రమాన్ని చేపట్టి, కొనసాగిస్తున్నాము. మన ఆదివాసీ ప్రాంతాలలో నేటికీ భూమిలేని వ్యవసాయ కూలి, పేద రైతాంగం భూమి కోసం పోరాడుతూనే వున్నారు. వ్యవసాయంలో ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందక, వెనకబడిన ఉత్పత్తి విధానం ద్వారా దిగుబడులు పెరగక, స్వయం సమృద్ధిని సాధించలేకపోతున్నారు. ఉత్పతి సంబంధాలలో మార్పులు తెస్తూ, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో ఆదివాసేతర పెత్తందార్లు, కొందరు తెగపెద్దలు (భూస్వాములుగా మారినవారు), ఫారెస్టు డిపార్ట్‌మెంట్, బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, మధ్య దళారీలు, నూతనంగా వృద్ధి చెందిన భూస్వాములకు వ్యతిరేకంగా మన పోరాటం కొనసాగుతున్నది.

పెదబయలు ఏరియాలోని, చిట్టెంగరువు ఆదివాసేతర పీడిత ప్రజల గ్రామం. అయితే వీరు ఆంధ్రప్రదేశ్‌లో, ఆదివాసీలుగా గుర్తింపు పొందారు. ఒడిషాలో వారికి ఆదివాసీలుగా గుర్తింపు లేదు. ఈ గ్రామంలో 30-35 కుటుంబాలున్నాయి. అందరూ వ్యవసాయం మీద ఆధారపడే జీవిస్తున్నారు. కానీ ఈ గ్రామంలో వ్యవసాయ కూలి, పేదరైతాంగం అధికంగానే ఉన్నారు. అయితే గ్రామ పెత్తందారు (నాయక్) చేతిలో 50 ఎకరాలకు పైబడిన మెరుగైన సాగు భూములు ఉన్నాయి. అందులో కూలీల ద్వారా పని చేయించి, వారి శ్రమను దోపిడీ చేయడం ద్వారా, ఆర్థికంగా అభివృద్ధి చెంది, రాజకీయంగా ప్రజలపై ఆధిపత్యాన్ని చలాయించేవాడు. అందులో కొంత భూమిని సాగు చేయకుండా బీడుగా వదిలేసి, దానిపై తన హక్కును నిలుపుకున్నాడు తప్ప, భూమిలేని పేదలకు సెంటు భూమి కూడా సాగు చేయడానికి అనుమతి నివ్వలేదు. వయస్సు పెరిగి, ముసలితనంతో అతడు చనిపోతే, ఆ భూములపై హక్కు మాదేనంటూ అల్లుడు యజమానిగా ముందుకు వచ్చాడు. ఈ గ్రామంలోని విప్లవ రైతు కూలి సంఘం, ఆ భూముల స్వాధీనం కోసం ప్రజలకు పిలుపునిచ్చింది. దీంతో ప్రజలు సంఘ నాయకత్వంలో, భూస్వామిని ప్రజా పంచాయితీకి లాగి, ఆ భూమిపై భూమిలేని పేదలకే హక్కు వుందని తీర్పు చెప్పారు. భూస్వామి ప్రజల తీర్పును ఆమోదిస్తూ, అంగీకరించక తప్పలేదు. ఆ తర్వాత 15 ఎకరాల పొలం భూమిని, 20 ఎకరాల చెలక భూములను సంఘం నాయకత్వంలో స్వాధీనం చేసుకొని, గ్రామంలో భూమిలేని పేదరైతాంగానికి చెందిన, 20 కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది. ఆ భూములను ప్రజలు సమిష్టి శ్రమ ద్వారా సాగుకు యోగ్యంగా తయారు చేసుకొని, పంటలు వేసుకున్నారు. ఈ పోరాటం ద్వారా భూమిని



పార్టీ పిలుపునందుకొని ప్రజా అభివృద్ధి, స్వావలంబనలో భాగంగా, కూరగాయలు పండిస్తున్న ఆదివాసీ రైతాంగం

సాధించుకోవడమే కాకుండా, తదుపరి విప్లవ ప్రజా కమిటీని ఏర్పర్చుకొనేందుకు సమాయత్తమవుతున్నారు.

కోరుకొండ ఏరియాలోని, రోళ్ళగడ్డ (పంచాయితీ)గ్రామం పూర్తిగా ఆదివాసీ గ్రామమే. చాలా సంవత్సరాలుగా పంచాయితీ గ్రామంగా వున్నప్పటికీ, కనీస అభివృద్ధికి ఆమడ దూరంలో వుంది. ఈ పంచాయితీకి చెందిన గ్రామాలపై కూడా ఆదివాసేతర పెత్తందారుల, రాజకీయ నాయకుల ఆధిపత్యం చలామణిలో వుంటూ వస్తున్నది. గ్రామంలో ఈ నాటికి భూమిలేని పేదలు కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో గ్రామ పెత్తందారు స్వాధీనంలో వుండి, సాగు చేసుకున్న పోలం భూమిని (గ్రామానికి దూరంగా వుంది) కొంతకాలం తర్వాత వదిలివేయడంతో బీడుగా మారింది. కానీ దానిని ప్రజలెవ్వరు సాగు చేసుకోవడానికి అనుమతి నివ్వకుండా అడ్డుకుంటు వస్తున్నారు. గ్రామంలోని విప్లవ రైతుకూలీ, విప్లవ మహిళా సంఘాల నాయకత్వంలో 10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని, భూమిలేని 15 కుటుంబాలకు పంపిణీ చేసారు. ఈ భూమిని సాగు చేసుకోవడానికి వీలుగా గ్రామంలోని ప్రజలు అన్ని రకాలుగా వారికి సహకరించారు. గతంలో ఈ గ్రామంపై పోలీసులు అనేకసార్లు దాడులకు దిగి, సంఘ కార్యకర్తలను అరెస్ట్ చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసారు. ప్రజలకు భూమిపై హక్కు, రాజకీయ అధికారం దక్కాలంటే ప్రజలు సాయుధం కావాల్సిందేనని పార్టీ ఇచ్చిన పిలుపునందుకొని, వాళ్ళు సాయుధం అవుతున్నారు.

కోరుకొండ ఏరియాలోని, సువ్వపల్లి గ్రామంలో, మొత్తం కువ్వి తెగకు చెందిన ఆదివాసి ప్రజలు నివసిస్తున్నారు. అన్ని తెగలలోలాగానే, ఈ తెగలో కూడా తెగవ్యవస్థ, దానికి తెగ పాలక వర్గం బలంగా వుండేది. గత 10 సంవత్సరాల క్రితమే, తెగ నాయక్ రాజకీయ ఆధిపత్యానికి వ్యతిరేకంగా, సంఘ నాయకత్వంలో పోరాటం జరిగింది. కాని తెగ పెద్ద, సంఘంలో బంధుత్వాన్ని ఉపయోగించుకొని, చీలికలు సృష్టించి, కుట్రలకు పాల్పడి, సంఘ నాయకుడి ఇంటిపై దాడి చేయించి, హత్య చేయాలని చూసాడు. ఒకవైపు ప్రభుత్వదాడి, మరొకవైపు తెగ పెద్ద కుట్రలకు తట్టుకోలేక, సంఘ నాయకుడు గ్రామం వదిలి వెళ్ళిపోయాడు. తెగ పెద్ద కొత్త అవతారమెత్తి, క్రిష్టియన్ సంఘ పెద్దగా మారి, ప్రజలను మత, అంధ విశ్వాసాలలో ముంచి, అహింస, శాంతి పేరుతో, పోరాటం స్థానంలో వర్గ సామరస్యాన్ని బోధించి, తన అధికారాన్ని నిలబెట్టుకున్నాడు. ఆ తర్వాత తెగ పెద్ద మరిన్ని ఆస్తులు కూడగట్టాడు. రాజకీయ పెత్తనం చలాయిస్తూ, ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు పెంచుకున్నాడు. చుట్టు పక్కల గ్రామాలలో జరుగుతున్న వ్యవసాయక విప్లవ పోరాట ప్రభావం, ఈ గ్రామ ప్రజలపై పడి వారు చైతన్యంతో, నాయక్‌ను ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ ప్రభావం పక్కనున్న కొక్కులగడ్డ గ్రామంపై కూడా పడింది. దీంతో వారు సంఘ నాయకత్వంలో సంఘటితపడి, తెగపెద్ద స్వాధీనంలో వున్న అటవీ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సువ్వపల్లి గ్రామ ప్రజలు, తెగ పెద్ద స్వాధీనంలో వున్న చెరువును స్వాధీనం చేసుకొని, సమిష్టి శ్రమ ద్వారా మరమత్తులు చేసుకున్నారు. పశువులు ఎండాకాలం నీళ్ళు త్రాగడానికి వీలుగానూ, సీజన్లలో పంట సాగుకు ఉపయోపడే విధంగానూ, చేపల పెంపకానికి అనువుగాను దీనిని అభివృద్ధి చేసుకున్నారు. ఈ సంవత్సరం సీజన్‌లో చేపల పెంపకం కూడా మొదలు పెట్టరు. దీనితో తెగపెద్ద ప్రజల సంఘటిత పోరాటం ముందు లొంగిపోక తప్పలేదు.

కటాఫ్ ఏరియాలోని జొంత్రి గ్రామం, బలిమెల రిజర్వాయర్ నీటి అంచున వుండే ఆదివాసీ గ్రామం. బలిమెల డ్యాంను నిర్మించడానికి ముందు, ఈ గ్రామంలోని ప్రజలందరికి దున్నుకోవడానికి సరిపడ సాగు భూములుండేవి. కాని డ్యాం నిర్మాణం తర్వాత, సాగు భూములన్ని నీటి ముంపుకు గురయ్యాయి. ప్రభుత్వం, ఇక్కడి ప్రజలకు కోల్పోయిన భూములకు నష్టపరిహారం చెల్లించడం గానీ, ఉపాధి మార్గం చూపడం గాని చేయలేదు. ఈ గ్రామానికి రెండు వైపులా నీరు, ఒక వైపు ఎత్తైన కొండలు వుండటంతో, కొత్తగా సాగు చేసుకునే భూములు అందుబాటులో లేవు. కొన్ని కుటుంబాలు గ్రామాన్ని వదిలి, కూలీ పనులు వెతుక్కుంటు వెళ్ళారు. మరి కొన్ని కుటుంబాలు పుట్టిన ఊరిని వదులుకోలేక అక్కడే వుండిపోయారు. గ్రామంలోని మెజారిటీ భూములు ముంపుకు గురికాగా, మిగిలిన భూములను కొందరు పెత్తందారులు, తెగపెద్ద కుటుంబాలు, ప్రజలను బెదిరించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో కూలీ పనులు కూడా దొరకని కొన్ని కుటుంబాలు, సీజన్‌లో చేపల వేట మీద ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామ తెగపెద్ద కుటుంబం చేతిలోనే సాగుకు యోగ్యమైన మెజారిటీ వరి పండే భూములున్నాయి. ఈ గ్రామంలో సంఘ నాయకత్వంలో గ్రామ పెత్తందారులకు, ప్రజా వ్యతిరేకులకు వ్యతిరేకంగా జరిగిన వర్గపోరాటంలో, కొందరు పెత్తందారులు భయపడి గ్రామాన్ని వదిలి వెళ్ళగా, మరికొందరు సంఘానికి లొంగిపోయి, గ్రామంలోనే వుండిపోయారు. గ్రామంలో సంఘానిదే పై చేయి అయ్యింది. దీంతో గ్రామంలో భూమి సమస్యను పరిష్కరించేందుకు, వున్న భూములన్నింటిని సాగులోకి తెచ్చేందుకు, మొదట భూమిలేని, భూమి కల్గిన కుటుంబాలను కలిపి, శ్రమ సహకార గ్రూపులుగా ఏర్పాటు చేసి, పండిన పంటను అందరికీ సమానంగా పంచారు. 2 సంవత్సరాలు గడిచిన తర్వాత గ్రామంలో మొత్తం భూములను కలిపి, సమిష్టి వ్యవసాయ క్షేత్రంగా మార్చారు. తెగపెద్ద కుటుంబాన్ని మాత్రం, శ్రమ సహకార గ్రూపులలో కలుపుకోలేదు. ఈ సంవత్సరం (2018) సంఘ నాయకత్వంలో తెగపెద్దకు చెందిన 15 ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని, సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో కలిపివేశారు. భూస్వామి అయిన తెగపెద్ద ప్రజల నిర్ణయానికి ఆమోదం తెలుపక తప్పలేదు. శ్రమలో ఆ కుటుంబం భాగస్వాములయితే, అన్ని కుటుంబాలకు లాగానే, ఆ కుటుంబానికి కూడా పంటలో వాటా యిస్తామని, సంఘం ప్రకటించింది.

కటాఫ్ ఏరియాలోని, ఒంద్రుపల్లి పంచాయితీ, కోడిగొంది

గ్రామంలో భూమిలేని పేదల సమస్యను పరిష్కరించడం, సాగు చేయకుండా బీడుగా వుంటున్న (పశువుల కొరత, కుటుంబాలలో శ్రమ చేసే వాళ్ళు లేక) భూములను సాగులోకి తెచ్చే లక్ష్యంతో, గత సంవత్సరం గ్రామంలోని మొత్తం కుటుంబాలను కొన్ని గ్రూపులుగా విభజించి, శ్రమ సహకార టీంలను ఏర్పాటు చేశారు. ఎక్కువ భూములున్న కొన్ని కుటుంబాలు ఈ గ్రూపులలో కలువకుండా విడి కుటుంబాలుగానే సాగు చేసుకున్నారు. అసలే భూమిలేని వాళ్ళ సమస్యను పరిష్కరించడంలో భాగంగా, భూ అసమానతలను తొలగించడానికి సంఘం ప్రజలతోనూ, ధనిక, మధ్య తరగతి రైతు కుటుంబాలతో చర్చించింది. దానితో ధనిక, మధ్య తరగతి నుండి కృష్ణ, రూప అనే రైతులు తమ భూముల నుండి 7ఎకరాల భూమిని ఇవ్వడానికి ముందుకు వచ్చారు. విప్లవ భూ సంస్కరణలలో భాగంగా, సంఘ నాయకత్వంలో భూమిలేని 7 కుటుంబాలకు భూ పంపిణీ చేసింది. ఇదే ఏరియాలోని తోటగూడ గ్రామంలో గత 3 సంవత్సరాల క్రితం, సాగునీటి కోసం ప్రజలు సమిష్టిగా శ్రమించి, చెక్‌డ్యాంను నిర్మించుకున్నారు. దాని కింద వున్న భూములను సాగులోకి తేవడం కోసం ఈ సంవత్సరం (2018) ఒక నెల రోజులు గ్రామ ప్రజలంతా సమిష్టిగా భూమి చదును కార్యక్రమం చేపట్టి, 15 ఎకరాలు సాగులోకి తెచ్చి, సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో కలిపివేశారు. అలాగే మర్రిబెడ, కొండంజరి గ్రామాలలో కూడా, భూమిని చదును చేసి, సాగుకు యోగ్యంగా తయారు చేసి, భూమిలేని 6 కుటుంబాలకు పంపిణీ చేశారు.

విశాఖ జిల్లాలోని పెదబయలు ఏరియా, మల్కనగిరి (ఒడిషా) జిల్లాలోని కటాఫ్ ఏరియాలో గత 3 సంవత్సరాలుగా మెజారిటీ గ్రామాలలో (ప్రజా వ్యతిరేకులను మినహాయించి) ప్రజలు శ్రమ సహకార గ్రూపులుగా ఏర్పడి, వ్యవసాయం చేస్తూ వస్తున్నారు. ఈ సహకార గ్రూపులు మొదట 5 నుండి 15 కుటుంబాలు, ఒక్కొక్క గ్రూపుగా ఏర్పడి, పని చేసాయి. కొన్ని గ్రామాలలో భూముల స్థాయి ఆధారంగా, కుటుంబాలు గ్రూపులుగా ఏర్పడగా, మరికొన్ని గ్రామాలలో భూములు వున్నవారు, భూమిలేని వారిని కలుపుకొని గ్రూపులు ఏర్పాటు చేసారు. ఎలా ఏర్పడినా, పండిన పంటను సమాన వాటాలుగా పంచుకునేవారు. దీనిపై ప్రతి సంవత్సరం సమీక్షా సమావేశాలు జరుపుకున్నారు. ఈ పద్ధతికి ముందు కొన్ని కుటుంబాలలో, భూమి ఉండి కూడా వ్యవసాయ ఉపకరణాలు (పశువులు, నాగళ్ళు)లేకా, కొన్ని కుటుంబాలలో భర్తలు(పని చేసేవారు) చనిపోయినప్పుడు మహిళలు వితంతువులుగా మారి, వ్యవసాయ పనులు చేయలేకా, వర్షాధారంపై ఆధారపడిన వ్యవసాయం కనుక, సకాలంలో దుక్కి దున్నకా – ప్రతి గ్రామంలో కొంత భూమి భీడు భూమిగా వుండి పోయేది. అంటే భూమి వుండి కూడా మొత్తం భూములను సాగులోకి తేలేకపోయేవారు. సకాలంలో పంట వేసుకున్నవారికి కూడా, ఎవరికి వారు సాగు చేసుకోవడం వలన పంట దిగుబడి తక్కువగా వచ్చేది. అదే సమయంలో గ్రామంలో భూమిలేని కుటుంబాలకు పనులు దొరకక ఇతర ప్రాంతాలకు వలసపోయేవారు. ఈ సమస్యలన్ని పార్టీ నాయకత్వంలో చేపట్టిన విప్లవ సంస్కరణలవల్ల కొంత మేరకు పరిష్కారమైనాయి.

శ్రమ సహకార గ్రూపులుగా ఏర్పడి, వ్యవసాయం ప్రారంభమైన తర్వాత పైన ఎదుర్కొన్న 4 సమస్యలను పరిష్కరించగలిగారు. శ్రమ సహకార గ్రూపులు ఏర్పర్చుకున్న తర్వాత, వ్యవసాయ ఉపకరణాలు ఉన్నవారు, అవి లేనివాళ్ళ భూములను కూడా సాగు చేసారు. అందరు కలిసి, ఎక్కువ గంటలు పని చేసి, మొత్తం భూములను సాగులోకి తెచ్చి, సకాలంలో పంటలు వేశారు. దానితో గ్రామంలో, మొత్తం పంట దిగుబడి గతం కన్న కొన్ని రెట్లు పెరిగింది. భూమిలేని వారికి కూడా పని కల్పించబడింది. భూమిలేనివారు, భూమి ఉన్న వారితో సమానంగా పంటను పొందడంవలన, వలసలు వెళ్ళే సమస్య, ఆర్థాకలి సమస్య చాలా వరకు పరిష్కారం అయింది. భూములు వున్నవారు, అందులో ఎక్కువ భూములు ఉన్నవారు గతంలో వ్యక్తిగతంగా (విడి కుటుంబంగా) సాగు చేసుకున్నప్పుడు వచ్చిన ఆదాయం (దిగుబడి) కన్న, ఈ పద్ధతి ద్వారా కొంత ఎక్కువగానే పొందారు. కనుక వారికి ఆర్థికంగా నష్టం జరుగలేదని సమావేశంలో సమీక్షించారు. ఈ సహకార పద్ధతి మరింత విస్తరించి, ఒక గ్రూపులో పంట దెబ్బతిన్నప్పుడు, పంట ఎక్కువ వచ్చిన గ్రూపులు వాళ్లు తమకు పండిన పంట నుండి కొంత భాగం సహాయం అందించడం ప్రారంభమైంది. ఈ సహకార ధోరణి, మరింత అభివృద్ధి చెంది, పంటలు దెబ్బతిన్న పక్క గ్రామాలకు సహాయం అందించే స్థాయికి ఎదిగింది. ఈ సంవత్సరం కటాఫ్ ఏరియాలో, సుమారు 20 గ్రామాలలో మొత్తం భూములను సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా మార్చివేశారు. ఆ భూములలో ప్రజలంతా సమిష్టిగానే శ్రమ చేయడం, పండిన పంటను ప్రతి కుటుంబానికి (జనాభా ప్రాతిపదికన) సమానంగా పంపిణీ చేయడం జరుగుతున్నది. అయితే ఈ గ్రామాలన్ని పూర్తిగా ఆదివాసీ గ్రామాలు, వర్గ, భూ అసమానతలు సాపేక్షికంగా తక్కువ స్థాయిలో వున్న గ్రామాలు, సహకార వ్యవసాయాన్ని సమర్థవంతంగా నడపడంలో అనుభవం వున్న గ్రామాలే.

గతంతో పోల్చితే పంటల మార్పిడిని అనుసరిస్తున్నారు. భూములను సాగుకు అనుకూలంగా తయారు చేసుకుంటున్నారు. మార్కెట్‌పై ఆధారపడకుండా స్వయంగా కూరగాయ తోటలు వేసి పండిస్తున్నారు. పశువుల సంరక్షణలో భాగంగా, అంటువ్యాధులు ప్రబలకుండా పశుశాలలను శుభ్రంగా వుంచడం, వర్షాలలో తడిసిపోకుండా చూడడం లాంటి చర్యలు చేపట్టి, పశుమరణాల రేటును తగ్గించారు. క్రమంగా స్వావలంబనతో కూడిన అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. ఈ మార్పు వెనుక ప్రజలు చేసిన పోరాటం, పార్టీ సల్పిన రాజకీయ కృషి వుంది. అదే ఉత్పత్తి సబంధాలలో, ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో ఈ స్వల్ప మార్పుకు కారణమయింది. దీని కొనసాగింపులో మరింత అభివృద్ధిని సాధించాలంటే, దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధాన్ని మరింత ఉన్నత దశకు తీసుకుపోవాలి.

# మార్చి 8, అంతర్జాతీయ శ్రామికమహిళాపోరాటదినం

## సందర్భంగా, ఎ.ఒ.బి జోన్‌లో, మహిళలపై రాజ్యహింసకు వ్యతిరేకంగా మార్చినెలంతా కొనసాగిన ప్రచార, ఆందోళన కార్యక్రమాలు

విప్లవోద్యమంలో రోజురోజుకు పెరుగుతున్న మహిళల భాగస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు, ప్రభుత్వ సాయుధ బలగాలు మహిళలపై అత్యాచారాలను ఒక ఆయుధంగా ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే వాకపల్లి, బల్లుగూడ, కుందిలి వంటి సంఘటనలు వెలుగులోకొచ్చి, వాటికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఇంకా ఇలాంటి సంఘటనలెన్నో వెలుగు చూడటం లేదు. ఇందుకు పరువు ప్రతిష్టలూ, కుటుంబం నుండీ, సమాజం నుండి ఎదురయ్యే సమస్యలు కారణంగా వుంటున్నాయి. ఇలాంటి సంఘటనలపై కోర్టులలో న్యాయం జరుగుతుందనే విశ్వాసం కూడా ఏ మాత్రం లేకపోవడం ఒక బలమైన కారణంగా వుంది. ఎందుకంటే ఇవి ప్రభుత్వ కనుసన్నలలో జరుగుతున్నవే కనుక.

పై పరిస్థితుల నేపథ్యంలోనే, 2018 మార్చి8 మహిళా దినాన్ని, 'మహిళలపై రాజ్యహింస (సాయుధ బలగాల అత్యాచారాలు)కు వ్యతిరేక దినం'గా, మార్చి నెలంతా జరపాలని ఎ.ఒ.బి–ఎస్.జడ్.సి పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకొని విప్లవ మహిళా సంఘం 1. వాకపల్లి, బల్లుగూడ, కుందిలి, యిడ్మె (ఛత్తీస్‌ఘడ్) అత్యాచారాలకు కారకులైన పోలీసులను విచారించి దోషులను శిక్షించాలని, 2. గ్రామాల నుండి పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని, 3.బాధిత మహిళలకు ప్రజలందరు అండగా నిలబడి పోరాడాలనీ, 4. వాకపల్లి మహిళలపై విచారణను అడ్డుకుంటున్న ప్రభుత్వ వైఖరిని ప్రతిఘటించాలనే డిమాండ్‌లతో, మార్చి 8 నుండి ఎప్రిల్ 8 వరకు నెల రోజులు ప్రచారం, సభలు, ఊరేగింపులు నిర్వహించింది.

ఎ.ఒ.బి స్పెషల్ జోనల్ కమిటీ పేరుతో విడుదల చేసిన కరపత్రాన్ని జోన్‌లో అన్ని డివిజన్‌లలో పంపిణీ చేసి, ప్రచారం చేశారు. ఎక్కడికక్కడ పై డిమాండ్‌లతో బ్యానర్‌లు, పోస్టర్‌లు, పత్రిక ప్రకటనల ద్వారా నెల రోజులు ప్రచారం చేశారు. ఎమ్.కె.వి.బి డివిజన్‌లోని పెదబయలు ఏరియా, కటాఫ్ ఏరియాలలో 13 ప్రచార క్యాంపెయిన్ టీంలను నిర్మాణం చేసి, వాటి ద్వారా ప్రచారం, సభలు, ఊరేగింపులు నిర్వహించారు. మార్చి 8న గ్రామ స్థాయిలో, పలు గ్రామాలలో సభలు జరిపారు. ఆ తర్వాత పాకెట్ స్థాయి సమావేశాలు జరిపారు. కలిమెల ఏరియాలోని పప్పులూరు, కుర్మనూరులలో 300 మందితో, అల్లూరుకోటలో 300 మందితో ఊరేగింపు,



మార్చి 8 అంతర్జాతీయ శ్రామికమహిళా పోరాట దినంను పురస్కరించుకొని, మహిళలపై జరుగుతున్న రాజ్యహింస, అత్యాచారాలకు వ్యతిరేకంగా సభలు నిర్వహించుకున్న విప్లవ ప్రజానీకం

సభలు జరిపారు. పెదబయలు ఏరియాలో కోంద్రు, తల్లాబు, తొల్లాలు, పప్పరమెట్ల, జాడిగూడ పాకెట్‌లలో 300 నుండి 500 మంది వరకు మహిళలు జమై, పై డిమాండ్‌లతో కూడిన బ్యానర్లు, ఎర్రజెండాలు ధరించి, ఊరేగింపులు జరిపి, ఆ తర్వాత సమావేశాలు, సభలు జరిపారు. ఈ సమావేశాలు, సభలలో మహిళా సంఘాల నాయకురాళ్ళు, మహిళలపై రాజ్యం అమలు జరుపుతున్న హింసను వివరిస్తూ, దానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కటాఫ్ ఏరియాలోని తాబేరులో 300 మందితో, జొంత్రి పాకెట్‌లో 300 మందితో, కొసంపుట్ పాకెట్‌లో 500 మందితో, దార్లబెడ పాకెట్‌లో 200 మందితో, గురుశెట్టి పాకెట్‌లో 800 మంది మహిళలతో ఊరేగింపులు, బహిరంగ సభలు జరిపి, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలనీ, రాజ్యహింసను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం చివరలో, కటాఫ్ ఏరియాలో సుమారు 50 గ్రామాలకు చెందిన 4వేల మంది ప్రజలతో ఊరేగింపు నిర్వహించి, భారీ బహిరంగ సభ జరుపుకున్నారు. అలాగే కోరుకొండ ఏరియాలోని రోళ్ళగడ్డ, బలపం పంచాయితీలలోని 30 గ్రామాల ప్రజలు కలిసి దిగవజనబలో 3వేల మందితో భారీ ఊరేగింపు జరిపి, చివరిగా బహిరంగ సభను జరుపుకొని, తదుపరి చేపట్టవలసిన కార్యక్రమాన్ని నిర్ణయించుకున్నారు.

ఈ సభలలో పాల్గొన్న వక్తలు, మహిళలపై సాయుధ బలగాలు చేస్తున్న అత్యాచారాలనూ, హింసను ఖండించడంతో పాటు, 'మహిళల అభ్యుదయం' కోసం ప్రభుత్వం చేస్తున్న చట్టాలనూ, వాటి అమలు తీరులోని లొసుగులను ఎండగడుతూ, ఉపన్యసించారు. మొత్తం పీడిత ప్రజల విముక్తిలో భాగంగా, స్త్రీల విముక్తి కోసం జరుగుతున్న ప్రజాయుద్ధంలో, మరింత చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల రోజులు గ్రామాలలో మహిళల సమస్యలు, వారి విముక్తి మార్గంపై విస్తృతంగా రాజకీయ చర్చ జరిగింది. మహిళలను సంఘాలలోకి సమీకరించడం కూడా జరిగింది. ఈ ప్రచార ఆందోళనలు ప్రభుత్వాన్ని, పోలీసులను గాబరాకు గురి చేశాయి. వారు రాజకీయంగా ఆత్మరక్షణ స్థితిని ఎదుర్కొన్నారు. దిక్కుతోచక పార్టీపై అసత్య ప్రచారం మొదలు పెట్టారు. మైనర్ బాలికలను, దళాలలోకి రిక్రూట్ చేసుకుంటున్నారనీ, వారితో సేవలు చేయించుకుంటున్నారనీ, అత్యాచారాలకు పాల్పడుతున్నారని మండల సెంటర్లలో పోస్టర్‌లు వేశారు. వీరి అసత్య ప్రచారాన్ని ప్రజలు విశ్వసించకపోగా, ఛీకొట్టారు.

## పోలీసుల అత్యాచారానికి గురైన వాకపల్లి ఆదివాసీ మహిళలకు న్యాయం జరగాలనీ, దోషులైన పోలీసులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్న ప్రజలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, విశాఖ జిల్లాలో, మన్యం సహజ ప్రాకృతిక వనరులకు, అనేక ఖనిజ నిక్షేపాలకు పెట్టింది పేరు. ఈ సహజ సంపదపై కన్నేసిన అప్పటి బ్రిటీష్ పాలకులు ఇక్కడి ఆదివాసీలను అనేక రకాలుగా దోపిడీ పీడనలకు గురి చేశారు. అదే సమయంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా, మన్యం పితూరిగా పేరు గాంచిన ఒక గొప్ప ఆదివాసీ తిరుగుబాటు జరిగింది. అడవితో జీవితాన్ని పెనవేసుకున్న మన్యం ప్రజలు, ఈ పోరాటంలో ముందు పీఠిన నిలిచారు. 'అడవిపై అధికారం ఆదివాసీలదే' అంటూ నినదించారు. తెల్లదొరల పెత్తనాన్ని సహించలేకపోయారు. అడవిపై హక్కు కోసం వారు చేసిన పోరాటాలలో అనేక మంది నాయకులుగా ఎదిగి, ఆయా పోరాటాలకు నాయకత్వం వహించారు.

ఆ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన్యం ప్రాంతంలో, దండకారణ్య ఉద్యమంలో భాగంగా తూర్పు కనుమల్లో 1980లో, సి.పి.ఐ (ఎమ్.ఎల్) [పీపుల్స్‌వార్] నేతృత్వంలో మళ్ళీ ఉద్యమం మొదలైంది. గెరిల్లా దళాలు విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి, ఆదివాసీ సమస్యల మీద, రైతాంగాన్ని పెద్ద ఎత్తున ఉద్యమంలోకి కదిలించాయి. ఫారెస్ట్ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్ని ఏకం జేసి, వారిని అడవి నుండి తరిమికొట్టాయి.

విశాఖ మన్యంలో 1990 నుంచి భారత దళారీ పాలకవర్గాలు బాక్సైట్ గనులు తవ్వాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆదివాసీ ప్రజల ప్రతిఘటనతో వాయిదా పడుతూ వస్తున్నది. బాక్సైట్ ఖనిజాన్ని తవ్వితీసి, కార్పోరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తున్న పాలక

వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. పార్టీ ఇచ్చే గైడెన్స్‌తో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రజలంత ఐక్య సంఘటనగా ఏర్పడి, "ప్రాణాలైనా ఇస్తాం కానీ, బాక్సైట్‌ను తవ్వనివ్వం" అనే నినాదంతో ప్రభుత్వంపై వత్తిడి తేవడంతో, ప్రజా ఉద్యమానికి ఖంగుతిన్న బాబు ప్రభుత్వం తాత్కాలికంగానైనా బాక్సైట్ తవ్వకాలను వెనక్కి తీసుకుంది.

విప్లవోద్యమంలో మొదటి నుంచి, మహిళల పాత్ర చాలా కీలకమైనది. ఆదివాసీ తెగ వ్యవస్థలోని పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుతూనే, రాజ్య నిర్బంధాన్ని ఎదుర్కోవడంలో ముందు వరుసన నిలబడుతున్నారు. ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచుకుంటూ, సంఘాలుగా ఏర్పడి, తమ తమ సమస్యలపై ఉద్యమిస్తున్నారు. పాలకవర్గాల అధికారానికి వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలపై రాజ్యం నిర్బంధాన్ని కొనసాగిస్తున్నది. అయినప్పటికీ, పోరాటబాటనే ఏకైక మార్గంగా ఎన్నుకుంటున్న ఆ ఆదివాసీ మహిళలు, రాజ్య నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ, విప్లవోదమాన్ని మరింత ముందుకు తీసుకుపోతున్నారు. వారు పార్టీలో, ప్రజాసైన్యంలో, ఐక్య సంఘటనలో సగభాగంగా వుంటున్నారు. త్యాగాలు చేయడంలో ముందుపీఠిన నిలబడుతున్నారు. కనుకనే, పోలీసులు మహిళలను విప్లవోద్యమం నుండి దూరం చేయడానికి, వారిపై అత్యాచారాలను ఒక ఆయుధంగా ప్రయోగిస్తున్నారు.

2007, ఆగస్టు 20 వ తేదీన, కూంబింగ్ పేరుతో మన్యంలోకి ప్రవేశించిన గ్రేహౌండ్స్ పోలీసు బలగాలు, రాత్రికి రాత్రే వాకపల్లి గ్రామాన్ని చుట్టుముట్టి, తెల్లవారుజామున 11 మంది మహిళలను సమీప అటవీ ప్రాంతంలోకి బలవంతంగా లాక్కెళ్ళి, అమానవీయంగా, క్రూరంగా అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ ఘటన తర్వాత ప్రజలందరూ ఏకమై, బాధిత మహిళలకు న్యాయం జరగాలని పెద్ద ఎత్తున తమ పోరాటాన్ని ప్రారంభించారు. వీరికి మద్దతుగా రాష్ట్ర వ్యాపితంగా ప్రజల నిరసనలు వెల్లువెత్తాయి. వారి పోరాటానికి దేశవ్యాపిత మద్దతు లభించడంతో, అప్పటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఖంగుతిని, తప్పనిసరి పరిస్థితులలో విచారణకు అంగీకరించింది. ఆ విచారణను నీరుగార్చేందుకు అత్యాచారానికి పాల్పడిన పోలీసులను రక్షించడంలో భాగంగా, హైకోర్టుకి వెళ్ళి, పోలీసులు విచారణకు నేరుగా హాజరు కాకుండా స్టే తెచ్చింది. హైకోర్టులో బాధిత మహిళలకు న్యాయం జరగకపోవడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సంఘటన జరిగి, 10 సంవత్సరాలు గడిచిన తర్వాత, 2017ఆగస్టులో సుప్రీంకోర్టు ఈ ఘటనపై 6 నెలల్లో విచారణ పూర్తి చేయాలనీ, అలాగే ఈ విచారణకు బాధిత మహిళలు కోరుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, హైకోర్టును ఆదేశించింది. అయినా విచారణ ముందుకు సాగడంలేదు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పల్లా త్రినాథరావును నియమించాలని మహిళలు కోర్టుకు విజ్ఞప్తి చేసారు. వీరి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ పోలీసులు పల్లా త్రినాథరావును బాధిత మహిళల తరఫున వాదించకుండా ఆయనకు అనేక ఆటంకాలు సృష్టించారు. అతన్ని అరెస్ట్ చేసి, తప్పుడు కేసులు పెట్టి, వెనక్కి లాగారు. ఈ విధంగా ప్రభుత్వం నిందితులైన పోలీసులను కాపాడటమే లక్ష్యంగా పెట్టుకున్నది. దీనితో మహిళలకు కోర్టుపై, ప్రభుత్వంపై విశ్వాసం మరింతగా సడలింది. వాకపల్లి మహిళల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, నరేంద్రమోడీ 'బేటిపడావో, బేటి బచావో' నినాదం యొక్క బూటకత్వాన్ని బహిర్గతం చేస్తున్నది. కానీ ప్రజలు మాత్రం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించారు.

విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో ఏరియా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం జరిగింది. 2018 జనవరిలో 10 పంచాయితీలకు చెందిన వందలాది గ్రామాల ఆదివాసీ ప్రజలు వాకపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించి, సభ జరిపారు. ఈ ర్యాలీకి 6 వేల మంది ప్రజలు హాజరైనారు. ఈ సభలో– 1. విచారణ మన్యంలోని పాడేరు ప్రాంతంలోనే చేపట్టాలి, 2. విచారణకు నిర్బంధం లేని ఒక స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి, 3. బాధితులు కోరిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌నే నియమించాలి, 4. 2009లో బల్లుగూడ గ్రామంలో నలుగురు పోలీసులు, ఆదివాసీ మహిళలపై అత్యాచారం చేసిన ఘటనపై కూడా, విచారణ చేపట్టి దోషులను శిక్షించాలి – అని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

ఈ సందర్భంగా ప్రజలు 30 వేల రూపాయలు, 10 క్వింటాళ్ళ బియ్యం, పెద్ద ఎత్తున బట్టలు... తదితర వస్తువులను బాధితులకందించారు. ర్యాలీకి వారం రోజుల ముందు నుండే, వందలాది మంది పోలీసులు కూంబింగ్‌ల పేరుతో ప్రజలను భయపెట్టి, అడ్డుకోవాలని చూసారు. ప్రజలంతా ఏకమై, రహస్య పద్ధతులను పాటిస్తూ, ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. తాము సమావేశమవుతున్న విషయం, పోలీసుల కంటబడితే ఖచ్చితంగా భగ్నం చేస్తారని ముందుగానే పసిగట్టి, ప్రజారక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకుని, సభను విజయవంతంగా జరుపుకున్నారు. బాధిత మహిళలు మీడియా ముందు తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధైర్యంగా మాట్లాడారు.

పోలీసుల దృష్టికి అందకుండా ఇంత పెద్ద సభ జరగడంతో వారు ఖంగుతిన్నారు. దీనితో సభకు హాజరైన ప్రజలపై తప్పుడు కేసులు బనాయించాలని పథకాలు వేస్తున్నారు. ఈ సభ అనంతరం ఏరియాలో భారీ సైనిక అభియాన్ చేపట్టారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, విచారణను సజావుగా సాగకుండా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వాకపల్లి పక్కనే నుర్మతి గ్రామంలో కొత్త పోలీసు క్యాంపు పెట్టి, గ్రామాన్ని తమ నిఘా నీడలో పెట్టుకొని, ప్రజలను భయపెడుతున్నారు. ప్రజలు ఈ నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ, పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి సంసిద్ధులై వున్నారు. వీరి న్యాయమైన పోరాటానికి అన్ని ప్రాంతాలలోని మహిళలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామికవాదులు, హక్కుల సంఘాలు మద్దతుగా నిలబడాలని కోరుకుంటున్నారు.

## ప్రజల అభివృద్ధి-సంక్షేమంలో భాగంగా త్రాగునీటి కుండీలను నిర్మించుకొని పరిశుభ్రమైన నీళ్ళు త్రాగుతున్న ప్రజలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని 72 ఏళ్ళుగా పాలకులు సంబరాలు జరుపుకుంటూనే వున్నారు. అధికారంలో వున్న ప్రతి పార్టీ ఈ దేశాన్ని ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా మార్చామని చెప్పుకోవడం సర్వసాధారణమయ్యింది. కానీ, వాస్తవమేమిటంటే, ఈ దేశంలో బడా భూస్వాములు, దళారీ బూర్జువా వర్గం ఆస్తులు, ప్రపంచంలోని సంపన్నులతో పోటీపడే స్థాయికి చేరితే, పేదల జీవితాలు మరింత అథోపాతాళానికి చేరాయి. నేటికీ దేశంలో కనీస ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్యం, త్రాగునీటికి కూడా నోచుకోని ప్రజలు, కోట్లలో వున్నారు. వెనకబడిన ఆదివాసీ ప్రాంతాలు ఈ విషయాలకు అందనంత దూరంలో వున్నాయి. అందుకే ప్రజలు ఈ రాజ్యవర్గ స్వభావం అర్థం చేసుకొని, వారి పాలనను బహిష్కరించి (ఎన్నికలను), ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గంలో ముందుకు వెళుతున్నారు. ఇప్పటికీ, ప్రజలు త్రాగునీటి కోసం పారే కాలువలపైన ఆధారపడుతున్నారు. వర్షాకాలంలో కలుషితమైన నీటిని తాగి మలేరియా, డయేరియా, అతిసార వంటి వ్యాధులు సోకి, ప్రతి సంవత్సరం వందలాది మంది ఆదివాసీలు, అనారోగ్య మరణాలకు గురవుతున్నారు. గ్రామాలలో విప్లవ ప్రజా సంఘాలు, పార్టీ నాయకత్వంలో విద్య, వైద్యం సమస్యలను పరిష్కరించే కృషి చేస్తూనే, త్రాగునీటి సౌకర్యాలపై కూడా కేంద్రీకరిస్తున్నాయి. ఈ విప్లవ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పార్టీ, మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలోని ప్రజలకు ఊటనీటి చెలిమెలు (బావులు) తవ్వి, సిమెంట్‌తో కుండీలు కట్టి, వాటికి పైపులు అమర్చి, పరిశుభ్రమైన నీటిని త్రాగే విధంగా కార్యక్రమాన్ని ఇచ్చింది. ఈ పనిని ప్రజలు సమిష్టిగా, స్వయం కృషి ద్వారా నిర్వహించారు. ఇందుకు అవసరమైన సిమెంట్, పైపులు వగైరా వస్తువులకు అయ్యే ఖర్చు నిమిత్తం, నిధులను గ్రామంలోని ప్రజలందరూ కుటుంబానికి కొంత డబ్బు వేసుకోవడం ద్వారానూ, పార్టీ, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కేటాయించిన నిధుల నుండీ, స్వాధీనపర్చుకున్న ప్రజా వ్యతిరేకుల ఆస్తుల నుండి సమకూర్చుకున్నారు. ఇలా జొడాంబ పంచాయితీలో గౌడుపుట్ , సిమ్లిపొద్దూర్, జాంపుర్లు, లాడిగూడ గ్రామాలలోనూ, ఒంద్రుపల్లి పంచాయితీలోని సన్యాసిగూడ, అర్లెంగిపడ, తోటగూడ, డకడపొద్దూర్ గ్రామాలలో కుండీలను నిర్మించుకున్నారు. దీనితో ఈ గ్రామాలలోని ప్రజలు పరిశుభ్రమైన నీటిని త్రాగుతున్నారు. ఇది ప్రజల అభివృద్ధి నమూనా అని చాటి చెబుతున్నారు. ఈ కార్యక్రమం అనేక గ్రామాలకు విస్తరించింది.

## ప్రభుత్వం అభివృద్ధి పేరుతో నిర్మిస్తున్న రోడ్లను వ్యతిరేకిస్తూ, తమ అవసరాల కోసం, సమిష్టిగా పని చేసి, రోడ్లను నిర్మించుకున్న కటాఫ్ ఏరియా ప్రజలు

అభివృద్ధి పేరుతో, ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాలలో వనరుల దోపిడీకీ, మార్కెట్ విస్తరణకూ, ఉద్యమ అణిచివేతకు కోట్ల రూపాయలు కేటాయించి నిర్మిస్తున్న రోడ్లను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు, వాటిని అడ్డుకుంటూ ప్రతిఘటిస్తున్నారు. అదే సమయంలో ప్రజలు రవాణా అవసరాల కోసం తామే స్వయంగా రోడ్లను నిర్మించుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. గత సంవత్సరం మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలోని పనసపుట్, ఒంద్రుపల్లి, జొడాంబ పంచాయితీలలో అనేక గ్రామాల మధ్య రవాణా సౌకర్యం కోసం పాతరోడ్లను మరమ్మత్తులు చేయడం, కొత్త రోడ్లను నిర్మించుకునే పనులను ప్రారంభించి, సుమారు 50 కిలోమీటర్ల వరకు పూర్తి చేసారు. ఇంకా మిగిలిపోయిన గ్రామాల రోడ్ల నిర్మాణాన్ని ఈ సంవత్సరం మొదలు పెట్టారు. 20 గ్రామాలకు చెందిన ప్రజలు (మహిళలు, వృద్ధులు, పురుషులు) వేలాదిగా కదిలి ఈ రోడ్డు నిర్మాణంలో భాగం అయ్యారు. మొరం, రాళ్ళు, తీసుకురావడానికి ట్రాక్టర్లను ఉపయోగించారు. ఈ ట్రాక్టర్ల, వ్యాన్‌ల యజమానులు కూడా వాహన కిరాయిలు తీసుకోకుండా స్వచ్ఛందంగానే ఇచ్చారు. వాటి డీజిల్, ఆయిల్ ఖర్చుల కోసం ప్రతి కుటుంబం నుండి 100 రూపాయల చొప్పున వసూలు చేసి, ఖర్చు చేసారు. కొందరు ధనిక రైతులు, వ్యాపారులు కూడా విరాళాలు అందజేసారు. సుమారు నెల రోజులు పని చేసి, 26 కిలోమీటర్ల రోడ్డును నిర్మాణం చేసుకున్నారు. స్వావలంబనతో కూడిన అభివృద్ధి నమూనాగా ఆచరణ ద్వారా నిరూపించారు. అదే సమయంలో 'ఆదివాసీ ప్రజల కోసం చేపట్టే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు, రోడ్ల నిర్మాణానికి మావోయిస్టులు అడ్డు పడుతున్నారని' ప్రభుత్వం, పోలీసులు చేసే తప్పుడు ప్రచారానికి ప్రజలు సరైన జవాబు చెప్పారు. అభివృద్ధి అని చెప్పే ప్రతి దానికి వర్గ స్వభావం ఉంటుంది. పాలకులు చెప్పే 'అభివృద్ధి నమూనా' సామ్రాజ్యవాద దోపిడీ నమూనాగా మావోయిస్టులు చెప్పేది ప్రజల అభివృద్ధి, స్వావలంబనతో కూడిన అభివృద్ధి నమూనాగా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. వర్గపోరాటంలో భాగంగానే ప్రజలు ఈ పోటీని అర్థం చేసుకుంటున్నారు.

> "కార్మికవర్గం ఆస్తిపర వర్గాలు ఏర్పాటు చేసిన పాత పార్టీలన్నింటికి వ్యతిరేకమైన, విలక్షణమైన రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకోవడం ద్వారా మాత్రమే, అది ఒక వర్గంగా పని చేయగలుగుతుంది."
>
> - (మార్క్స్ స్థాపించిన మొదటి ఇంటర్నేషనల్ నిబంధనావళి నుండి)

## “వనరుల దోపిడీ లక్ష్యంగా నిర్మిస్తున్న రోడ్లను అడ్డుకుంటాం
## ప్రజల రవాణాకు అవసరమైన రోడ్ల నిర్మాణాన్ని అనుమతిస్తాం”
## అంటూ తీర్మానించిన కోరుకొండ ఏరియా ప్రజలు

విశాఖ మన్యంలో లక్షల కోట్ల విలువైన బాక్సైట్, లాటరైట్, చైనాక్లే... లాంటి భూగర్భ ఖనిజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి ప్రభుత్వం వారితో ఒప్పందాలను కుదుర్చుకున్నది. ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, ప్రతిఘటన మూలంగా టి.డి.పి ప్రభుత్వం, తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ, రోడ్లను, బ్రిడ్జీలను నిర్మించి, సెల్‌టవర్లను ఏర్పాటు చేసి, పోలీసు క్యాంపులు నెలకొల్పి, పార్టీని నిర్మూలించడం ద్వారా, ప్రజలను లొంగదీసుకోవాలనే పథకంతో ముందుకు కదిలింది. ఈ పథకాన్ని పార్టీ నాయకత్వంలో ప్రజలు అడ్డుకోవడం ప్రారంభించడంతో, ప్రభుత్వం “మావోయిస్టులు అభివృద్ధిని అడ్డుకుంటున్నార”ని అసత్య ప్రచారానికి దిగింది. ‘ప్రజలు నేటికీ, కొండదారులలో కాలినడకన నడుస్తున్నారనీ, వైద్యం అందక చనిపోతున్నారనీ,’ ప్రజలపట్ల కపట ప్రేమ వలకబోస్తూ, వారి మీడియా ద్వారా అసత్య ప్రచారం చేసి, ప్రజలను నమ్మించాలని తాపత్రయపడింది. అయితే ప్రభుత్వం ప్రజల యెడల చూపుతున్న ఈ కపట ప్రేమను బహిర్గత పరిచేందుకు, విశాఖ జిల్లా, కోరుకొండ ఏరియాలోని రాళ్ళగడ్డ, బలపం పంచాయితీలకు చెందిన సుమారు 50 గ్రామాలకు చెందిన 3వేల మంది ప్రజలు, మార్చి 12న చెరువూరు గ్రామం వద్ద, ఒక భారీ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి పత్రికా విలేకరులనూ, ఎలక్ట్రానిక్ మీడియాను పిలిపించి, వారి సమక్షంలోనే ప్రజలు తమ వైఖరిని బహిరంగంగా ప్రకటించారు. “మేము 72 ఏళ్ళుగా, కనీస ప్రాథమిక అవసరాల కోసం చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు ‘అభివృద్ధి’ పేరుతో సెల్‌టవర్లను, రోడ్లను ఎందుకు నిర్మిస్తుందో ప్రభుత్వం వెల్లడించాలి. అలాగే కాఫీ తోటలు, అడవి మీద హక్కు మాదే అంటే ఎందుకు మాపై హత్యాకాండను అమలు చేస్తుందో తెలియజేయాలి. హాస్పిటల్‌కు, స్కూల్‌కు బదులు పోలీసు క్యాంపులు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారో చెప్పాలి” అని ప్రశ్నించారు. అంతేకాకుండా, “మా ఉత్పత్తులను అమ్మేందుకూ, అవసరమైన సరుకులు కొనేందుకు కోరుకొండ సంత వరకు వాహనాల రాకపోకలకు వీలుగా, సింగిల్ రోడ్డు నిర్మాణానికి అనుమతిస్తాం కానీ, ప్రభుత్వం వేసే భారీ రోడ్డు నిర్మాణాలనూ, సెల్‌టవర్‌లను ఎంతమాత్రం ఆమోదించం” అని ప్రకటించారు. “ప్రజలు చేసుకుంటున్న అభివృద్ధికి ప్రభుత్వం, దాని సాయుధ బలగాలు అడ్డు రాకుండా ఉంటే సరిపోతుందనీ, వాళ్ళు అభివృద్ధి పేరుతో చేస్తున్న విధ్వంసాన్ని ప్రాణాలు ఇచ్చయినా అడ్డుకుంటాం” అంటూ నినదించారు. ప్రజలు ఇచ్చిన ఈ సమాధానంతో, అప్పటివరకు మావోయిస్టులే ఆదివాసీల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారానికి తెరపడింది.





“వనరుల దోపిడీ లక్ష్యంగా నిర్మిస్తున్న రోడ్లను అడ్డుకుంటాం
ప్రజల రవాణాకు అవసరమైన రోడ్ల నిర్మాణాన్ని అనుమతిస్తాం”
అంటూ రాజ్యానికి వ్యతిరేకంగా మీటింగ్ జరుపుకొన్న 50 గ్రామాల ప్రజలు

## ‘ఆపరేషన్ వింజరి’ పేరుతో పోలీసులు చేస్తున్న సాయుధ దాడులు, అడవి మీద అధికారం కోసం చేస్తున్న తమ పోరాటాన్ని ఏ మాత్రం అడ్డుకోలేవని, పోరు శంఖం ఊదిన పెదబయలు ఏరియా ప్రజానీకం

విశాఖ జిల్లా, పెదబయలు ఏరియాలో ‘దున్నేవారికే భూమి–విప్లవ ప్రజాకమిటీలకే అధికారం’ నినాదంతో ప్రజలు సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. భూస్వాముల భూముల స్వాధీనం; పంపిణీ, భూమి చదును, సాగునీటి సౌకర్యం, వ్యవసాయంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో పాటు, విద్య, వైద్యం, త్రాగునీరు లాంటి సమస్యలను పరిష్కరిస్తూ, విప్లవ ప్రజాసంఘాలు, దానికి సాయుధ దన్నుగా ప్రజా మిలీషియా పని చేస్తున్నాయి. దీనిని సహించలేని ప్రజా శత్రువులు, వారికి అండగా ప్రభుత్వం ప్రజలపై పెద్ద ఎత్తున నిర్బంధానికి పూనుకున్నాయి. పోలీసులు నిరంతరం గాలింపులు చేస్తూ, ప్రజలపై దాడులు చేస్తూ అక్రమ అరెస్టులకు దిగారు. ఈ దాడులను, ప్రజలు పార్టీ నాయకత్వంలో ప్రతిఘటిస్తూ వస్తున్నారు. డిశంబర్ 2017లో పి.ఎల్.జి.ఎలోని మిలీషియాను పెద్ద ఎత్తున సమీకరించి, ప్రజా వ్యతిరేకులను, పోలీసు ఏజెంట్లను విచారించడం, ప్రజల ఆమోదంతో శిక్షలు విధించడం, ప్రజలెవ్వరూ శత్రువుకు ఏజెంట్లుగా మారవద్దనీ ప్రచారం చేయడం వగైరా కర్తవ్యాలతో ఒక మిలటరీ, రాజకీయ క్యాంపెయిన్ తీసుకున్నారు. అదే సమయంలో శత్రువు ‘ఆపరేషన్ వింజరి’ (పంచాయితీ గ్రామం) పేరుతో 500 మంది గ్రేహౌండ్స్ బలగాలతో  కూంబింగ్ చేపట్టి, దాడులకు దిగాడు. ఈ సందర్భంగా గ్రామాలపై దాడులు చేసి, అక్రమ అరెస్టులకు దిగితే, ప్రజలు ప్రతిఘటించి వారిని విడిపించుకున్నారు. కూంబింగ్‌కు వచ్చిన బలగాలపై మిలీషియా మైన్ పేల్చి, శత్రువును గందరగోళపర్చింది.



రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా 5వేల మందితో సభ జరుపుకున్న
జాంగూడ, వింజరి, గిన్నెలకోట పంచాయితీల ప్రజలు

దానితో ఆ బలగాలు అక్కడి నుండి తోక ముడవక తప్పలేదు. ఆ తర్వాత పోలీసులు, గ్రామాల నుండి పనులపై సంతలకు, బంధువుల ఇళ్ళకు, మండల కేంద్రాలకు వెళుతున్న సాధారణ ప్రజలను సైతం అరెస్టులు చేయడం, అక్రమ కేసులు బనాయించి జైళ్ళకు పంపడం, బెయిల్‌పై విడుదలయిన వారిని తిరిగి అరెస్టులు చేయడం ఒక క్యాంపెయిన్‌గా చేపట్టారు.

ఈ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ, జాంగూడ, వింజరి, గిన్నెలకోట పంచాయితీలలోని అనేక గ్రామాల ప్రజలు 2018, ఎప్రిల్ 16న తల్లాబు అనే గ్రామం వరకు ఊరేగింపుగా తరలివెళ్ళి 5వేలమంది ప్రజలతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు– 1. అక్రమ అరెస్టులు వెంటనే నిలిపివేయాలి, 2. కూంబింగ్‌ల పేరుతో గ్రామాలపై దాడులు ఆపివేయాలి, 3. పోలీసు క్యాంపుల నిర్మాణానికి అనుమతినివ్వం, 4. మహిళలపై పోలీసులు జరిపిన అత్యాచారాలపై విచారణ జరిపి, దోషులను శిక్షించాలి, 5. అడవిపై అధికారం ఆదివాసీలదీ, పీడిత ప్రజలదే అంటూ నినదించారు.

ఈ సభలో వక్తలు, “రోడ్లు కాదు మన్యంలో పంట పోలాలకు కాలువలు తవ్వండి. పోలీసు ఔట్‌పోస్టులు ఆపి, చెక్ డ్యాంలు నిర్మించండి. ఆస్పత్రులు, పాఠశాలలు అందుబాటులోకి తీసుకురండి. యువకులకు ఆటవస్తువులు కాదు, వారికి ఉద్యోగాలు కల్పించండి. జనమైత్రి శిబిరాలు ఏర్పాటు చేసి, బిర్యానీ ప్యాకెట్లు ఇవ్వడం కాదు, మా అడవి మీద మాకు అధికారం కల్పించండి. గ్రామాలకు పోలీసులను కాదు, వ్యవసాయ అధికారులను, డాక్టర్లను, టీచర్లను పంపించండి. ‘బేటీ బచావో బేటీ పఢావో’ నినాదాలు కాదు, మహిళలపై అత్యాచారాలు ఆపండి” అంటూ మాట్లాడారు. ఈ సభను పోలీసులు భగ్నం చేయకుండా నివారించుకోవడానికి రక్షణగా, వందలాది గ్రామాలు సెంట్రీలు, పెట్రోలింగ్‌లు నిర్వహించారు. ఈ సభలో ప్రజలు చేసిన డిమాండ్‌లను మీడియా కూడా చాలా వివరంగా రాయక తప్పలేదు. ఈ సభ విప్లవ ప్రజలపై గొప్ప రాజకీయ ప్రభావం వేసి, వారి సంఘటిత శక్తి మీద మరింత విశ్వాసాన్ని పెంచింది. పోలీసులు నోరు మెదపకుండా ఆ తర్వాత మీటింగ్ నిర్వహణపై ఆరాలు తీసారు.

# ప్రజలే నిజమైన ఉక్కుకోట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో, నాయకత్వ నిర్మూలన లక్ష్యంతో, ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు, ఒడిషాలోని ఎస్.ఒ.జి బలగాలు, బి.ఎస్.ఎఫ్ బలగాలు సంయుక్తంగా, ఆలౌట్ ఆపరేషన్ పేరుతో, 2015 జనవరిలో భారీ సైనికదాడిని ప్రారంభించారు. ఈ దాడిని విజయవంతం చేసేందుకు, చాలా ముందునుండే, పకడ్బందిగా సన్నాహాలు చేసుకున్నారు. అయితే ఈ మొదటి ఆపరేషన్‌లో, ప్రజలు ముందే పార్టీని అప్రమత్తం చేయడంతో, పి.ఎల్.జి.ఎ కౌంటర్‌గా ముందస్తు దాడి చేయడం మూలంగా శత్రువు ప్లాను విఫలమయ్యింది. ఆ తర్వాత 2015, 2016 సంవత్సరాల మధ్య మరికొన్ని డామినేషన్లు చేపట్టారు. అయితే ఎక్కువసార్లు ప్రజల మద్దతుతో పార్టీ వాటిని విఫలం చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఎ.పి.ఎస్.ఐ.బి ఈ ప్రాంతంలో ఇంటలీజెన్సీని అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా కేంద్రీకరించి పని చేసింది. గ్రామాల నుండి బహిష్కరించిన లేదా పారిపోయిన ప్రజావ్యతిరేకులు, పోలీసు ఇన్‌ఫార్మర్‌లపై లక్షలు ఖర్చు చేసి, సమాచార సేకరణపై దృష్టి పెట్టింది. అదే సమయంలో టెర్రయిన్‌పై కూడా క్రమంగా పట్టు సంపాదించింది. పార్టీ, విప్లవ ప్రజా సంఘాల కార్యకలాపాలపై, దళాల పని విధానంపై నిఘా పెట్టింది. మన బలం, బలహీనతలను అంచనా కట్టింది. ఎ.పి–ఒ.ఎస్ పోలీసు ఉన్నతాధికారులు, ప్రతి నెల ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సమన్వయాన్ని మెరుగుపర్చుకున్నారు. సుమారు 2 సంవత్సరాలు, ఎ.పి.ఎస్.ఐ.బి (ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటలీజెన్సీ బ్యూరో) అధికారులు ఒక టీంగా పని చేసి, టార్గెట్ విఫలం కాకుండా ఉండేందుకు అనేక సన్నాహాలు చేసుకున్నారు. అవకాశం వచ్చేదాకా నిరీక్షించారు. అక్టోబర్ 24, 2016న అవకాశం రాగానే, అత్యంత రహస్యంగా సంఘటనా స్థలానికి చేరుకొని, ఆకస్మికంగా విరుచుకుపడి, రాంగూడలో పార్టీకి భారీ నష్టాన్ని కల్గించారు. ఈ సందర్భంగా శతృవు మనపై పెద్ద విజయాన్నే సాధించాడు. ఈ సంఘటనపై, దేశవ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తమయింది. విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు, పౌరహక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు కదిలి సంఘటనపై నిజనిర్ధారణకు ఆ ప్రాంతానికి తరలివెళ్ళారు. ప్రజలు వారిని సాదరంగా ఆహ్వానించి, అక్కున చేర్చుకొని, వాస్తవాలను నిర్భయంగా వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక వాదుల మద్దతుకు అభినందనలు తెలియజేశారు. ఆ సమయంలో పెద్ద ఎత్తున అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజలనుండి పార్టీని రక్షించుకోకుంటే ప్రజలకు నాయకత్వం వుండదనే భావన బలంగా వ్యక్తీకరించబడింది. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు సెక్షన్ల నుడి నిరసనలు వ్యక్తమయినాయి. ఇదే స్ఫూర్తితో, ఉద్యమ ప్రాంతంలోని ద్రోహులను గుర్తించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొద్దినెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకులు, విప్లవ ద్రోహులను గుర్తించి, ప్రజా పంచాయితీలు నిర్వహించి, శతృవు చేసిన కుట్రలను బహిర్గత పరిచి, ద్రోహులను శిక్షించారు. ఈ క్రమంలోనే రాజ్య వ్యతిరేక చైతన్యాన్ని పెంచుకుంటున్న ప్రజలు, ఒడిశా ప్రభుత్వం నిర్వహించిన స్థానిక సంస్థల (పంచాయితీ, బ్లాక్, జిల్లా) ఎన్నికలను పూర్తిగా బహిష్కరించారు. అమరుల స్మారకార్థం, అనేక గ్రామాలలో స్థూపాలు నిర్మించారు. స్మారక భవనాలను నిర్మించి, వాటిలో అమరుల ఫోటోలను ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేశారు. వేలాది మంది ప్రజలు కదిలి, రాంగూడ అమరుల సంస్మరణ సభలు జరిపారు.

అమరుల కుటుంబాలను ఆర్థికంగా, హార్ధికంగా ఆదుకున్నారు. స్థానిక శత్రువులను రాజకీయంగా ఒంటరి చేశారు. దీనితో మొత్తం ప్రజలలో మరింత విప్లవ స్థైర్యం పెరిగింది.

శత్రువు రాంగూడలో పొందిన విజయాన్ని నిలబెట్టుకోవడం, స్వంత బలగాలను దెబ్బతినకుండా రక్షించుకోవడం, దెబ్బతిన్న ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను పునర్నిర్మించుకోవడం వగైరా కారణాల రీత్యా కొంత సమయం ఎలాంటి కూంబింగ్‌లకు దిగలేదు. అంటే మరో దాడికి సన్నాహాలు చేసుకునే పనిలో నిమగ్నం అయ్యాడు. 2017 నవంబర్‌లో కటాఫ్ ఏరియాలోని, గొనబెడ గ్రామంలో దళంతో పాటు, పై స్థాయి నాయకత్వం వుందనే పక్కా సమాచారంతో ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు రాత్రికిరాత్రే గ్రామాన్నీ, దళం మకాంను చుట్టుముట్టారు. ఒకవేళ దళం తప్పించుకుంటే, తిరిగి దెబ్బ తీసేందుకు, ఏరియా అంతా బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా, అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసుల రాకను గమనించిన ప్రజలు, ఆ రాత్రికి రాత్రే అన్ని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి, దళం కోసం వెదికారు. ఈ విషయాలు దళానికి తెలియనప్పటికీ, తన రోజువారి పద్ధతులలో తెల్లవారుజామున 4 గంటలకే మకాం ఖాళీ చేసింది. శత్రువు ఈ విషయాన్ని పసిగట్ట లేకపోయాడు. ఉదయాన్నే గ్రామంపైన, మకాంపైన దాడి చేశాడు. కానీ దళం తప్పించుకుందని అర్థమయి ఖంగుతిన్నాడు. తెల్లవారేసరికి దళాన్ని ప్రజలు కలుసుకోగలిగారు. అప్పటికే ఆ ప్రాంతమంతా (చిన్న పాకెట్) శత్రువు బలగాలు మొహరించి వున్నాయి. ఏ కొంచెం ఆలస్యం చేసినా దాడి జరుగుతుందని భావించిన ప్రజలు, దళాన్ని ఆ ప్రాంతం నుండి దూరంగా తీసుకెళ్ళాలని నిర్ణయించుకున్నారు. వందలాది మంది ప్రజలు రక్షణవలయంగా ఏర్పడి, తమ మధ్యలో దళాన్ని పెట్టుకొని, మైదానం దాటించి, మరో ప్రాంతానికి చేర్చారు. అదే రోజు ఉదయం, దారిలో వెళుతున్న ముగ్గురు మిలీషియా సభ్యులను ఎ.పి పోలీసులు అరెస్టు చేసి, ఈ విషయం ప్రజలకు అర్థం కానివ్వకుండా జాగ్రత్తపడ్డారు. ఒకరోజు తర్వాత పోలీసులు వాపస్ అవుతున్నప్పుడు వారి వెంట తీసుకెళ్ళారు. ఇది కొందరు ప్రజలు గమనించి ప్రజలందర్నీ అప్రమత్తం చేశారు. అప్పటికే పోలీసులు వెళ్ళిపోవడంతో, సుమారు 2వేల మంది ప్రజలు కుంతిలిపొద్దూరులో వున్న ఐ.ఆర్.బి (ఇండియన్ రిజర్వ్ బెటలియన్) పోలీసు క్యాంపు ముందు బైఠాయించి, అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఐ.ఆర్.బి క్యాంపు పోలీసు అధికారులు మాత్రం, ఆ అరెస్టుతో మాకు సంబంధం లేదనీ, ఎ.పి వాళ్ళకే తెలుసని దబాయించారు. మీకు సంబంధం లేకుంటే ఇక్కడ నుండి ఖాళీ చేసి వెళ్ళాలని ప్రజలు మరో డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. పోలీసులు గేట్లు మూసుకొని బయటకు రాకుండా ఒక రోజంతా వున్నారు. ఆ తర్వాత ప్రజలు, ఈ క్యాంపు పోలీసులకు నదిగుండా పడవల ద్వారా వచ్చే సరుకుల సప్లైలను నిలిపివేశారు. స్థానిక సంతలలో, దుకాణాలలో క్యాంపు పోలీసులకు సరుకులు అమ్మకూడదని నిర్ణయించి, అమలు చేశారు. దానితో ప్రభుత్వం, ఈ క్యాంపు బలగాలకు కోట్లు ఖర్చు చేసి, హెలికాప్టర్ ద్వారానే సప్లైలు అందించాల్సిన పరిస్థితికి నెట్టబడింది. ఈ సందర్భంగా, దళాన్ని తమ దాడి నుండి రక్షించారనే కోపంతో, ఎ.పి గ్రేహౌండ్స్ పోలీసులు దకడపొద్దూరు గ్రామంపై దాడి చేసి, అక్రమంగా ఒక యువతిని పట్టుకొని తరలిస్తుండగా, ప్రజలు పోలీసులను 7,8 కిలోమీటర్ల వరకు వెంబడించి, ఆమెను విడిపించుకున్నారు.

2018 మే నెలలో, జొడాంబ పంచాయితీలోని, పానొపొద్దూరు, పనస పొద్దూరు పరిసర గ్రామాలలో నాయకత్వం, దళం కదలికలు వున్నాయనే సమాచారం అందుకున్న ఎ.పి-ఒ.ఎస్ ప్రత్యేక పోలీసు బలగాలు మే 16, రాత్రి 12 గంటల సమయంలో (ప్రజలందరు నిద్రపోతున్నప్పుడు) ఎ.పి సరిహద్దుల వరకు వాహనాలలో వచ్చి దిగి, అక్కడి నుండి అనేక బ్యాచీలుగా విడిపోయి, వేరు వేరు దిశల గుండా ఈ ప్రాంతంలోకి ప్రవేశించాయి. ఈ విషయాన్ని మిలీషియా సెంట్రీలు గమనించి, ప్రజలను అప్రమత్తం చేశారు. దళం ఎక్కడుందో వారికి నిర్దిష్టంగా తెలియదు కానీ, పోలీసుల ప్రయాణ దిశను బట్టి, దళం పనసపొద్దూరు దిశలో వుండి వుంటుదని అంచనా వేసుకొని, వేగంగా సమాచారం అందించడానికి మోటారు సైకిళ్ళపై బయలు దేరారు. అయితే దారిలో అప్పటికే ముందుకు వెళ్ళిన పోలీసులు, వీరిని అడ్డుకొని వెనక్కి పంపారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు ట్రాక్టర్‌కు నాగళ్ళు అమర్చుకొని దుక్కిదున్నే పేరుతో బయలుదేరారు. వీరిని మరో బ్యాచీ అడ్డగించింది. అయినా ప్రజలు వారి ప్రయత్నం అపకుండా, మరో ట్రాక్టర్‌కు ట్రాలీ బిగించుకొని ఇసుక తీసుకువచ్చే పేరుతో బయలుదేరారు. ఇంకొక దిశలో మరికొందరు రిజర్వాయర్ గుండా పడవలు తీసుకొని బయలుదేరారు. ఈ ప్రయత్నాల ద్వారా ఉదయం 6 గంటలకు పనసపొద్దూర్ గ్రామ పరిసరాలకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి, నదికి ఇరువైపుల మోహరించి వున్నారు. ట్రాక్టర్‌లో వచ్చిన ప్రజలలో కొద్దిమంది మట్టి తవ్వుతున్నట్లుగా నటిస్తుండగా, మరికొందరు ముందుకు కదిలారు. అయితే వీరిని కూడా పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. శత్రువు కల్పించిన ఆటంకాల మూలంగా సకాలంలో పార్టీకి సమాచారం అందించలేకపోయారు. అక్కడికి 30 నిమిషాల దూరంలో వున్న పానొపొద్దూరు గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో మన మకాం వుంది. మన మకాం సమాచారం నిర్దిష్టంగా శత్రువుకు లేకపోయినప్పటికీ, ఒక బ్యాచ్ పానొపొద్దూరు గ్రామాన్ని దాని పక్కనే వుండే మకాంను కవర్ చేస్తూ, 6:30 నిమిషాలకు మన సెంట్రీపోస్ట్ ముందుకు చేరుకుంది. శత్రువు రాకను ముందే గమనించిన మన సెంట్రీ అప్రమత్తమై ఫైరింగ్ ప్రారంభించింది. దానితో పోలీసులు తేరుకొని ఫైరింగ్ చేస్తూనే, మన మకాం వైపు దూసుకు వచ్చారు. మరింత సమీపానికి రాగానే మనం మైన్‌పేల్చి, ఫైరింగ్ ఓపెన్ చేయగా శత్రువు అడ్వాన్స్ అవ్వడం ఆగిపోయింది. దీనిని అవకాశంగా తీసుకొని మన బలగాలు సురక్షితంగా అక్కడి నుండి

వెనక్కి తగ్గాయి. అప్పటికే మనకు సమాచారం ఇచ్చేందుకు బయలుదేరిన ఒక టీం రిట్రీట్‌లో వున్న మనకు కలిసింది. శతృవు ఏ దిశగుండా వచ్చింది? ప్రస్తుతం ఎక్కడ మోహరించి వున్నారనే సమాచారం ఇచ్చారు. మనకు త్రాగడానికి జావ, వండుకోవడానికి బియ్యం, వంట పాత్రలు సమకూర్చారు. మనం రిట్రీట్ అవుతున్న క్రమంలోనే మనపై హెలిక్యాప్టర్లు చక్కర్లు కొడుతూ, మన రిట్రీట్ దిశగా బలగాలను దింపడం ప్రారంభించాయి. అదే సమయంలో మన ఆచూకీని కనిపెట్టేందుకు డ్రోన్లు మనపై తిరగసాగాయి. ఈ సమయంలో బయట వున్న మన కామ్రేడ్స్ ప్రోద్బలంతో, మనకు ఆహారం అందించేందుకు ప్రజలు అనేక టీంలుగా అడవిలోకి వచ్చారు. అప్పటికే మనకు కలిసిన టీం ద్వారా సురక్షితంగా ప్రజల మద్దతుతో తప్పుకొనేందుకు అవకాశం వుందని తెలిసినప్పటికీ, ఆ మార్గంలో శతృవు సులువుగా అడ్డగిస్తాడనే అంచనాతో రిట్రీట్‌కు కఠినమైన మార్గన్ని ఎంచుకున్నాము. ఈ మార్గంలో ఎత్తయిన కొండలు, గుట్టలు వుండటంతో, అనుకున్న సమయానికి, అనుకున్న ప్రాంతానికి చేరలేకపోయాము. అప్పటికే రాత్రి 9 గం॥లయ్యింది. మనం చేరిన ప్రాంతం పోలీసు క్యాంపుకు 40 ని॥ల దూరంలో వుంటుంది. అప్పటికే అక్కడ ఒక పోలీసు బ్యాచీ మోహరించి వుంది. ఈ విషయాన్ని మన ఫార్మేషన్‌లో ముందున్న మిలీషియా కామ్రేడ్స్‌కు సంబంధించిన కుక్కలు పసిగట్టి, అనుమానాస్పదంగా పెద్దఎత్తున మొరిగాయి. మిలీషియా కామ్రేడ్స్ అదేమిటో నిర్ధారించుకోవడానికి రాళ్ళు విసిరారు. దానితో అక్కడ ఏవో కదలినట్లు అనిపించింది. ఒక ఎర్రని లైట్ వెలుగుతున్నట్లు కూడా అనుమానం కల్గింది. కాని అవి ఏమిటనేవి ఒక నిర్ధారణకు రాలేకపోయారు. వెనక్కి తిరిగి వెళ్ళటం చాలా కష్టంతో కూడుకున్న పని కావటంతో పాటు, మనం చేరుకునే ప్రాంతంలో పోలీసుల కూంబింగ్ జరిగే అవకాశం వుండటంతో తిరిగి అక్కడ నుండి రిట్రీట్ అవ్వాలనే ఆలోచనను ఉపసంహరించుకున్నాము. అనుమానం వచ్చిన విషయాలను క్లియర్ చేసుకోవాలనుకున్నాము. ఇందుకనుగుణంగా ఒక టీంను శతృవు విషయం క్లియర్ చేసేందుకు పంపాము. ఆ టీంను రెండుసార్లు పంపినప్పటికీ, ముందుకు పోకపోవటంతో సభ్యులను కొద్దిగా మార్చి, మరోసారి పంపడం జరిగింది. అప్పటికే రాత్రి 2 గం॥ల సమయం అయింది. ఈ ప్రయత్నాలన్నింటిని గమనిస్తూ, ఆంబూష్‌లో కూర్చొన్న పోలీసులు మన టీం దగ్గరకు రాగానే ర్యాఫిడ్ ఫైర్ ఓపెన్ చేసారు. అప్పుడు మన టీంలోని ఒకరు అమరులు కాగా, మిగిలిన వాళ్ళు రిట్రీట్ అయ్యారు. దానితో వెనుదిరిగి అనివార్యంగా దిగిన కొండనే ఎక్కాల్సి వచ్చింది. నిద్రలేకపోవడం, అలసట, ముందురోజు అన్నం తినకపోవడంతో ఏర్పడిన నీరసంతోనే మన బలగాలు శక్తినంతా కూడగట్టుకొని వచ్చిన మార్గానే వెనక్కి వెళ్ళాల్సి వచ్చింది. సాయంత్రానికి ఒక గ్రామానికి చేరుకొని, నిరాయుధంగా వున్న మిలీషియా కామ్రేడ్స్‌ను ఆ గ్రామంలోనే ప్రజలలో భాగంగా, కలిసివుండే విధంగా ఏర్పాటు చేసి, తెల్లవారి దళం మరికొంత ముందుకు వెళ్ళి ఆగింది. అప్పటికే మూడురోజులయ్యింది. ఆ ప్రాంతమంతా పోలీసు బలగాలతో నింపివేసి, దారులు మూసివేసి, నీటి స్థలాల వద్ద బలగాలను మోహరించి, గ్రామాలను చుట్టుముడుతూ, మూడవరోజు సాయంత్రానికి పోలీసులు దళం మకాం సమీపం వరకు చేరుకున్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అప్రమత్తం చేయడంతో, అక్కడి నుండి దళం తప్పుకుంది. మనం వదిలి వచ్చిన మిలీషియా వున్న గ్రామాన్ని పోలీసులు చుట్టుముట్టారు. అప్పటికే దళానికి ఆహార ఏర్పాట్లకోసం అక్కడికి వచ్చిన మరో ఎ.సి.ఎమ్ కూడా అదే గ్రామానికి చేరుకొని శతృవు చుట్టివేతలో యిరుక్కుంది. ఆ రాత్రంతా పోలీసులు అక్కడే వుండి, ఉదయం గ్రామంలోకి వెళ్ళి, అందరినీ పరిశీలించి, అనుమానాస్పదంగా వున్న మిలీషియా సభ్యులను, ఎ.సి.ఎమ్‌ని అరెస్ట్ చేశారు.

గ్రామస్తులను ఎవరిని బయటకు వెళ్ళకుండా నిర్బంధించారు. అరెస్టు చేసిన వారిని సాయంత్రం వరకు అడవిలోనే ఇంటరాగేషన్ చేశారు. ఆ రోజు అడవిలోనే పడుకున్నారు. మరుసటిరోజు ఉదయానికి ఈ అరెస్టు వార్త అన్ని గ్రామాలకు చేరిపోయింది. కొన్ని గంటలలోనే ప్రజలు పనులు మానుకొని, మహిళలు వంటలు చేయడం కూడా బంద్ చేసి, అనేక గ్రామాల నుండి పిల్లలు, వృద్ధులు, మహిళలు, పురుషులు సుమారు 3వేల మంది పరుగెత్తుకుంటు వెళ్ళి, పోలీసులు వాపస్ కావడానికి (ఎ.పి-ఒ.ఎస్ సరిహద్దు) అవకాశం వున్న దిశలలో మోహరించారు. ఈ విషయాలు అర్థం అయిన పోలీసులు, విడివిడిగా వున్న బ్యాచీలను ఒకే చోటుకు పిలిపించుకొని, తొందరగా ఆ ప్రాంతం నుండి రిట్రీట్ కావడానికి వీలుగా ప్లాన్ చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని వెనకాల పెట్టుకొని, దారులను విడిచి, ప్రజలు లేని దిశ నుండి వేగంగా వెళ్ళడానికి ప్రయత్నం చేశారు. ఈ విషయం గమనించిన ప్రజలు కూడా అందరూ ఒక దగ్గరకు చేరుకున్నారు. రాళ్ళు, కర్రలు తీసుకొని పోలీసుల వెంట పడ్డారు. అదే సమయంలో ఎ.పి సరిహద్దు గ్రామల ప్రజలు కూడా, పోలీసులకు అడ్డు తిరిగారు. ఇలా అన్ని వైపుల నుండి ప్రజలు పోలీసులను చుట్టుముట్టి, "ఆగండిరా! మా ప్రాంతానికి ఎ.పి పోలీసులు ఎందుకు వచ్చారు? మా పిల్లలని అరెస్టు చేసే అధికారం మీకెవరిచ్చారు?" అంటూ పోలీసులపై దాడికి దిగారు. దీంతో భయపడ్డ పోలీసులు, ముందుగా టియర్ గ్యాస్‌షెల్స్ వేసి, ప్రజలను భయపెట్టి చెల్లాచెదురు చేయాలని చూసారు. కాని వాళ్ళు ఊహించిన దానికి భిన్నంగా, ప్రజలు మరింత కొపోద్రిక్తులై 'మార్ పోలీస్‌కో మార్' (చంపండి పోలీసులను) అంటూ ఒక్కసారిగా నినదిస్తూ రాళ్ళవర్షం కురిపించారు. ఖంగుతిన్న పోలీసులు తుపాకులు లోడ్ చేసి, ఫైరింగ్ ఓపెన్ చేశారు. ప్రజలు మరింత తెగింపుతో ముందుకు పరుగెత్తి వెంటపడటంతో, పోలీసులు కాలికి బుద్ధి చెప్పక తప్పలేదు. ఈ ప్రజల ప్రతిఘటనను చూసిన పోలీసులు, అరెస్టు చేసిన మిలీషియాను ముందే వదిలి వేశారు. వారితోపాటు అరెస్టయిన ఎ.సి.ఎమ్ అప్పటికే ఊగిసలాటతో ఉద్యమంలో కొనసాగుతున్నది. ఈ సందర్భంగా, రాజకీయంగా మరింత పతనమై, ప్రజలు లాక్కువచ్చినా రాకుండా, పోలీసులతోనే వెళ్ళి,

ఆ తర్వాత సరెండర్ అయ్యింది. ఇది ప్రజలను కొంత నిరాశపర్చింది. అయితే తమకోసం పోరాడేవాళ్ళు, త్యాగం చేసేవాళ్ళే అసలైన నాయకులనీ, అటువంటివారికి మనపార్టీలో కొదవ లేదని సమాధానపడి, ధైర్యంగా, విజయంతో వెనుదిరిగారు.

ఈ సందర్భంగా లోపలికి వచ్చిన సాయుధ బలగాలను తిరుగు ప్రయాణంలో దెబ్బ తీసేందుకు, మన మిలీషియా కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, శత్రువు తృటిలో తప్పించుకున్నాడు. ఈ విధంగా ప్రజల నుండి, మిలీషియా నుండి ఎదురైన తీవ్ర ప్రతిఘటనను ఎ.పి. పోలీసు బలగాలు జీర్ణించుకోలేపోయాయి. దానితో వారి ఏజెంట్ల ద్వారా ప్రజలు సంతలకు కానీ, ఎ.పికి కాని వస్తే అరెస్టు చేస్తామని బెదిరించి ప్రచారాలకు దిగారు. ఈ సంఘటన జరిగి వారం తిరగకముందే సరిహద్దుల్లో (ఒ.ఎస్-ఎ.పి) వున్న ముంచింగ్‌పుట్ పోలీస్టేషన్ ఎస్.ఐ, బరడా గ్రామానికి చెందిన పోలీసు ఏజెంటు, గంజాయి వ్యాపారి ద్వారా కటాఫ్ ఏరియాలోని కొజ్జరిగూడ గ్రామ సంఘ నాయకుడిని, ఆయన తమ్ముడికి ఇవ్వాల్సిన గంజాయి డబ్బులను, తానే వస్తే ఆయన సమక్షంలో ఇస్తామని నమ్మించి మోసగించి, ఇంటికి రప్పించి పట్టుకున్నారు. ఈ వార్త కొన్ని గంటల్లోనే ఆంధ్ర-ఒడిషా గ్రామాలకు చేరిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కొద్ది మంది ప్రజలు, అదే రోజు స్టేషన్ గేటు ముందు బైఠాయించారు. మరుసటి రోజు ఉదయమే కటాఫ్ ఏరియా నుండి 700 మంది ప్రజలు 25 కిలోమీటర్ల దూరంలో వున్న ముంచింగిపుట్ పోలీస్టేషన్‌కు బయల్దేరారు. రాబోయే ప్రమాదాన్ని పోలీసులు ముందుగానే పసిగట్టి, ప్రజలు పోలీస్టేషన్‌కు చేరడానికి కొద్ది నిమిషాల ముందే అరెస్టయిన వారిని బేషరతుగా విడుదల చేశారు. శత్రువు ఎంతో బలసంపన్నుడుగా కనబడినా, సంఘటిత ప్రజల శక్తి ముందు వ్యూహాత్మకంగా కాగితపు పులేనని ఋజువు అయ్యింది. పార్టీని, పి.ఎల్.జి.ఎని, ప్రజా నిర్మాణాలను కంటికి రెప్పలా కాపాడుకోవడంలో ప్రజలే నిజమైన ఉక్కుకోట అని ఈ సంఘటనలు ఋజువు పరుస్తున్నాయి. వారే రేపటి చరిత్రను నిర్మిస్తారు కూడా. ▲

---

"లోకంలోని పీడిత ప్రజలందరికీ తన ప్రేమను పంచిపెట్టి, అచంచలమైన ఆశావాదంతో కూడిన పోరాట సందేశాన్ని వారికి అందించిన ఈ మహోన్నత మానవుడిని కేవలం ఒక విగ్రహమాత్రుడిగా చిత్రించబోవటం చారిత్రక తప్పిదమవుతుంది. ఆయన స్మృతిని మరింత ప్రకాశమానంగా నిలుపుకోవాలంటే ఈ వ్యక్తీకరణల నుండి ఆయనను రక్షించుకొని, ఆయనలోని మానవతాకోణాన్ని గురించి నొక్కి చెప్పాల్సిన అవసరం వుంది. నేను చేసిన ఈ రచన ద్వారా ఆయన కృషిని, మార్క్సిస్టు అర్థశాస్త్రపు సిద్ధాంత కర్తలిరువురి జీవితాల్లోని ఆటుపోట్లను గురించి తెలియని వారికి రేఖామాత్రంగానైన పరిచయం చేయటానికైనా విలవుతుందని నా ఆశ."

మార్క్స్, ఎంగెల్స్ జీవిత రేఖలు రాసిన సందర్భంగా - **ఎర్నెస్టో చే గువేరా**

62వ పేజి తరువాయి భాగం...

ఇటువంటి రెండు ఆవిష్కరణలు సాగించడమే ఒక జీవిత కాలానికి సరిపోతుంది. అసలు అటువంటి ఆవిష్కరణ ఒక్కటి చేసిన ఆ వ్యక్తి సంతోషపడవచ్చు. కానీ మార్క్స్ పరిశోధించిన ప్రతి ఒక్క రంగంలోనూ, – నిజం చెప్పాలంటే ఆయన ఎన్నో రంగాలలో పరిశోధించాడు, ఏ ఒక్క రంగంలోనూ పై పైన కూడా కాదు – ప్రతి ఒక్క రంగంలోనూ, చివరికి గణితశాస్త్రంలో కూడా ఆయన స్వతంత్ర ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞానశాస్త్ర ఖని ఆయన. కాని ఆయన వ్యక్తిత్వంలో ఇది సగం కూడా కాదు. మార్క్స్ దృష్టిలో శాస్త్రం అంటే చారిత్రకంగా చలనశీలనమైన, విప్లవ శక్తి. సైద్ధాంతిక విజ్ఞాన శాస్త్రంలో ఒక కొత్త ఆవిష్కరణ జరిగినప్పుడు ఆ ఆవిష్కరణకు ఉండగల ఆచరణాత్మక అన్వయం ఏమిటో ఊహించడం అసాధ్యమైనప్పటికీ, ఆయన గొప్ప ఆనందం పొందేవాడు. ఆ ఆవిష్కరణ పారిశ్రామిక రంగంలో, మొత్తంగా చారిత్రక అభివృద్ధిలో తక్షణ విప్లవాత్మక మార్పులకు దారి తీస్తుందన్నప్పుడు మరింత ఆనందం పొందేవాడు. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తి శాస్త్ర రంగంలో జరుగుతున్న ఆవిష్కరణల అభివృద్ధిని, ఇటీవల కాలంలో మార్సెల్ డెప్రెజ్ ఆవిష్కరణలను ఆయన సన్నిహితంగా పరిశీలించాడు.


ఎందుకంటే అన్నిటికన్న ముందు మార్క్స్ ఒక విప్లవవాది. పెట్టుబడిదారీ సమాజాన్ని, అది ఉనికిలోకి తీసుకువచ్చిన రాజ్య నిర్మాణాలను కూలదోయడానికి ఏదో ఒకరకంగా సహకరించడమే, ఆధునిక కార్మికవర్గ విముక్తికి దోహదం చేయడమే ఆయన జీవిత లక్ష్యం. ఆధునిక కార్మికవర్గ స్థితి గురించీ, దాని అవసరాల గురించీ, దాని విముక్తి గురించీ దానికి చైతన్యం కలిగించిన తొలి వ్యక్తి ఆయన. పోరాటమే ఆయన జీవనసూత్రం. పోరాడటంలో ఆయన చూపిన ఉద్వేగం, పట్టుదల, సాధించిన విజయం అతి తక్కువ మందిలో చూస్తాం. మొదటి రైనిష్ జీటుంగ్ (1842), పారిస్‌లో వోర్‌వార్ట్స్ (1844), డాయిష్ బ్రస్సెలర్ జీటుంగ్ (1847), న్యూ రైనిష్ జీటుంగ్ (1848–49), న్యూయార్క్ ట్రిబ్యూన్ (1852–61) పత్రికలలో ఆయన కృషి, వాటికి తోడుగా ఎన్నెన్నో సమరశీల కరపత్రాలు, పారిస్, బ్రస్సెల్స్, లండన్‌లలో సంస్థా నిర్మాణ కృషి, చివరికి వీటన్నిటికీ శిఖరాయమానంగా మహత్తరమైన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ స్థాపన. ఇంకేమీ చేయకపోయినా ఈ ఒక్క సంస్థ స్థాపనలో సాధించిన విజయమే ఆ స్థాపకుడికి గర్వకారణమైనది.

అంతేకాదు, వీటన్నిటి ఫలితంగా, మార్క్స్ తన కాలంలో అందరికంటే ఎక్కువగా ద్వేషానికీ, నిందకూ గురైన వ్యక్తి అయ్యాడు. అటు నిరంకుశ రాచరిక ప్రభుత్వాలు, ఇటు గణతంత్రాలమని చెప్పకున్న ప్రభుత్వాలూ ఆయనను తమ పాలనా ప్రాంతాల నుంచి బహిష్కరించాయి. మితవాదులైనా, అతి తీవ్రవాదులైనా బూర్జువాలందరూ ఆయన మీద నిందలు గుప్పించడానికి ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ఇదంతా తన దారిలోని సాలెగూడు లాగ ఆయన చేత్తో పక్కకి జరిపేశాడు. దాన్ని విస్మరించాడు. అత్యంత అవశ్యకమైన అనివార్యత తోసినప్పుడు మాత్రమే జవాబు ఇచ్చాడు. చివరికి సైబీరియా నుంచి కాలిఫోర్నియా వరకూ గనుల నుంచి యూరప్, అమెరికాలలోని సకల ప్రాంతాల నుంచి లక్షలాది మంది సహకార్మికుల ప్రేమనూ, గౌరవాన్నీ చూరగొని ఆయన మరణించాడు. లక్షలాది మంది ఆయన కోసం సంతాపం ప్రకటిస్తున్నారు. అంతేకాదు, ఆయనకు ఎందరో ప్రత్యర్థులున్నప్పటికీ, ఒక్కరంటే ఒక్కరైనా వ్యక్తిగత శత్రువు లేరని చెప్పడానికి కూడా నేను సాహసిస్తున్నాను.

యుగయుగాల వరకు ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన కృషి కూడా.

# మార్క్స్ స్మృతిలో ఎంగెల్స్ మాటలు

## *లండన్‌లోని హైగేట్ సిమెటరీలో కార్ల్ మార్క్స్ మృతదేహాన్ని ఖననం చేశాక 1883 మార్చ్ 17న ఫ్రెడరిక్ ఎంగెల్స్ చేసిన ఉపన్యాసం*



మార్చ్ 14 మధ్యాహ్నం పావు తక్కువ మూడు గంటలకు, అత్యుత్తమ సజీవ ఆలోచనాపరుడు ఆలోచించడం మానేశాడు. ఆయనను ఒంటరిగా వదిలి రెండు నిమిషాలు కూడా కాలేదు, మేం తిరిగి వెళ్ళి చూసేసరికి, తన వాలుకుర్చీలో ఆయన ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు – శాశ్వతనిద్ర.

ఆయన మృతిలో చెప్పరానంత నష్టానికి గురయింది కేవలం యూరప్, అమెరికాలకు చెందిన సమరశీల కార్మికవర్గం మాత్రమే కాదు, చరిత్ర శాస్త్రం కూడా. ఈ మహత్తర స్ఫూర్తి వెళ్ళిపోవడంతో ఏర్పడిన శూన్యం త్వరలోనే మనందరికీ తేటతెల్లమవుతుంది.

డార్విన్ సేంద్రియ ప్రకృతి అభివృద్ధి నియమాన్ని కనిపెట్టినట్టుగానే, మార్క్స్ మానవ చరిత్ర అభివృద్ధి నియమాన్ని కనిపెట్టాడు. భావజాలం మితిమీరి పెరిగినందువల్ల ఇంతకాలమూ మరుగున పడిన ఒక సాధారణ వాస్తవాన్ని ఆయన బైటపెట్టాడు. రాజకీయాలనో, విజ్ఞాన శాస్త్రాలనో, కళలనో, మతాన్నో... వగైరా వగైరా దేన్నయినా చేపట్టడానికి ముందు మానవజాతి మొట్టమొదట తినవలసి, తాగవలసి, కూడూ, గుడ్డా ఏర్పరచుకోవలసి ఉంటుందనేదే ఆ వాస్తవం. అంటే తక్షణ భౌతిక సాధనాల ఉత్పత్తే, తత్ఫలితంగా ఒక నిర్దిష్ట ప్రజానీకం లేదా ఒక నిర్దిష్ట కాలంలో సాధించిన ఆర్థికాభివృద్ధి స్థాయే పునాది అవుతుందనీ, ఆ పునాది మీదనే ఆ ప్రజలకు చెందిన రాజ్య వ్యవస్థలు, న్యాయ భావనలు, కళ, చివరికి మతం గురించిన భావనలు తలెత్తుతాయని, వాటిని ఆ పునాది వెలుగులోనే వివరించవలసి ఉంటుదనేదే ఆ వాస్తవం. ఇంతకాలమూ అందుకు తలకిందులుగా జరగగా, ఇప్పుడు ఆ పునాది మీద జరగాలి.

అంతమాత్రమే కాదు. ప్రస్తుతకాలపు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని, ఆ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్ని నిర్దేశించే ప్రత్యేక చలన సూత్రాన్ని కూడా మార్క్స్ కనిపెట్టాడు. అదనపు విలువ అనే భావనను కనిపెట్టడం హఠాత్తుగా మొత్తం సమస్య మీద వెలుగు ప్రసరించింది. ఆ సమస్యను పరిష్కరించే ఉద్దేశంతో అటు బూర్జువా ఆర్థిక వేత్తలూ, ఇటు సోషలిస్టు విమర్శకులూ చేసిన అంతకుముందరి పరిశోధనలన్నీ చీకట్లో దేవులాడుతూ వుండగా, ఈ భావన వెలుగు ప్రసరించింది.

తరువాయి భాగం 61వ పేజిలో...